www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 1-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 15 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి తె. 4.02 తదుపరి నవమి; నక్షత్రం: శ్రవణం తె. 3.11 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 7.59-9.31; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.37; అమృతఘడియలు: సా. 5.12-6.44; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.31 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నేడు పెన్షన్లు పడవు!

బ్యాంకులకు 'మే డే' సెలవు

'తగిన చర్యలు' తీసుకోవాలన్న శశిభూషణ్



అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'మే 1వ తేదీన పెన్షన్ల పంపిణీ ప్రారంభిస్తాం' అని సర్కారు తొందరపడి ప్రకటించింది. ఇప్పుడు నాలుక్కరుచుకుని 'తగిన చర్యలు' తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. మే1వ తేదీన పింఛన్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, ఖాతాలు లేని వాళ్లకు సిబ్బంది పంపిణీ చేస్తారని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే... మే 1వ తేదీ 'కార్మికుల దినోత్సవం' సందర్భంగా బ్యాంకులకు సెలవు. ఈ విషయం మంగళవారం రాత్రి గుర్తుకొచ్చినట్లుంది. అందుకే... 'ప్రతి సంవత్సరంలాగే... మే డే సందర్భంగా బ్యాంకులకు సెలవని జిల్లా కలెక్టర్లు, పింఛను లబ్ధిదారులు గమనించాలని మనవి. దీనిని దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోగలరు' అని ఒక ప్రకటన జారీ చేశారు. దీని అర్థం.. బుధవారం పింఛన్ల పంపిణీ ఉండదనే!



అందరికీ బాసటగా..

సామాజిక పెన్షన్ ప్రతినెలా రూ.4 వేలు

బడికి వెళ్లే పిల్లలందరికీ ఏటా 15 వేలు

ప్రతి కుటుంబానికీ 25 లక్షల ఆరోగ్యబీమా

ప్రతి రైతుకూ 20 వేల పెట్టుబడి సాయం.. మళ్లీ అమరావతి నిర్మాణం

ఆర్థిక రాజధానిగా విశాఖ.. కర్నూలులో తక్షణం హైకోర్టు బెంచ్




ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేస్తున్న చంద్రబాబు, పవన్

అభివృద్ధి + సంక్షేమం

సమ్మిళితంగా కూటమి ఉమ్మడి మేనిఫెస్టో

అన్ని వర్గాలనూ ఆకట్టుకునేలా హామీల వర్షం

సంపూర్ణ సమ్మతి ప్రకటించిన బీజేపీ



మేనిఫెస్టో సమగ్ర సమాచారం 13లో

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు.. రాష్ట్ర ఆదాయాన్ని పెంచే అభివృద్ధి! మరోవైపు... ప్రజల జీవితాలు మెరుగుపరిచే సంక్షేమం! రెండింటి సమ్మిళితంగా టీడీపీ- జనసేన - బీజేపీ కూటమి మేనిఫెస్టో విడుదలైంది.

అన్ని వర్గాలు, వృత్తులు, ఉద్యోగులు, యువత, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు.. ఒక్కమాటలో చెప్పాలంటే సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా వరాల వర్షం కురిసింది. 'సూపర్ సిక్స్'కు... సూపర్ సిక్స్ 2.0 తోడైంది. పేదల ఆదాయం పెంచి, బతుకులు మార్చే దిశగా ఈ మేనిఫెస్టో తయారైంది. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను మంగళవారం ఇరు పార్టీల సారథులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడుదల చేశారు. దీనికి బీజేపీ పూర్తిస్థాయి మద్దతు, సమ్మతి తెలియజేసింది. సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, ప్రతి రైతుకూ ఏటా రూ.20వేల పెట్టుబడి సహాయం, 19 ఏళ్లు దాటిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 వంటి అనేక సంక్షేమ

మిగతా 11వ పేజీలో...

ఆదాయం పెంచుతాం.. పంచుతాం

అన్ని వర్గాల సంక్షేమం.. అభివృద్ధిపథంలో రాష్ట్రం

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి లక్ష్యమిదే: చంద్రబాబు

డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వడ్డీలేని రుణం

బీసీ సబ్ ప్లాన్‌తో ఐదేళ్లలో లక్షన్నర కోట్ల ఖర్చు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్

అగ్రవర్ణ పేదలకు 10% ఈడబ్ల్యూఎస్ అమలు

మెగా డీఎస్సీపైనే తొలి సంతకం.. మళ్లీ విదేశీ విద్య

జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు రద్దు

విషపూరిత మద్యం బ్రాండ్లు రద్దు 11

ఇబ్బందుల్లేకుండా కాలేజీలకే రీయింబర్స్‌మెంట్

ప్రతి ఆలయ కమిటీలోనూ బ్రాహ్మణులకు చోటు

విద్యుత్ భారం మోపం.. చెత్త పన్ను రద్దు

వంద రోజుల్లోనే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

రాష్ట్రానికి పూర్వ వైభవం తెస్తాం: చంద్రబాబు

విధ్వంస పాలనను సాగనంపండి

కూటమి అభ్యర్థులకు ఓటుతో స్వర్ణాంధ్ర సాధన

జనసేన షణ్ముఖ వ్యూహం, టీడీపీ సూపర్ సిక్స్ కలిపి మేనిఫెస్టో

ప్రజల అవసరాలు తీరుస్తాం.. రేపటి ఆకాంక్షలను సాకారం చేస్తాం: పవన్

మీ భూమికి జగన్ స్పాట్!

ల్యాండ్ టైటిల్ యాక్ట్ కర్మ, కర్త, క్రియ వైసీపీ సర్కారే

అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే అసెంబ్లీలో బిల్లు

కేంద్రం ఆలోచనకంటే 5 నెలల ముందే ఇక్కడ 'చట్టం'

ఆమోదం కోసం మూడుసార్లు కేంద్రానికి బిల్లు

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆమోదం పొందింది ఆయనే

ఏం తెలిసో.. ఏమీ తెలియకో ధర్మాన అబద్ధాలు

'అవగాహన ఉండీ' అజేయ కల్లం బొంకులు

చట్టం అమలులోకి వచ్చిందంటూ 2023 నవంబరులోనే గెజిట్

రీసర్వే జరుగుతున్నదీ ఈ చట్టం ప్రకారమే

చట్టానికి అనుకూలంగా 'వైసీపీ' సదస్సు

'అమలులోకి రాలేదు' అంటూ కల్లం కట్టు కథలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మీ భూమి మీది కాదు! ఇంకెవరైనా వచ్చి నాది... అన్నారంటే అంతే సంగతులు!'.. ఇదీ జగన్ సర్కారు తెచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం (ల్యాండ్ టైటిల్ యాక్ట్)-2022 సారాంశం! కబ్జాకోర్లకు, అక్రమార్కులకు ఊతమిచ్చేలా తయారు చేసిన ఈ చట్టంపై సర్కారు పెద్దలు అచ్చేసిన అబద్ధాలు చెబుతున్నారు. టైటిల్‌చట్టంపై ప్రజలు, ప్రజా సంఘాలు, న్యాయవాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో 'అతకని కవరింగ్'లు

మిగతా 3వ పేజీలో...

భూమి పట్టా నాదా.. జగన్‌దా?



సర్వం జగన్ ఫొటోల మయం

సీఎం ఫొటోల పిచ్చిపై జనాగ్రహం

భూపట్టా పేరిట చేతికి బొమ్మల పుస్తకం

ప్రతి పేజీలోనూ జగన్ ఫొటోలే

భూమి నాది.. పుస్తకం నాది.. మధ్యలో జగన్ ఫొటోలెందుకు?

రైతాంగం తీవ్ర స్వరం 3

సీఎం సతీమణి భారతిరెడ్డికీ సెగ

ప్రచారంలో నిలదీసిన వైసీపీ నేత



అబూజ్‌మడ్‌లో పేలిన తూటా..

10 మంది మావోయిస్టుల మృతి

మృతుల్లో ముగ్గురు మహిళలు.. కీలక నేతలు 2

50 రోజుల్లో ఏడో ఎన్‌కౌంటర్

4 నెలల్లో 91 మంది మృతి

గాజుగ్లాసుపై 24 గంటల్లో నిర్ణయం 11

ఆ పార్టీ ఇబ్బందులను పరిష్కరిస్తాం

హైకోర్టుకు తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘం

స్వతంత్రులకు గుర్తు కేటాయింపును సవాల్ చేసిన జనసేన

175 స్థానాలు... బరిలో 2,387 మంది

25 పార్లమెంటు స్థానాలకు 454 మంది పోటీ 11

వైద్యుడు రాసిన మరణ శాసనం

తల్లి సహా భార్యాపిల్లల హత్య

అనంతరం ఉరేసుకుని ఆత్మహత్య

బెజవాడలో దారుణం 3

అప్పులు, ఆస్పత్రి నిర్వహణలో భాగస్వాములతో విభేదాలని ప్రచారం

ఒక్కసారైనా నిజం చెప్పు జగన్!



నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనా?.. హత్య కేసుపై మాట్లాడ్డానికి వణుకా?

అవినాశ్ దొరికిపోతాడని భయమా.. వైఎస్ భారతి ఎందుకు మాట్లాడట్లేదు?

ఓడిపోతామని జగన్ జడిసిపోతున్నారు.. రేపోమాపో పదవి ఊడడం ఖాయం

కడప, పులివెందుల ప్రజలు న్యాయం చేయాలి.. మీ ఓటుతో వివేకా సార్ వైపు నిలవాలి

కనీసం పులివెందుల స్వేచ్ఛ కోసం ఓటేయాలి.. ఇది రాజకీయ సమరం 14

టీడీపీ, బీజేపీ, జనసేనతో కుమ్మక్కు కాలేదు.. వివేకా కుమార్తె సునీత స్పష్టీకరణ

సొంత ఇలాకాలో షాకులు!

పులివెందులలో భారతికి ప్రశ్నలు

రైతులకు వైఎస్ మేలు చేశారు 3

రుణమాఫీపై జగన్‌కు చెప్పండి

పదేపదే వైసీపీ నేతల డిమాండ్

పాస్‌బుక్‌పై ఆయన ఫొటో ఎందుకు?

రైతు భరోసాలో వాటా పెంచాలి

జగన్ కేసులు మళ్లీ మొదటికి!

సీబీఐ కోర్టు జడ్జి బదిలీ 2

ఆది నుంచీ వినాల్సిన పరిస్థితి

కొత్త జడ్జికి సైతం పదవీకాలం తక్కువే

హైకోర్టు పర్యవేక్షించినా.. ఆలస్యంపై సుప్రీంకోర్టు ప్రశ్నించినా కదలని కేసులు

సునీల్‌రెడ్డి పిటిషన్ కొట్టివేత

ఎమ్మార్ కేసులో పిటిషన్లపై తీర్పు వెల్లడి

ఇంట్లో వాళ్ల చేతిలో రిమోట్ జగన్!



ఐదేళ్లుగా కేంద్రంలో మోదీ చేతిలో కూడా.. అటు బీజేపీ.. ఇటు ఇంట్లో ఉన్నవాళ్లు.. ఇద్దరి పేర్లూ 'బీ' తోనే మొదలవుతాయి.. షర్మిల విసుర్లు 14



కాంగ్రెస్‌ది విచ్ఛిన్నకర అజెండా: మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను తొలగించి వాటిని తమ ఓటుబ్యాంకుకు (ముస్లింలకు) ఇవ్వాలనేది కాంగ్రెస్ దాని మిత్రపక్షాల ఉద్దేశమని ప్రధాని మోదీ ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ వ్యతిరేకం అయినప్పటికీ, ఇండియా కూటమి విచ్ఛిన్నకరమైన, వివక్షాపూరితమైన అజెండాను కలిగి ఉన్నదని పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కలిగించాలని పిలుపునిస్తూ ఎన్డీఏ కూటమి ఎంపీ అభ్యర్థులకు మోదీ వ్యక్తిగత లేఖలు రాశారు. తన పదేళ్ల హయాంలో దేశంలో అన్ని రంగాలు మెరుగయ్యాయని, అయినప్పటికీ ఇంకా చెయ్యాల్సింది చాలా ఉందని మోదీ పేర్కొన్నారు. అందుకే ఈ ఎన్నికలు కీలకమన్నారు.

‘చీల్చడం’ చేటు చేస్తుందా?

- బీజేపీకి ప్రభుత్వాలను పడగొట్టిన అప్రదిష్ట!
- బిహార్, మహారాష్ట్రల్లోని కూటముల్లో జోక్యం
- ఈ రెండు చోట్ల ప్రత్యర్థుల పట్ల సానుభూతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమికి అధికారం దక్కడంలో కీలకమైన యూపీ, మహారాష్ట్ర, బిహార్‌లో ఈసారి ఓటర్ల తీర్పు ఎలా ఉండనుంది? మహారాష్ట్ర, బిహార్‌లోని విపక్ష కూటముల్లో వేలు పెట్టి, ప్రభుత్వాలను మార్చేసిన అప్రదిష్ట చేటు చేస్తుందా? ప్రత్యర్థులపై సానుభూతి పెరిగి కమలానికి ఎదురుదెబ్బ తగలనుందా? యూపీలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను మరోసారి నిలువరించగలదా? ఇవీ ప్రస్తుత ఎన్నికల సమరంలో ఆసక్తికర ప్రశ్నలు. హిందూత్వవాదం బలంగా ఉండే యూపీ, మహారాష్ట్ర, బిహార్‌లో మొత్తం 168 సీట్లున్నాయి. 2014 ఎన్నికల్లో ఎన్డీఏకి యూపీలో 73, మహారాష్ట్రలో 41, బిహార్‌లో 33 (మొత్తం 147) సీట్లు దక్కాయి. అంటే 87.5 శాతం స్థానాలు నెగ్గింది. ఇక 2019లో సైతం యూపీలో 64, మహారాష్ట్రలో 41, బిహార్‌లో 39 (మొత్తం 144) సీట్లు వచ్చాయి. 85.7 శాతం సీట్లు గెలుచుకుంది. అయితే, ప్రస్తుతం ఎన్డీఏకు వాతావరణం ఏకపక్షంగా లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బిహార్‌లో ఆర్జేడీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న నీతీశ్ కుమార్‌ను తమవైపు తిప్పుకోవడం, మహారాష్ట్రలో ఉద్ధవ్ సారథ్యంలోని కాంగ్రెస్-శివసేన- ఎన్సీపీ సర్కారును ఏక్‌నాథ్ శిందే ద్వారా కూల్చేయడం, ఆపై అజిత్ పవార్‌నూ ఆకర్షించి ఎన్సీపీని చీల్చడం బీజేపీ పట్ల వ్యతిరేకతను పెంచిందనే విశ్లేషణలు వస్తున్నాయి. ముఖ్యంగా గత రెండు ఎన్నికల్లో ఎన్డీఏ 48 సీట్లకు గాను 41 చొప్పున సాధించిన మహారాష్ట్రలో ఈసారి సీట్లకు భారీగా గండి పడే అవకాశాలున్నాయని అంటున్నారు. ఎన్సీపీ, శివసేనలను చీల్చడంలో బీజేపీ పాత్ర ఉందన్న ప్రచారంతో శరద్ పవార్, ఉద్ధవ్ థాక్రే పట్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడిందని, అది ఓట్ల రూపంలో మారుతుందని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు చీలిక వర్గాల్లోకి వెళ్లిపోయినా కార్యకర్తలు మాత్రం శరద్ పవార్, ఉద్ధవ్ వైపే ఉన్నారని, ఎన్సీపీ (శరద్‌పవార్), శివసేన (ఉద్ధవ్), కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడీతో గట్టిపోటీ ఖాయమని చెబుతున్నారు.

బిహార్‌లో తేజస్వీ ప్రతాపం..

బిహార్‌లో ప్రాంతీయంగా ప్రధాని మోదీని సవాలు చేయగల స్థాయికి ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ మరింత బలమైన నేతగా ఎదిగారని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. మైనారిటీ, యాదవులు, దళితుల దన్నుతో ఆర్జేడీ-కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఖాయమని అంటున్నారు. నీతీశ్ తరచూ కూటములను మార్చడం బిహార్ ప్రజలకు ఏవగింపు కలిగించిందని, అలాంటి నాయకుడితో జట్టు కట్టడం బీజేపీకీ ఇబ్బందిగా మారనుందని పేర్కొంటున్నారు. ఇక, కేంద్రంలో అధికార పీఠానికి దగ్గరి దారి యూపీ. 80 స్థానాలకు గాను 2014, 2019లో ఎన్డీఏ 73, 64 సీట్ల చొప్పున సాధించింది. ఈసారి అఖిలేశ్ యాదవ్ సారథ్యంలోని సమాజ్‌వాదీ పార్టీ ఇండియా కూటమిలో భాగమై కాంగ్రెస్‌కు గౌరవ సంఖ్యలో సీట్లిచ్చింది. పంటల మద్దతు ధర కోసం ఉద్యమం, 111 మంది ఎమ్మెల్యేలు, మైనారిటీలు, యాదవ వర్గాలలో గట్టి పట్టున్న సమాజ్‌వాదీ పార్టీ.. ఎన్డీఏ సీట్లను గణనీయంగా తగ్గిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, అయోధ్య రామ మందిరంతో పాటు మోదీ పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసమే తమకు సీట్లు సాధించిపెడుతుందని బీజేపీ నమ్ముతోంది. రైతు నేత చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడంతో లాభిస్తుందని భావిస్తోంది.

మహా రసవత్తరం

మహారాష్ట్ర బరిలో రెండు శివసేనలు, రెండు ఎన్సీపీలు

- దశాబ్దాలుగా పోట్లాడుకున్న వర్గాలు ఒకే శిబిరంలో..!
- పవార్‌లు, శిందే, ఉద్ధవ్‌ల రాజకీయ జీవితానికి పరీక్ష



మహారాష్ట్ర అంటే మహామహుల రాజకీయ క్షేత్రం. వర్గ పోరుకు, వారసత్వ రాజకీయాలకు పెట్టింది పేరు. దేశంలో ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధిక లోక్ సభ సీట్లున్న రాష్ట్రం ఇదే. ఐదేళ్లలో ఇక్కడ పరిణామాలు ఎంతలా మారాయో అందరూ చూశారు. ఎవరూ ఊహించని రీతిలో రెండు ప్రాంతీయ పార్టీలు నాలుగు అయ్యాయి. తమతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసి సీఎం కుర్చీ దగ్గర పంచాయితీతో.. కాంగ్రెస్, ఎన్సీపీ పంచన చేరిన శివసేనను ఏక్‌నాథ్ శిందే ద్వారా చీల్చేసింది బీజేపీ. తద్వారా ఉద్ధవ్ థాక్రేకు ఝలక్ ఇచ్చింది. అనంతరం అజిత్ పవార్‌నూ ఆకర్షించి ఎన్సీపీని విడగొట్టి.. శరద్ పవార్‌కు షాకిచ్చింది. ఇప్పుడు బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి కూటమిలో శివసేన (శిందే), ఎన్సీపీ (అజిత్), కాంగ్రెస్ సారథ్యంలోని మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో ఎన్సీపీ (శరద్ పవార్), శివసేన (ఉద్ధవ్) ఎన్నికల సమరంలో తలపడుతున్నాయి. మహారాష్ట్రలో తొలి దశలో 5, మలి విడతలో 8 సీట్లకు పోలింగ్ ముగిసింది. మూడో దశలో 11 స్థానాలకు మే 7న ఓటింగ్ జరగనుంది. నాలుగో దశలో మే 13న మరో 11 సీట్లకు, మే 20న 13 స్థానాలకు పోలింగ్ ఉంది.

దశాబ్దాల విభేదాలు.. ఓట్లు మళ్లుతాయా?

రెండు పార్టీలు నాలుగుగా మారి, మరో రెండు పార్టీలతో కలిసి వస్తుండడంతో మహారాష్ట్ర ప్రజల నాడి ఏమిటో రాజకీయ పరిశీలకులకు అంతుబట్టడం లేదు. రెండున్నర దశాబ్దాలు బీజేపీ-శివసేన కేడర్‌తో కాంగ్రెస్-ఎన్సీపీ శ్రేణులు ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడ్డాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్-ఎన్సీపీతో కలిసి శివసేన ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2022లో శిందే తిరుగుబాటు చేసి బీజేపీతో కలిశారు. ఇక ఎన్సీపీని చీల్చిన అజిత్ పవార్ బీజేపీ-శిందే సేన సర్కారులో చేరారు. శిందే, అజిత్‌కు వర్గాలకు పార్టీ ఎన్నికల గుర్తులు దక్కాయి. మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు వీరి వెంటే ఉన్నా.. ఎన్సీపీ, శివసేన సంప్రదాయ అభిమానులు, మద్దతుదారులు ఓటు వేస్తారా? అంటే కష్టమేనని పరిశీలకులు చెబుతున్నారు. కాగా, 2014, 2019లో బీజేపీ-అవిభాజ్య శివసేన కూటమి 51.34 శాతం ఓట్లతో 41 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్- అవిభాజ్య ఎన్సీపీలు 35 శాతంపైగా ఓట్లతో వరుసగా 5, 6 సీట్లతో సరిపెట్టుకున్నాయి. నిరుడు మార్చిలో కస్బాపేట్ ఉప ఎన్నికలో 3 దశాబ్దాల తర్వాత బీజేపీని కాంగ్రెస్ ఓడించింది. చించ్వాడ్‌ను బీజేపీ నిలబెట్టుకుంది.

ఇరు సేనల పోరు..

రెండు శివసేనలు, రెండు ఎన్సీపీలు బరిలో ఉన్న ఎన్నికలు మహా రసవత్తరంగా సాగుతున్నాయి. విదర్భ ప్రాంతం యావత్మాల్-వాశిం వంటి సీట్లలో శిందే, ఉద్ధవ్ సేనల అభ్యర్థులు నేరుగా తలపడ్డారు. ఇక్కడ బలమైన వర్గాలు మరాఠాలు, దేశ్‌ముఖ్‌లు, కుంబీలు, బంజారాలు 2019లో బీజేపీ-అవిభాజ్య శివసేన కూటమికి మద్దతిచ్చాయి. బంజారాలు ఉద్ధవ్ పార్టీ వైపు నిలిచారు. మిగతావారు ఎవరి పక్షం వహిస్తే వారిదే విజయం. బుల్డాణాలోనూ శివసేనల అభ్యర్థులే పరస్పరం ఢీకొన్నారు.

నలుగురు నేతలకూ సవాల్

మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబరులో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ పార్టీల నాయకుల పరిస్థితి ఎలా ఉన్నా.. సీఎం ఏక్‌నాథ్ శిందే, ఉద్ధవ్ థాక్రే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, శరద్ పవార్‌లకు ఈ ఎన్నికలు చాలా కీలకం. తాను స్థాపించిన పార్టీని.. అన్న కుమారుడు అజిత్ చీల్చడంతో హతాశుడైన మరాఠా యోధుడు శరద్‌పవార్ (83) ఈ ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకుంటున్నారు. పార్టీ కేడర్ తనను వీడి వెళ్లకుండా ఉండాలన్నా, అసెంబ్లీ ఎన్నికల నాటికి బలీయంగా కనిపించాలన్నా.. పెద్ద పవార్ ప్రస్తుత ఎన్నికల్లో మెరుగైన సీట్లు సాధించడం ముఖ్యం. ఇక ఎన్సీపీ గుర్తు గడియారం సహా మెజారిటీ కేడర్ అజిత్ పవార్ వెంటనే ఉంది. అయితే, వీరంతా ఇకముందు కూడా చెక్కుచెదరకుండా ఉండాలంటే లోక్ సభ ఎన్నికల్లో సత్తా చాటాల్సి ఉంది. కాగా, తాను ప్రజాబలం ఉన్న నేతను అని నిరూపించుకునేందుకు సీఎం శిందేకు, తమ ఉనికి ఇంకా ఉందని చాటేందుకు ఉద్ధవ్ థాక్రేకు ఈ ఎన్నికలు కీలకం. - సెంట్రల్ డెస్క్

బరిలో మాజీ సీఎంలు.. మాజీ సీఎంల కుమార్తెలు

మహారాష్ట్ర మాజీ సీఎం నారాయణ్ రాణె బీజేపీ తరఫున రత్నగిరి-సింధుదుర్గ్ నుంచి బరిలో దిగారు. ఈయనకు రెండుసార్లు ఎంపీగా గెలిచిన వినాయక్ రౌత్ గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే, మరో మాజీ సీఎం అశోక్ చవాన్ బీజేపీలో చేరి నాందేడ్ నుంచి పోటీ చేశారు. మాజీ సీఎంలు శరద్ పవార్ కుమార్తె సుప్రియా బారామతిలో, సుశీల్‌కుమార్ శిందే కుమార్తె ప్రణీతి సోలాపూర్‌లో పోటీకి నిలిచారు.

కంచుకోటలో వదినా మరదళ్ల ఢీ

మహారాష్ట్రలోనే కాదు దేశవ్యాప్తంగానూ ఆసక్తి రేకెత్తిస్తున్న పోటీ బారామతిలో జరుగుతోంది. సిటింగ్ ఎంపీ సుప్రియా తన వదిన సునేత్రను ఢీకొంటున్నారు. మే 7న ఇక్కడ పోలింగ్ ఉంది. సుప్రియా ఇప్పటికే వరుసగా మూడుసార్లు ఇక్కడినుంచి గెలిచారు. ఆమె తండ్రి శరద్ పవార్ అయితే డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. తమ కుటుంబానికి కంచుకోట అయిన బారామతిలో సుప్రియా ఓడితే అది శరద్‌కు పెద్ద ఇబ్బందే. బారామతి చేజారితే.. యావత్ పార్టీ చేజారినట్టే.

ఛత్రపతి శివాజీ వారసుడికి ఎంఐఎం మద్దతు

మరాఠాలకే కాదు హిందువులందరికీ ఆరాధ్యమైన ఛత్రపతి శివాజీ వారసులు వేర్వేరు పార్టీల తరఫున బరిలో దిగారు. సతారాలో శ్రీమంత్ ఛత్రపతి ఉదయన్‌రాజె భోస్లే బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఈయన రాజ్యసభ సభ్యుడు. కొల్హాపూర్‌లో శివాజీ వంశస్థుడైన శ్రీమంత్ శాహూ ఛత్రపతి మహరాజ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచారు. ఈయనకు అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఎంఐఎం పార్టీ మద్దతు పలకడం గమనార్హం.

బీజేపీ మళ్లీ గెలిస్తే.. రాజ్యాంగాన్ని చింపి విసిరేస్తారు: రాహుల్

భిండ్(ఎంపీ), ఏప్రిల్ 30: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని చింపి విసిరేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యానించారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు సాధారణ ఎన్నికలు కాదని, రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్న పోరు అని ఆయన అన్నారు. మంగళవారం మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లాలో రాహుల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రసంగిస్తూ.. కేంద్రంలోని పాలక వర్గం రిజర్వేషన్లకు వ్యతిరేకం కాకపోతే పీఎస్‌యూలు, రైల్వేస్, ఇతర సంస్థలను ఎందుకు ప్రైవేటీకరిస్తున్నారని నిలదీశారు. తాము అధికారంలోకి వస్తే మహాలక్ష్మి యోజన పథకం ద్వారా మహిళలకు ఏడాదికి రూ.లక్ష అందిస్తామని రాహుల్ చెప్పారు.

ఓటుతో ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేశంలో జరుగుతున్న ఎన్నికలు గెలుపోటములకు చెందినవి కావని, ఇవి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికలుగా కేజ్రీవాల్ అభివర్ణించారని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ తెలిపారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను మంగళవారం ఆయన కలిశారు. ఆ తర్వాత బయటికి వచ్చిన ఆయన కేజ్రీవాల్ సందేశాన్ని మీడియా ద్వారా తెలిపారు. "ప్రజలను నా గురించి ఆందోళన చెందవద్దని తెలపండి. వారిని ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడమని చెప్పండి" అని కేజ్రీవాల్ చెప్పినట్లు మాన్ తెలిపారు.

పోలింగ్ వివరాల వెల్లడికి జాప్యమేంటి?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పార్లమెంటు ఎన్నికల మొదటి రెండు దశల పోలింగ్ తుది వివరాలు ఇంకా వెల్లడి కాకపోవడంపై ఎన్నికల సంఘాన్ని మంగళవారం ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. నియోజకవర్గాల వారీగా ఎంత పోలింగ్ జరిగిందో తుది లెక్కలను ఖరారు చేయకపోవడం ఏమిటని అడిగాయి. మొదటి దశ ఎన్నికలు జరిగి 11 రోజులయినా మొత్తం పోలయిన ఓట్లు ఎన్ని? ఎంత శాతం పోలింగ్ జరిగిందన్న లెక్కలను ప్రకటించలేదని గుర్తు చేశాయి. గతంలో పోలింగ్ ముగిసిన 24 గంటల్లోగానే మొత్తం సమాచారం వచ్చేదని, ఇప్పుడు మాత్రం తాత్కాలిక గణాంకాలతోనే సరిపెడుతున్నారని ప్రశ్నించాయి.

యూపీలో కనిపించని కాంగ్రెస్ అగ్రనేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: మూడో దశ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్ సిద్ధమవుతున్నప్పటికీ కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రచారానికి హాజరు కావట్లేదు. ఇది పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని స్థానిక నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ యూపీలోని మొత్తం 80 ఎంపీ స్థానాలకు గానూ 17చోట్ల బరిలోకి దిగుతోంది. కానీ, ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక ఇక్కడ ప్రచారం చేయలేదు.

‘డర్టీ’ పిక్చర్ గుట్టు రట్టయింది..

ప్రజ్వల్ డ్రైవర్ ద్వారానే!

బెంగళూరు/బళ్లారి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): "నీకన్నా వయసులో పెద్దదాన్ని.. నన్నేం చేయకు. మీ నాన్నకు, తాతకు నాచేత్తో అన్నం వడ్డించాను. అమ్మలాంటిదాన్ని.. వీడియోలు తీయకు" అని వేడుకుంటున్నా వినకుండా.. భయంతో ముడుచుకుపోయి కూర్చున్న ఓ వయసు పైబడిన మహిళను ప్రజ్వల్ ఈడ్చుకెళ్లి, లైంగిక దాడికి పాల్పడ్డమే కాక, వీడియో తీశాడంటూ మంగళవారం ‘ఎక్స్’లో పలువురు చేసిన ట్వీట్లు వైరల్ అవుతున్నాయి. ఇంతకీ.. కర్ణాటక రాజకీయాలను కుదిపేస్తున్న ఈ ‘డర్టీ పిక్చర్’ గుట్టు ఎలా రట్టు అయింది? ప్రజ్వల్ తన ఫోన్‌లో తీసుకున్న వీడియోలు ఎలా బయటపడ్డాయి? అనే ప్రశ్నలకు సమాధానం దొరికింది. ప్రజ్వల్ కుటుంబానికి పదిహేనేళ్లపాటు డ్రైవర్‌గా ఉన్న కార్తీక్ ద్వారా ఈ వీడియోలు బీజేపీ నేత దేవరాజెగౌడ వద్దకు చేరాయి. ఈ విషయాన్ని ఇద్దరూ ఒప్పుకొంటున్నారు. కానీ.. ఆ తర్వాత ఈ వీడియోలు కాంగ్రెస్ నేతకు, మీడియాకు, సోషల్ మీడియాకు ఎలా చేరాయనే విషయంలో మాత్రం ఇద్దరూ పరస్పరం నిందించుకుంటున్నారు. తాను దేవరాజెగౌడకు తప్ప ఎవరికీ ఈ వీడియోలు ఇవ్వలేదని కార్తీక్ చెబుతుంటే.. అతడే కాంగ్రెస్ నేతలకు ఇచ్చాడని దేవరాజెగౌడ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కార్తీక్ మంగళవారం ఒక వీడియో విడుదల చేశారు.



కార్తీక్

"నేను ప్రజ్వల్ రేవణ్ణ కుటుంబం వద్ద పదిహేనేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నా. అయితే.. నాపేరిట ఉన్న కొద్దిపాటి భూమిని రేవణ్ణ కుటుంబం లాక్కుని.. నన్ను మానసికంగా, నా భార్యను శారీరకంగా వేధించారు. దీంతో ఏడాది క్రితమే వారి వద్ద పని మానేశా. ఆ తర్వాత వారి మీద కేసు పెట్టడానికి ఎంతగానో ప్రయత్నించాను. ఆ సమయంలోనే నేను బీజేపీ నేత దేవరాజె గౌడను కలిశాను. నాకు సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నా వద్ద ఉన్న వీడియోలు తీసుకున్నారు. ఆయనకు తప్ప నేను మరెవ్వరికీ ఆ వీడియోలు ఇవ్వలేదు. కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారో నాకు తెలియదు. ఈ విషయంలో ఆయన తనను తాను కాపాడుకోవడానికి నన్ను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు." అని చెబుతూ సోషల్ మీడియాలో ఒక వీడియో కూడా విడుదల చేశారు. దేవరాజెగౌడను నమ్మితే ఆయన తనను మోసం చేశారని వాపోతున్నారు. మరోవైపు దేవరాజెగౌడ్ ఏమో.. ఈ వీడియోలు బయటపడితే తమ కూటమికి దెబ్బ కాబట్టి, ఆ పని తానెందుకు చేస్తానని ప్రశ్నిస్తున్నారు. డ్రైవర్ కార్తీక్ నుంచి తీసుకుని కాంగ్రెస్ నేత శ్రేయస్ పటేల్ ఈ వీడియోలను బయటపెట్టారని ఆయన ఆరోపిస్తున్నారు. అయితే.. దేవరాజెగౌడ హసన్ లోక్‌సభ సీటును ఆశించారని.. ఆ సీటు తనకు రాకపోవడంతో ప్రజ్వల్‌ను దెబ్బతీయడానికి ఈ వీడియోలను బయటపెట్టారన్న వాదనా వినిపిస్తోంది.


ప్రజ్వల్‌పై వేటు పడింది..

ప్రజ్వల్ వ్యవహారం ఎన్నికల్లో తమను దెబ్బతీసే ప్రమాదం ఉండడంతో.. జేడీఎస్ పార్టీ ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ప్రజ్వల్‌ను సస్పెండ్ చేస్తూ పార్టీ కోర్ కమిటీ తీర్మానించింది. మరోవైపు.. జేడీఎస్‌తో పొత్తు నేపథ్యంలో ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, పలువురు కర్ణాటక నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గువాహటిలో మాట్లాడుతూ ప్రజ్వల్ విషయమే కాదు, మహిళల గౌరవానికి భంగం కలిగించే అంశం ఏదైనా క్షమించేది లేదని తేల్చిచెప్పారు. ప్రజ్వల్ తప్పుచేసి ఉంటే చట్ట ప్రకారం శిక్ష తప్పదని స్పష్టం చేశారు. కాగా, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వ్యవహారంపై విచారణను వేగవంతమైంది. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణతో పాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే రేవణ్ణకు సిట్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లోగా నేరుగా సిట్ ముందుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. హాజరు కాని పక్షంలో తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోటీసుల్లో స్పష్టం చేసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రజ్వల్ రాసలీలలకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర డీజీపీని జాతీయ మహిళా కమిషన్ ఆదేశించింది.

రిజర్వేషన్లపై ఫేక్ ప్రచారం

- మత ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లకే మేం వ్యతిరేకం: అమిత్ షా

గువాహటి, ఏప్రిల్ 30: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేస్తుందని, రిజర్వేషన్లు తీసేస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. రిజర్వేషన్లపై తమకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఒక ఫేక్ వీడియోను ప్రచారంలోకి తెచ్చిందని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై తాను మాట్లాడిన అసలు వీడియో.. కాంగ్రెస్ ప్రచారంలో పెట్టిందని చెబుతున్న ఫేక్ వీడియోను షా విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఉమ్మడి ఏపీలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన 4%రిజర్వేషన్లతో ఓబీసీలు నష్టపోయారని, ఓ సర్వే కూడా చేపట్టకుండానే కర్ణాటకలో ముస్లిందరినీ ఓబీసీ కేటగిరిలోకి చేర్చారని కాంగ్రెస్ పై షా ధ్వజమెత్తారు. ఇలా మత ప్రాతిపదికన ఇచ్చిన రిజర్వేషన్లను ఆయా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చాక తొలగిస్తుందని ఆయన తెలిపారు. 400 సీట్లతో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తీసివేస్తుందంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా ఆధారరహితమని షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పగ్గాలు రాహుల్ గాంధీ చేపట్టిన తర్వాత రాజకీయాలను మరింతగా దిగజార్చారని షా విమర్శించారు. కర్ణాటకలో జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన సెక్స్ స్కాంపై ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.



షా విమర్శలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తిప్పికొట్టారు. ఫేక్ వీడియోలు చేయడంలో, సోషల్ మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడంలో బీజేపీకి ఎంతో అనుభవం ఉందని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. కాగా, బీజేపీని ఎదుర్కోవడం చేతగాని ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో నకిలీ వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. "ఏఐతో నకిలీ వీడియోలు తయారు చేసి వారి ప్రేమ దుకాణంలో అమ్ముతున్నారు" అని వ్యాఖ్యానించారు. ఆ అబద్ధాల దుకాణాన్ని ఇక మూతవేయాలి... అని పిలుపునిచ్చారు.

అభూజ్‌మడ్‌లో పేలిన తూటా

10 మంది మావోయిస్టుల మృతి

చర్ల, చింతూరు, ఏప్రిల్ 30: మావోయిస్టుల కంచుకోట అభూజ్‌మడ్ మరోమారు ఎరుపెక్కింది. మంగళవారం భద్రతాబలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. బస్తర్ ఐజీ పి.సుందర్‌రాజ్ కథనం ప్రకారం.. అభూజ్‌మడ్‌లో నక్సల్స్ కదలికలపై సమాచారం అందుకున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ బలగాలు ‘ఆపరేషన్ కగార్’లో భాగంగా సోమవారం రాత్రి నారాయణ్‌పూర్-కాంకేర్ జిల్లాల సరిహద్దుల్లోని టేక్మెట-కాకుర్ గ్రామాల మధ్య అభూజ్‌మడ్ అడవుల్లో కూంబింగ్ ప్రారంభించారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో అభూజ్‌మడ్ అడవుల్లోకి(కాల్పెర్ గ్రామానికి 30 కిలోమీటర్ల దూరంలో) బలగాలు వెళ్లగానే.. మావోయిస్టుల నుంచి కాల్పులు ప్రారంభమయ్యాయి. దాంతో.. భద్రతాబలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఉదయం 9 గంటల వరకు.. సుమారు మూడు గంటల పాటు ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులు కొనసాగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు సుందర్‌రాజ్ తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలున్నట్లు వివరించారు. మృతులను గుర్తించాల్సి ఉందని, వీరిలో కీలక నేతలు ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. భద్రతాబలగాల వైపు ఎలాంటి నష్టం జరగలేదని, అభూజ్‌మడ్ అడవుల్లో కూంబింగ్ కొనసాగుతోందని చెప్పారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఒక ఏకే-47 తుపాకీ, ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక రివాల్వర్‌తోపాటు.. భారీగా మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాలను నారాయణ్‌పూర్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు వివరించారు.

చర్చల దిశగా ఛత్తీస్‌గఢ్ సర్కారు!

ఛత్తీస్‌గఢ్ సర్కారు చర్చలకు సిద్ధమంటూ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ మావోయిస్టులకు సంకేతాలిచ్చారు. "మావోయిస్టులు చిన్నగ్రూపులుగా వచ్చినా.. పెద్ద గ్రూపులుగా ఉన్నా.. చర్చలు జరపొచ్చు. మీ వెసులుబాటును బట్టి వీడియోకాల్ ద్వారా చర్చలు జరపొచ్చు. లేదంటే.. మీ తరఫున ఓ మధ్యవర్తిని పంపండి" అని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

4 నెలల్లో 91 మంది మృతి

మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌తో కలిపి.. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో భద్రతాబలగాల కాల్పుల్లో 91 మంది మావోయిస్టులు మృతిచెందారు. గడిచిన 50 రోజుల్లో జరిగిన ఏడు భారీ ఎన్‌కౌంటర్లు మావోయిస్టు శిబిరానికి భారీ నష్టాన్ని మిగిల్చాయి. ఈ నెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఛత్తీస్‌గఢ్‌తోపాటు పరిసర రాష్ట్రాల చరిత్రలోనే అత్యధికంగా 29 మంది మృతిచెందారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం సరిహద్దుల్లోని తెర్లాం/పూవర్తి మొదలుకుని, అభూజ్‌మడ్ వరకు 80 వేల మంది భద్రతా బలగాలతో 5 వేలకు పైగా క్యాంపులను పెట్టడంతో.. మావోయిస్టులు సేఫ్ జోన్లను వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

జగన్ అక్రమాస్తుల కేసులు మళ్లీ మొదటికి!

- సీబీఐ కోర్టు జడ్జి బదిలీ.. ఆది నుంచి వినాల్సిన పరిస్థితి

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ అక్రమాస్తుల వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. తండ్రి వైఎస్ అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని పేర్కొంటూ హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఈడీలు మొత్తం 20 చార్జిషీట్‌లు దాఖలు చేశాయి. ఈ కేసులపై సీబీఐ కోర్టులో గత 12 ఏళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉంది. ఆయా చార్జిషీట్ల నుంచి తమను తప్పించాలని కోరుతూ జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాఖలు చేసిన 130 డిశ్చార్జి పిటిషన్‌లపై మంగళవారం తీర్పు వెలువడాల్సి ఉంది. వీటి పరిష్కారానికి హైకోర్టు ఇప్పటికే ఒకసారి గడువు పొడిగించింది. ఈ గడువు సైతం ఏప్రిల్ 30తో ముగిసింది. మంగళవారం ఈ పిటిషన్‌లలో తీర్పు వెలువడుతుందని అంతా భావించారు. అయితే, అనారోగ్యం కారణంగా తీర్పులు సిద్ధం కాలేదని సీబీఐ కోర్టు జడ్జి రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల బదిలీల్లో రమేశ్‌బాబు సైతం వేరే కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ కారణంగా మళ్లీ మొదటి నుంచి కేసులు వినేందుకు మే 15కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో 12 ఏళ్లుగా కొనసాగుతున్న విచారణ మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. 2013 నుంచి సీబీఐ కోర్టులో ఏడుగురు జడ్జిలు బదిలీ అయ్యారు. తాజాగా రమేశ్‌బాబు సైతం బదిలీకావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి బదిలీల్లో తమ వద్ద రిజర్వు అయి ఉన్న కేసుల్లో తీర్పులు ఇచ్చి బదిలీ అయిన చోట రిపోర్ట్ చేయాలని హైకోర్టు బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే అనారోగ్య కారణంగా తీర్పులు సిద్ధం కాలేదని జడ్జి రమేశ్‌బాబు పేర్కొన్నారు. 2022, మే 4 నుంచి ఆయన జగన్ అక్రమాస్తులకు సంబంధించిన డిశ్చార్జి పిటిషన్‌లపై సుదీర్ఘంగా వాదనలు విన్నారు. తీర్పు వెలువరించాల్సిన సమయంలో బదిలీ కావడంతో ఆయన కేసులను తిరిగి ప్రారంభిస్తున్నట్టు(రీ ఓపెన్) ప్రకటించారు. దీంతో కొత్తగా వచ్చే జడ్జి మళ్లీ ఈ కేసులను మొదటి నుంచి వినాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో మరో ట్విస్ట్ ఏమిటంటే కొత్తగా వచ్చే జడ్జికి సైతం రిటైర్‌మెంట్ వయసు దగ్గర పడిందని.. ఆయనకు కూడా ఎక్కువ కాలం పదవిలో ఉండరని చర్చ జరుగుతోంది. కేవలం డిశ్చారి పిటిషన్‌లకే దశాబ్దకాలం పడితే.. ప్రధాన కేసులు ఎప్పుడు విచారణకు వస్తాయి? ఎప్పుడు శిక్షలు పడతాయి? అన్న అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి.

హైకోర్టు, సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తున్నా...

ప్రజాప్రతినిధుల కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి.. తీర్పులు ఇవ్వాలని అశ్వినీ ఉపాధ్యాయ కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కేసులను హైకోర్టులు ప్రత్యక్షంగా పరిశీలించాలని.. దిగువ కోర్టులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొంది. ఈ ఆదేశాలతో తెలంగాణ హైకోర్టు సుమోటోగా ఈ అంశాన్ని స్వీకరించింది. హైదరాబాద్ సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్‌లను ఫిబ్రవరి 29లోగా పరిష్కరించాలని గతేడాది డిసెంబరులో పేర్కొంది. అయితే, భారీగా ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు సాక్షుల వాంగ్మూలాలు రికార్డు చేయాల్సి ఉందని.. 13 వేల పేజీల డిక్టేషన్ సిద్ధం చేస్తున్నందున మరింత గడువు కావాలని సీబీఐ కోర్టు కోరడంతో గడువును రెండు నెలలు(అంటే ఏప్రిల్ 30 వరకు) పొడిగించింది. ఈ నేపథ్యంలో చివరి రోజైన మంగళవారం తీర్పు వెలువడుతుందని అంతా భావించగా.. తనకు అనారోగ్యం వల్ల తీర్పు వెల్లడించలేకపోతున్నానని జడ్జి ప్రకటించడం సంచలనంగా మారింది.

ఎమ్మార్ కేసులో ఎదురుదెబ్బ

సీబీఐ కోర్టు జడ్జి రమేశ్‌బాబు.. ఎమ్మార్ కేసులో నిందితులు దాఖలు చేసిన 9 డిశ్చార్జి పిటిషన్‌లపై మంగళవారం తీర్పు వెలువరించారు. జగన్ సన్నిహితుడు ఎన్. సునీల్‌రెడ్డి , కోనేరు ప్రదీప్, విజయరాఘవ, శ్రీకాంత్ జోషి, ఎమ్మార్ ఎంజీఎఫ్, ఎమ్మార్ ప్రాపర్టీస్, ఎమ్మార్ హిల్స్, బౌల్డర్ హిల్స్ డిశ్చార్జి పిటిషన్‌లను కోర్టు కొట్టేసింది. మరో నిందితుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బీపీ ఆచార్యపై 120బీ, 409 సెక్షన్లను తొలగించిన సీబీఐ కోర్టు.. అవినీతి నిరోధక చట్టం కింద అభియోగాలు ఎదుర్కోవాల్సిందేనని పేర్కొంది. ఇతర నిందితులను కేసు నుంచి తప్పించడానికి నిరాకరించింది. నిందితులు విచారణను ఎదుర్కోవాల్సిందేనని ప్రకటించింది. కాగా.. అక్రమాస్తుల కేసులో దాల్మియా సిమెంట్స్ చార్జిషీట్‌లో నిందితులుగా ఉన్న దాల్మియా సిమెంట్స్ భారత్, ఆ కంపెనీ ఎండీ పునీత్ దాల్మియాకు హైకోర్టులో చుక్కెదురైంది. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 50 చట్టబద్ధతను ప్రశ్నిస్తూ వారు దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ ముగించింది.

అసదుద్దీన్.. ఆంధ్రుల జీవితాలతో ఆడుకోవద్దు

ముస్లింల మద్దతు టీడీపీకే: ఫారూఖ్ షుబ్లి

విజయవాడ, ఏప్రిల్ 30: రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎప్పుడూ మాట్లాడని అసదుద్దీన్ ఎన్నికల సమయంలో మాట్లాడటం విడ్డూరంగా ఉందని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లి అన్నారు. ఏపీలోని ముస్లింలు టీడీపీతోనే ఉన్నారని చెప్పారు. అసదుద్దీన్ ఒవైసీకి జగన్‌మోహన్‌రెడ్డి మిత్రులైతే ఇద్దరూ కలిసి టెన్నిస్ గాని క్రికెట్ గాని ఆడుకోవాలని ఎద్దేవా చేశారు. అంతేగాని మా ఆంధ్రుల జీవితాలతో ఆడుకోవాల్సింది కాదని హితవు పలికారు.

లోకం తీరు



మీ భూమికి జగన్ స్పాట్!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నారు. ఆ చట్టం రూపొందించింది తాము కాదని, కేంద్రమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అతకని అబద్ధాలు చెబుతున్నారు. అసలు ఆ చట్టం అమలులోకే రాలేదని, రీసర్వే పూర్తయ్యాకే టైటిల్ చట్టం అమలు చేస్తామని.. రెవెన్యూ, న్యాయపరమైన అంశాలపై అవగాహన లేనివారే టైటిల్ చట్టంపై బురదచల్లుతున్నారని జగన్ ముఖ్య సలహాదారు అజేయకల్లంరెడ్డి వింత వాదన చేస్తున్నారు.

తొలి స్పాట్ జగన్‌దే

భూయాజమాన్య హక్కు చట్టం కేంద్రమే రూపొందించిందన్నది మంత్రి ధర్మాన మాట! ఇది పచ్చి అబద్ధం. ఎందుకంటే.. కేంద్ర కేబినెట్ సెక్రటరీ వద్ద జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు నీతి ఆయోగ్ సీఈఓ 2019 అక్టోబరు 10న ఓ కీలక సమావేశం నిర్వహించారు. ల్యాండ్ టైటిల్ ముసాయిదా బిల్లు రూపకల్పన కోసం కమిటీని ఏర్పాటుకు ఆ భేటీలో నిర్ణయించారు. అప్పుడు తెలంగాణ రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా ఉన్న వినోద్‌కుమార్ అగర్వాల్ అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పడింది. అదే ఏడాది డిసెంబరు 20న కేబినెట్ సెక్రటరీకి నీతి ఆయోగ్ సీఈవో ఒక లేఖరాశారు. మొత్తానికి..2019 డిసెంబరు 28వ తేదీన అటు కేంద్రం నుంచి, ఇటు నీతి ఆయోగ్ నుంచి రాష్ట్రాలకు ల్యాండ్ టైటిల్ యాక్ట్ ముసాయిదా బిల్లు కాపీలు వచ్చాయి. ఇదీ కేంద్రం విషయంలో జరిగింది! అసలు విషయం ఏమిటంటే.. అంతకు ఐదు నెలల ముందే జగన్ సర్కారు ఈ బిల్లుకు ప్రాణప్రతిష్ఠ చేసింది. జగన్ ప్రభుత్వం 2019 మేలో ఏర్పడింది. ఆ తర్వాత రెండు నెలలకే.. అంటే జూలైలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ బిల్లు-2019ను ఆమోదించేశారు. దీనినే బిల్ 38 ఆఫ్ 2019గా పిలుస్తారు. ఆ వెంటనే దీనిని ఆమోదం కోసం కేంద్రానికి పంపించారు. మరి...ఈ బిల్లును తొలుత రూపొందించిందెవరు కేంద్రమా? రాష్ట్రమా? ఈ ప్రశ్నకు మంత్రి ధర్మాన బదులిస్తారా?

'సొంత' చట్టాన్ని కేంద్రం కాదంటుందా?

అసెంబ్లీలో ఆమోదించిన టైటిల్ యాక్ట్‌ను రాష్ట్రం కేంద్రానికి పంపడం... అక్కడ ఆమోదం పొందకుండా తిరుగుటపాలో వెనక్కి రావడం! ఇలా మూడుసార్లు జరిగింది. 2021లో ఒకసారి, 2022లో మరోసారి అసెంబ్లీలో సవరణ బిల్లులు ఆమోదింపచేసి కేంద్రం ఆమోదం కోసం పంపించారు. కేంద్రంలో ఏం జరిగిందో కానీ, 2023లో కూడా ఆమోదించలేదు. దీంతో... 'ఈసారి బిల్లు వెనక్కి వస్తే మీ సంగతి తేలుస్తా' అని అధికారులను జగన్ తీవ్రంగా హెచ్చరించారని కూడా చెబుతారు. సర్వే అధికారి ఢిల్లీలో మకాం వేసి నానా తంటాలుపడి చివరకు కేంద్ర ఆమోదం పొందేలా లాబీయింగ్ చేశారు. అది నిజంగా కేంద్రం ఆమోదించినదే అయితే... మూడుసార్లు ఎందుకు తిరస్కరిస్తుంది? 'ఆమోదం పొందకపోతే...' అని జగన్ ఎందుకు హెచ్చరించాల్సి వస్తుంది?

కేంద్రం ఒత్తిడి నిజమేనా?

ధర్మాన, అజేయకల్లం చెబుతున్నట్లుగా ల్యాండ్ టైటిల్ బిల్లులో కేంద్రం ఒత్తిడి లేదు. నీతి ఆయోగ్ బలవంతమూ లేదు. ఎందుకంటే.. కేంద్రం కంటే ఐదునెలల ముందే రాష్ట్రం ఈ బిల్లును తయారు చేసింది. ఇంకా చెప్పాలంటే, రాష్ట్రమే ఒత్తిడి/లాబీయింగ్ చేసి మరీ తాను రూపొందించిన బిల్లుపై కేంద్ర ఆమోదం పొందింది. ఇందులో ఎవ్వరికీ ఏ సందేహమున్నా 'బిల్ 38 ఆఫ్ 2019'ను చూడొచ్చు. అది అసెంబ్లీ వెబ్‌సైట్ బిల్స్ జాబితాలో ఉంది. అసలు విషయం ఏమిటంటే... ఆ బిల్లు ఆమోదించేనాటికి రెవెన్యూ మంత్రిగా ధర్మాన ప్రసాదరావు లేరు. ఆయన ఎమ్మెల్యేగా మాత్రమే ఉన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు అప్పటి నీతి ఆయోగ్ నుంచి వచ్చిన ఫైళ్లు, డేటా వెళ్లే అవకాశమే లేదు. అయినా, మంత్రి అలవోకగా అబద్ధాలు చెబుతున్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పైన కేంద్రం కంటే జగన్‌కే ఆసక్తి ఎక్కువ అనేది నిజం!

చట్టం తెచ్చాక ఏకాభిప్రాయం ఏమిటి?

'టైటిల్ చట్టం అమల్లోకి వచ్చాక ఏకాభిప్రాయం తీసుకుంటాం' అని మంత్రి ధర్మాన సరికొత్త భాష్యం చెబుతున్నారు. చట్టం తీసుకురావడానికి ముందు ప్రజలతో చర్చిస్తారా? లేక ఆ చట్టం ప్రజాకంటకమైనదని తేలాక ప్రజలతో మాట్లాడతారా? ఇప్పుడు ప్రజలతో చర్చిస్తామని చెప్పడం దేనికి సంకేతం? నిజానికి, వినోద్‌కుమార్ అగర్వాల్ కమిటీ నివేదికలో, చట్టం తీసుకురాకముందే రాష్ట్రాలు ఏం చేయాలో స్పష్టంగా ఉంది. 5వ చాప్టర్‌లోని రోడ్‌మ్యాప్ అంశంలో 1వ విభాగంలో రాష్ట్రాలు ఏం చేయాల్నో దిశానిర్దేశం చేశారు. టైటిల్ ముసాయిదా బిల్లులోని అంశాలను ఒక గ్రామం లేదా మండలంలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలన్నారు. అంతకన్నా ముందే ప్రజలు, రైతులు, రాజకీయ పార్టీలతో చర్చించాలని సూచించారు. కానీ, జగన్ సర్కారు ప్రజలను సంప్రదించకుండానే ఈ వివాదాస్పద బిల్లును అసెంబ్లీలో ఆమోదించారు. ఇప్పుడు ప్రజలు వ్యతిరేకిస్తుండటంతో 'ఏకాభిప్రాయం' అంటూ కొత్త పల్లవి అందుకున్నారు.

సునీల్.. ఇవెక్కడి నీతిపాఠాలు?

టైటిల్ చట్టానికి అనుకూలంగా నిర్వహించిన 'వైసీపీ' అనుకూల సదస్సులో అజేయకల్లంరెడ్డితో పాటు నల్సార్ యూనివర్సిటీ అధ్యాపకుడు సునీల్ అలియాస్ 'భూమి' సునీల్ పాల్గొన్నారు. చట్టం లేకపోతే తీవ్ర నష్టం జరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. టైటిల్ చట్టంలో కోర్టుల ప్రమేయం ఉండదనేది అబద్ధమని, ఈ చట్టం అమలు కాకపోతే రాష్ట్రం మరో 50 ఏళ్లు వెనకబడి పోతుందని ఆక్రోశించారు. మరి... ఆ చట్టంలోని ఆరో సెక్షన్‌ను ఆయన చదివారో, చదవలేదో తెలియదు! భూ వివాదాల్లో సివిల్ కోర్టుల ప్రమేయాన్ని ఈ సెక్షన్ అడ్డుకుంటోంది. న్యాయం దక్కాలంటే హైకోర్టుకే వెళ్లాలి. ఎంత మంది పేదలు తమ చిన్న కమతాలకోసం హైకోర్టు దాకా వెళ్లి పోరాటం చేయగలరు? ఇది అందరికీ సాధ్యమయ్యేదేనా? గతంలో తెలంగాణ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ తీసుకొచ్చినప్పుడు ఇదే సునీల్ కుమార్ 'మహా అద్భుతం' అని పొగిడారు. సదస్సులు, సమావేశాలు నిర్వహించి ధరణి సేవలను ఆకాశానికెత్తారు. తెలంగాణ ప్రజలు ధరణిని చీత్కరించుకుంటూ పోరాటాలు చేయడంతో... 'ఔను, ధరణిలో లోపాలున్నాయి' అని చెప్పారు. 'ధరణి' దిద్దుబాటు కమిటీలో ఆయన కూడా సభ్యుడే. ఇప్పుడు ఏపీలో ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న టైటిల్ చట్టం బాగుందని, అది లేకపోతే రాష్ట్రం మరో 50 ఏళ్లు వెనక్కిపోతుందని సునీల్ ఆవేదన పడుతుండటం చిత్రంగా లేదూ!

కల్లంరెడ్డి డొంక తిరుగుడు?

ముఖ్యమంత్రి జగన్ సలహాదారు, సీఎస్‌గా పనిచేసిన అజేయ కల్లంరెడ్డి టైటిల్ చట్టం అమలుపై సరికొత్త భాష్యాలు చెబుతున్నారు. అసలు ఈ చట్టం అమల్లోకే రాలేదన్నట్లు పేర్కొన్నారు. ఇది కూడా అబద్ధమే. ఎందుకంటే... 2023 అక్టోబరు 31 నుంచి అమలులోకి వచ్చినట్టుగా నవంబరు 1న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేశారు. డిసెంబరులో స్టేట్‌ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేస్తూ జీవో ఇచ్చారు. చట్టం అమలుకు అవసరమైన ప్రాధికార సంస్థ ఇది. రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే జరుగుతున్నదే ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రకారం! చట్టంమీద అవగాహన లేని వాళ్లే బురద చల్లుతున్నారని అజేయ కల్లం ఆక్రోశించారు! ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు నెలల తరబడి కోర్టు విధులను బహిష్కరించారు. వారికి కూడా అవగాహన లేదంటారా? అసలు.. దీనిపై అజేయకల్లంకు ఉన్న అవగాహన ఏపాటిదో? 2022 నుంచి రీ సర్వే అనంతరం రైతులకు ఇస్తున్న పాసుపుస్తకాలపై 'శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పథకం' అని ముద్రిస్తున్నారు. అంటే.. 'ల్యాండ్ టైటిల్ యాక్ట్' ప్రకారం ఇస్తున్నవే కదా? అంతా చేస్తూ..రీ సర్వే అయ్యాకే చట్టం అని చెప్పడం మోసం కదా? రీ సర్వే పూర్తవ్వకుండా శాశ్వత భూ హక్కుపత్రాలు ఎలా ఇస్తున్నారు? ఇది తప్పు కాదా? గత ప్రభుత్వంలో ఆయన సీఎస్‌గా పనిచేశారు. 2016లో రెవెన్యూ సెక్రటరీగా పనిచేశారు. జమాబందీ, అజమాయిషీ చేయాలని అప్పుడు అనిపించలేదా? అవి చేస్తామంటే ఎవరు అడ్డుకున్నారు? కనీసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారా?

పట్టా నాదా? జగన్‌దా?

సీఎం ఫొటోల పిచ్చిపై జనాగ్రహం

- భూపట్టా పేరిట చేతికి బొమ్మల పుస్తకం
- ప్రతి పేజీలోనూ జగన్ ఫొటోలే
- భూమి నాది.. పుస్తకం నాది..
- మధ్యలో జగన్ ఫొటోలెందుకు?
- రైతాంగం తీవ్ర స్వరం
- సీఎం సతీమణి భారతిరెడ్డికీ సెగ
- ప్రచారంలో నిలదీసిన వైసీపీ నేత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మా పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలెందుకు? మా తాతాల కాలం నుంచి వారసత్వంగా వస్తోన్న భూముల పట్టాపై జగన్ ఫోటోలెందుకు వేశారు? వాటిపై మా ఫోటోలే ఉండాలి కదా!

కడప జిల్లా వేంపల్లె మండలం వైసీపీ నేత భాస్కర్‌రెడ్డి ఈ ప్రశ్నను ఎవరికో వేయలేదు...ముఖ్యమంత్రి జగన్ సతీమణి భారతిరెడ్డినే ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలోనే భారతిరెడ్డికి ఈ ప్రశ్నలెదురయ్యాయి.

కాకినాడలో జగన్ నిర్వహించిన రెవెన్యూ మీటింగ్‌లో కృష్ణయ్య అనే రైతుకు జగన్ బొమ్మ ఉన్న పాసుపుస్తకం అందించారు. దాని నిండా జగన్ బొమ్మలే కనబడటంతో ఆ రైతు వేదిక మీద నుంచే పాసుపుస్తకాన్ని చించిపడేశారు..

గుంటూరు జిల్లాకు చెందిన రైతు నాగభూషణం పాసుపుస్తకాన్ని చూపిస్తూ, 'ఈ భూమి నాదా? జగన్‌దా? నా పాసుపుస్తకంలో జగన్ బొమ్మలేయడం దేనికి? భూమి జగన్‌దా? నాదా? దీన్ని చూసి బ్యాంకువాళ్లు ఏమనుకుంటారు?' అంటూ ఆగ్రహించారు.



విజయనగరం మండలంలో శ్రీనివాసు అనే రైతు నేరుగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి అక్కడి టేబుల్‌పై తన పాసుపుస్తకం విసిరారు. 'నా పాసుపుస్తంలో జగన్ బొమ్మలెందుకు వేశారు? పుస్తకం ముందుపేజీ, లోపలిపేజీ, వెనక పేజీల్లో జగన్ బొమ్మలే ఉన్నాయి, నా ఫోటో కనబడనట్లుగా వేశా"రని రైతు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ బొమ్మలున్న పాసుపుస్తకం తనకొద్దని రైతు చెప్పడంతో, ఇష్టం ఉంటే తీసుకో, లేదంటే ఆఫీసునుంచి వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేశారు. పాసుపుస్తకాన్ని ఆ రైతు అక్కడేపడేసి వెళ్లిపోయారు.

వీరిలో ఏ ఒక్కరూ ప్రతిపక్షపార్టీల కార్యకర్తలు కారు. అంతా రైతులే. ఇక కడప నియోజకవర్గంలో, అందులోనూ జగన్‌కు తిరుగులేని బలం ఉన్న వేంపల్లెలో సీఎం సతీమణిని ప్రశ్నించిన రైతు స్వయనా వైసీపీ నేత. ఆయన అక్కడి మాజీ సర్పంచి కూడా. జగన్ బొమ్మ ఉన్న పాసుపుస్తకాలను రైతులు జీర్ణించుకోలేకపోతున్నారడానికి ఇవి మచ్చుతునకలు. కొందరు కోపంతో చించివేయగా, మరికొందరు తీవ్ర ఆగ్రహావేశాలను ప్రదర్శిస్తున్నారు. ఇక మరికొందరు ఎన్నికల ప్రచారంలో తమ వద్దకు వచ్చిన వైసీపీ నేతలను నిలదీస్తున్నారు.

నడుమ జగన్ ఏందిరో?

భూమి రైతుది. పాసుపుస్తకం రైతుది. మధ్యలో జగన్‌బొమ్మలెందుకు వేశారన్నది రైతుల ప్రశ్న. దీనికి ముఖ్యమంత్రి జగన్, ఫొటోల పిచ్చిని పరాకాష్ఠకు తీసుకెళ్లిన రెవెన్యూ, సర్వే ఉన్నతాధికారులే బదులివ్వాలి. అధికారులు గత ఏడాదిన్నర కాలంగా ఈ ప్రశ్నకు ముఖం చాటేశారు. ఆ రెండు శాఖలు అధికారికంగా స్పందించలేదు. ఇక ముఖ్యమంత్రి ఏనాడూ ప్రజల ముందుకొచ్చి, పాసుపుస్తకాల్లో తన ఫొటోలు ఎందుకువేశారో సమాధానం చెప్పుకోలేదు. దీంతో రైతుల్లో ఆగ్రహం కాస్తా కసిగా మారుతోంది. ఫొటోల పిచ్చిపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

పుస్తకం నిండా బొమ్మలే..

ఏపీ టైటిల్ చట్టంపై, అందులోని ప్రమాదకర క్లాజులపై రాష్ట్రం అంతా మహోద్యమమే నడుస్తోంది. తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని రద్దుచేస్తామని ఎన్డీఏ కూటమి ప్రకటించింది. ఉమ్మడి మేనిఫెస్టోలోనూ అదే మాట చెప్పింది. ఇక అధికారపార్టీ నానా తంటాలుపడుతోంది. తాము ఇష్టపడి చట్టం తీసుకురాలేదని, కేంద్రం ఒత్తిడిచేస్తేనే తెచ్చామని చెబుతోంది. ఇదెలా ఉన్నా, రైతులు మాత్రం జగన్ బొమ్మలున్న పాసు పుస్తకాలను సహించలేకపోతున్నారు. పుస్తకం నిండా జగన్ బొమ్మలేమిటని మండిపడుతున్నారు.

సీఎం సరదా తీర్చడానికి..

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి, పట్టాదారు పాసుపుస్తక చట్టం-1971(ఆర్ఓఆర్) ప్రకారం జగన్ బొమ్మలు పాసుపుస్తకాల్లో, రికార్డుల్లో ముద్రించడానికి వీల్లేదు. అందుకే, టైటిల్ చట్టం పేరిట శాశ్వత భూ హక్కు పత్రాలంటూ జగన్ బొమ్మలేసి ప్రభుత్వ రికార్డుల్లో ప్రతీ పేజీల్లో జగన్ బొమ్మలు ఉండాలన్న సీఎం సరదాను రెవెన్యూ, సర్వేశాఖలు తీర్చేశాయి. చట్టం ప్రకారం చెల్లవని తెలిసినా ప్రజాధనంతో ఆ పనికానిచ్చేశాయి. జగన్‌పట్ల ఉన్న స్వామిభక్తిని చాటుకునేందుకు అధికారులు ఇలాంటి పనులకు తెగించారు. ఇప్పటికే పాసుపుస్తకాల ముద్రణకోసం రూ.25 కోట్లపైనే ఖర్చుపెట్టారు. ప్రభుత్వం మారితే టైటిల్‌చట్టం ఉండదు. మరి ఆ చట్టం పరిధిలో ఇచ్చిన పాసుపుస్తకాలు కూడా కొనసాగించరు. అప్పుడు వీటిపై వ్యయం చేసిన 25 కోట్లు వృథానే. ఇందుకు జగన్, ఆయన భజనలో మునిగిపోయిన సర్వే, రెవెన్యూ అధికారులు నైతిక బాధ్యత వహిస్తారా? అని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.



రైతులకు రుణమాఫీ చేయాలని జగన్‌కు చెప్పాలని భారతిని కోరుతున్న తువ్వపల్లె, వేంపల్లె వైసీపీ నేతలు

సొంత ఇలాకాలో షాకులు!

- పులివెందులలో భారతికి ప్రశ్నలు
- రుణమాఫీపై జగన్‌కు చెప్పండి
- పదేపదే వైసీపీ నేతల డిమాండ్
- పాస్ పుస్తకంపై ఆయన ఫొటో ఎందుకు?
- రైతు భరోసాలో రాష్ట్రం వాటా పెంచాలి

కడప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సొంత ఇలాకా.. అందులోనూ సొంత పార్టీ నేతలు! చెప్పింది విని, జేజేలు కొట్టడంతప్ప... ఎదురు మాట్లాడిందీ, డిమాండ్లు చేసిందీ లేనేలేదు. మొట్టమొదటిసారిగా ఈ సీన్ రివర్స్ అవుతోంది. పులివెందుల నియోజకవర్గంలో వరుసగా రెండో రోజున జగన్ సతీమణి భారతికి వైసీపీ నేతలనుంచి 'డిమాండ్లు' వినిపించాయి. భారతి మంగళవారం పులివెందులలో ప్రచారం చేశారు. పిరమిడ్‌నగర్‌లో తువ్వపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నేతలు వెంకటనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ భర్త ధనుంజయరెడ్డి, వేంపల్లె వైసీపీ నాయకులు రెడ్డెయ్య తదితరులు రైతుల అసంతృప్తిని ఆమెకు తెలిపారు. "రైతులకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మేలు చేశారు. రుణమాఫీ చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఈ విషయం జగన్‌కు చెప్పండి" అని భారతిని కోరారు. రుణమాఫీ సాధ్యమయ్యేదైతే జగనే చెప్పేవారని, సాధ్యం కాదు కాబట్టి చెప్పలేదని ఆమె బదులిచ్చారు. అయినా సరే... రుణమాఫీ విషయాన్ని జగన్‌కు తెలపాలని వైసీపీ నేతలు పదేపదే కోరారు.

మా పాస్‌బుక్‌పై 'జగన్' ఎందుకు?

రైతుల పట్టాదారు పాసుబుక్కులపై జగన్ ఫొటో వద్దంటూ వైసీపీ నేత, కుమ్మరాంపల్లె మాజీ సర్పంచ్ భర్త భాస్కర్‌రెడ్డి వైఎస్ భారతికి ముఖాన్నే చెప్పారు. ఆమె సోమవారం వేంపల్లెలోని జీఎం కాంప్లెక్స్ వద్ద ప్రచారం నిర్వహిస్తుండగా... భాస్కర్‌రెడ్డి ఆమెతో మాట్లాడారు. "మా తాతల కాలం నుంచి పట్టాదారు పాసుబుక్కులపై రైతుల ఫొటోలే ఉన్నాయి. ఇప్పుడు జగన్ ఫొటోలు పెట్టడం పద్ధతి కాదు... తీసేయమని జగన్‌కు చెప్పండి. నా ఎస్సీ, నా బీసీ, నా మైనారిటీ అని చెప్పడమే తప్ప, జగన్ ఎప్పుడైనా 'నా రైతు' అని చెప్పారా?"అని భాస్కర్ రెడ్డి ప్రశ్నించారు. రైతు భరోసా కింద ఇచ్చే 13,500లలో కేంద్ర వాటాయే రూ.6 వేలని... రాష్ట్రం తన వాటా పెంచాలని జగన్‌కు చెప్పాలని భారతిని కోరారు.



తిరుమల శ్రీవారి 'గోవిందనామాల'ను 10,01,116 సార్లు రాసిన తొలి భక్తురాలిగా కర్ణాటకలోని పెద్దబల్లాపూర్‌కి చెందిన ఇంటర్ విద్యార్థిని కీర్తన రికార్డు సృష్టించారు. ఆమెకి టీటీడీ మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాన్ని కల్పించింది. - తిరుమల

నైరుతిలో వర్షాలే వర్షాలు!

- లానినా ప్రభావంతో బలపడనున్న రుతుపవనాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీనపడుతూ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరికొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితు లు ఏర్పడి, జూలై చివరిలో లానినా ప్రభావం కనిపిస్తుందని అమెరికా, ఆస్ట్రేలియా వాతావరణ సంస్థలు ఇప్పటికే వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా అంటే 106 శాతం వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనాకు వచ్చింది. వచ్చే నెలలో ఎల్‌ని నో అంతమైన తరువాత పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు చల్లబడనున్నాయి.

మరో ఐదు రోజులు ఏపీలో గాడ్పులు

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత, వడగాడ్పులు మరింత పెరుగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. వివిధ ప్రాంతాల్లో 47 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు 45-47 డిగ్రీలు, ఇతర ప్రాంతాల్లో 42-45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం కర్నూలు జిల్లా జి.సింగవరంలో అత్యధికంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

'వైఎస్సార్ టీచర్స్' రాష్ట్ర అధ్యక్షుడి సస్పెన్షన్

అనంతపురం విద్య, ఏప్రిల్ 30: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అశోక్‌కుమార్‌రెడ్డి అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల హైస్కూల్‌లో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అధికార పార్టీకి ముందు నుంచి విధేయుడు. ఇటీవల వైసీపీ ప్రభుత్వానికి మద్దతుగా ఆయన చేసిన వ్యాఖ్యలు, జగన్ భజన గురించి జగన్ సొంత పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆయనపై పలువురు ఫిర్యాదు చేశారు.

అనంతలో రూ.1.99 కోట్ల నగదు పట్టివేత

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30: అనంతపురం జిల్లా కేంద్రంలో ఓ కారులో తరలిస్తున్న రూ.1.99 కోట్ల నగదును పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని విద్యుత్‌నగర్ సర్కిల్‌లో మంగళవారం చేపట్టిన తనిఖీల్లో రెండు బ్యాగుల్లో పెద్ద మొత్తంలో ఉన్న నగదును గుర్తించారు. ఆధారాలు లేకపోవడంతో ఆ డబ్బును సీజ్ చేశారు. కదిరికి చెందిన కారు డ్రైవర్ పి.ఆనంద్‌కుమార్ ఆ మొత్తాన్ని అనంతపురం నుంచి కదిరికి తీసుకెళ్తున్నట్లు తెలిపాడు.

కోడ్ ఉల్లంఘించి టీచర్స్ బదిలీలు!

- విద్యాశాఖ మంత్రి, అధికారులపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ టీచర్లను బదిలీ చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతోపాటు.. ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్‌బాబుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనాకు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావులు ఫిర్యాదు చేశారు. అనంతరం మన్నవ సుబ్బారా వు మీడియాతో మాట్లాడుతూ.. సాధారణ బదిలీలు పూర్తయిన తర్వాత లంచాలు తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా 653 మంది ఉపాధ్యాయులకు నేరుగా పోస్టింగ్‌లు ఇచ్చారని తె లిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండగా ఇలా ఉపాధ్యాయులను బదిలీ చేయడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు.

పాలిసెట్ ప్రాథమిక కీ విడుదల

పాలిసెట్ ప్రాథమిక కీ మంగళవారం విడుదల చేసినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కీ చూసుకోవచ్చని, అదే వెబ్‌సైట్‌లో ఈ నెల 4 వరకు అభ్యంతరాలు తెలపవచ్చని పేర్కొన్నారు. 5న తుది కీ విడుదల చేసి, 10లోగా ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

వైద్యుడి మరణ శాసనం



భార్య, పిల్లలతో డాక్టర్ శ్రీనివాస నాయక్

విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధలు, ఆసుపత్రి నిర్వహణలో భాగస్వాముల మధ్య విభేదాలతో ఓ వైద్యుడు దారుణానికి ఒడిగట్టాడు. జన్మనిచ్చిన తల్లిని, కట్టుకున్న భార్యను, కన్న పిల్లలను కిరాతకంగా చంపేశాడు. తర్వాత తాను ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం విజయవాడలో కలకలం రేపింది. నగరంలోని పటమట ఫన్‌టైమ్స్ క్లబ్ వెనుక వీధిలో ఉంటున్న డాక్టర్ దారావత్ శ్రీనివాస నాయక్ (45) ఆర్థోపెడిక్ వైద్యుడు. ఆయన భార్య ఉషారాణి గృహిణి. వారికి కుమార్తె శైలజ(9), కుమారుడు శ్రీహాన్(5) ఉన్నారు. శ్రీనివాస నాయక్ తల్లి రమణమ్మ(65) వారితోనే ఉంటుంది. ఏడాది క్రితం శ్రీనివాస నాయక్ విజయవాడ డోర్నకల్ రోడ్డులో శ్రీజ ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఏర్పాటుచేశారు. దీనిపై ఆదాయం రాకపోగా ఎదురు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో ముగ్గురు వైద్యులను భాగస్వాములుగా చేర్చుకున్నారు. ఆసుపత్రి కోసం చేసిన అప్పులు పెరిగిపోవడం, భాగస్వాములుగా చేరిన వారు మొత్తం పెత్తనం లాక్కోవడంతో ఆయన తీవ్ర మనోవేదనకు లోనయ్యారని తెలుస్తోంది. మంగళవారం తెల్లవారుజామున మొదటి గదిలో నిద్రపోతున్న భార్య కుమార్తెను, ఆ తర్వాత రెండో గదిలో ఉన్న తల్లిని, అనంతరం మూడో గదిలో ఉన్న కుమారుడు శ్రీహాన్‌ను మెడకోసి శ్రీనివాస నాయక్ హత్య చేశారు. ఆ తర్వాత ఉదయం ఆరు గంటల వరకు ఆయన మేల్కొని ఉన్నారు. హైదరాబాద్‌లో న్యాయాధికారిగా పనిచేస్తున్న సోదరుడు దుర్గాప్రసాద్‌కు ఒక లేఖ రాశారు. ఈ లేఖతో పాటు తన కారు తాళాలను తీసుకుని ఎదురింటికి వెళ్లిన శ్రీనివాస నాయక్ ఆ గేటుకు ఉన్న ఉత్తరాల పెట్టెలో వేశారు. తర్వాత ఇంటికి వచ్చి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఉదయం పది గంటల సమయంలో పనిమనిషి చూడగా వరండాలో డాక్టర్ ఉరికి వేలాడుతూ కనిపించారు. ఆమె ఇరుగుపొరుగు వారికి, వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆయన సోదరుడు హైదరాబాద్ నుంచి వచ్చాక కారు తలుపులు తెరవగా అందులో ఒక బ్యాగ్‌లో నగదు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ ఉన్నాయి.

నమ్మాలి మరి!

- బాబు పథకాలకు జగన్ వక్రభాష్యం
- కేజీ బంగారం, బెంజి కారట!
- టీడీపీ అధినేత ఇవ్వని హామీపై విసుర్లు

ఒంగోలు, కడప, కలికిరి, మైదుకూరు ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ మరోసారి పచ్చి అబద్ధాలు ఒలకబోశారు. టీడీపీ అధినేత చంద్రబాబును తిడుతూ 23 నిమిషాల్లో ప్రసంగం ముగించేసి వెళ్లిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ప్రకాశం జిల్లా టంగుటూరులో సిద్ధం సభ నిర్వహించారు. జనం స్పందన లేదనుకున్నారో ఏమోగానీ 23 నిమిషాల్లోపే తన ప్రసంగం ముగించేశారు. ఇలా ఇలా ఊపండంటూ పదేపదే చెప్పి చేతులూపించుకున్నారు. 2014లో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో హామీలు ఏమీ అమలు కాలేదన్నారు. 'ఈసారి ఇంటింటికీ కేజీ బంగారం, బెంజి కారు ఇస్తారంటా.. మీకు తెలుసా' అని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. ఇక చంద్రబాబును డెవలప్‌మెంట్‌కింగ్ అని ప్రచారం చేస్తున్నారని, ఆయన ఎందు లో గొప్ప అంటూ ప్రశ్నించారు. అప్పట్లో నగరాలకు ఐటీ సంస్థలను తెచ్చానని చంద్రబాబు చెప్పారంటూ.. మేజర్ పంచాయతీ అయిన మీ కొండపి కి ఐటీ పరిశ్రమ తెచ్చారా.. అని వితండవాదం చేయడం గమనార్హం. పునాదుల్లో ఉన్న 17 వైద్య కళాశాలను.. పూర్తిచేశానని గొప్పలు చెప్పారు.

వెలిగొండపై పచ్చి అబద్ధాలు..

వెలిగొండ ద్వారా నీటిని ప్రకాశం జిల్లాకు తెచ్చింది జగనేనంటూ సీఎం స్వోత్కర్షకు పాల్పడ్డారు. కానీ, ఇది అబద్ధం. కొద్దిరోజుల క్రితం వెలిగొండకు వచ్చిన జగన్.. 'ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నా. కానీ నీరు మాత్రం జూలై తర్వాత వస్తాయ'ని ప్రకటించారు. నెలన్నర వ్యవధిలోనే ఆయన మంగళవారం సభలో వెలిగొండ ద్వారా ప్రకాశం జిల్లాకు నీరిచ్చానని గొప్పగా చెప్పారు. కడప జిల్లా మైదుకూరులోనూ ఇదే పరిస్థితి. 2014-15 నాటి చంద్రబాబు మేనిఫెస్టోను చదువుతూ.. వచ్చిందా అంటూ, ఇలా ఇలా ఇలా అని చేయి చూపుతూ అడిగినా.. జనం నుంచి స్పందన లేదు. ఇక... అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరిలో నిర్వహించిన సభలో పెన్షన్లపై అబద్ధాలు ఆడారు. 2019లో తాను అధికారంలోకి వచ్చేనాటికి చంద్రబాబు కేవలం రూ.1000 మాత్రమే పెన్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. వాస్తవానికి చంద్రబాబు పాలనలో రూ.2000 పెన్షన్ ఇచ్చేవాళ్లు. ఏడాదికి రూ.250 చొప్పున ఐదేళ్లకు జగన్ దానిని మూడు వేలు చేశారు. ఈ విషయాన్ని దాచిపెట్టిన జగన్.. రూ.1000 నుంచి రూ.3 వేలకు పింఛన్లను పెంచినట్లు గొప్పలు చెప్పుకొన్నారు. కాగా, మైదుకూరు



ప్రకాశం జిల్లా టంగుటూరు సభలో అంతంగా మాత్రంగానే జనం

బహిరంగసభలో జగన్ మాట్లాడుతూ.. అనివార్య కారణాల వల్ల, కరోనా వల్ల రాజోలి చేపట్టలేక పోయామన్నారు. తొలి నాలుగేళ్ల వర్షాలు కురిసి సమృద్ధిగా ప్రాజెక్టులు ఉండడంతో నీటి కొరత లేదన్నారు. ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో సమస్య తిరిగి తలెత్తిందన్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే రాజోలి పూర్తి చేస్తామని చె ప్పారు. సీఎం స్థాయి వ్యక్తి రాజోలి ప్రాజెక్టు ప్రాధాన్యత గుర్తించలేకపోవడం ఏమిటి.. అసలు ఆయనకు సాగునీటిరంగంపై అవగాహన ఉందా అంటూ సభలోని జనం మాట్లాడుకోవడం కనిపించింది.

సీఎం పర్యటన ఏర్పాట్లలో రెవెన్యూ అధికారి



సభ ఏర్పాట్ల పరిశీలనలో పీఏ టు స్పెషల్ కలెక్టర్ జి.శ్రీనివాసులు

మైదుకూరులో మంగళవారం సీఎం జగన్ సిద్ధం సభకు హాజరయ్యా రు. ఈ నేపథ్యంలో సీఎం సభకు బందోబస్తు ఏర్పాట్లను సోమవారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పరిశీలించారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో కడప కలెక్టరేట్‌లో పీఏ టు స్పెషల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసులు ఉన్నారు. గతంలో ఈయన జమ్మలమడుగు ఆర్డీవోగా పనిచేశారు. ఎన్నిక ల సమయంలో ఈయనను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో రాజకీయ నేతలు పాల్గొనే కార్యక్రమం ఏర్పాట్లలో ఈయన పాల్గొన్నారు. ఈ విషయంపై మైదుకూరు ఆర్వో చంద్రమోహన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఇది కోడ్ ఉల్లంఘనే అన్నారు.

కొత్తగా రూ.3,000 కోట్ల అప్పు

- 28 రోజుల్లోనే రూ.10,000 కోట్లు

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేస్తోంది. 28 రోజుల్లో రూ.10,000 కోట్ల అప్పులు చేసింది. ఏప్రిల్ 2వ తేదీన రూ.4,000 కోట్లు, ఏప్రిల్ 23న రూ.3000 కోట్లు, ఏప్రిల్ 30న రూ.3,000 కోట్లు అప్పులు తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం 6 నెలలకు ఇచ్చిన రూ.47,000 కోట్ల అప్పుల పరిమితిలో రూ.10,000 కోట్లను ఏప్రిల్ నెల్లోనే తెచ్చేశారు.

కూటమి మేనిఫెస్టోతో రేషన్ డీలర్లకు ఊరట: దివి

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ విధానాన్ని సమీక్షించి.. పౌరసరఫరాల వ్యవస్థను పటిష్ఠం చేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోలో హామీ ఇవ్వడం రాష్ట్రంలోని 29,500 మంది రేషన్ డీలర్లకు గొప్ప ఊరటగా భావిస్తున్నామని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు తెలిపారు. డీలర్ల సమస్యలను పరిష్కరించే విధంగా పంపిణీ విధానాన్ని సమీక్షిస్తామని చెప్పిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కూటమికి బ్రాహ్మణులు మద్దతివ్వాలి: నీలాయపాలెం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందువులకు, బ్రాహ్మణులకు ఎన్డీయే కూటమి అద్భుతమైన హామీ ఇచ్చిందని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. 'గత ఐదేళ్లలో దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసాలు, రథాల దగ్ధం వంటి ఘటనలపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తాం. దోషులకు శిక్ష పడేలా చేస్తామని మేనిఫెస్టోలో చెప్పడం హర్షించదగిన విషయం' అని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పుంగనూరులో కేంద్ర బలగాలను దింపాలి: టీడీపీ

పుంగనూరు నియోజకవర్గంలో శాంతిభద్రతలు లేవని టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మంగళవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను టీడీపీ నేతలు వర్ల రామయ్య, ఏఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు, కోడూరి అఖిల్ కలసి వినతి పత్రాలు అందజేశారు. 'మంత్రి పెద్దిరెడ్డికి తొత్తుగా వ్యవహరిస్తున్న పుంగనూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డిని తక్షణమే బదిలీ చేసి, పుంగనూరు పోలీసులను ఎన్నికలయ్యే వరకు వీఆర్‌లో పెట్టాలి. ఎన్నికలయ్యే వరకు ఆ నియోజకవర్గంలో రాష్ట్ర పోలీసులను కాకుండా కేంద్ర బలగాలను నియమించాలి. పొన్నూరులో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ సుధాకర్‌ను, చిత్తూరులో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అరుణను సస్పెండ్ చేయాలి' అని వారు కోరారు.

పుంగనూరు పెద్దిరెడ్డి జాగీరా?: సీపీఐ

'పుంగనూరులో ప్రజాస్వామ్యం మంటగలిసింది. అక్కడ వైసీపీ శ్రేణుల దాష్టీకాలు నానాటికీ పెరిగిపోతున్నాయి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. 'మంత్రి పెద్దిరెడ్డి కనుసన్నల్లో అనుచరులు వీరంగం సృష్టిస్తున్నారు. పుంగనూరు పాకిస్తాన్‌లో ఉందా? లేక అది పెద్దిరెడ్డి జాగీరా? ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకోవాలి. పుంగనూరును సమస్యాత్మక ప్రాంతంగా గుర్తించాలి. అక్కడ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి' అని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

కర్నూలుకు ఈఆర్‌సీ.. జూన్ నుంచి కార్యకలాపాలు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కర్నూలుకు తరలిపోతోంది. కర్నూలుకు ఈఆర్‌సీని అమరావతి నుంచి తరలిస్తున్నామంటూ కమిషన్ గతేడాది ఏప్రిల్‌లో ఉత్తర్వు జారీ చేసింది. దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) కర్నూలులో ఈఆర్‌సీ కార్యాలయానికి సబ్‌స్టేషన్‌కు సమీపంలో భూమి కేటాయించింది. ఈ భూమిలో ఈఆర్‌సీ కార్యాలయం నిర్మాణం అవుతోంది. అయితే, ఏడాది కాలంలోనే కార్యాలయ నిర్మాణం, ఈఆర్‌సీ తరలింపు ఆగమేఘాల మీద జరిగిపోతాయని ఎవరూ ఊహించలేదు. అదీ కొన్ని రోజుల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఉండగా, దీనిపై ఆదేశాలు జారీ కావడం గమనార్హం.

అభివృద్ధికి పట్టం కట్టండి: లక్ష్మణరెడ్డి

బాపట్ల, ఏప్రిల్ 30: ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపే అభ్యర్థులను గెలిపించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి కోరారు. మంగళవారం బాపట్లలో నిర్వహించిన సమావేశంలో లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ దేశంలో అత్యధిక ఎన్నికల వ్యయం జరిగే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కానుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 1000 కుటుంబాల మధ్యే పోటీ జరుగుతుందన్నారు. ప్రజలను కులాల వారీగా విభజించి కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలవాలని పార్టీలు భావించడం మంచిది కాదన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దగ్ధ వనాలు

ఉత్తరాఖండ్‌లో అడవులు తగలబడుతున్నాయి. మంటలు ఆర్పే ప్రయత్నాలు ఉధృతంగా సాగుతున్నప్పటికీ, కొత్తకార్చిచ్చులు పుట్టుకొస్తున్నాయి. గత ఏడాదితో పోల్చితే భారీ, అతిభారీ దావానలాల సంఖ్య ఈ ఏడాది ఎక్కువగా ఉంది. గత పదిరోజుల్లో రెండువందలకు పైగా తీవ్రస్థాయి కార్చిచ్చులు నమోదైతే, గత ఏడాది ఇదే కాలంలో పదకొండుమాత్రమే నమోదైనాయట. మంటలు ఆర్పేందుకు, వ్యాప్తిని నిరోధించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో విశ్వప్రయత్నం చేస్తున్నది. హెలికాప్టర్లు బాంబీ బకెట్లతో నీళ్ళు కుమ్మరిస్తున్నాయి. అయినప్పటికీ, విద్యాలయాలకూ, జనావాసాలకు కూడా ఈ కార్చిచ్చుల బాధ తప్పడం లేదని వార్తలు వస్తున్నాయి.

ఈ కార్చిచ్చులమీద సర్వోన్నత న్యాయస్థానం ముందు మూడేళ్ళుగా నాలుగుపిటిషన్లు విచారణకోసం ఎదురుచూస్తున్నాయని, వాటిని వెంటనే స్వీకరించాలని సోమవారం ఒక ప్రభుత్వేతర సంస్థ ప్రధాన న్యాయమూర్తికి మొరపెట్టుకుంది. వేలాది హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతి అయిపోతున్నదని, ఉత్తరాఖండ్ రాష్ట్రంగా ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకూ అధికారిక లెక్కల ప్రకారమే యాభైవేల హెక్టార్ల అడవి తగలబడిపోయిందని ఈ సంస్థ తన బాధ వ్యక్తంచేసింది. ప్రకృతికంటే మానవకార్యకలాపాలే ఈ దావానలాలకు ముఖ్య కారణమని ఆ సంస్థ ఆరోపిస్తున్నది. 2019లో 2,981 హెక్టార్లు తగలబడితే, ఆ మరుసటి ఏడాది, అంటే కరోనా ఆంక్షలు అమలులో ఉన్నప్పుడు 172 హెక్టార్లు మాత్రమే అగ్నికి ఆహుతి అయిన విషయాన్ని ఈ సంస్థ చీఫ్‌జస్టిస్ దృష్టికి తీసుకువచ్చింది. ఈ డేటాను లోతుగా గమనించినప్పుడు, 2021లో 3,576 హెక్టార్లు, 2022లో 3,425 హెక్టార్లు మంటల్లో మాయంకావడం ఆశ్చర్యం కలిగించదు. ఏటా ఫిబ్రవరినుంచి దావానలాలు ఆరంభమవుతాయి కనుక ఆర్నెల్లు ముందునుంచే నిర్దిష్టమైన చర్యలతో వాటిని నియంత్రించవచ్చునని పిటిషన్‌దారు వాదన.

కార్చిచ్చులపై పిటిషన్లను సత్వరమే విచారణకు చేపడతామన్న చంద్రచూడ్ హామీని అటుంచితే, ఈ దావానలాలకు ప్రధానకారణం మానవ కార్యకలాపాలే. స్థానికులు, పర్యాటకులు కాలుతున్న సిగరెట్లను నిర్లక్ష్యంగా విసిరేయడం, ఎక్కడపడితే అక్కడ వండుకొని, నిప్పు సరిగా ఆర్పకపోవడం, వ్యవసాయక్షేత్రాల్లో వ్యర్థాలను తగలబెట్టడం ఇత్యాది చర్యలతో పాటు, స్మగ్లర్లు ఉద్దేశపూర్వకంగా అడవులకు నిప్పంటిస్తున్న ఘటనలు కూడా ఎక్కువవుతున్నాయి. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటూ, వాతావరణం మరింత పొడిగా మారిపోయిన నేపథ్యంలో కార్చిచ్చుల సంఖ్య పెరిగివుండవచ్చు. కానీ, వేసవి ప్రవేశం కంటే ముందుగానే వందలాది హెక్టార్ల అడవి నాశనమైన అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. తప్పును పూర్తిగా వాతావరణ మార్పులమీదకు నెట్టివేయడం సరికాదు. మనిషి అత్యాశకు అడవులు బలైపోతుంటే, మానవ నిర్లక్ష్యం కారణంగా పెరిగిన భూతాపం మిగిలిన వనాలను మింగేస్తోంది.

కార్చిచ్చు ఘటనల సంఖ్య ఉత్తరాఖండ్‌లో గత రెండుదశాబ్దాల్లో బాగా పెరిగాయి. భారీ ప్రాజెక్టుల నిర్మాణంతో అడవుల విధ్వంసం ఒకపక్కన జరిగిపోతుంటే, పర్యాటకాన్ని పెంచడం, అభివృద్ధి సాధించడం పేరిట చేపట్టిన చర్యలు మరింత నష్టాన్ని చేకూర్చుతున్నాయి. అడవుల నిర్వహణలో స్థానికుల పాత్ర గతంతో పోల్చితే బాగా తగ్గిపోయిందని, దావానలాలను అరికట్టడంలో పూర్వపు తరాలవారు ప్రదర్శించిన చొరవ ఇప్పటివారిలో లేకుండాపోయిందని, ప్రభుత్వాలు సైతం ప్రజాభాగస్వామ్యం విషయంలో శ్రద్ధచూపడం లేదని పర్యావరణవేత్తలు వాపోతున్నారు. 90శాతం కార్చిచ్చులు మానవ ప్రేరేపితాలేనని అంటున్నప్పుడు, వాటిని నివారించడానికీ, నిరోధించడానికీ స్థానికుల సాయం చాలా అవసరం. వేసవి సమీపించి, వేడి పెరిగి, వాతావరణం పూర్తిగా పొడిబారి అగ్గిరాజుకున్న తరువాత ప్రజలను హెచ్చరించడమో, అభ్యర్థించడం కాక, ముందుగానే వారి భాగస్వామ్యంతో నివారణ చర్యలు ఆరంభం కావాలి. ఎండుటాకులనుంచి పైన్ వృక్షాల వరకూ అగ్గిపుట్టించే ఏ అంశాన్నీ వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెబ్బయ్‌శాతం అడవులున్న ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో దావానలాలను సమర్థంగా ఎదుర్కోవడానికి సిబ్బందికి ఆధునిక పరికరాలు ఉండాలి, ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు జరగాలి.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నిజానికి 8 గంటల పనిదినం క్రమక్రమంగా 7 గంటల, 6 గంటల, 5 గంటల, 4 గంటల పనిదినంగా మారాలి. కానీ 8 నుండి 10, 12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది. ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది.

పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదు!

కార్మికుణ్ణి ‘మాట్లాడే యంత్రం’గా దిగజార్చిన పెట్టుబడిదారీ యుగనీతిపై ఓ తిరుగుబాటు బావుటా మే డే! కార్మికుణ్ణి కూడా మనిషిగానే చూడాలంటే, అతడు/ ఆమె రోజుకు ఏఏ విధులకు ఎన్నెన్ని గంటల్ని కేటాయించాలో నిర్వచించింది మేడే పోరాటం. 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, మరో 8 గంటలు తన కోసం. ఈ ఆఖరిది ఆచరణలో వినోదం కోసం. లేదా కుటుంబ జీవితం కోసం. ఇదే అత్యంత ప్రాధాన్యత గలది. అదే 1886లో ప్రధానంగా పొందిందీ, నేడు ప్రధానంగా కోల్పోయేదీ!

రోజుకు 24 గంటలు. దాన్ని మూడు సమ భాగాలు చేస్తే 8 గంటలౌతుంది. ఓ 8 గంటలు పెట్టుబడిదార్ల వద్ద పని కోసం. ఇంకో 8 గంటలు పని ద్వారా కోల్పోయిన శరీర శక్తిని తిరిగి పొందేందుకు నిద్రకోసం. మరో ముఖ్యమైన 8 గంటలు తన కోసం. అంటే కార్మికుడి కోసం. ఆచరణలో కుటుంబం కోసం. అదే సాంఘిక జీవితం. సోషల్ లైఫ్. ఓ మనిషిగా కార్మికుణ్ణి మార్పుకు గురి చేసే ముఖ్యమైన ప్రక్రియ అదే!

మనిషికి అవసరమైన 8 గంటల నిద్రా కాలాన్ని కూడా పారిశ్రామిక వర్గం కబ్జా చేసిన దశ ఉంది. అది కార్మికవర్గాన్ని ‘టాకింగ్ టూల్’గా; ‘లివింగ్ యానిమల్’గా ఫ్యాక్టరీల్లో 16 గంటలకు మించి పని చేయించింది. ఫలితంగా ఆకలి, రోగాల కంటే, నిద్ర చాలని కారణంగా అకాల మరణాలు జరిగిన దశ ఒకటుంది. అలా మరణించిన వారిని పశువుల శవాల్లా అవతలకు ఈడ్చివేసి రిజర్వుడ్ నిరుద్యోగులతో పని చేయించుకుంది. అలా పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ శవ రాశుల పునాది మీద బలపడింది.

1789 ఫ్రెంచ్ విప్లవం, 1886 మేడే పోరాటం మధ్య 97 ఏళ్ల వ్యవధి ఉంది. శతాబ్ది తేడాలో సంభవించిన రెండు ప్రాపంచిక ఘటనలు రెండు భిన్నమైన మానవ విలువల్ని అందించిన నేపథ్యం ఉంది. ఈ రెండింటికి కర్త పాత్రను మొదట సందర్భంలో రైతాంగం, తర్వాతి సందర్భంలో కార్మికవర్గం చేపట్టి విజయవంతం చేశాయి. ఆ కాలాల్లో వాటికి ఏఏ వర్గాల జనం కర్తలుగా మారినా, అవి అందించిన ఫలితాలు మాత్రం అంతిమంగా ఆనాటి సగటు సమాజాల విలువలుగానే మారాయి. ఆ విలువలను కోల్పోయే ప్రమాదం ఏర్పడితే ఆ నిర్దిష్ట వర్గాల ప్రజల వరకే పరిమితం కాకుండా మొత్తం ప్రజలు కూడా నష్టపోతారు. ఈ వెలుగులో మరో 8 గంటల పని దినానికి ఎదురయ్యే నేటి ప్రమాదం పట్ల సకల రంగాల ప్రజల్ని అప్రమత్తం చేయాల్సి ఉంది.

మేడే పోరాటంతో దక్కిన 8 గంటల పని దినం కార్మికుణ్ణి మనిషిగా మార్చింది. పని, నిద్ర పోగా మరో 8 గంటలు కార్మికవర్గానికి దక్కింది. దీంతో భార్యాబిడ్డలతో కార్మికవర్గం సామాజికంగా వినోదభరిత జీవితాన్ని పొందింది. తద్వారా కార్మికుడు యంత్రంగా కాక, మనిషిగా రూపొందాడు. ఈ మరో 8 గంటల సాంఘిక జీవితం కార్మికవర్గాన్ని పూర్తి స్థాయిలో మార్చివేసింది.

వినోద జీవితం గడపడానికి సమయం దొరికిన తర్వాతనే నాటి ప్రజలందరి వలెనే తమ భార్యాబిడ్డలతో కార్మికవర్గం వీధుల్లో, పార్కుల్లో, వినోద క్రీడల్లో, పండగ పబ్బాలలో, సంబరాలలో, గ్రంథాలయాల్లో భాగమైంది. తన పూర్వ పశుబంధం స్థానంలో కొత్తగా మనిషిబంధం రూపొందింది. ఏ నిర్వచనాన్ని ఎవరు ఎలా ఇచ్చినా, వాస్తవ ఆచరణలో నాటి కార్మికుణ్ణి యాంత్రిక జీవితం నుండి వేరు పరిచింది మేడే పోరాటమే.



మేడే పేరు వింటే ఎర్రజెండా రెపరెపలు, జండా గద్దెలు, స్థూపాలంకరణలు, విప్లవ గానాలు, పోరాట నాదాలు, కార్మిక ప్రదర్శనలు, శ్రామికవర్గ కవాతులు, ప్రభాత భేరీలు, ఉద్వేగభరిత ప్రసంగాలు గుర్తుకు వస్తాయి. ఇంతకంటే భిన్నమైన మానవీయ కోణం కూడా మేడేలో దాగి ఉంది. దాన్ని ప్రాచుర్యంలోకి తేవడం నేటి తక్షణ, ప్రధాన కర్తవ్యం.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నిజానికి 8 గంటల పనిదినం క్రమక్రమంగా 7 గంటల, 6 గంటల, 5 గంటల, 4 గంటల పనిదినంగా మారాలి. కానీ 8 నుండి 10, 12, 14, 15, 16 గంటలుగా మారడం ఏమిటి? కోవిడ్‌లో 12 నుండి 14 కోట్ల మంది వలస కార్మికుల వెతలు లోకం ఎదుట బహిర్గతమైనవి. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి ఉన్నది.

శారీరక శ్రమ చేసే కార్మికవర్గం మాటే కాదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగవర్గం మాట కూడా ఇదే! ఈ మానసిక శ్రమ చేసే ఉద్యోగ వర్గాలతో సైతం గతం కంటే ఎక్కువ గంటల పని చేయించే స్థితి ఏర్పడింది. ఇదెక్కడి వరకు వెళ్లిందంటే ఉన్నత విద్యావంతులే కాక, సాంకేతిక నిపుణులై అధిక రాబడి గల సాఫ్ట్‌వేర్ వంటి ఉద్యోగులు సైతం నేడు అధిక సమయం పనిచేయాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా ఐటి ఉద్యోగవర్గపు సాంఘిక జీవితం తీవ్ర కల్లోలభరితమవుతున్నది. వారు మానసిక రోగులుగా మారుతున్న దుస్థితిని చూస్తున్నాం. వారి వైవాహిక కుటుంబ జీవితంపై దుష్ప్రభావం పడుతోంది. ఎంత జీతాలు వచ్చినా సాంఘిక జీవితాన్ని కోల్పోతే సుఖం ఏమిటి? ఈ రోజు కార్మిక పోరాటం జీతభత్యాల వరకే పరిమితం కాక, పని గంటల సమస్యపై కూడా దృష్టి సారించాల్సి ఉంది. ఈ కర్తవ్యం శ్రామికవర్గ, ఉద్యోగ సంఘాలపై ఉంది.

మేడే సందర్భంగా శ్రామికవర్గ సంస్థల నేతలు, ఆర్గనైజర్లు, కార్యకర్తలు ప్రత్యేక బాధ్యతని నిర్వహించాల్సి ఉంది. వారికి మేడే కార్మికవర్గ వ్యవహారంగా కాకుండా, యావత్తు సమాజ వ్యవహారంగా మార్చడానికి ఓ అవకాశం ఉంది. వారు దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వారు మేడేని విశాల ప్రజాల మధ్యకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయాలి. ఆ సావకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఇప్పటికే కొంత వైఫల్యం ఉంది. ఇలా చెప్పాల్సి వస్తున్నందుకు సాటి శ్రామికవర్గ సహచరునిగా బాధతో పాటు విచారం వ్యక్తం చేస్తున్నాను.

పని గంటల కాలపరిమితి పెరిగిన మేరకు కార్మికవర్గం తమ సాంఘిక జీవితాన్ని కోల్పోతుంది. కారల్ మార్క్స్ చెప్పినట్లు కార్మికవర్గం తీవ్ర పరాయీకరణకి గురౌతుంది. తన ఎదుట గల అన్ని శక్తుల్ని శత్రువులుగా చూస్తోంది. ఆ అందరి దృష్టిలో కార్మికవర్గం కూడా తేలికైపోతుంది. దాన్ని వారు కూడా శత్రువుగా చూసే స్థితి ఏర్పడుతుంది. తుదకు ఆ నష్టం కేవలం కార్మికవర్గానికే పరిమితం కాకుండా మొత్తం సమాజం నష్టపోతుంది. ఈ విధంగా దేశంలో నలభై కోట్లకి పైగా కార్మిక కుటుంబాలది యాంత్రిక జీవితంగా మారితే, భావి సామాజిక సంక్షోభస్థితి ఏ స్థాయిలో ఉంటుందో తేలిగ్గా ఊహించవచ్చు. ఈ కారణంగా రేపటి సంక్షోభాన్ని నివారించడం కోసం కార్మిక కుటుంబాల్ని చైతన్యపరిచి పోరాటానికి సిద్ధం చేయడం ఓ కర్తవ్యం కావాలి. అందుకే 138వ మేడే సందర్భంగా కార్మికోద్యమ శక్తులతో పాటు ప్రజాతంత్ర, వామపక్ష, లౌకిక, ప్రగతిశీల శక్తులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

జీతభత్యాలు, సౌకర్యాలు, హక్కులు, జీవన ప్రమాణాలు, ఉద్యోగ భద్రత వంటి వివిధ కోర్కెల సాధనకై పోరాడుతూ అంతకంటే ప్రాధాన్యతని పని గంటలపై ఇవ్వాల్సి ఉంది. మన మీద ఇది చరిత్ర మోపిన బాధ్యత! రేపు ముందుకు వెళ్లాలంటే నేడు మనం వెనక్కి వెళ్లాల్సిందే. 2025 వైపుకూ, ఇంకా ముందుకూ వెళ్లాలంటే, మంచి భవిష్యత్తును మనం నిర్మించుకోవాలంటే, 1886 వైపుకు చూపును సారిద్దాం. చికాగో విప్లవ స్ఫూర్తిని పొంది ముందడుగు వేద్దాం.

(నేడు మేడే)

● పి. ప్రసాద్
ఐ.ఎఫ్.టి.యూ.

మారుతున్న మోదీ ప్రచార సరళి



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దేశ రాజధాని ఢిల్లీ పొలిమేరల్లోని ఘజియాబాద్, ఎక్కడ చూసినా వేలాది అపార్ట్‌మెంట్లు, మాల్స్‌తో ఒక కాంక్రీట్ జంగిల్‌లా ఉంటుంది. ఇక్కడ నివసించే వారంతా ఎక్కువగా ఢిల్లీలో రకరకాల ఉద్యోగాలు చేస్తున్నా అత్యధికులు ఉత్తరప్రదేశ్ ఓటర్లే. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన రోజు ఈ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ఆటోలు, కార్లపై కాషాయ పతాకాలు రెపరెపలాడాయి. దాదాపు ప్రతి అపార్ట్‌మెంట్‌లో అయోధ్యలో ప్రాణప్రతిష్ఠను పెద్ద పెద్ద స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. రామమందిరం కోసం ప్రజల శతాబ్దాల పోరాటాన్ని దేశ స్వాతంత్ర్యోద్యమంతో పోలుస్తూ ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని ఉత్కంఠతో విన్నారు. అందరికీ ప్రసాదాలు పంచిపెట్టారు. పేదలకు అన్నదానాలు చేశారు. భారతదేశం పూర్తిగా మారిపోతోందన్న అభిప్రాయం ఈ దృశ్యాలు చూసినప్పుడు అనిపించింది. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీని అభినందిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం కూడా చేశారు. ‘శ్రీరాముడు తన స్వంత నివాసానికి తిరిగి వచ్చారు. ఈసారి బీజేపీ 400 సీట్లు సాధించడం ఖాయం’ అని ప్రధాని మోదీ ఫిబ్రవరి 5న లోక్‌సభలో ప్రసంగించారు.

కాని ఆశ్చర్యకరమేమంటే ఇదే ఘజియాబాద్‌లో ఏప్రిల్ 26న రెండవ విడత ఎన్నికల్లో గత మూడు ఎన్నికల్లో కంటే అత్యంత తక్కువ శాతం పోలింగ్ జరిగింది. అపార్ట్‌మెంట్లనుంచి జనం బయటికి రాలేదు. ఎందుకో గాని భారతీయ జనతా పార్టీ నమ్మకం పెట్టుకున్న నగర ప్రజలు ఓటింగ్ చేసేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. రాత్రి 10 గంటల వరకు ఓటింగ్ జరిగినప్పటికీ ఓటింగ్ శాతం 49.65 శాతానికి మించలేదు. శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠను అంత ఉత్సాహంగా జరుపుకున్న ప్రజలు ఎందుకు అంతే ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనలేకపోయారో బీజేపీ నేతలే కారణాలు చెప్పలేకపోతున్నారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికీ, రాజకీయాలకూ సంబంధం లేదని జనం భావించారో లేదో కూడా చెప్పలేం. అదే సమయంలో దేశంలో జరుగుతున్న రాజకీయాలను వారు చర్చించుకోవడం లేదని కూడా చెప్పలేము. అన్నిటికన్నా ముఖ్యం ఈ దేశంలో ప్రజాస్వామిక ప్రక్రియను ప్రజలు అంత సీరియస్‌గా, చైతన్యవంతంగా తీసుకుంటున్నారా లేదా అన్నది చర్చనీయాంశం. ఎన్నికల పుణ్యమా అని వచ్చిన ఒక రోజు సెలవును విశ్రాంతిగా గడపకుండా ఎండన పడి ఓటింగ్‌కు ఎందుకు వెళ్లాలని భావించేవారు అధికంగా కనిపిస్తున్నారు. కోవిడ్ సమయంలో గంటలు కొట్టించి, దీపాలు వెలిగించి, ‘గో గో కరోనా’ అన్న నినాదాలు చేయించిన, వాక్సినేషన్ సర్టిఫికెట్లపై కూడా తన ఫోటోను వేయించుకుని ప్రోత్సహించిన నాయకుడు ఎన్నికల పట్ల ప్రజలను ఎందుకు ఉత్తేజవంతుల్ని చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదు. అంత మాత్రాన ప్రభుత్వం పట్ల ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యల్నీ పూర్తిగా విశ్వసించలేము. అదే సమయంలో తక్కువ శాతం పోలైనా ఆ ఓట్లన్నీ తమకేనని బీజేపీ నేతలు చెబుతున్న మాటల్నీ నమ్మడానికి వీల్లేదు. రెండింటి మధ్య సత్యం వేరే ఉన్నదని మాత్రం అనుకోవడానికి వీలుంది.

అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ తర్వాత మోదీకి తిరుగులేదని, ఆయనను ఓడించగల శక్తులు లేవనే అభిప్రాయం చాలా మందిలో ఏర్పడింది. టీనా (దేర్ ఈజ్ నో ఆల్టర్‌నేటివ్– ప్రత్యామ్నాయం లేదు) అన్న ఒకే ఒక కారణంగా ఆయన అజేయుడనే అభిప్రాయం కలిగింది. ప్రతిపక్షాలు వివిధ రాష్ట్రాల్లో కొంత ఏకం అయినా మోదీని ఏమీ చేయలేరనే చాలా మంది భావించారు. ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు తీర్పు తర్వాత తీగలాగితే డొంక కదిలినట్లుగా మోదీ వ్యతిరేక చర్చ వేడెక్కింది. ప్రతిపక్షాలపై ఏజెన్సీల దాడులు, కేజ్రీవాల్ అరెస్టు తదితర పరిణామాలతో మోదీ ఏకపక్ష చర్యలు సరైనవా అన్న చర్చ మొదలైంది. తటస్థంగా ఉన్న వర్గాలు కూడా మోదీ విధానాలపై సందేహాలను వ్యక్తం చేయడం మొదలుపెట్టాయి. అయినప్పటికీ మోదీ విజయాన్ని అడ్డుకోవడం సాధ్యమా అన్న సందేహాలు ఇప్పటికీ మాయం కాలేదు. మోదీ అనుకున్నంతగా 400 సీట్లు సాధించలేకపోవచ్చేమో కాని ఆయన మళ్లీ ప్రధానమంత్రి కావడాన్ని ఎవరు ఆపలేరనే అభిప్రాయం చాలా మందిలో మారలేదు. ఆయన శక్తియుక్తులను తక్కువ అంచనా వేయలేకపోవడమే ఇందుకు కారణం.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మోదీ ఎన్నికల ప్రచారం రకరకాల మలుపులు తిరుగుతోంది. రామమందిర ప్రాణప్రతిష్ఠ చేసిన నరేంద్రమోదీ ఆ విషయాన్ని కూడా రానురానూ ప్రస్తావించడం తగ్గించారు. అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ జరిగిన వెంటనే ఎన్నికల షెడ్యూలు ప్రకటించి ఉంటే బీజేపీ ఘనవిజయం సాధించేదనే అభిప్రాయం చాలా మందిలో ఉండేది. కాని మోదీయే పూర్తిగా రామమందిరంపై దృష్టి కేంద్రీకరించకుండా తన స్వంత పేరుతో ప్రచారం ఉధృతం చేశారు. గత ఎన్నికల్లో చౌకీదార్ అని చెప్పుకున్న మోదీ ఈ ఎన్నికల్లో ‘మోదీ కా గ్యారంటీ’ అన్న పదాలకు విస్తృత ప్రాధాన్యత కల్పించారు. ఎన్నికల మేనిఫెస్టో మాత్రమే కాదు, ప్రచార ప్రకటనల్లోనూ మోదీ గ్యారంటీ అన్న పదాలను ప్రజల్లోకి చొచ్చుకువెళ్లేలా చూసేందుకు ప్రయత్నించారు. వికసిత్ భారత్, అమృత కాల్, ఆత్మనిర్భర్, విశ్వగురు వంటి అంశాలను ప్రస్తావించి భారత్‌ను గతంలో కంటే ఎక్కువ అభివృద్ధి చేస్తుంది తానేనని, ప్రజలకు సంక్షేమ కార్యక్రమాల ఫలితాలు నేరుగా అందేలా చేస్తోంది తానేనని మోదీ చెప్పుకున్నారు. ఇదే అంశంపై ఆయన ప్రచారం పూర్తిగా కొనసాగించి ఉంటే ఎన్నికలు ఆసక్తికరంగా మారేవి. ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధినీ, పది సంవత్సరాల్లో మోదీ సాధించిన అభివృద్ధినీ బేరీజు వేసుకునేందుకు అవకాశం ఉండేది.

కాని క్రమంగా మోదీ ఈ ధోరణి కూడా తగ్గించి కాంగ్రెస్‌పై విమర్శల బాణాలు పెంచారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన వెంటనే అందులో ఉన్న అంశాలపై తీవ్ర దాడులు చేయడం మొదలుపెట్టారు. తద్వారా మోదీ చేస్తున్న ఆరోపణలు నిజంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్నాయా అన్న ఆసక్తి అనేకమందిలో పెరిగింది. తాము సామాజిక న్యాయం గురించి అద్భుతమైన ఎన్నికల ప్రణాళిక రూపొందించినా దానిపై జనం దృష్టి పెద్దగా పడడం లేదని మొదట్లో జై రాంరమేశ్, కొప్పుల రాజు వంటి నేతలు వాపోయేవారు. కాని ఉన్నట్లుండి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోకు ప్రచారాన్ని మోదీయే కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అందర్నీ దోచి, మైనారిటీలకు పంచిపెడుతుందనే మోదీ చేసిన ప్రచారం ఊపందుకోవడంతో కాంగ్రెస్ మేనిఫెస్టోపై పలువురి దృష్టి మళ్లింది. దానిపై ఎన్నికల కమిషన్ బీజేపీకి నోటీసులు ఇచ్చిన తర్వాత విషయంపై మరింత చర్చ జరిగింది.



మోదీ ఎన్నికల ప్రచారం రకరకాల మలుపులు తిరుగుతోంది. రామమందిర ప్రాణప్రతిష్ఠ చేసిన నరేంద్రమోదీ ఆ విషయాన్ని రానురానూ ప్రస్తావించడం తగ్గించారు. తన స్వంత పేరుతో ప్రచారం ఉధృతం చేశారు. గత ఎన్నికల్లో చౌకీదార్ అని చెప్పుకున్న మోదీ ఈ ఎన్నికల్లో ‘మోదీ కా గ్యారంటీ’ అన్న పదబంధానికి విస్తృత ప్రాధాన్యం కల్పించారు. అభివృద్ధి అంశంపై ఆయన ప్రచారం పూర్తిగా కొనసాగించి ఉంటే ఎన్నికలు ఆసక్తికరంగా మారేవి. మోదీ క్రమంగా ఈ ధోరణినీ తగ్గించి కాంగ్రెస్‌పై విమర్శలు ముమ్మరం చేశారు.

గత పదేళ్లుగా మోదీ హయాంలో కష్టించి సాధించామని బీజేపీ చెప్పుకుంటున్న విజయాలకు ప్రచారంలో క్రమంగా ప్రాధాన్యత తగ్గిపోతోంది. పెద్దనోట్ల రద్దు, నల్లధనానికి అడ్డుకట్ట వేయడం, పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్ రద్దు, అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ, జన్‌ధన్ యోజన, 80 కోట్లమందికి ఉచిత ఆహార ధాన్యాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై బీజేపీ నేతలు తక్కువగా మాట్లాడుతున్నారు. వాటి బదులు కాంగ్రెస్ లేవనెత్తిన అంశాలకు మోదీ ప్రాచుర్యం కల్పిస్తున్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు ఉండవని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టేందుకు మోదీ, ఆయన అనుయాయులు రంగంలోకి దిగారు. ఈ అంశాలపై ప్రజల మనసుల్లో అనుమాన బీజాలు నాటడంలో కాంగ్రెస్ విజయవంతం కాగలిగిందా? లేకపోతే 2019 ఎన్నికల్లో కేవలం 52 సీట్లు సాధించిన కాంగ్రెస్‌కు మోదీ ఎందుకు ఎన్నికల ప్రచారంలో అంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు? ఊసులో లేకుండా పోవాల్సిన పార్టీ మోదీ నాలుకపై పదే పదే ఎందుకు తచ్చాడుతోంది?


ఈ దేశ సంపద కొన్ని వర్గాల చేతుల్లోనే పరిమితం కాకుండా ప్రజలకు పంచడం గురించి రాజకీయ పార్టీలు హామీలు గుప్పించడం కొత్త విషయం కాదు. ప్రపంచంలో సంపద విషయంలో నెలకొన్న అసమానతలను థామస్ పికెటీ లాంటి ఆర్థికవేత్తలు ఎప్పుడో ప్రస్తావించారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని దేశానికి తిరిగి తీసుకువచ్చి ప్రజలకు పంచుతానని మోదీ 2014లో చేసిన ప్రచారం ఆయనకు ఎంతో జనాదరణ కల్పించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. కేంద్ర ఏజెన్సీలు స్వాధీనపరుచుకున్న డబ్బును ప్రజలకు పంచిపెడతానని కూడా ఆయన ఇటీవల హామీ ఇచ్చారు. కాని గత పదేళ్లలో మోదీ సంపదను ప్రజలకు పంచారా, కొన్ని వర్గాలకు కేంద్రీకృతం చేశారా అన్న చర్చను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అదానీ, అంబానీలకు దోచి పెట్టారని రాహుల్‌గాంధీ ప్రతి సభలోనూ ప్రస్తావించారు. చివరకు సంపదను పంచడం గురించి కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కూడా కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. మోదీ ఈ చర్చను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మార్చడంలో ఎంతమేరకు సఫలీకృతులవుతారన్నది చెప్పలేం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధనవంతుల ఆస్తులను పేదలకు పంచుతారని, వారసత్వ పన్ను విధిస్తారని మోదీ చేస్తున్న ప్రచారం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మారుతుందా లేదా సానుకూలంగా మారుతుందా అన్న అనుమానాలకు దారితీస్తోంది. ప్రైవేట్ ఆస్తులను ప్రజల ఆస్తులుగా పరిగణించేందుకు రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో ఆర్టికల్ 39(బి)ని అన్వయించడంపై 9 మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ బెంచ్ కూడా ఇదే సమయంలో విచారణ జరుపుతుండడం ఈ చర్చను మరింత ఆసక్తికరంగా మార్చింది. ప్రభుత్వ ఏజెన్సీల దాడులు, కోర్టు కేసులు, పోలీసుల సమన్లు వంటి అంశాలను పక్కన పెడితే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, రిజర్వేషన్లు, సంపదను పంచడం, అభివృద్ధి, సంక్షేమం వంటి విషయాలపై చర్చ జరగడం ఆరోగ్యకరమైన పరిణామమే.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఏమి ఒరగబెట్టారని రైతులు ‘సిద్ధం’గా ఉండాలి?

ఆంధ్రప్రదేశ్ పక్కా వ్యవసాయ రాష్ట్రం. భూమి, నీళ్లు ఉంటే బంగారం పండిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లభిస్తుంది. రైతు మొదలుకొని కూలీ వరకు జీవన ప్రమాణం పెరుగుతుంది. బ్రిటీష్ కాలంలో గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ, కృష్ణపై ఆనకట్ట, కాంగ్రెస్ హయాంలో సాగర్, శ్రీశైలం నిర్మించారు కాబట్టి ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా నేడు వర్ధిల్లుతోంది. వైఎస్. రాజశేఖర రెడ్డి మిగులు జలాల ఆధారంగా గల ప్రాజెక్టులను పట్టాలకెక్కించారు. దానివల్ల మెట్ట ప్రాంతాలకు ఎంతో కొంత ఊరట కలిగింది. తీవ్ర విమర్శల మధ్య చంద్రబాబు నాయుడు తెగించి పట్టిసీమ ఎత్తిపోతలు నిర్మించారు. కాబట్టి కృష్ణ బేసిన్‌లో నీటి ఎద్దడి ఏర్పడిన ఈ ఏడు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ డెల్టా బయటపడింది. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం సాగించి తన హయాంలో హెడ్ వర్క్స్ 64.08 శాతం పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు ఆ మాత్రమైనా రూప కల్పన ఏర్పడింది. జగన్మోహన్ రెడ్డి తన హయాంలో ఏం సాధించారు?

జగన్మోహన్ రెడ్డి పరిపాలన అయిదేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల రంగంలో పురోగతి లేకపోవడం పక్కనపెడితే భవిష్యత్తులో జరగబోయే నష్టం అపారంగా ఉండబోతోంది. రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ రంగం కుదుట పడితేనే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన ఏర్పడి వలసలు ఆగిపోతాయి. వలసలు ఆగితేనే అభివృద్ధి. అది సాధ్యం కావాలంటే మెట్ట ప్రాంతాల్లోని పెండింగ్ ప్రాజెక్టులు పాక్షికంగానైనా పూర్తి కావాలి.



జగన్మోహన్ రెడ్డి పాలనలో పోలవరం హెడ్ వర్క్స్ కేవలం 5.71శాతం పూర్తయింది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత 2019 జూన్ 3న నిర్వహించిన సమీక్షలో గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన వర్క్స్ గురించి ఇచ్చిన గణాంకాలతో ప్రస్తుత స్టేటస్ రిపోర్టు సరిపోల్చితే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఇది. తనకు 25మంది పార్లమెంటు సభ్యులను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానని చెప్పి అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి తానే కేంద్రం వద్ద మోకరిల్లి, తుదకు చట్టబద్ధత గల పోలవరం ప్రాజెక్టుకు నిధుల సంగతి దేవుడెరుగు, రెండవ డీపీఆర్ ఆమోదం పొందలేకపోయింది. అధికారాంతంలో కేంద్ర నుండి తొలి దశలో రూ.31వేల కోట్ల అంచనాలతో పది వేల కోట్లు తెచ్చి 41.15 మీటర్ల స్థాయికి నిర్మాణం పూర్తి చేస్తానని సంవత్సర కాలం చేసిన ప్రగల్భాలు గాలికి పోయాయి.

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత మూడు రాజధానుల సిద్ధాంతం తెరమీదకు తెచ్చారు. ఉత్తరాంధ్రలో విశాఖను పరిపాలన రాజధానిగానూ అన్ని రంగాల్లో రాష్ట్రం మొత్తం మీద బాగా వెనుకబడిన రాయలసీమలో న్యాయ రాజధాని ఏర్పాటు ప్రకటించారు. అయిదేళ్ల తర్వాత ఏమైందీ ప్రత్యేకంగా చెప్ప పనిలేదు. గమనార్హమైన అంశమేమంటే పరిపాలన రాజధాని చేయదలచిన ఉత్తరాంధ్రకు, పోలవరం ప్రాజెక్టుకు విడదీయరాని సంబంధముంది. విశాఖ మహానగర ప్రజల తాగునీటికి పోలవరం నుండి 23.99 టియంసిల కేటాయింపులున్నాయి. వాస్తవంలో విశాఖ మహానగరాన్ని అంతర్జాతీయ నగరం చేయదలచివుంటే పోలవరం ప్రాజెక్టు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం సాగించేవారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి పోలవరం ప్రాజెక్టు నుండి 63.20 టియంసిలు నీటి కేటాయింపులున్నాయి. ఉమ్మడి విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం ఈ మూడు జిల్లాల్లో ఎమిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు ఈ పథకం ద్వారా అందించవచ్చు. పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్లకు నిర్మాణం జరిగితేనే ఇది సాధ్యం. ఈ పథకం తొలి అంచనా రూ.7214.10 కోట్లయితే గత ఏడాదికే రూ.18వేల కోట్లకు నిర్మాణ వ్యయం పెరిగింది. ఒకవేళ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడినా నిర్మాణ వ్యయం ఎంత పెరుగుతుందో. ఈ ఒక్క ప్రాజెక్టే కాదు, గత అయిదేళ్లుగా సాగునీటి నీటి రంగం పడకేసినందున పుణ్య కాలం గడచిపోయి నిర్మాణ వ్యయాలు అనూహ్యంగా పెరిగాయి. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత జరిగిన ఒక సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు లక్షా డెబ్బై వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. అయిదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం వ్యయం చేసింది కేవలం రూ.37వేల కోట్లు మాత్రమే. పుణ్యకాలం గడిచిపోయినందున ఈపాటికి అయిదు లక్షల కోట్లకు మించిపోయి వుంటుంది.

రాయలసీమ వర్షాభావంతో వెనుకబడి వలసల ప్రాంతంగా వుంటే ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా భిన్నమైనది. వర్షపాతం ఎక్కువ. చిన్న పెద్ద నదులున్నాయి. పడిన వర్షపు వరద నీరు సముద్రం పాలౌతోంది. వంశధార నుండి ఏటా వంద టియంసిల నీరు సముద్రం పాలౌతోంది. వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేస్తే ఒక్క ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోనే 50 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. పైగా ఈ ఉమ్మడి మూడు జిల్లాలకు విస్తారమైన సముద్ర తీరం ఉంది. రాష్ట్ర విభజన చట్టంలో ఈ మూడు జిల్లాలను వెనుకబడినవిగా పేర్కొన్నారు. వాస్తవంలో జగన్మోహన్ రెడ్డి వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయదలచి వుంటే అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మౌలిక సదుపాయాలు కల్పించి వుండేవారు. కానీ అందుకు భిన్నంగా కేవలం పరిపాలన రాజధాని అన్న భావోద్వేగ నినాదంతో కాలం గడిపేశారు.

రాష్ట్రంలో పదమూడు ఉమ్మడి జిల్లాలుంటే రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలు ఏ విధంగా చూసినా భిన్నం. వర్షపాతం తక్కువ. నిత్యం తాగునీటికీ కరవే. ఈ దుర్భర జీవితం తరతరాలుగా వెన్నాడుతోంది. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇక్కడి ప్రతి ఒక్కరి చేతుల్లో చేయి వేసి రాయలసీమను కోనసీమ చేస్తానని నమ్మబలికారు. ఆచరణలో అంతా తలకిందులైంది. రాయలసీమ అస్తిత్వం కోరేవారు (వైసీపీ వాళ్లను మినహాయించితే) జగన్మోహన్ రెడ్డి చేసిన ద్రోహం గురించి తీవ్ర మథనంతో వున్నారు. తటస్థులు, సామాన్య జనం మండిపడుతున్నారు. తుదకు ఇప్పుడు కూడా జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభల్లో పాదయాత్ర సందర్భంగా చేసిన హామీల గురించి మాట మాత్రంగా ప్రస్తావించకపోవడంపై కోపోద్రిక్తులవుతున్నారు.

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత 2019లోనే రాయలసీమ పర్యటనకు వెళ్లిన సమయంలో ఇచ్చిన ఆదేశాల మేరకు కర్నూలు చీఫ్ ఇంజనీర్ రూ.33.134కోట్ల వ్యయంతో చిత్తూరు జిల్లా మినహాయించి మూడు జిల్లాలకు చెంది వివిధ పథకాలు పంపారు. ఇందులో ముచ్చుమర్రి నుండి రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రతిపాదించితే గొప్పలకు పోయి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి ప్రతిపాదించి ప్రతిష్టంభనలో పడేశారు. 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు గల కెసి కెనాల్‌కు కేవలం 1.25 టియంసిల నిల్వ సామర్థ్యం గల సుంకేసుల బ్యారేజీ ఒక్కటే దిక్కు. తుంగభద్రపై 20 టియంసిల సామర్థ్యంతో గుండ్రేవుల వద్ద రిజర్వాయర్ నిర్మాణం గురించి ఈ అయిదేళ్ల కాలం పట్టించుకోలేదు. ఆఖరికి 2.965 టియంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మింపబడి నిర్మాణ లోపంతో పశువుల మేత భూమిగా మిగిలిన అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు గురించి ప్రతిపాదన కూడా లేదు. ఏం సాధించారని 2019లో లాగా రాయలసీమ ప్రజలు తిరిగి పట్టం గట్టాలి?

రాయలసీమకు చెంది పెండింగ్ ప్రాజెక్టుల్లో గాలేరు నగరి హంద్రీనీవా వెలుగొండ తెలుగు గంగ ముఖ్యమైనవి. చిత్తూరు జిల్లాకు చెంది గాలేరు నగరి రెండవ దశ పూర్తిగా అటకెక్కించారు. వెలుగొండకు చెంది నల్లమల సాగర్ నిర్వాసితులను గాలికి వదిలేశారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగా టన్నెల్స్ ప్రారంభోత్సవంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిందనిపించారు. హంద్రీనీవా దుర్గతి భిన్నమైనది. 2021లో హంద్రీనీవా ప్రధాన కాలువ 6300 క్యూసెక్కులు ప్రవహించే విధంగా విస్తరణకు రూ.6182కోట్ల వ్యయంతో చేపట్టేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించింది. తర్వాత అతీ గతీ లేదు.

జగన్మోహన్ రెడ్డి పరిపాలన అయిదేళ్ల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల రంగంలో పురోగతి లేకపోవడం పక్కనపెడితే భవిష్యత్తులో జరగబోయే నష్టం అపారంగా ఉండబోతోంది. రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ రంగం కుదుటపడితేనే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన ఏర్పడి వలసలు ఆగిపోతాయి. వలసలు ఆగితేనే అభివృద్ధి. అది సాధ్యం కావాలంటే మెట్ట ప్రాంతాల్లోని పెండింగ్ ప్రాజెక్టులు పాక్షికంగానైనా పూర్తి కావాలి. అయిదేళ్ల కాలం సాగునీటి రంగం ఆచూకీ లేకుండా గడచిపోయింది.

● వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

యుద్ధం

యుద్ధానికి సిద్ధం కావాలి
ప్రజాస్వామ్యం అంపశయ్యపై
పవళించినపుడు
చూపుడు వేలే ఆయుధంగా
యుద్ధ బీభత్సాన్ని
సృష్టించుకోవాలి
యుద్ధం వద్దనుకొని
నిరాశానిస్పృహల
దుప్పట్లలో కునుకు తీస్తే
రేపటి భయ విహ్వల
చిత్రాన్ని మార్చే
విలుకాడు ఎవరూ రారు.
ఆ సుపథాన్ని మనమే
నిర్మించుకోగల్గాలి
మన స్వగతంతో అంతరాత్మ
ప్రేక్షకులమై ముందుకు
నడచే త్రోవ కావాలి
ఉదయాలు కాలిపోతున్నపుడు
వసంతాల్ని ఉరితీస్తున్నపుడు
‘మంచికాలం’లో
తెరచాప ఎత్తుకోగల్గాలి
బజార్లన్నీ సూపర్‌బజారై
అచ్చోసిన మాటలు కమ్మకమ్మగా
చిలక పలుకులుగా విన్పిస్తుంటే
ఎదుర్కొనే దమ్ము చిటికెన
వేలుకే ఉంటుంది.
యుద్ధకాలంలో అస్త్రశస్త్రాల
ఆరాతీస్తే
బానెట్ తగిలి పడినా
శిరస్త్రాణం ధరిస్తే
రేపు మనదవుతుంది!
యుద్ధం ఎప్పుడూ చేయలేం
సూర్యాస్తమయం కమ్ముకుంటే
ఎదురుచూపులే కదా మిగుల్తాయి.
ఈ మండే ఎండల మంటల్లో
ఓటుతో ఓటమిని
అప్రహతిహతంగా ఎదిరిస్తే
జేబులో సెల్‌ఫోన్
రింగ్ టోన్ మారుస్తుంది!

–చిన్ని నారాయణరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com

ABN ఆంధ్రజ్యోతి

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru








న్యూస్‌మేకర్

“ఇన్నేళ్లుగా తనకు తాను కొన్ని పరిమితులు విధించుకున్న సునీత... భర్త అరెస్టుతో నాటకీయ పరిణామాల మధ్య హఠాత్తుగా భారీ సభలో ప్రత్యక్షమయ్యారు. అయితే ఈసారి ఢిల్లీ ప్రజల ముందుకు వచ్చింది 2015లో నాటి సునీత కాదు... అచంచల ఆత్మవిశ్వాసం, పోరాటస్ఫూర్తి గల సునీత.

సునీత కేజ్రీవాల్

అది 2015... ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సంచలన విజయం సాధించిన సందర్భం. పార్టీ కార్యాలయంలో సంబరాలు మిన్నంటిన వేళ... వేదికపై 'ఆప్' అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఘనంగా ఎంట్రీ ఇచ్చారు. పక్కనే ఉన్న తన సహధర్మచారిణి సునీత కేజ్రీవాల్ భుజంపై చేయి వేసి... 'ఈమె నా సహధర్మచారిణి. ఇప్పటివరకు మీ ముందుకు రాలేదు' అంటూ గొప్పగా పరిచయం చేశారు. నాడు ఎంతో బిడియంగా... బెరుగ్గా కనిపించిన 58 ఏళ్ల సునీత... నేడు లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన భర్తకు అండగా నిలిచి... పరిణతి చెందిన రాజకీయ నాయకురాలిగా పార్టీని ముందుండి నడిపిస్తున్నారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ఆ స్థానాన్ని భర్తీ చేసేది ఎవరనేదానిపై చర్చ మొదలైంది. ఆ సమయంలో అందరి దృష్టి సునీతా కేజ్రీవాల్ పైకి మళ్లింది. దానికి కారణం... అవినీతిపై పోరాటం నుంచి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించడం వరకు కేజ్రీవాల్ ప్రతి అడుగులో ఆమె భాగం పంచుకోవడమే. 'జైలు నుంచే పరిపాలిస్తా' అంటూ కేజ్రీవాల్ ప్రకటించడం వెనుక బహుశా తనకు అండగా సునీత ఉందన్న ధైర్యం కావచ్చు. ఆవిడ సామర్థ్యంపై నమ్మకం కావచ్చు. నాడు 2015లో మొదటిసారి 'నా భార్య సునీత' అని గర్వంగా పరిచయం చేసిన కేజ్రీవాల్ అదే వేదికపై... "ప్రభుత్వ ఉద్యోగి అయినందున తనపై చర్యలు తీసుకుంటారేమోనని తను ఎప్పుడూ భయపడుతూ ఉండేది. ఇవాళ తనకు చెప్పాను... 'ఇకపై నువ్వు భయపడాల్సిన అవసరం లేదని. ఆమె లేకపోతే నేను ఏదీ సాధించగలిగేవాడిని కాదు. ప్రతి సందర్భంలోనూ నాకు తోడుగా ఉన్నందుకు ధన్యవాదాలు సునీత" అంటూ భావోద్వేగంగా చెప్పారు. అప్పటికి సునీత ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్) అధికారిగా కొనసాగుతున్నారు.

ఇంటి బాధ్యతలు భుజానికెత్తుకొని...

ముస్సోరీ సివిల్ సర్వీస్ అకాడమీ(1993)లో కేజ్రీవాల్, సునీత మొదటిసారి కలిశారు. కొన్నాళ్ల స్నేహం తరువాత ఒక రోజు కేజ్రీవాల్ వెళ్లి సునీత తలుపు తట్టారు. 'నన్ను పెళ్లి చేసుకొంటావా' అని అడిగారు. ఆమె అంగీకారంతో నవంబర్ 1994లో ఇద్దరూ జంటగా మారారు. ఐఆర్ఎస్ అధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసి అరవింద్ కేజ్రీవాల్ అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భాగం కావడం, ఆ తరువాత రాజకీయాల్లోకి ప్రవేశించిన నేపథ్యంలో ఇంటి బాధ్యతలను సునీత తన భుజాలపై వేసుకున్నారు. అత్తమామలు, ఇద్దరు పిల్లల ఆలనా పాలనా చూసుకున్నారు. ఆర్థికంగానూ కుటుంబానికి అండగా నిలబడ్డారు. కేజ్రీవాల్ కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి ఎప్పుడూ భంగం కలగనివ్వలేదు. మీడియా దృష్టి ఆమెపై పడకుండా జాగ్రత్త పడ్డారు.

భర్త ఆరోగ్యమే ప్రధానం...

కేజ్రీవాల్ మొదటిసారి సీఎం అయిన మరుసటి ఏడాది సునీత స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఉద్యోగం వదిలేసే నాటికి ఆమె ఇన్‌కమ్‌ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ కమిషనర్. పదవీ విరమణ తరువాత సునీత దృష్టి పెట్టింది భర్త రాజకీయాలపై కాదు... ఆయన ఆరోగ్యంపై. ఢిల్లీ, ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో క్షణం తీరిక లేకుండా తిరుగుతున్న కేజ్రీవాల్... సమయానికి తింటున్నారా? రెగ్యులర్‌గా డయాబెటిక్ ఇన్సులిన్ తీసుకొంటున్నారా? అనే విషయాలపై ఎంతో ఆందోళన చెందారు. ఆయన వెన్నంటి వేళకు అన్నీ చూసుకున్నారు. ఆయనకు రక్షణ గోడలా నిలిచారు. అప్పుడే కాదు... పెళ్లి నాటి నుంచి సునీత రోజువారీ పనుల్లో భర్త ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూవస్తున్నారు.

> **'జెయిల్ కా జవాబ్ ఓట్ సే'**
>
> 
>
> ఢిల్లీలో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సునీత ప్రచార రథం ఎక్కారు. జైల్లో ఉన్న కేజ్రీవాల్... ఎన్నికల లోగా బయటకు వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో ఆమే కార్యక్షేత్రంలోకి దిగారు. 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' (జైలుకు జవాబు ఓటే) అంటూ సాగే పాటతో ఆమె భారీ రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. వీటికి జనం నుంచి విశేష స్పందన రావడం పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపింది. అయితే 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' పాటను ఎన్నికల సంఘం నిషేధించింది. ఏదిఏమైనా విద్యావంతురాలు కావడం, హిందీ, ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడగలగడం సునీతకు బాగా కలిసొచ్చింది. సూటిగా, సుత్తి లేకుండా సాగే ఆమె ప్రసంగాలు కేజ్రీవాల్ లేని లోటును కొంతవరకైనా భర్తీ చేయగలవని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఒక్క ఢిల్లీలోనే కాకుండా పంజాబ్, గుజరాత్, హరియాణాల్లో కూడా సునీత ప్రచారానికి రంగం సిద్ధం చేసింది 'ఆప్'.

ప్రచార బాధ్యతలు...

అప్పటివరకు తెర వెనకే ఉన్న సునీత 2020 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బయటకు వచ్చారు. అరవింద్ కేజ్రీవాల్ ఇతర నియోజకవర్గాల్లోని పార్టీ అభ్యర్థుల ప్రచారంలో బిజీగా ఉంటే... ఆయన బరిలో దిగిన ఢిల్లీలో ప్రచార బాధ్యతలను సునీత తీసుకున్నారు. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి మహిళలను ప్రత్యేకంగా కలిశారు. వారికి 'ఆప్' ఇచ్చిన హామీలను వివరించి చెప్పారు. నిన్నటి వరకు సామాజిక మాధ్యమాల్లో సునీత పోస్టులన్నీ ఢిల్లీ, పంజాబ్‌ల్లోని 'ఆప్' ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు, చేసిన పనుల గురించే ఉండేవి. లేదంటే పార్టీ, ప్రభుత్వం ప్రకటనల రీపోస్ట్‌ల ప్రకటనలకే పరిమితమయ్యారు. అంతకుమించి ఆప్, బీజేపీ మధ్య జరుగుతున్న రాజకీయ యుద్ధంలో కానీ, ఎన్‌డీఏ నడుపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై కానీ స్పందించకూడదని నియమంగా పెట్టుకున్నారు. అయితే ఒకే ఒక్క సందర్భం (2018)లో అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను విమర్శించారు. అదికూడా ఓ స్కామ్‌కు సంబంధించి తన సోదరి, కుటుంబాన్ని వేధించిన విషయంలో.

కేజ్రీవాల్ అరెస్టుతో...

ఇన్నేళ్లుగా తనకు తాను కొన్ని పరిమితులు విధించుకున్న సునీత... భర్త అరెస్టుతో నాటకీయ పరిణామాల మధ్య హఠాత్తుగా భారీ సభలో ప్రత్యక్షమయ్యారు. అయితే ఢిల్లీ ప్రజల ముందుకు వచ్చింది 2015లో సునీత కాదు... అచంచల ఆత్మవిశ్వాసం, పోరాటస్ఫూర్తి గల సునీత. కిక్కిరిసిన ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో... 'ఇండియా' కూటమి నిర్వహించిన భారీ ర్యాలీని ఉద్దేశించి ఆమె గళం విప్పారు. జైలు నుంచి కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. ఆ తరువాత... 'మన ప్రధాని మోదీ నా భర్తను జైల్లో పెట్టారు. ప్రధాని చర్య సరైనదేనా? జైల్లో ఉన్నారు కనుక కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు అంటున్నారు. మరి ఆయన రాజీనామా చేయాలా? మీ కేజ్రీవాల్ సింహంలాంటివారు. ఆయన్ను వీళ్లు ఎంతో కాలం జైల్లో ఉంచలేరు' అంటూ సునీత తనదైన శైలిలో ప్రసంగించారు.

ప్రజల మద్దతు కూడగట్టేందుకు...

ఆ ప్రసంగం తరువాత ఢిల్లీ ప్రజలను ఉద్దేశించి సునీత మూడు వీడియో సందేశాలు కూడా విడుదల చేశారు. అందులో తన భర్త అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ ప్రజల కొడుకుగా, పెద్దన్నగా అభివర్ణించే ప్రయత్నం చేశారు. కేజ్రీవాల్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు పార్టీ తరుఫున మరొక వీడియో సందేశం వదిలారు.

తద్వారా ప్రజలు తమ పార్టీకి భావోద్వేగాల పరంగానూ కనెక్ట్ అవ్వాలన్నది ఆమె ఆలోచన. ఒకవేళ కేజ్రీవాల్ ఎక్కువ కాలం జైల్లోనే గడపాల్సి వస్తే... సీఎం కుర్చీలో సునీతను కూర్చోబెట్టడానికి రంగం సిద్ధమవుతుందన్న ఊహాగానాలు కూడా ఊపందుకున్నాయి. అయితే ఈ ఊహాగానాలను ఆప్ నాయకులు ఖండించారు. కేజ్రీవాల్ స్థానంలో మరొకరిని తీసుకువచ్చే ఆలోచనేదీ లేదని తేల్చి చెప్పారు. 2020లో ఆప్ విజయం తరువాత 'మీకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం ఉందా అని' ఓ ఆంగ్ల పత్రిక అడిగిన ప్రశ్నకు... 'ఆప్ తీసుకొనే ఎలాంటి నిర్ణయాల్లోనూ నేను జోక్యం చేసుకోను. కేవలం నా భర్తకు సహకారం అందిస్తాను' అంటూ చెప్పుకొచ్చారు. ఇన్నాళ్లూ భర్తకు నీడలా ఉన్న ఆమె... ఇప్పుడు ముందుకు వచ్చి ఆయనకు మద్దతుగా ప్రజలను ఏకం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఫ్యాషన్



స్టైలిష్‌గా, ఫ్యాషన్‌గా కనిపిస్తూ, అంతే సమానంగా సౌకర్యంగా ఉండే డ్రెస్సుల్లో షార్ట్ డ్రెస్ ఒకటి. అటు క్యాజువల్ వేర్‌గా ఇటు ఈవెనింగ్ వేర్‌గా ఉపయోగపడే షార్ట్ గౌన్స్ ధరించడంలో చిట్కాలు తెలుసుకుందామా..!

ముద్దొచ్చే షార్ట్ గౌన్స్

సందర్భాన్ని బట్టి...

కాటన్, షిఫాన్, జార్జెట్.. ఇలా ఎన్నో రకాల మెటీరియల్స్‌తో తయారయ్యే షార్ట్ డ్రెస్‌లను సందర్భాన్ని బట్టి ఎంచుకుంటూ ఉండాలి. పార్టీ వేర్‌గా ధరించాలనుకుంటే జార్జెట్, శాటిన్‌తో తయారైన షార్ట్ డ్రెస్ ఎంచుకోవాలి. డైలీవేర్ కోసం ప్యూర్ కాటన్, కలంకారీ, గాబు ప్రింటెడ్ డ్రెస్‌లు బాగుంటాయి. కనిపించాలనుకునే లుక్‌ను బట్టి ఈ డ్రెస్‌లను సొంతగా డిజైన్ చేయించుకోవచ్చు. స్లీవ్‌లెస్, బోట్‌నెక్ షార్ట్ డ్రెస్‌లు డైలీ వేర్‌గా, నడుముకు బెల్ట్, ఛాతీ దగ్గర వర్క్ ఉన్న డ్రెస్‌లను ఈవినింగ్ వేర్‌గా వేసుకోవచ్చు.

యాక్సెసరీస్

శాండిల్స్, హైహీల్స్, బూట్స్.. ఎలాంటివైనా షార్ట్ డ్రెస్‌కు సూటవుతాయి. రెట్టింపు స్టైలిష్‌గా కనిపించాలనుకుంటే హైహీల్స్, బూట్స్ వేసుకోవచ్చు. వెడ్జెస్, స్పోర్ట్స్ షూతో కూడా ఈ డ్రెస్‌ను మ్యాచ్ చేయవచ్చు. క్యాజువల్‌గా కనిపించాలనుకుంటే లోఫర్స్ వేసుకోవచ్చు. కలర్‌ఫుల్‌గా కనిపించే ఫ్లాట్స్ కూడా ఈ డ్రెస్‌కు మ్యాచ్ అవుతాయి.

జ్యువెలరీ

పొడవాటి స్ట్రాప్ ఉండే హ్యాండ్ బ్యాగ్, టోట్స్ ఈ రకం డ్రెస్‌లకు మ్యాచ్ అవుతాయి. మెడలో ఎలాంటి జ్యువెలరీ ధరించకుండా ఉంటేనే ఈ డ్రెస్‌లో ఫ్యాషనబుల్‌గా కనిపిస్తారు. పొడవాటి హ్యాంగింగ్స్, చేతికి బ్రేస్‌లెట్ బాగుంటాయి. డార్క్ కలర్ లిప్‌స్టిక్స్, షాడోలతో మ్యాచ్ చేస్తే, షార్ట్ డ్రెస్‌లో అట్రాక్టివ్‌గా కనిపించవచ్చు.



శరీరం గట్టిగా..

ఎండాకాలం అనగానే పుచ్చకాయలు గుర్తొస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రకాల పుచ్చకాయలు ఉన్నాయి. శరీరానికి చల్లదనం కూడా చేకూర్చే ఈ సమ్మర్ ఫ్రూట్ ఉపయోగాలివే..

- వాటర్‌మెలన్‌లో 90 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని డీహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడుతుంది.
- ఇందులో ఫైబర్ ఉండటం వల్ల తిన్న ఆహారం సులువుగా జీర్ణం అవుతుంది. దీంతో పాటు బరువు తగ్గాలనుకునేవాళ్లు ఈ పండును మెనూలో ఉంచుకోవాల్సిందే.
- విటమిన్- సి పుష్కలం. దీనివల్ల చర్మం, జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇమ్యూనిటీని పెంచుతుంది.



- ఎ- విటమిన్ ఉండటం వల్ల శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. పొటాషియం ఉండటం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. త్వరగా నీరసం రాదు. గుండె ఆరోగ్యానికి మంచిది.
- రక్తంలోని చక్కెరశాతం పెరగకుండా కాపాడుతుంది. ముఖ్యంగా ఎండాకాలంలో వడదెబ్బ బారిన నుంచి పుచ్చకాయ పండు రక్షిస్తుంది.
- మలబద్ధకంతో బాధపడేవాళ్లు, మూత్రం మంటగా వస్తున్నప్పుడు.. ఈ పుచ్చకాయ పండు లేదా రసం తాగితే ఉపశమనం లభిస్తుంది. బ్లడ్ ప్రెషర్‌ను నియంత్రిస్తుంది.

> **'దిక్సూచి' వెబ్ పేజీలో...**
> సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
> లేదా ఈ కింది యూఆర్ఎల్
> https://ejyothy.com/oCMqVEPలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఇళయరాజాను అవమానిస్తారా?

గంగై అమరన్ ఆగ్రహం



'సంగీత దర్శకుడు ఇళయరాజా గురించి ఇకపై అవాకులు చెవాకులు పేలితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందంటూ తమిళ సినీ గేయ రచయిత వైరముత్తును ఇళయరాజా సోదరుడు, సంగీత దర్శకుడు గంగై అమరన్ హెచ్చరించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఇళయరాజా సంగీతమే గొప్పదని, ఆ సంగీతాన్ని సమకూర్చిన వ్యక్తికే పాటలు కూడా సొంతమని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు ఇటీవల చెన్నైలో జరిగిన ఆడియో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒక పాటలో సంగీతం గొప్పదా? భాష గొప్పదా? అనేది ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారిందని, సంగీతం ఎంత గొప్పదో భాష కూడా అంతే గొప్పదని, ఈ రెండూ కలిస్తేనే పాటగా మారుతుందని, ఈ విషయాన్ని గ్రహించి అర్థం చేసుకున్న వారే జ్ఞానులని అభిప్రాయపడ్డారు. జ్ఞాని అన్న మాట ఇళయరాజాకు వర్తించే విధంగా ఉందంటూ సోషల్ మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన గంగై అమరన్, వైరముత్తుపై మండిపడ్డారు. ఇళయరాజా గురించి వ్యాఖ్యానించడం ఇంతటితో మానుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని గంగై అమరన్ హెచ్చరించారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

నవీన్‌చంద్రకు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం



టాలీవుడ్ హీరో నవీన్‌చంద్రకు అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం జరిగిన ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో నవీన్‌చంద్ర ఉత్తమ నటుడి పురస్కారం అందుకున్నారు. గత ఏడాది విడుదలైన కాన్సెప్ట్ ఓరియంటెడ్ చిత్రం 'మంత్ ఆఫ్ మధు' చిత్రంలో అద్భుతమైన నటనకు గాను ఈ పురస్కారం ఆయనకు దక్కింది. ప్రస్తుతం నవీన్‌చంద్ర రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' సహా పలు చిత్రాల్లో నటిస్తున్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్



'బేబీ'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటిస్తున్న చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. మే 31న ఈ సినిమా విడుదల కానుంది. సరికొత్త కంటెంట్‌తో ఈ చిత్రం రాబోతోందని పోస్టర్‌ను చూస్తుంటే తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

తప్పకుండా ఆదరించాలి



'సగిలేటి కథ' మూవీ ఫేమ్ రవితేజ మహాదాస్యం ఓ కొత్త చిత్రంలో నటిస్తున్నారు. మద్దుల మదన్‌కుమార్ దర్శకత్వం వహించగా, సౌజన్య కావూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ఇటీవలే ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో రవితేజ మహాదాస్యంపై విరాజ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా పురాణపండ శ్రీనివాస్ మాట్లాడుతూ "సినీ రంగంలోకి ఎంతో మంది ప్రతిభావంతులు వస్తున్నారు. వారిని తప్పకుండా ఆదరించాలి" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: అఖిల్ దేశ్‌పాండే, కెమెరామెన్ నితిన్ రెడ్డి చిమ్ముల, సహ నిర్మాతలు: దియా, సంజీవ్ కోనేరు, వెంకట్ రమణారెడ్డి.

జీవిత అనుభవాన్ని పంచుకొనేలా ఉంటుంది



'అల్లరి' నరేశ్ హీరోగా రూపొందిన 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంభాషణలు అందించిన అబ్బూరి రవి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 'ఉద్యోగం రావడం, పెళ్లి కావడం.. ఇవే లైఫ్‌లో సెటిల్ అవడం అంటే. కానీ పెళ్లి విషయంలో ఇప్పటి యువత దృక్పథం మారిపోతోంది. పెళ్లి చేసుకుంటారో లేదో కూడా తెలియడం లేదు. అందుకే ఈ సీరియస్ సమస్యను వినోదభరితంగా 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రంలో చెప్పాం. ప్రత్యేకంగా సందేశం ఏమీ ఇవ్వలేదు కానీ ఓ జీవిత అనుభవాన్ని పంచుకొనేలా, ఆలోచింపజేసే విధంగా ఉంటుంది. అన్నారు.

సినిమాలో సిట్యువేషనల్ కామెడీతో పాటు ఎమోషన్ కూడా ఉందని చెబుతూ 'కంటెంట్‌లో మేటర్ ఉంటే అద్భుతమైన కామెడీ రాయవచ్చు. ఇందులో నరేశ్, జామీ లివర్ మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలు నవ్విస్తాయి. పెళ్లి కాని ప్రతి ఒక్కరూ కోరుకొనే కంటెంట్ ఉన్న క్లీన్ ఎంటర్‌టైనర్ ఇది' అని రవి చెప్పారు.

'ఒక దర్శకుడు హీరోకి, నిర్మాతకు కథ చెప్పి ఒప్పిస్తాడు. అంటే తను ప్రూవ్ చేసుకున్నట్లే. ఎవరొచ్చినా నేను ఒక మాట చెబుతా.. మనిద్దరి మధ్య ఒక కథ ఉంది. దానికి ఎటువంటి న్యాయం చేయాలో చర్చిద్దాం.. అని. కొత్త పాత అనే తేడా నాకు ఉండదు. ఏ దర్శకుడితోనైనా పని చేసే విధానం ఒక్కటే. దర్శకుడు తీసుకొచ్చిన కథని ఎంత గొప్పగా చెప్పాలన్నదే ఆలోచిస్తా' అన్నారు. చిత్ర పరిశ్రమంలో తన ఇరవై ఏళ్ల జర్నీ గురించి చెబుతూ 'ఎన్ని సినిమాలు రాశానో నాకు తెలీదు కానీ ఈ జర్నీ బాగుంది' అన్నారు. ప్రస్తుతానికి నటన మీద దృష్టి లేదనీ, దర్శకత్వం చేయాలనే ఆలోచన ఉందనీ, ఆ ప్రయత్నాల్లోనే ఉన్నాననీ అబ్బూరి రవి చెప్పారు.

పర్ఫెక్ట్ కామెడీ ఎంటర్‌టైనర్



హిట్ సినిమా టైటిల్‌ను వాడుకుంటూ ఈ మధ్య సినిమాలు వరుసగా వస్తున్న సంగతి తెలిసిందే. ఆ కోవలోకి లేటెస్ట్‌గా 'బ్రహ్మచారి' చిత్రం చేరింది. ఏఎన్నార్, కమల్‌హాసన్ నటించిన చిత్రాల టైటిల్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో గుంట మల్లేశం కథానాయకుడిగా నటించారు. నర్సింగ్ దర్శకత్వం వహించగా, రామ్ భూపాల్‌రెడ్డి నిర్మించారు. తెలంగాణ యాసలో వస్తున్న ఈ పర్ఫెక్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ మే 10న విడుదలవుతోంది. సోమవారం ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించిన సందర్భంగా నిర్మాత రామ్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా కథ చాలా నాచురల్‌గా అనిపించింది" అని అన్నారు. డైరెక్టర్ నర్సింగ్ మాట్లాడుతూ "ఎంతో కష్టపడి ఈ సినిమా తీశాం. అందరూ ఆదరించాలని కోరుతున్నా" అని చెప్పారు. హీరో గుంట మల్లేశం మాట్లాడుతూ "ఇదొక సూపర్బ్ కామెడీ ఎంటర్‌టైనర్. థియేటర్స్‌లో ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సాయి ఆకులవిజయ్, సినిమాటోగ్రఫీ: కర్ణ ప్రియాసన్, సంగీతం: పాండురంగ, కో ప్రొడ్యూసర్: చిట్టిబాబు, హస్సాన్, జావిద్.

రాహుల్, శ్రేయాస్‌లపై వేటు
చాహల్, దూబేలకు చోటు

వికెట్ కీపర్లుగా పంత్, శాంసన్
హార్దిక్‌కు వైస్‌కెప్టెన్సీ
టీ20 వరల్డ్‌కప్‌నకు భారత జట్టు


చాహల్


రాహుల్


పంత్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌లో తలపడే భారత జట్టును జాతీయ సెలెక్టర్లు మంగళవారం ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ బృందానికి ఊహించినట్టుగానే రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అయితే హార్దిక్ పాండ్యా ఎంపికపై కొంత సందేహాలు వ్యక్తమైనా.. తను బెర్త్ దక్కించుకోవడంతో పాటు జట్టు వైస్ కెప్టెన్సీ కూడా దక్కించుకున్నాడు. 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో ఓడాక భారత జట్టులో మార్పుల కారణంగా రోహిత్, విరాట్ లేకుండానే ముందుకెళ్లారు. కానీ తిరిగి రోహిత్‌తో పాటు విరాట్ కోహ్లీ సైతం ఈ మెగా టోర్నీలో ఆడబోతుండడం గమనార్హం. ఓపెనర్‌గా యశస్వీ జైస్వాల్, విడిలార్డర్‌లో విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా రానున్నారు. ఇక జూన్ ఒకటి నుంచి 29 వరకు వెస్టిండీస్, యూఎస్‌ఏలో ఈ మెగా టోర్నీ జరుగుతుంది. ఇందుకోసం భారత ఆటగాళ్లు విడతలవారీగా అమెరికా వెళ్లనున్నారు. కోచ్ ద్రవిడ్‌తో కలిసి తొలి బ్యాచ్ మే 21న బయలుదేరుతుంది.

రాహుల్‌కు నిరాశే..: జట్టులో స్టార్ ఆటగాడిగా కొనసాగుతున్న కేఎల్ రాహుల్‌పై ఆశ్చర్యకరంగా సెలెక్టర్లు వేటు వేశారు. ఐపీఎల్‌లో నిలకడగానే రాణిస్తున్నప్పటికీ అతడికి స్థానం దక్కలేదు అలాగే మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్‌ను సైతం విస్మరించారు. ఇక ఫినిషర్ రింకూ సింగ్, ఓపెనర్ గిల్ రిజర్వ్ ప్లేయర్లుగా ఉంటారు. ఇప్పటికే టీ20ల్లో భారత్ తరఫున ఆడిన తిలక్ వర్మ, ముకేశ్ కుమార్‌లకు నిరాశే ఎదురైంది. యువ పేసర్ మయాంక్ యాదవ్‌ను సైతం సెలెక్టర్లు పట్టించుకోలేదు.

రిషభ్.. 17 నెలల తర్వాత

వికెట్ కీపర్ రిషభ్ పంత్ సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ జట్టులో ఆడబోతున్నాడు. 2022, డిసెంబరులో కారు ప్రమాదానికి గురైన అతను తాజా ఐపీఎల్‌లో మెరుగ్గానే రాణిస్తున్నాడు. దీంతో వికెట్ కీపర్‌గా అతడితో పాటు సంజూ శాంసన్‌ను ఎంపిక చేశారు.ఇక, శాంసన్‌కిది తొలి వరల్డ్‌కప్. 2015లోనే జట్టులోకి వచ్చినా ఇప్పటికి 25 మ్యాచ్‌లే ఆడాడు. అలాగే స్పిన్నర్ చాహల్‌పై తిరిగి సెలెక్టర్లు నమ్మకముంచారు. గతేడాది ఆగస్టులో తన చివరి టీ20 మ్యాచ్ ఆడిన చాహల్ తాజా ఐపీఎల్‌లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీశాడు. జడేజా, అక్షర్, కుల్దీప్ ఇతర స్పిన్నర్లుగా ఉన్నారు. అలాగే సీఎస్‌కే విడిలార్డర్ బ్యాటర్ శివమ్ దూబేను సైతం పరిగణనలోకి తీసుకున్నారు. స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగే దూబే మెగా టోర్నీలో ఉపయోగపడగలడని సెలెక్టర్లు భావించడంతో రింకూకు బెర్త్ దక్కలేదు. పేస్ బాధ్యతలను బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్ తీసుకోనున్నారు.

ఇదే మన సైన్యం

బ్యాటర్లు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, కోహ్లీ, సూర్యకుమార్.
ఆల్‌రౌండర్లు: హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్.
వికెట్‌కీపర్లు: రిషభ్ పంత్, సంజూ శాంసన్
బౌలర్లు: అర్ష్‌దీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్, కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్.
రిజర్వ్ ఆటగాళ్లు: శుభ్‌మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్.

భారత జట్టు గ్రూపు దశ మ్యాచ్‌లివే

ఎప్పుడు	ప్రత్యర్థి	వేదిక	సమయం
జూన్ 5	ఐర్లాండ్	న్యూయార్క్	రా. 7.30 గం.
జూన్ 9	పాకిస్థాన్	న్యూయార్క్	రా.8 గం.
జూన్ 12	అమెరికా	న్యూయార్క్	రా.8 గం.
జూన్ 15	కెనడా	లాడర్‌హిల్	రా.8 గం.

ఉబెర్ కప్‌లో అమ్మాయిలకు ఓటమి

చెంగ్డూ (చైనా): ఉబెర్ కప్ గ్రూప్ దశను భారత మహిళల జట్టు పరాజయంతో ముగించింది. గ్రూప్-ఎలో మంగళవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 0-5తో చైనా చేతిలో చిత్తయింది. కెనడా, సింగపూర్‌లపై విజయాలతో ఇప్పటికే క్వార్టర్స్ బెర్త్ సొంతం చేసుకొన్న భారత్.. చైనాకు కనీస పోటీ కూడా ఇవ్వలేక పోయింది.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: చెన్నై
చెన్నై X పంజాబ్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
చెన్నై	9	5	4	0	10	0.810
హైదరాబాద్	9	5	4	0	10	0.075
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
గుజరాత్	10	4	6	0	8	-1.113
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

20 జట్లు...55 మ్యాచ్‌లు

అమెరికా-వెస్టిండీస్ వేదికలుగా మొత్తం 20 జట్లు పాల్గొనే ఈ టీ20 ప్రపంచకప్ జూన్ ఒకటి నుంచి జరగనుంది. 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూపునుంచి టాప్‌లో నిలిచే రెండు జట్లు సూపర్-8కు చేరతాయి. జూన్ 29న జరిగే ఫైనల్‌కు బార్బడోస్ వేదిక కానుంది. అమెరికాలో మూడు, వెస్టిండీస్‌లో ఆరు వేదికల్లో కలిపి ఈ వరల్డ్‌కప్‌లో మొత్తం 55 మ్యాచ్‌లు జరుగుతాయి.

గట్టెక్కిన జెయింట్స్

పోరాడి ఓడిన ముంబై | ప్లేఆఫ్స్ రేసు నుంచి హార్దిక్ సేన అవుట్?


స్టొయినిస్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 62)

లఖ్‌నవూ: ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠగా సాగిన లోస్కోరింగ్ మ్యాచ్‌లో.. నెగ్గిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్‌కు మరింత చేరువైంది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' స్టొయినిస్ (45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) అర్ధ శతకంతో పాటు బౌలర్లు రాణించడంతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలిచింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 144/7 స్కోరు చేసింది. నేహల్ వధేరా (46), టిమ్ డేవిడ్ (35 నాటౌట్), ఇషాన్ కిషన్ (32) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో లఖ్‌నవూ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ (28) రాణించాడు. ఈ విజయంతో లఖ్‌నవూ 3వ స్థానానికి ఎగబాకగా.. ఏడో ఓటమితో ముంబై నాకౌట్ అవకాశాలు దాదాపుగా ముగిశాయి. గాయం నుంచి కోలుకొని ఈ మ్యాచ్‌లో ఆడిన మయాంక్ 3.1 ఓవర్లు బౌల్ చేసిన తర్వాత మళ్లీ నొప్పితో మైదానం వీడాడు.

ఆఖర్లో ఒత్తిడి: స్వల్ప ఛేదనలో స్టొయినిస్ రాణించినా.. లఖ్‌నవూ కష్టంగానే గట్టెక్కింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన అరంగేట్రం ఆటగాడు అర్షిన్ కులకర్ణి (0)ని తుషార గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేర్చాడు. అయితే, రాహుల్‌కు జత కలసిన స్టొయినిస్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరోవైపు రాహుల్.. 5వ ఓవర్‌లో తుషార బౌలింగ్‌లో 4,6,4,4తో 20 రన్స్ రాబట్టాడు. పవర్‌ప్లే ముగిసేసరికి లఖ్‌నవూ 52/1తో నిలిచింది. కాగా, ధాటిగా ఆడుతున్న రాహుల్‌ను అవుట్ చేసిన హార్దిక్.. రెండో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఈ దశలో స్టొయినిస్, దీపక్ హుడా (18) సంయమనంతో ఆడడంతో 10 ఓవర్లకు లఖ్‌నవూ 79/2తో మెరుగ్గానే కనిపించింది. అయితే, హుడాను పాండ్యా అవుట్ చేశాడు. నబి బౌలింగ్‌లో స్టొయినిస్ కూడా అదే ఓవర్‌లో అవుటయ్యాడు. చివరి 5 ఓవర్లలో సూపర్ జెయింట్స్ విజయానికి 29 రన్స్ కావాల్సి ఉండగా.. పూరన్ (14 నాటౌట్), టర్నర్ (5) నెమ్మదిగా ఆడడంతో ఆందోళన రేగింది. పైగా 17వ ఓవర్ బౌల్ చేసిన బుమ్రా ఒక్క పరుగే ఇవ్వగా.. తర్వాతి ఓవర్ తొలి బంతికే టర్నర్‌ను కొట్జీ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. ఇక, బదోని (6) రనౌటైనా.. ఒత్తిడి మధ్య పూరన్ మ్యాచ్‌ను ముగించాడు.

టాప్ ఢమాల్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్ సేన ఆరంభంలోనే తడబడింది. రోహిత్ (4)ను మొహిసిన్ స్వల్ప స్కోరుకే క్యాచవుట్ చేయగా.. సూర్యకుమార్ (10)ను స్టొయినిస్ వెనక్కిపంపాడు. తిలక్ వర్మ (7) రనౌట్ కాగా.. హార్దిక్ (0)ను నవీనుల్ డకౌట్ చేశాడు. దీంతో పవర్‌ప్లేలో ముంబై 28/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ ఇషాన్, వధేరా ఐదో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. 9వ ఓవర్‌లో మయాంక్ బౌలింగ్‌లో కిషన్ ఇచ్చిన క్యాచ్‌ను టర్నర్ చేజార్చాడు. అయితే, గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న ఇషాన్‌ను బిష్ణోయ్ బోల్తా కొట్టించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో మయాంక్ బౌలింగ్‌లో వధేరా 6,6,4తో 16 పరుగులతో స్కోరు వేగం పెంచారు. అర్ధ శతకానికి చేరువవుతున్న తరుణంలో వధేరాను మొహిసిన్ అద్భుతమైన యార్కర్‌తో బౌల్డ్ చేయగా.. నబి (1)ని మయాంక్ అవుట్ చేశాడు. కానీ, డెత్‌లో డేవిడ్ కొంత ధాటిగా ఆడడంతో ముంబై 140 మార్క్ అయినా దాటింది.

స్కోరుబోర్డు

*ముంబై: ఇషాన్ (సి) మయాంక్ (బి) బిష్ణోయ్ 32, రోహిత్ (సి) స్టొయినిస్ (బి) మొహిసిన్ 4, సూర్యకుమార్ (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 10, తిలక్ (రనౌట్) 7, హార్దిక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 0, నేహల్ (బి) మొహిసిన్ 46, టిమ్ డేవిడ్ (నాటౌట్) 35, నబీ (బి) మయాంక్ 1, కొట్జీ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 144/7; వికెట్ల పతనం:** 1-7, 2-18, 3-27, 4-27, 5-80, 6-112, 7-123; **బౌలింగ్:** స్టొయినిస్ 3-0-19-1, మొహిసిన్ 4-0-36-2, నవీనుల్ 3.5-0-15-1, మయాంక్ యాదవ్ 3.1-0-31-1, రవి బిష్ణోయ్ 4-0-28-1, దీపక్ హుడా 2-0-13-0.*

*లఖ్‌నవూ: రాహుల్ (సి) నబీ (బి) హార్దిక్ 28, అర్షిన్ (ఎల్బీ) తుషార 0, స్టొయినిస్ (సి) తిలక్ (బి) నబీ 62, దీపక్ హుడా (సి) బుమ్రా (బి) హార్దిక్ 18, పూరన్ (నాటౌట్) 14, టర్నర్ (బి) కొట్జీ 5, బదోని (రనౌట్) 6, క్రునాల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 19.2 ఓవర్లలో 145/6; వికెట్ల పతనం:** 1-1, 2-59, 3-99, 4-115, 5-123, 6-133; **బౌలింగ్:** తుషార 4-0-30-1, బుమ్రా 4-0-17-0, కొట్జీ 3-0-29-1, పీయూష్ 3-0-23-0, హార్దిక్ 4-0-26-2, నబీ 1.2-0-16-1.*

బవుమా, ఎన్‌గిడి అవుట్

కేప్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టులో మాజీ కెప్టెన్ తెంబా బవుమా, పేసర్ ఎన్‌గిడిలకు చోటు దక్కలేదు. కెప్టెన్‌గా మార్‌క్రమ్ వ్యవహరించనున్నాడు. అలాగే తొమ్మిది నెలల విరామం తర్వాత పేసర్ నోకియా జట్టులో చేరనున్నాడు. రొసో, వాన్‌డర్ డుస్సెన్‌లపైనా వేటు పడింది.

దక్షిణాఫ్రికా జట్టు: మార్‌క్రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, రికెల్టన్, రబాడ, జాన్సెన్, కేశవ్ మహరాజ్, ఫోర్టున్, నోకియా, కొట్జీ, షంసీ, బార్ట్‌మన్.

ఇంగ్లండ్ జట్టులో ఆర్చర్

లండన్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆడే ఇంగ్లండ్ జట్టులో పేసర్ జోఫ్రా ఆర్చర్ చోటు దక్కించుకున్నాడు. బట్లర్ నేతృత్వంలో 15 మందితో కూడిన జట్టును మంగళవారం ప్రకటించారు. గాయం నుంచి కోలుకున్న ఆర్చర్ ఏడాది తర్వాత పునరాగమనం చేయనున్నాడు. స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ ఒక్కడే అన్‌క్యాప్‌డ్ ప్లేయర్. అలాగే ఇదే జట్టు మే 22 నుంచి పాక్‌తో జరిగే నాలుగు టీ20ల సిరీస్‌లోనూ పాల్గొంటుంది. దీంతో ఐపీఎల్‌లో ఆడుతున్న ఇంగ్లండ్ ఆటగాళ్లు బట్లర్, మొయిన్ అలీ, ఫిల్ సాల్ట్, బెయిర్‌స్టో, సామ్ కర్రాన్, టోప్లే, లివింగ్‌స్టోన్, విల్ జాక్స్ ప్లేఆఫ్స్‌కు ముందే తమ జట్లను వీడనున్నారు.

భారత్‌కు రెండో గెలుపు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో రెండో టీ20లో భారత మహిళల జట్టు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 19 పరుగులతో నెగ్గింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బంగ్లా 20 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. రాధా యాదవ్‌కు మూడు.. దీప్తి, శ్రేయాంకలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 5.2 ఓవర్లలో 47/1 స్కోరు దగ్గర భారీ వర్షం కురవడంతో మ్యాచ్ రద్దయ్యింది. అప్పటికే రన్‌రేట్ మెరుగ్గా ఉండడంతో భారత్‌ను విజేతగా ప్రకటించారు.

హర్షిత్‌పై మ్యాచ్ నిషేధం

కోల్‌కతా: ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ పేసర్ హర్షిత్ రాణాకు 100 శాతం మ్యాచ్‌ఫీజు జరిమానాతోపాటు ఓ మ్యాచ్ నిషేధం విధించారు. సోమవారం ఢిల్లీతో మ్యాచ్‌లో అభిషేక్ పొరెల్‌ను అవుట్‌చేసిన రాణా ఫ్లయింగ్‌కిస్‌తో సెండాఫ్ ఇచ్చి దురుసుగా ప్రవర్తించాడు. ఈ ఐపీఎల్‌లో అతను ఇలా చేయడం ఇది రెండోసారి.

నిత్య, ప్రత్యూషకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియన్ గ్రాండ్ ప్రీలో తెలుగు అథ్లెట్లు నిత్య (తెలంగాణ), ప్రత్యూష (ఆంధ్రప్రదేశ్), షణ్ముగం (ఆంధ్రప్రదేశ్) పతకాలు కొల్లగొట్టారు. మంగళవారం బెంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో 100 మీటర్ల రేసులో స్వర్ణం గెలిచిన నిత్య.. ఆ తర్వాత 200 మీటర్ల పరుగులో కాంస్యం అందుకుంది. ఇదే రేసులో ప్రత్యూష పసిడి పతకం సాధించింది. పురుషుల 200 మీటర్ల రేసులో షణ్ముగం కాంస్యం దక్కించుకున్నాడు.

బిజినెస్

ధర పెరిగినా పసిడికి తగ్గని గిరాకీ

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 8% వృద్ధి, 136.6 టన్నులుగా నమోదు
3 నెలల్లో 19 టన్నుల గోల్డ్ కొనుగోలు చేసిన ఆర్‌బీఐ : డబ్ల్యూజీసీ వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) భారత్‌లో బంగారం గిరాకీ వార్షిక ప్రాతిపదికన 8 శాతం పెరిగి 136.6 టన్నులకు చేరుకుంది. ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) మంగళవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. గడిచిన కొన్ని నెలల్లో బంగారం ధరలు భారీగా పెరిగి సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరినప్పటికీ, దేశీయంగా బలమైన ఆర్థిక వాతావరణం ఈ విలువైన లోహానికి గిరాకీ కొనసాగేందుకు దోహదపడిందని డబ్ల్యూజీసీ రిపోర్టు పేర్కొంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సైతం దూకుడుగా బంగారం కొనుగోళ్లు జరపడం మెరుగైన వృద్ధికి మరో కారణమని నివేదిక పేర్కొంది. గత ఏడాది జనవరి-మార్చి కాలానికి గోల్డ్ డిమాండ్ 126.3 టన్నులుగా నమోదైంది. మరిన్ని ముఖ్యాంశాలు..

1 విలువపరంగా, క్యూ1లో బంగారం గిరాకీ 20 శాతం వృద్ధితో రూ.75,470 కోట్లకు పెరిగింది. సమీక్షా కాలంలో దేశీయంగా బంగారం ధరల సగటు 11 శాతం పెరిగినప్పటికీ, పసిడికి డిమాండ్ రెండంకెల స్థాయిలో వృద్ధి చెందడం గమనార్హం.

1 మొత్తం డిమాండ్‌లో స్వర్ణాభరణాల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి 95.5 టన్నులకు చేరుకోగా.. పెట్టుబడి అవసరాల కోసం బంగారం కడ్డీలు, నాణేల కొనుగోళ్లు 19 శాతం వృద్ధి చెంది 41.1 టన్నులకు చేరుకున్నాయి. గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లోకి సైతం 2 టన్నులకు పైగా పెట్టుబడులు వచ్చాయి. విలువపరంగా బంగారు ఆభరణాల విక్రయాలు 15 శాతం పెరిగి రూ.52,750 కోట్లుగా, బంగారంలో పెట్టుబడులు 32 శాతం పెరిగి రూ.22,720 కోట్లుగా నమోదయ్యాయి.

1 ఈ జనవరి-మార్చిలో దేశీయంగా 38.3 టన్నుల బంగారం రీసైక్లింగ్ జరిగిందని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 10 శాతం అధికమని డబ్ల్యూజీసీ తెలిపింది.

1 క్యూ1లో ఆర్‌బీఐ 19 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. గత ఏడాది మొత్తానికి కొనుగోలు చేసిన 16 టన్నుల కంటే అధికమిది. ఈ ఏడాదిలో మరింత బంగారం కొనుగోలు చేయనున్నట్లు ఆర్‌బీఐ సంకేతాలిచ్చిందని డబ్ల్యూజీసీ ఇండియా రీజినల్ సీఈఓ సచిన్ జైన్ తెలిపారు.

1 ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశంలోకి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 25 శాతం పెరిగి 179.4 టన్నులకు చేరుకున్నాయి. 2023లో ఇదే సమయానికి 143.4 టన్నుల బంగారం దిగుమతైంది.

1 క్యూ1లో ప్రపంచవ్యాప్త బంగారం డిమాండ్ 3 శాతం పెరిగి 1,238 టన్నులకు చేరుకుంది. 2016 తర్వాత గోల్డ్ గ్లోబల్ డిమాండ్‌పరంగా ఇదే అత్యంత బలమైన త్రైమాసికమని డబ్ల్యూజీసీ తన నివేదికలో పేర్కొంది.



ఈ ఏడాది దేశంలో బంగారం డిమాండ్ 700-800 టన్నుల స్థాయిలో నమోదు కావచ్చు. ధరలు మరింత ఎగబాకిన పక్షంలో పసిడి గిరాకీ వార్షిక అంచనాలోని దిగువ శ్రేణికే పరిమితం కావచ్చు. గత ఏడాది గోల్డ్ డిమాండ్ 747.5 టన్నులుగా నమోదైంది. ప్రస్తుత త్రైమాసికం (ఏప్రిల్-జూన్) విషయానికొస్తే, పసిడి ధరలు ఏప్రిల్‌లో అమాంతం పెరగడంతో పాటు ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో గిరాకీ స్తబ్దుగానే ఉండనుందని భావిస్తున్నాం.
- సచిన్ జైన్, రీజినల్ సీఈఓ, ఇండియా, డబ్ల్యూజీసీ

చిన్నారుల్లో పీసీవీ వ్యాక్సిన్ ఫలితాలు ప్రోత్సాహకరం:బీఈ

హైదరాబాద్: వ్యాక్సిన్ల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన బయోలాజికల్-ఈ లిమిటెడ్ (బీఈ) చిన్నారుల కోసం తయారుచేసిన 14-వ్యాలెంట్ న్యూమో కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ) మూడో దశ క్లినికల్ ట్రయల్స్ ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నట్లు ప్రకటించింది. 6 నుంచి 8 వారాల వయసు గల శిశువులపై న్యూబివ్యాక్స్ 14 టీఎం లేదా బీఈ-పీసీవీ-14 పేరిట తయారు చేసిన ఈ వ్యాక్సిన్‌ను పరీక్షించారు. ఈ అధ్యయన ఫలితాలను అంతర్జాతీయ జర్నల్ వ్యాక్సిన్ ఆమోదించి ప్రచురించినట్లు బీఈ తెలిపింది. దేశంలోని 12 ప్రదేశాల్లో 6-10-14 వారాల వయసు గల ఆరోగ్యవంతులైన 1,290 మంది శిశువులపై ఈ వ్యాక్సిన్ పరీక్షలు నిర్వహించారు. 3 డోసుల షెడ్యూల్ పూర్తయిన అనంతరం వారి శరీరానికి కలిగిన రక్షణను ఈ సందర్భంగా పరిశీలించారు. న్యూమోకోకల్ వ్యాధిలోని మొత్తం 14 రకాల స్టీరియోటైప్‌ల నుంచి శిశువులకు ఇది సంపూర్ణ రక్షణ కల్పించిందని ఆ పరీక్షల్లో తేలినట్లు తెలిపింది. ఇది పీసీవీ-13తో సమానమైన భద్రతా ప్రొఫైల్ కలిగి ఉన్నట్లు పేర్కొంది.

సనోఫీ మధుమేహ ఔషధం సోలిక్వా

న్యూఢిల్లీ: సనోఫీ ఇండియా.. మధుమేహ చికిత్సలో ఉపయోగించే సోలిక్వా ఇంజెక్షన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి గత ఏడాది ఈ ఔషధం మార్కెటింగ్‌కు అనుమతి లభించింది. ఇన్సులిన్, గ్లార్గిన్ 100 యూనిట్లు/ఎంఎల్ కాంబినేషన్ ఉన్న ఈ ఇంజెక్షన్ పెన్ ధర రూ.1,850.

తగ్గిన మోల్డ్ టెక్ లాభం

హైదరాబాద్: మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ లిమిటెడ్ మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.160.74 కోట్ల అమ్మకాలపై రూ.27.85 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.1,468.75 కోట్ల అమ్మకాలపై రూ.292.67 కోట్ల నికర లాభం ఆర్జించింది.


జోయాలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

Joyalukkas World's favourite jeweller

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ సంస్థ జోయాలుక్కాస్ అక్షయ తృతీయ కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా వజ్రాలు (డైమండ్స్) కొనుగోలు చేసిన వినియోగదారులకు రూ.2,000 విలువైన ఉచిత వోచర్స్ అందించనున్నట్లు తెలిపింది. అలాగే రూ.50,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన బంగారు నగలు కొనుగోలు చేసిన ఖాతాదారులకు రూ.1,000 విలువైన గిఫ్ట్ వోచర్, రూ.10,000 విలువైన వెండి నగలు కొనే కస్టమర్లకు రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్‌ను అందించనున్నట్లు జోయాలుక్కాస్ వెల్లడించింది. మే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ మధ్య వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జోయాలుక్కాస్ షోరూమ్‌ల్లో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. కాగా ఈ అక్షయ తృతీయ కోసం జోయాలుక్కాస్ 10 లక్షలకు పైగా విలక్షణమైన ఆభరణాలను తన షోరూమ్స్‌లో అందుబాటులో ఉంచింది.

డబ్ల్యూఏఎస్‌ఎల్ ఈక్విటీలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు వాటా

హైదరాబాద్: విమానాశ్రయాల్లో డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలు అందించే డబ్ల్యూఏఎస్‌ఎల్ ఈక్విటీలో, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ 8.4 శాతం వాటా తీసుకుంది. ఇందుకోసం రూ.57 కోట్లు చెల్లించినట్టు తెలిపింది. విమానాశ్రయాలకు సంబంధించిన వ్యాపారాల్లో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే చర్యల్లో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈ వాటా కొనుగోలు చేసింది. ఉత్తిష్ఠ విరాట్ ఫండ్ నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఈ వాటా కోసం 4.6 లక్షల షేర్లను కొనుగోలు చేసింది.




బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▲	66,600 ▲	87,000 ▼
ముంబై	71,710 ▼	65,686 ▼	80,050 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక 100 గుడ్లు)

1వ తేదీ



హైదరాబాద్	365
వరంగల్	367
చిత్తూరు	468
విజయవాడ	370
గోదావరి	370
విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.48

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129
వరంగల్	129
కరీంనగర్	129
మహబూబ్‌నగర్	129
కర్నూలు	129
విశాఖపట్నం	127
గోదావరి	135
విజయవాడ	135
గుంటూరు	137
ఒంగోలు	137
చిత్తూరు	127

నిఫ్టీ సరికొత్త రికార్డు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల దన్నుతో ఎన్ఎస్ఈ నిఫ్టీ మంగళవారం సరికొత్త జీవితకాల గరిష్ఠానికి ఎగబాకింది. ఇంట్రాడేలో ఒక దశలో సూచీ 139.95 పాయింట్ల లాభంతో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 22,783.35 వద్దకు చేరుకుంది. బీఎస్ఈ సెన్సెక్స్ సైతం 440 పాయింట్లకు పైగా బలపడి 75,111.39 స్థాయికి పెరిగింది. కానీ, ఆఖరి గంటలో మదుపరులు బ్యాంకింగ్, ఐటీ, మెటల్ రంగ షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సూచీలు ఏకంగా నష్టాల్లోకి మళ్లాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 188.50 పాయింట్ల నష్టంతో 74,482.78 వద్దకు జారుకుంది. నిఫ్టీ 38.55 పాయింట్లు కోల్పోయి 22,604.85 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోయాయి.

జేఎన్‌కే లిస్టింగ్ అదుర్స్: హీటింగ్ పరికరాల తయారీ సంస్థ జేఎన్‌కే ఇండియా మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.415తో పోలిస్తే బీఎస్ఈలో కంపెనీ షేరు 49.39 శాతం ప్రీమియంతో రూ.620 వద్ద లిస్టయింది. ఒకదశలో 71.56 శాతం పెరుగుదలతో రూ.712 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 67.21 శాతం లాభంతో రూ.693.95 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,859.81 కోట్లుగా నమోదైంది. గతవారంలో ముగిసిన కంపెనీ ఐపీఓకు సైతం భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుకు 28 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ ఐపీఓకు సెబీ ఓకే: గోల్డ్ లోన్ కంపెనీ మణప్పురం ఫైనాన్స్ అనుబంధ విభాగమైన ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ ఐపీఓకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ.1,500 కోట్ల వరకు సమీకరించాలని భావిస్తోంది.

నేడు మార్కెట్లకు సెలవు: మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1న (బుధవారం) స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సెలవు. మార్కెట్లు గురువారం యథావిధిగా పనిచేస్తాయి.

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో జరిగే మోసాలకు చెక్

» కొత్త నిబంధనలు జారీ చేసిన సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లో జరిగే ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్ వంటి విధానాలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఎంఎఫ్‌లను నిర్వహించే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఇలాంటి మోసాలను అడ్డుకునేందుకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ఏఎంసీలు ఈ వ్యవస్థల పనితీరుకు జవాబుదారీగా ఉండడంతో పాటు బాధ్యత కూడా తీసుకోవాలని సెబీ స్పష్టం చేసింది.

మరింత పర్యవేక్షణ

ఈ వ్యవస్థలో ఉద్యోగులు, బ్రోకర్లు, డీలర్లు చేసే ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలను అడ్డుకునేందుకు మరింత పర్యవేక్షణ, అంతర్గత నియంత్రణ పద్ధతులు ఉండాలని సెబీ స్పష్టం చేసింది. ఫ్రంట్ రన్నింగ్, మోసపూరిత లావాదేవీలు జరిపే వారిని ఎప్పటికప్పుడు గుర్తించేందుకు గట్టి పర్యవేక్షణ కూడా అవసరమని తెలిపింది. మంగళవారం సమావేశమైన సెబీ డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

ఓటర్ల కోసం అభిబస్ ప్రత్యేక ఆఫర్


హైదరాబాద్: ఆన్‌లైన్ బస్-టికెటింగ్ ప్లాట్‌ఫామ్ అభిబస్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఓటర్ల కోసం ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల కోసం అభివోట్ పేరుతో ఈ ఆఫర్‌ను తీసుకువచ్చినట్లు అభిబస్ సీఈఓ లెనిన్ కోడూరు, సీఓఓ రోహిత్ శర్మ తెలిపారు. ఈ ఆఫర్‌లో భాగంగా ప్రతి టికెట్ కొనుగోలుపై రూ.100 క్యాష్‌బ్యాక్‌తో పాటు 20 శాతం నుంచి రూ.250 వరకు డిస్కౌంట్‌ను అందించనున్నట్లు చెప్పారు. ఈ ఆఫర్ మే 11 నుంచి 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

1 గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ.. మార్కెట్లోకి హై పెర్ఫార్మెన్స్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఆంపైర్ నెక్సస్ విడుదల చేసింది. దీని ధర రూ.1,09,900 (ఎక్స్‌షోరూమ్). 3కిలోవాట్ ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో కూడిన ఈ స్కూటర్ ఒకసారి చార్జింగ్‌తో 136 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని కంపెనీ సీఈఓ విజయ్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న కస్టమర్లకు మే నెల ద్వితీయార్ధం నుంచి ఈ స్కూటర్ డెలివరీలను ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది.

1 కేబీసీ గ్లోబల్ లిమిటెడ్ (గతంలో కర్దా కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్)లో అమెరికాకు చెందిన మినర్వా వెంచర్స్ ఫండ్ వాటా కొనుగోలు చేసింది. ఏప్రిల్ 26న బల్క్ డీల్ ద్వారా ఎన్ఎస్ఈలో 1 శాతం వాటాకు సమానమైన కోటి షేర్లను మినర్వా వెంచర్స్ ఫండ్ కొనుగోలు చేసింది.

1 కేఎస్‌బీ లిమిటెడ్.. మార్చితో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.544.2 కోట్ల అమ్మకాలపై రూ.43.1 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. తొలి త్రైమాసిక విక్రయాల్లో 11 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు పేర్కొంది. సమీక్షా కాలంలో మహారాష్ట్ర ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నుంచి 2,500 సోలార్ వాటర్ పంపింగ్ సిస్టమ్స్ కోసం రూ.63 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు కేఎస్‌బీ తెలిపింది.

1 అపే ఎలక్ట్రిక్ త్రీ వీలర్స్ కోసం బ్యాటరీ సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను తీసుకువచ్చినట్లు పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. వినియోగదారుడు డీలర్‌షిప్స్ నుంచి రూ.2.59 లక్షలకు అపే ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ను కొనుగోలు చేస్తే.. నెలవారీ అద్దె కింద డీలర్ దగ్గర నుంచి బ్యాటరీని అందించనుంది. బ్యాటరీ లీజ్ కాలపరిమితి కార్గో వాహనాలకు 1,20,000 కిలోమీటర్లు లేదా 8 సంవత్సరాలు, ప్యాసింజర్ వాహనాలకు 1.5 లక్షల కిలోమీటర్లు లేదా ఎనిమిది సంవత్సరాలుగా ఉంటుంది.



మంచి వైద్యుడు.. మంచి స్నేహితుడు.. పైగా సౌమ్యుడు.. అంతకుమించి కుటుంబాన్ని అమితంగా ప్రేమించే మనిషి. అలాంటి ఓ వ్యక్తి తల్లి, భార్య, కూతురు, కొడుకును దారుణంగా హత్యచేసి, తాను ఆత్మహత్య చేసుకుంటాడా? పటమటలోని ఆర్థోపెడిక్ వైద్యుడు దారావత్ శ్రీనివాస నాయక్ ఆత్మహత్య, ఆయన కుటుంబ హత్యల వెనుక ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇంట్లో నిద్రపోతున్న భార్య ఉషారాణి, కుమార్తె శైలజ, తల్లి రమణమ్మ, కుమారుడు శ్రీహాన్ మెడ పైభాగంలో ఉన్న నరాలను కోసి దారుణంగా చంపేంత కర్కశత్వం ఆయనలో ఉందా? ఈ దారుణానికి కారణం అప్పులేనా? లేక ఎవరితోనైనా వైరమా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు సాగుతోంది. - విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)

ఏమిటీ దారుణం





రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మృతదేహం

డాక్టర్ నాయక్ ఆత్మహత్య, కుటుంబ హత్యల వెనుక అనుమానాలు

ఆసుపత్రిలో సమస్యలా..?

నూజివీడుకు చెందిన శ్రీనివాస నాయక్ గుంటూరులోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆయన తండ్రి జమలయ్య నాయక్ మాజీ పోలీసు అధికారి. విజయవాడలో ఏసీపీగా పనిచేశారు. శ్రీనివాస నాయక్‌కు ఒక అన్నయ్య ఒక చెల్లెలు ఉన్నారు. అన్నయ్య దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో న్యాయాధికారి. తండ్రి విజయవాడలో పనిచేసినప్పటి నుంచి ఆ కుటుంబం ఇక్కడే స్థిరపడిపోయింది. పటమటలోని ఫన్‌టైమ్స్ క్లబ్ వెనుక వీధిలో అభ్యుదయ జూనియర్ కళాశాలకు పక్కనే శ్రీనివాస నాయక్ సొంతింటిని నిర్మించుకున్నాడు. ఏడాది క్రితం దోర్నకల్ రోడ్డులో శ్రీజ ఆసుపత్రిని ప్రారంభించాడు. ఆ తర్వాత ఆర్థిక ఒడిదొడుకులు పెరగడంతో వేరే వైద్యులకు దీని నిర్వహణను అప్పగించినట్టు తేలింది. మొత్తం ముగ్గురు వైద్యులు శ్రీజను నడపడానికి నాయక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో 90 శాతం వాటా వారిదని, పదిశాతం వాటా నాయక్‌దని నిర్ణయించుకున్నారు. నాయక్‌కు ఆసుపత్రిలో ఒక చాంబర్ ఇచ్చినట్టు తెలిసింది. ఈనెల 1వ తేదీ నుంచి ఈ ఆసుపత్రి నిర్వహణ కొత్త వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్టు సమాచారం. అయితే, రాసుకున్న ఒప్పందం ప్రకారం కాకుండా ఉల్లంఘనలు ఏమైనా జరిగితే వివాదాలు మొదలయ్యాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించడానికి నాయక్ ఇబ్బందులు పడుతున్నాడని, వాటిని చెల్లిస్తామని, నాయక్‌కు సహాయం చేస్తామని ఆసుపత్రి నిర్వహణ తీసుకున్నవారు చెప్పారని స్నేహితుడు డాక్టర్ భగవాన్ తెలిపారు.

- అప్పుల కారణంగానే ఈ ఘటనకు ఒడిగట్టారా?
- ఆర్థిక సమస్యలతో ఆసుపత్రిలో భాగస్వాములకు చోటు
- ఆసుపత్రిలో ఏమైనా సమస్యలున్నాయా?
- కుటుంబం తలచుకుంటే తీర్చలేనన్ని అప్పులా?
- మానసిక ఒత్తిడి వల్లేనని వాయిస్ మెసేజ్
- ఈఎంఐలు కట్టలేకపోయాడన్న స్నేహితుడు
- అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు

కుటుంబ కలహాలా..?

తాను ఆత్మహత్య చేసుకోవడానికి ముందు శ్రీనివాస నాయక్ ఒక లేఖ రాశాడు. అందులో 'దిస్ ఈస్ మై కార్ కీ మేడమ్, ప్లీజ్ గివ్ ఓన్లీ టు శ్రీదుర్గాప్రసాద్ మై బ్రదర్' అని రాశాడు. ఈ లేఖను, కారు తాళాలను ఎదురుగా ఉన్న ఇంటి గేటుకు ఉన్న ఉత్తరాల పెట్టెలో వేసి తిరిగి వెళ్లిపోతుండగా, ఇంటి యజమాని అప్పుడే మేల్కొని గమనించాడు. నాయక్‌ను పిలిచి ఏమిటని ప్రశ్నించాడు. లేఖ, తాళాలు తన అన్నయ్యకు అందజేయాలని, తాను ఇక ఉండనని చెప్పి వెళ్లిపోయాడు. ఒక బ్యాగ్‌లో కొంత నగదు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌ను సర్ది కారులో పెట్టాడు. ఆ కారు తాళాల్నే ఎదురింట్లో ఇచ్చాడు. నాయక్ అత్తమామలు కొండపల్లిలో ఉంటారు. ఈ లేఖ, తాళాలను అత్తమామలకు కాకుండా దూరంగా ఉన్న అన్నయ్యకు అందజేయాలని రాశాడు. దీంతో కుటుంబ కలహాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అన్నదమ్ముల ఇద్దరి మధ్య పెద్దగా సత్సంబంధాలు ఉండవని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 'నేను మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాను. నేనంటే కుటుంబ సభ్యులకు చాలా ఇష్టం. నేను లేకుండా వాళ్లు బతకలేరు. అందుకే కుటుంబ సభ్యులను చంపేసి నేను చనిపోతున్నా' ఇదీ డాక్టర్ శ్రీనివాస నాయక్ చేసిన వాట్సాప్ సందేశం. వాయిస్ రికార్డ్ ద్వారా ఈ సందేశాన్ని తన వాట్సాప్‌లో పోస్టు చేసుకున్నాడు.



మృతదేహాలను బయటకు తీసుకొస్తూ..

చాలా మంచోడు :
డాక్టర్ భగవాన్, స్నేహితుడు

నేను, శ్రీనివాస నాయక్ గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుకున్నాం. నాయక్ చాలా మంచి వ్యక్తి. ఏడాది క్రితం శ్రీజ ఆసుపత్రిని ఏర్పాటు చేశాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. కొద్దిరోజుల క్రితమే దీన్ని మరొకరికి ఇచ్చాడు. ఇందులో 90 శాతం వారిది, పది శాతం వాటా నాయక్‌ది. ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాడు. వాటిని చెల్లిస్తామని, నాయక్‌కు సహాయం చేస్తామని ఆసుపత్రి నిర్వహణ తీసుకున్నవారు చెప్పారు.

ఎలాంటి లేఖ లభించలేదు :
అధిరాజ్‌సింగ్ రాణా, డీసీపీ

ఘటనా స్థలంలో మాకు ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. ఘటన మంగళవారం ఉదయం 6.30 గంటలకు ముందు జరిగి ఉంటుందని భావిస్తున్నాం. మాకు సమాచారం రాగానే వచ్చి చూడగా వరండాలో డాక్టర్ ఉరేసుకుని కనిపించాడు. తర్వాత లోపలకు వెళ్లి చూడగా మొదటి గదిలో రెండు, తర్వాత గదిలో ఒకటి, మూడో గదిలో ఒక మృతదేహం కనిపించాయి. ఆస్తులు, అప్పులకు సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేశాం. మరింత లోతుగా దర్యాప్తు చేస్తాం.

అప్పుల విషయమేమీ తెలియదు : కుటుంబ సభ్యులు

కుటుంబ సభ్యులు నలుగురిని చంపడానికి డాక్టర్ నాయక్ రెండు కత్తులను ఉపయోగించాడు. వాటిని కొనుగోలు చేసిన రశీదు పోలీసులకు లభించింది. గురునానక్ కాలనీలో ఉన్న ఉషోదయ సూపర్ మార్కెట్‌లో వీటిని కొన్నట్టు తేలింది. దీనిప్రకారం ఒక పోలీసు బృందం సూపర్ మార్కెట్‌కు వెళ్లి సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించింది. ఘటన గురించి తెలియగానే శ్రీనివాస నాయక్ సతీమణి ఉషారాణి కుటుంబ సభ్యులు పటమటకు చేరుకున్నారు. ఉషారాణి తండ్రి రామాంజీ కుటుంబం ఇబ్రహీంపట్నం కొండపల్లిలో ఉంటోంది. రామాంజీ హెచ్‌పీసీఎల్ ఉద్యోగం చేసి రిటైరయ్యారు. రామాంజీ కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను చూడగానే కుప్పకూలిపోయారు. ఉషారాణి తల్లి బోరున విలపించారు. రామాంజీని పోలీసులు విచారించగా, కొన్ని విషయాలను వెల్లడించినట్టు తెలిసింది. తన అల్లుడికి ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయం తెలియదని ఆయన చెప్పారు. కొన్నాళ్ల క్రితం ఒక స్థలాన్ని విక్రయించి కొంత నగదు సమకూర్చినట్టు వెల్లడించారు. అప్పులు గురించి చెప్పినట్టయితే మరో స్థలాన్ని విక్రయించి తీర్చేవారమని తెలిసింది.

జయహో.. జ్యోతి సురేఖ

ప్రపంచకప్ ఆర్చరీలో జ్యోతి సురేఖ హ్యాట్రిక్ స్వర్ణాలు

- నగర ఆర్చర్‌కు ఘనంగా స్వాగతం
- అభినందించిన ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి



జ్యోతి సురేఖను అభినందిస్తున్న ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న

విజయవాడ స్పోర్ట్స్/గన్నవరం, ఏప్రిల్ 30 : షాంఘైలో ఇటీవల జరిగిన ప్రపంచకప్ స్టేజ్-1 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో హ్యాట్రిక్ స్వర్ణాలతో సత్తా చాటిన యువ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖకు అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక శాప్ ప్రధాన కార్యాలయంలో ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న మంగళవారం ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాప్ పరిపాలనాధికారి పి.రామకృష్ణ, జ్యోతి సురేఖ తండ్రి వెన్నం సురేంద్ర పాల్గొన్నారు. కాగా, అంతకుముందుకు గన్నవరం విమానాశ్రయానికి విచ్చేసిన జ్యోతి సురేఖకు ఘనస్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో ఇక్కడికి వచ్చిన జ్యోతి సురేఖకు యూనియన్ బ్యాంక్ విజయవాడ డీజీఎం ఎం.శ్రీధర్, ఏజీఎం బి.హరీశ్, ఏపీ యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆనంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవితేజ, కెనరా బ్యాంక్ ఉద్యోగ సంఘం కార్యదర్శి బి.బాబు తదితరులు ఘనంగా స్వాగతించారు.

ఇనాం.. హామీ మాయం..?



జగ్గయ్యపేటలో బాధితుల ఆందోళన (ఫైల్)

ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఇనాం భూముల సమస్య

- అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తానన్న జగన్
- పరిష్కరించకపోగా, టీడీపీ తెచ్చిన ఆర్డినెన్స్‌కు బ్రేక్

ఇనాం భూముల సమస్య.. ఏళ్ల తరబడి బాధితులను ముప్పుతిప్పలు పెడుతున్న ప్రధాన సమస్య. టీడీపీ హయాంలో ఆర్డినెన్స్ అనే అస్త్రంతో ఇనాంకు పరిష్కార మార్గం చూపగా, వైసీపీ ప్రభుత్వం వచ్చాక దానిని తొక్కి పెట్టింది. ఫలితంగా రెండు జిల్లాల్లో 3,511 ఎకరాల ఇనాం భూములు, వాటి బాధితులు తమ సమస్య పరిష్కారానికి ఏళ్ల తరబడి ఎదురుచూస్తూనే ఉన్నారు.

కంచికచర్ల : ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3,511.88 ఎకరాల ఇనాం భూములున్నాయి. నందిగామలో 650 ఎకరాలు, జగ్గయ్యపేటలో 400 ఎకరాలు ఉన్నాయి. ఈ రెండు పట్టణాల్లో 16 వేలమంది బాధితులు ఉన్నారు. పుష్కరకాలం నుంచి వీరంతా నరకం అనుభవిస్తున్నారు. పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు, వైద్యానికి, ఇతరత్రా కుటుంబ అవసరాలకు బాధితులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఈ భూములపై బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదు. ఏదో ఒక ధరకు అమ్ముదామనుకున్నా కొనే నాథుడు లేడు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల మొద్దునిద్ర వల్ల ఈ ఇనాం భూముల సమస్య అలాగే ఉండిపోయింది.

టీడీపీ తెచ్చిన ఆర్డినెన్స్

పూర్వం రాజులు, జమిందారులు.. దేవాలయాలకు సేవలందించే వారికి జీవనోపాధి నిమిత్తం సాగు భూములను ఇనాంగా ఇచ్చారు. స్వాతంత్ర్యం వచ్చాక 1956లో ప్రభుత్వం ఇనాం చట్టాన్ని తీసుకొచ్చింది. అర్హులైన వారికి అధికారులు రైత్వారీ పట్టాలు ఇచ్చారు. కొంతమంది అనర్హులు కూడా పట్టాలు పొందారు. కాలక్రమేణా గ్రామాలు పట్టణాలుగా విస్తరించటంతో ఎక్కువ శాతం భూములు స్థలాలుగా మారాయి. ఎక్కడికెక్కడ విలువైన భవనాలు వెలిశాయి. ఇనాం భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో 2013లో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఇనాం ల్యాండ్ ఎబాలిషన్ చట్టానికి చేసిన సవరణలో చిన్న తప్పిదం జరిగింది. ఇది 1956 నుంచి జరిగిన లావాదేవీలకు వర్తింపజేయటంతో ఈ భూములన్నీ నిషేధిత జాబితాలోకి వెళ్లాయి. రిజిస్ట్రేషన్లు లేకపోవటం వల్ల బాధితులు పలుమార్లు ఆందోళనకు దిగారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆ తరువాత సీఎం చంద్రబాబు స్పందించి ఆంధ్రప్రదేశ్ ఇనాం (ఎబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్ టూ రైత్వారీ) అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్-2019 పేరుతో 2019, ఫిబ్రవరిలో ఆర్డినెన్స్ తెచ్చారు. దీనిప్రకారం 2013కు ముందు ఇచ్చిన పట్టాలు చెల్లుబాటు అవుతాయి. ఇనాం సర్వీసు భూముల అంశం కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి జాబితాలో ఉన్నందున అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపారు. ఇక దీనికి చట్టబద్ధత కల్పించాల్సి ఉండగా, వైసీపీ ప్రభుత్వం వచ్చింది.


వైసీపీ వచ్చాక మోకాలడ్డు

ఇనాం సమస్యను పరిష్కరించి, బాధితుల కళ్లల్లో ఆనందం నింపుతానని గత ఎన్నికలకు ముందు జగన్ హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక ఆ హామీని మరిచిపోయారు. బాధితులకు న్యాయం జరిగేలా 2019 ప్రారంభంలో టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించకుండా మోకాలడ్డారు. ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ఆమోదముద్ర వేసినప్పటికీ, చంద్రబాబుకు పేరొస్తుందన్న దురుద్దేశంతో కావాలనే నీరుగార్చారు.

ఆగిన అమ్మకాలు.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

2013లో తీసుకొచ్చిన చట్ట సవరణ వల్ల వేలాది మంది పలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు చేయకపోవటంతో ఈ భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. అయితే, కొందరు తమ అవసరాలకు అమ్ముకున్నారు. కాలగమనంలో ఈ భూములు చేతులు మారాయి. 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల సర్వీస్ ఇనాం భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చట్ట సవరణ చేయాల్సి వచ్చింది. సవరణలో అక్షరం తేడాతో అంతా తారుమారైంది. సవరణలో విత్ ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్ అని ఉండాల్సి ఉండగా, విత్ రెట్రాస్పెక్టివ్ అని ఇవ్వటంతో 1956 ఇనాం ఎబాలిష్ యాక్ట్ దగ్గర నుంచి కొనుగోళ్లు జరిగిన వాటిన్నింటినీ ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. వాస్తవానికి 2013 వరకు సర్వీసుదారులుగా ఉన్నవారికి ఇనాం భూములు చెందాలని, 2013 తర్వాత కొత్తగా ఇవ్వరాదని చట్ట సవరణ చేశారు. సవరణలో అక్షరం తేడా వల్ల అప్పటికే రాష్ట్రంలో ఇనాం భూములు కొన్న వేలాది మంది చిన్న, మధ్యతరగతి కుటుంబాల వారు బాధితులయ్యారు.

నరకం చూస్తున్నాం..



12 ఏళ్ల నుంచి అష్టకష్టాలు పడుతున్నాం. ఇప్పటికే ఒకటికి పదిసార్లు రిజిస్ట్రేషన్లు జరిగిన స్థలాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. జగన్ హామీలను నమ్మి ఓట్లేసిన మాకు తీరని అన్యాయం చేశారు. సమస్యను పరిష్కరించకుండా కావాలని కాలయాపన చేశారు. ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించకపోవటం దుర్మార్గం. మమ్మల్ని అగాధంలోకి నెట్టిన జగన్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెబుతాం.

- రాటకొండ రామకోటేశ్వరరావు, ఇనాం భూముల బాధితుల సంఘం రాష్ట్ర నాయకుడు

కొడాలి.. అండ్ కో..

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఉస్కో అంటే.. మున్సిపల్ అధికారగణం డిస్కో అన్నారంట. పాత మున్సిపల్ కార్యాలయం వాడకం అంశంలో నాని అడుగడుగునా నిబంధనలకు పాతరేసినా రిటర్నింగ్ అధికారి పద్మావతి మొదలు మున్సిపల్ అధికారుల వరకు మిన్నకుండిపోయి అయ్యవారి అడుగులకు మడుగులొత్తారు. టీడీపీ నాయకులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా నోటీసుతో మమ.. అనిపించారు. కానీ, నిజాలు దాచాలంటే దాగిపోతాయా..? ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.



క్యాంపు కార్యాలయం విషయంలో అన్నీ ఉల్లంఘనలే..

- తెలిసి కూడా ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులు
- కొడాలి నాని సేవలో తరిస్తున్న ఆర్వో, ఇతర అధికారగణం
- కౌన్సిల్ ఆమోదం లేకుండానే కార్యాలయం హస్తగతం
- వేలం నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వాడకం

ఏడు నెలలకు పైసా అద్దె చెల్లించలేదు..!

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/ గుడివాడ) : గుడివాడ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో కొంత ప్రాంతాన్ని కొడాలి నాని తన క్యాంప్ ఆఫీసుగా వాడుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక.. మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇవ్వడంతో ఖాళీ చేశారు. అయితే, నామినేషన్‌లో తాను ప్రభుత్వ వసతి ఉపయోగించుకోలేదని నాని పేర్కొనడం నిబంధనలకు విరుద్ధమంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై రిటర్నింగ్ అధికారి కనీస స్పందన చూపలేదు. ఈ విషయంలో కొడాలి నాని పక్కాగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని స్పష్టమైనా ఒక్క అధికారికి కూడా ఇది తప్పని చెప్పే ధైర్యం లేకుండాపోయింది.

- వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానీని మంత్రి పదవి వరించింది. మంత్రి క్యాంపు కార్యాలయం కోసం పరిశీలన జరుగుతున్న సమయంలో ఆయన కన్ను పాత మున్సిపల్ కార్యాలయంపై పడింది. కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఆ భవనాన్ని తన స్వాధీనంలోకి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మున్సిపాల్టీకి వచ్చిన అభివృద్ధి నిధులు సుమారు రూ.3 కోట్లతో పాత భవనానికి మరమ్మతులు చేయించారు. మున్సిపాలిటీ సొమ్ముతో మరమ్మతులు చేసి మరీ భవనాన్ని ఆయనకు అప్పగించారు. 2019, నవంబరులో పౌరసరఫరాల శాఖతో మున్సిపాలిటీ వారు మూడేళ్ల కాలానికి లీజు ఒప్పందం చేసుకున్నారు. ఇది అధికార దుర్వినియోగం కాదా...?.
- పౌరసరఫరాల శాఖతో మున్సిపాలిటీ ఒప్పందం 2022, నవంబరు 30న ముగిసింది. నాటి నుంచి 2023, జూలై వరకు ఏడు నెలలు పాటు ఎమ్మెల్యే నాని ఆక్రమణలోనే పాత మున్సిపల్ భవనంలోని పై అంతస్తు ఉంది. ఈ కాలానికి ఎలాంటి అద్దె చెల్లించకుండా ఉచితంగా ప్రభుత్వ భవనాన్ని నాని ఉపయోగించుకున్నారు. 2023, జూలై 10న మళ్లీ నాని పేరుతో మున్సిపల్ శాఖ ఒప్పందం చేసుకుంది. 2025, నవంబరు వరకు ఆయన పేరుతో లీజుకు ఇచ్చినట్టు అందులో పేర్కొన్నారు. అదేరోజు మున్సిపల్ కౌన్సిల్‌లో హడావిడిగా తీర్మానం కూడా చేసేశారు.
- పౌరసరఫరాల శాఖ నుంచి ఎమ్మెల్యే నాని పేరిట.. పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మార్చే క్రమంలో వచ్చిన విద్యుత్ బిల్లులను మున్సిపాలిటీకి చెల్లించినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఇది అధికార దుర్వినియోగం కాదా...?
- గుడివాడకు చెందిన భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ సమాచార హక్కు చట్టం ద్వారా పాత మున్సిపల్ భవనం లీజు వివరాలను అడిగారు. పౌరసరఫరాల శాఖ పూర్తిస్థాయిలో అద్దెను చెల్లించలేదని, ఏడు నెలల పాటు ఎమ్మెల్యే కొడాలి నాని ఆధీనంలో భవనం ఉన్నట్టు సమాచారమిచ్చారు. 2023, జూలైలో నానీకి భవనం ఇవ్వగా, డిసెంబరు నుంచి అద్దె వసూలు చేస్తున్నట్లు అధికారులు సమాచారం ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక 2024, మార్చి 17న మున్సిపల్ అధికారులు సదరు భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. 23 నెలలుగా ఎమ్మెల్యే కొడాలి నాని అద్దె చెల్లించలేదని తెలిపారు. దీన్ని అధికార దుర్వినియోగం కాక ఏమంటారు?
- 2024, మార్చి 17న.. మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే కొడాలి నాని ఆధీనంలో ఉన్న పాత మున్సిపల్ భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారికి సమాచారమిచ్చారు. అయితే, మార్చిలో వరుసగా 19, 20, 21, 22, 23, 26 తేదీల్లో రోజుకు రూ.2 లక్షల చొప్పున, మార్చి 27న మిగిలిన రూ.1,14,240 అద్దె బకాయి చెల్లించినట్టు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. నామినేషన్ విషయంలో తలనొప్పులు వస్తాయన్న ఉద్దేశంతోనే ఈ అద్దెలు చెల్లించినట్లు తెలుస్తోంది. ఉల్లంఘనలన్నీ ఈ రూపేణా మాఫీ అయిపోతాయని నాని భావించి ఉండటం అధికార దుర్వినియోగం కాదా?

ఆయన ఎమ్మెల్యే అయితే మా ప్రాణాలుంటాయా?



రాంబాబురెడ్డి (ఫైల్)

- మురుగు సమస్య పరిష్కరించమన్నందుకే దాడి
- జెడ్పీటీసీ స్థాయికే ప్రాణాలు తీస్తామన్నారు..!
- మైలవరం పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త రాంబాబురెడ్డి ఆవేదన

మైలవరం, ఏప్రిల్ 30 : ఆయనో ప్రజాప్రతినిధి. ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన జెడ్పీటీసీ. సమస్యలను పరిష్కరించాల్సిన ఆయనే సమస్యను సృష్టించి, ఇదేమని ప్రశ్నించినందుకు దాడి చేయించారు. సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి భర్తనే రక్త మొచ్చేలా తలపై రాడ్డుతో దాడి చేయించారు. హత్యాయత్నం కేసు నమోదు చేయాలని బాధితులు.. పోలీసులను కోరినా న్యాయం జరగలేదు. ఏడాదిగా ఈ కేసు నడుస్తూనే ఉంది. ఈ కేసులో నిందితులు మైలవరం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, ఆయన తమ్ముడు స్వామి కాగా, బాధితుడు అలవాల రాంబాబు రెడ్డి. ఏడాది కిందట తనపై జరిగిన హత్యాయత్నం కేసును రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు ఎందుకు తొక్కిపెడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. 'మైలవరం పట్టణ పంచాయతీ 16వ వార్డు సభ్యురాలిగా నా భార్య పద్మావతి ఉంది. వార్డు పరిధిలోని సుగాలి కాలనీలో ఎస్టీలు వాడుకున్న నీరు బయటకు పోకుండా సర్నాల తిరుపతిరావు సోదరుడు స్వామి డ్రెయినేజీకి ఉన్న తూములు మూసేస్తూ చప్టా నిర్మించుకున్నారు. దీంతో మురుగు నీరు డ్రెయినేజీలో నిల్వ ఉండి దోమల బెడద, దుర్వాసన విపరీతంగా వస్తుండటంతో స్థానికులు వార్డు సభ్యురాలి దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ పెద్దల వద్ద పంచాయతీ పెట్టించగా, సర్నాల తిరుపతిరావు, అతని సోదరుడు స్వామి వచ్చారు. ఈ క్రమంలో అకారణంగా నా కుమారుడు గణేశ్ రెడ్డిపై స్వామి దాడికి దిగారు. గణేశ్ గొంతు నొక్కుతుండగా, వదలమని అడ్డుపడిన నాపై ఇనుపరాడ్డుతో దాడి చేసి తల పగలగొట్టారు. తీవ్ర రక్తస్రావమై ఆసుపత్రిలో వారం పాటు చికిత్స పొందాను. అప్పట్లో కేసు పెట్టగా సర్నాల స్వామి, తిరుపతిరావు, కేశవరావుపై ఐపీసీ 324, 323, 506, ఆర్‌డబ్ల్యూ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఘటన జరిగి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు నాకు న్యాయం చేయలేకపోయారు. మైలవరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు జెడ్పీటీసీగా ఉన్న సమయంలోనే ఇంత అరాచకాలు సృష్టిస్తే ఎమ్మెల్యే అయితే నియోజకవర్గంలో ఎవరినీ బతకనివ్వరు. మా ప్రాణాలు కూడా తీసేస్తారు.' అంటూ రాంబాబురెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు.





హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మకు రూ.1.91 కోట్లకు పైగా కానుకలు

వన్‌టౌన్, ఏప్రిల్ 30 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో మంగళవారం 15 రోజుల వ్యవధికి సంబంధించి ఆలయ మహామండపం ఆరో అంతస్తులో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.1,91,27,261ల నగదు, 370 గ్రాముల బంగారం, 3కిలోల 850 గ్రాముల వెండి కానుకల రూపేణా సమకూరాయి. వీటితో పాటు యూఎస్‌ఏ డాలర్లు 516, ఓమన్ బైంసాలు 100, యూకే పౌండ్లు 80, ఇంగ్లాడ్ పౌండ్లు 40, ఆస్ట్రేలియా డాలర్లు 100, కెనడా డాలర్లు 15, 5 యూరోలు, 2 సింగపూర్ డాలర్లు, 25 యునైటెడ్ అరబ్ ఎమరేట్స్ దిర్హమ్స్, ఒక కువైట్ దినార్, 24 ఖతార్ రియాల్స్, 1000 కొరియా వాన్‌లు వచ్చాయి. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా రూ.44,831లు కానుకగా వచ్చాయి. ఈవో కేఎస్ రామారావుతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, భవానీ సేవాదారులు తదితరులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

అన్నివర్గాలను సంతృప్తపరిచేలా మేనిఫెస్టో

» నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 30 : జగన్ అరాచక, విధ్వంసక, సైకో పాలనతో తీవ్ర గాయాల పాలైన రాష్ట్రానికి టీడీపీ కూటమి మేనిఫెస్టో గాయాలు మాన్పించేలా, అన్ని వర్గాలను మెప్పించేలా ఉందని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలిసంతకంతో దగా పడ్డ విద్యార్థి, నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు తెస్తుందని, ఫించన్లను రూ.4వేలకు పెంచటం, దుర్మార్గపు, చీకటి చట్టమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తానన్న హామీపై హర్షం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేసి చూపించి రాష్ట్రంలో సంపద పెంచి ఇటు సంక్షేమాన్ని, అభివృద్ధిని పుంతలు తొక్కించేలా ఉందన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కేశినేని చిన్ని

కూటమికి భారీ విజయం ఖాయం: కేశినేని చిన్ని

విద్యాధరపురం, ఏప్రిల్ 30: ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి భారీ విజయం ఖాయమని కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో 52వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పలువురు మైనార్టీ సెల్ నాయకులు కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి చిన్ని కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌ను గద్దె దింపేందుకు మరో 15 రోజులే ఉందన్నారు. టీడీపీ మైనార్టీలకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వానికి ఓటమి తప్పదని హెచ్చరించారు. యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేసే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు అనేక మంది వైసీపీ వీడి టీడీపీలోకి వస్తున్నారని అన్నారు. టీడీపీ 52వ డివిజన్ అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి సయ్యద్ కరీముల్లా, డివిజన్ మహిళా సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మధుసూదనరావు పాల్గొన్నారు.



టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైసీపీ మూకలు

టీడీపీ నేతలపై అక్రమ కేసులు!

» వసంత ఎన్నికల ప్రచార ర్యాలీలో వైసీపీ నేతల హల్‌చల్

» అక్రమ కేసుల సంస్కృతి వారికి కొత్త కాదు : వసంత

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 30 : కొటికలపూడి గ్రామంలో మైలవరం కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఎన్నికల ప్రచారానికి వస్తున్న అనూహ్య స్పందన చూసి వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు బాణాసంచా కాల్చుతుండగా అడ్డుకుని రోడ్డుపై విసిరివేశారు. ఈక్రమంలో వైసీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలు కాగా.. ఇదంతా వసంతే చేయించాడని ఆరోపిస్తూ మూలపాడుకు చెందిన వైసీపీ నేత కార్యకర్తలతో స్టేషన్‌కు వెళ్లి టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించాడు. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు పోలీసులు వసంతతో పాటు మరో తొమ్మిది మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారు. వైసీపీ నేతలు పథకం ప్రకారం టీడీపీ ఎన్నికల ప్రచారంలో అల్లర్లు సృష్టించడమే కాక చర్చిలో ప్రార్థనలకు వెళ్లకుండా తాళాలు వేయించినట్టు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు.

అక్రమ కేసులు వారికి కొత్త కాదు

అక్రమ కేసుల సంస్కృతి వాళ్లకి కొత్తేమి కాదని మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ అన్నారు. కొటికలపూడి గ్రామంలో ర్యాలీలో జరిగిన ఘటనలో తనను మొదటి ముద్దాయిగా చేర్చి కేసు పెట్టించారని, అరకిలో మీటర్ దూరంలో వాహనంపై ఓట్లు అభ్యర్థిస్తుంటే నేను చేయమన్నానని నెపం మోపారన్నారు. అర్ధరాత్రి నాపై కేసు పెట్టింది చాలక తన కంపెనీ నుంచి రెండు వేలమంది వచ్చారని అభాండాలు వేస్తున్నారని, తన కంపెనీలో 200 మంది ఉద్యోగులే ఉన్నారన్నారు. మైలవరంలో పోటీ పెట్టిన వ్యక్తిపై జగన్ ఆయన సామాజికవర్గానికి చెందిన అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, హర్షారెడ్డి, తిరుపతిరెడ్డి అనే ముగ్గురితో పాటు కడప, కర్నూలు నుంచి 80 మందిని రప్పించి ప్రతి నాయకుడిపై పెత్తందారిగా పెట్టారన్నారు. నాపై కేసులు పెట్టుకోండి.. ఏం జరుగుతుందో ప్రజలే నిర్ణయిస్తారన్నారు.

మేనిఫెస్టోతో వైసీపీ నేతల్లో వణుకు : కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : టీడీపీ కూటమి మేనిఫెస్టో చూసి వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మచిలీపట్నం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ హయాంలో పేదప్రజలకు అండగా ఉన్న అన్నా క్యాంటీన్ వంటి పథకాలను వైసీపీ రద్దు చేసిందని, ఈ పథకాలను పునరుద్ధరిస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో చంద్రబాబు పేర్కొనడంతో వైసీపీ నేతల గుండెల్లో దడ పుట్టుకొచ్చిందన్నారు. ప్రతీ ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తానని, నిరుద్యోగలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదన్నారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీదని చెప్పడంతో నిరుద్యోగులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మహిళలకు మూడు వంటగ్యాస్ సిలెండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 వంటి పథకాలతో వారి ముఖాల్లో ఆనందం కనబడుతోందన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తానని చెప్పిన మాట నిలబెట్టుకుని మేనిఫెస్టోలో చేర్చారన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తామన్నారు. టీడీపీ హయాంలో పండుగలకు ఇచ్చిన కానుకల పథకాలు తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో అందరికీ అనుకూలంగా ఉంటే బందరు ఎమ్మెల్యే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ మేనిఫెస్టో ప్రజలను ఆకర్షించలేదని, అంకెల గారడీ అని అందరికీ తెలిసి పోయిందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు.

878 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకం



» ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 47 శాతం పైగా గుర్తింపు
» ఎన్నికల సంఘానికి నివేదించిన జిల్లా యంత్రాంగం
» అత్యధికంగా విజయవాడ తూర్పులో 159
» అత్యల్పంగా నందిగామలో 77
» భద్రత పెంచేందుకు బలగాలు కోరిన జిల్లా యంత్రాంగం
» సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో.. వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నవ ఎన్టీఆర్ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఆందోళనకలిగిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 47శాతం పైగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా ఎన్నికల యంత్రాంగం నివేదించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1874 పోలింగ్ స్టేషన్లలో 878 వరకు సమస్యాత్మకంగా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 720 లోకేషన్లలో ఒకటి నుంచి 15 వరకు కూడా పోలింగ్ స్టేషన్లు ఉంటాయి. ఈ లెక్కన మొత్తం 332

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఇవే..

జిల్లావ్యాప్తంగా 720 లోకేషన్లలో 1874 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తీవ్ర హింసాత్మక పోలింగ్ కేంద్రాలు లేకపోయినా.. సమస్మాత్మక కేంద్రాలు 878 వరకు ఉన్నాయని గుర్తించారు. వీటిలో అత్యధికంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 159, సెంట్రల్ నియోజకవర్గంలో 134, తిరువూరులో 129, మైలవరం నియోజకవర్గంలో 124, జగ్గయ్యపేటలో 116, విజయవాడ పశ్చిమలో 97, నందిగామలో 77 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించారు.

పోలింగ్ లొకేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల యంత్రాంగం గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల లొకేషన్ల ఆధారంగా చూస్తే 46.11 శాతం మేర సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించటం జరిగింది. గత సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న వివాదాలు, అల్లర్లు, పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలగటం, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అనుచరుల పరస్పర కవ్వింపులు అన్నింటినీ గమనంలోకి తీసుకుని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. ప్రధానంగా 2009, 2014, 2019లలో చోటు చేసుకున్న గొడవలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎన్నికల యంత్రాం గం గట్టి బందోబస్తుకు బలగాల కోసం ఇప్పటికే పోలీసు యంత్రాంగానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది.

గన్నవరం అత్యంత సమస్యాత్మకం..

కృష్ణాజిల్లా పరిధిలోకి వచ్చే గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం పరిధిలోని కొన్ని గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉంటాయి. విజయవాడ రూరల్ మండల పరిధిలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, నున్న, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, నైనవరం, పాతపాడు, గొల్లపూడి వంటి గ్రామాలలో ఎన్నికల నిర్వహణ బాధ్యత ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగంపైనే ఆధారపడి ఉంది. ఈ ప్రాంతాల్లో కొన్ని మైలవరం నియోజకవర్గ పరిధిలోకి, కొన్ని గన్నవరం నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. మైలవరం నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాకు చెందింది కాబట్టి వీటి కౌంటింగ్ అంతా ఇక్కడే నిర్వహిస్తారు. గన్నవరం నియోజకవర్గానికి చెందిన గ్రామాలకు సంబంధించి కృష్ణాజిల్లాలో లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల నిర్వహణ మాత్రం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగమే చూసుకోవాల్సి ఉంటుంది. గత ఎన్నికలలో ప్రసాదంపాడులో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు, నున్న, కొత్తూరు తాడేపల్లి వంటి ప్రాంతాలలో గొడవలకు ఆవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితులు, పరస్పరం రెచ్చగొట్టుకుంటున్న తీరు, బల సమీకరణలతో పోటీకి ముందే గన్నవరంలో ఒక రకమైన యుద్ధ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగాన్ని ఈ పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ పోలింగ్ కేంద్రాలపైనా సీరియస్‌గా దృష్టి సారించాలని నిర్ణయించటం జరిగింది.

సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లన్నింటిలోనూ వెబ్ క్యాస్టింగ్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం నిర్ణయించింది. సాంకేతిక కన్ను ఈ సమస్యాత్మక కేంద్రాల మీద పర్యవేక్షణ చేస్తోంది. మొత్తం 913 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారంలో లైవ్‌గా ఆయా స్టేషన్ల స్థితిగతులను గమనిస్తూ ఉంటారు. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల ఆవరణ, చుట్టుపక్కల, 100 మీటర్ల దూరం నుంచి పోలింగ్ కేంద్రాల సమీపం వరకు వీడియోగ్రఫీ కూడా చేయించాలని నిర్ణయించారు. గుర్తించిన 430 పోలింగ్ స్టేషన్లలో వీడియోగ్రఫీ చేయిస్తున్నారు.

తొలి దశ అడ్మిషన్‌కు 600 మంది విద్యార్థుల ఎంపిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న కృష్ణాజిల్లా విద్యార్థులకు తొలి దశ అడ్మిషన్‌లో 697 మందిని ఎంపిక చేసినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. మంగళవారం డీఈవో మాట్లాడుతూ, ఎస్సీ కేటగిరిలో 309, ఎస్టీ కేటగిరిలో 16, బీసీ 253, మైనారిటీ 34, ఓసీ కేటగిరిలో 88 మంది పిల్లలు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు అడ్మిషన్ ప్రక్రియ బుధవారం నుంచి మే 10వరకు నిర్వహిస్తారన్నారు. మండలస్థాయిలో మే 11న ఎంఈవోలకు ఏవైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చన్నారు. ఎంఈవోలు 14వ తేదీన ఫిర్యాదుల జాబితా తెలపాలన్నారు. డీఈవో ఆ ఫిర్యాదులను మే 15న ఎస్‌పిడికి తెలియచేస్తారన్నారు. 16, 17 తేదీల్లో సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులను పరిష్కరిస్తారన్నారు.

అమరావతి రాజధానిగా కొనసాగాలంటే.. ఎన్డీఏ అధికారంలోకి రావాలి



» మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు

నందిగామ, ఏప్రిల్ 30 : అమరావతి రాజధానిగా కొనసాగాలంటే ఎన్డీఏ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఐతవరంలోని తన నివాసంలో అమరావతి జేఏసీ నేత పోతుల బాలకోటయ్య, రాష్ట్ర బీసీ నాయకురాలు యలగాని నూకానమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం కోసం భూములు త్యాగం చేసిన అమరావతి రైతులను మోసం చేస్తూ జగన్ రాజధాని మార్పుకు ముందుకు వచ్చాడన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా జగన్ పని చేస్తున్నాడని ఆరోపించారు. అమరావతి రాజధానిని నాశనం చేసిన జగన్ అధికారంలోకి వస్తే విశాఖ నుంచి పాలిస్తానని ప్రకటించడం దారుణమన్నారు. ప్రజలు ఈ అంశాలను పరిగణంలోకి తీసుకొని ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే అమరావతి నిర్మాణం పూర్తవుతుందని, ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. చంద్రబాబు వంటి మేధావి పాలన ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా మ్యానిఫేస్టో విడుదల చేసిన కూటమి నేతలకు ఆయన అభినందనలు తెలిపారు. పోతుల బాలకోటయ్య, యలగాని నూకానమ్మలు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి మ్యానిఫేస్టోలో మంచి ప్రాధాన్యత దక్కిందన్నారు.

గుడివాడను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

» ఎన్నికల ప్రచారంలో వల్లభనేని బాలశౌరి, వెనిగండ్ల రాము హామీ

గుడివాడ, ఏప్రిల్ 30 : గుడివాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పథంలో నడిపిస్తామని మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ కూటమి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రజలకు హామీ యిచ్చారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి వారు మాట్లాడుతూ, అభివృద్ధి అంటే పట్టని, గిట్టని వైసీపీ నేతలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జగన్, నానిలకు ఓట్లు యావ తప్ప, ప్రజల గోడు పట్టదని, సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నేతలు దింట్యాల రాంబాబు, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో పాల్గొన్న బాలశౌరి, వెనిగండ్ల, రావిలు

వెనిగండ్ల సమక్షంలో టీడీపీలోకి చేరికలు

పలువురు వైసీపీ కార్యకర్తలు వెనిగండ్ల రాము సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కొడాలి నానికి అత్యంత సన్నిహితుడు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యుడు, బీసీ నేత కిలారపు రంగప్రసాద్ వెనిగండ్ల సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. వెనిగండ్ల, బాలశౌరిల సమక్షంలో రైలుపేటకు చెందిన మహిళలు, యువత టీడీపీలో చేరారు. స్థానిక 25వ వార్డుకు చెందిన వడ్డెర కులస్థులు 150మంది టీడీపీలో చేరారు. జనసేన జిల్లా నాయకులు పాలంకి సారధి బాబు, వార్డు ఇన్‌చార్జ్ దారపురెడ్డి శేషు, మైనార్టీ నాయకులు షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు సర్వం సిద్ధం చేయండి

» మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్

వన్‌టౌన్, ఏప్రిల్ 30 : హజ్ యాత్ర విజయవంతానికి కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ అన్నారు. హజ్-2024 యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో సన్నద్ధత సమావేశం మంగళవారం వన్‌టౌన్‌లోని షాదీఖానాలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హజ్ యాత్రకు ఈ ఏడాది కోటా 2,902 మందికి గాను ఇప్పటివరకు 2,580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 720 మంది, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1118 మంది, బెంగుళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 720 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 9 మంది యాత్రకు బయలుదేరనున్నట్టు వివరించారు. హజ్ యాత్రీకులు ఆయా ఎంబార్కేషన్ పాయింట్‌ల నుంచి మే 26 నుంచి జూన్ 9వ తేదీ మధ్య బయలుదేరతారని తెలిపారు. సుమారు 38 నుంచి 42 రోజుల యాత్ర ముగించుకుని జూలై 1 నుంచి 21వ తేదీ లోగా తిరిగి విజయవాడ చేరుకుంటారని తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి యాత్రీకుల ప్రయాణానికి స్పైస్‌జెట్ సేవలు అందించడానికి ముందుకు వచ్చినట్టు తెలిపారు. హజ్ యాత్రీకుల సౌకర్యార్థం గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలోని మదర్సాలో బస ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హజ్ యాత్రికులకు సుమారు 40 రోజుల పర్యటనకు మాత్రమే అనుమతి ఉందని అంతకంటే ఎక్కువ రోజులకు అనుమతి లేదని ఆయన వివరించారు. హ్యాండ్‌బ్యాగ్ లగేజీ కింద 8 కేజీల బ్యాగు, చెక్ ఇన్ లగేజీ కింద 20 కేజీల బరువున్న రెండు బ్యాగులకు అనుమతి ఉందని తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకు తమ శాఖ తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క యాత్రీకునికి సుమారు రూ.4లక్షల వరకు ఫారిన్ ఎక్స్‌చేంజ్ అందిస్తున్నట్టు తెలిపారు. సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ షేక్ హలీం బాషా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి లక్ష్మీకాంతరెడ్డి, హజ్ కమిటీ స్టేట్ సభ్యులు, ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదర్, ఎస్‌బీఐ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.నాగవేణి, డిప్యూటీ జనరల్ మేనేజర్ మనీష్ కుమార్, ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్

కృష్ణలంక, ఏప్రిల్ 30: విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను దోష రహితంగా, సజావుగా నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంలో మంగళవారం ఢిల్లీరావు ఆధ్వర్యంలో సెంట్రల్ నియోజకవర్గ బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల తొలిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ఇప్పటికే నిర్వహించామని, అయితే సెంట్రల్ నియోజకవర్గంలో 20 మంది పోటీలో ఉన్నారని, దీంతో రెండో బ్యాలెట్ యూనిట్ అవసరమైందని ఢిల్లీరావు తెలిపారు. ఒక బ్యాలెట్ యూనిట్‌లో 15 మంది అభ్యర్థులు, ఒక నోటా బటన్‌కు మాత్రమే వీలుంటుం దని తెలిపారు. 321 అదనపు బీయూల కేటాయింపునకు ఈ ప్రక్రియ నిర్వహించినట్లు వివరించారు. సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యాక గొల్లపూడిలోని ఈవీ ఎం, వీవీ ప్యాట్ గోదాము వద్ద బీయూల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షిం చారు. డీఆర్వో వి.శ్రీనివాస రావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న ఢిల్లీరావు

858 సీ-విజిల్ ఫిర్యాదులు పరిష్కారం

కృష్ణలంక: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీ-విజిల్ ద్వారా 863 ఫిర్యాదులు రాగా 858 పరిష్కారమయ్యాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) ద్వారా 2,161 ఫిర్యాదులు రాగా 2,130 పరిష్కారమయ్యాయని ఆయన తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్(1950) ద్వారా 407 ఫిర్యాదులు రాగా 407, ఎన్‌జీఎస్‌పీ ద్వారా 648కి 639, వాట్సాప్ నెంబర్ (91549 70454) ద్వారా వచ్చిన 41కి 41, కాల్‌సెంటర్ (0866-2570051) ద్వారా వచ్చిన 25 ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టం(సీఎంఎస్) ద్వారా వచ్చిన 85 ఫిర్యాదుల్లో 73, సీఈవో మెయిల్స్ ద్వారా 16 ఫిర్యాదులు రాగా 13 పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో మీడియా మానిటరింగ్ ద్వారా 76 అంశాలకు సంబంధించి 74 పరిష్క రించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

కలిసొచ్చే కాలం..



కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో చంద్రబాబును కలిసిన ముద్దరబోయిన

సొంతగూటికి ముద్దరబోయిన

» గన్నవరం, గుడివాడలో పనిచేయాలని అధినేత ఆదేశం

» ముద్దరబోయిన బాధ్యత తనదని స్పష్టం చేసిన చంద్రబాబు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/నూజివీడు): ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీకి కాలం కలిసి వస్తోంది. నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టీడీపీ అధినేత బుజ్జగింపుతో సోమవారం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అనంతరం కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో ఉన్న చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ముద్దరబోయినను గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో తిరిగి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముద్దరబోయిన బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. నూజివీడు, గన్నవరం, గుడివాడ, మైలవరం, కనిగిరినియోజకవర్గాల్లో ముద్దరబోయిన సేవలను వినియోగించుకోవాలని పార్టీ నిర్ణయించింది.

ముద్దరబోయిన రాకతో ఆ రెండు చోట్ల ఊపు

యాదవ సామాజికవర్గానికి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు బీసీల్లో మంచి పట్టుంది. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో ఉపయోగించుకుంటే బీసీల ఓట్లను సునాయాసంగా టీడీపీ ఖాతాలో వేసుకోవచ్చు. గతంలో ముద్దరబోయిన గన్నవరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది తర్వాత కాంగ్రెస్‌పార్టీలో చేరారు. సుదీర్ఘకాలం బీసీ సంఘాల్లో జిల్లా రాష్ట్రస్థాయి పదవుల్లో పనిచేశారు. 2014లో టీడీపీలో చేరిన ముద్దరబోయినకు 2014, 2019లలో నూజివీడు టీడీపీ టికెట్ ఇచ్చినా ఆయన విజయం సాధించకపోవడంతో, 2024లో కొలుసు పార్థసారధికి నూజివీడు తెలుగుదేశం టిక్కెట్‌ను కేటాయించింది. దీంతో అలిగి ముద్దరబోయిన పార్టీని వీడారు. అయితే ముద్దరబోయినకు బీసీల్లో ఉన్న పట్టు దృష్ట్యా టీడీపీ ఆయన్ను వదులుకునేందుకు ఇష్టపడలేదు.

ఆయన సేవలను వినియోగించుకోవాలనే వ్యూహంతో ఆయనకు నచ్చచెప్పి మళ్లీ పార్టీలోకి తీసుకువచ్చారు. తెలుగుదేశంపార్టీకి అత్యంత కీలకమైన గన్నవరం, గుడివాడ నియోజకవర్గాలతో పాటు మైలవరం, కనిగిరి నియోజకవర్గాల్లో కూడా ఆయన సేవలు వినియోగించుకునే పార్టీ వ్యూహరచన చేస్తోంది.



రావి హరగోపాల్‌నగర్‌లో ఓటర్ల స్లిప్‌ల పంపిణీలో వలంటీర్ కోటిప్రసాద్ (సర్కిల్‌లో)

ఎన్నికల విధుల్లో వలంటీర్!



వలంటీర్‌కు ఇచ్చిన ఓటర్ల స్లిప్‌లు లెక్కిస్తున్న బీఎల్వో

పామర్రు, ఏప్రిల్ 30 : ఎన్నికల విధుల్లో వలంటీర్ల ప్రమేయం ఉండకూడదన్న ఎన్నికల సంఘం ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తున్నారు. ఎన్నికల సంఘం ద్వారా ఓటర్లకు స్లిప్‌ల పంపిణీలో బీఎల్వోకు సహాయకుడిగా అధికార పార్టీకి చెందిన ఓ వలంటీర్ ప్రమేయంపై సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి కె.శ్రీలక్ష్మి బృందం పట్టణంలోని రావిహరగోపాల్‌నగర్‌లో 165 నెంబరు పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి ఓటర్లకు అందించే స్లిప్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బీఎల్వో శావరాజు వలంటీర్ నూదులగంటి కోటిప్రసాద్‌ను స్లిప్‌ల పంపిణీలో భాగస్వామిని చేసినట్టు లిఖితపూర్వకంగా తెలియజేసినట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఎల్వో రాజుతోపాటు వలంటీర్ కోటిప్రసాద్‌ను విధుల నుంచి తప్పించి, చర్యల నిమిత్తం ఎన్నికల అధికారికి సిఫార్సు చేసినట్టు ఎంపీడీవో ఎం.భారతి, శ్రీలక్ష్మిలు వెల్లడించారు. తనిఖీ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ

వన్‌టౌన్, ఏప్రిల్ 30: ఎన్టీఆర్ జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్లు బుధవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభిస్తారని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం రేషన్‌బియ్యం, పంచదార, గోధుమపిండి నిర్దేశిత ధరలతో కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేసేలా ఆదేశించామని ఆయన పేర్కొన్నారు. విటమిన్ బీ12, ఐరన్ కలిపిన పోషకవిలువలతో కూడిన బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని తెలిపారు. పోషక విలువలున్న ఫోర్టిఫైడ్ బియ్యం, పంచదార, గోధుమ పిండిని జిల్లాలోని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గోధుమపిండిని కేజీ 16 రూపాయలకు ఇస్తారని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యాన్ని అనధికారికంగా కొనుగోలు, అమ్మకాలు చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారని ఆయన హెచ్చరించారు. నిత్యావసర సరుకుల పంపిణీలో ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.70

నిరుద్యోగ యువతకు జనశిక్షణా సంస్థాన్ శిక్షణ కార్యక్రమాలు

మొగల్రాజపురం, ఏప్రిల్ 30: జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కొరకు జన శిక్షణా సంస్థాన్ చైర్మన్ విద్యాఖన్నా ఆధ్వర్యంలో మేలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్స్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజిరేషన్, ఐస్‌క్రీం మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారీ, బాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్ తదితర వాటిలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావి చెట్టు సెంటర్‌లో ఉన్న కార్యాలయంలో కాని, ఫోన్ 0866-2470420లో కాని సంప్రదించవచ్చని తెలిపారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న వైసీపీ

● సీపీఎం సెంట్రల్ అభ్యర్థి సీహెచ్ బాబూరావు



ఎన్నికల ప్రచారంలో బాబూరావు

పాయకాపురం, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో కార్మిక హక్కులను కాలరాస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని సీపీఎం సెంట్రల్ అభ్యరి సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో కండ్రిక కాలనీ, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, శాంతినగర్, వాంబేకాలనీ, తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబూరావు ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు.

సూపర్ సిక్స్‌తో పేదల జీవితాల్లో వెలుగులు

కేశినేని శ్రీదేవి

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 30 : జగన్‌రెడ్డి మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, అసలు ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరని, కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే సూపర్‌సిక్స్ పథకాలతో పేదల జీవితాలు వెలుగులు నిండుతాయని కేశినేని శ్రీదేవి అన్నారు. స్థానిక 34వ డివిజన్, కేదారేశ్వరపేటలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి విజయాన్ని కోరుతూ కేశినేని శివనాథ్ సోదరి కేశినేని శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంలో ఆమె మాట్లాడుతూ కూటమి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళల సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. మహిళా నాయకురాలు షేక్ ఆషా, చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

● భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాల పంపిణీ



గవర్నర్‌పేట, ఏప్రిల్ 30: జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో గవర్నర్‌పేట, సూర్యారావుపేట ప్రాంతాల్లో టీడీపీ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బొండా రవితేజ పాల్గొని రామమందిరం వీధి, వెంకటేశ్వరరావు వీధి ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. జనసేన, బీజేపీ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కేబీఎన్‌లో స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సులు

వన్‌టౌన్, ఏప్రిల్ 30: కాకరపర్తి భావనారాయణ కళాశాలలో కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సులను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం వేసవి సెలవులను పురస్కరించుకుని తక్కువ ఫీజుతో ఈ కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, టాలీప్రైమ్ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. రెండు నెలల కాలపరిమితితో ఈ కోర్సులను అందిస్తున్నామన్నారు. రోజు ఒక గంట తరగతి బోధనతో పాటుగా మరో గంట ల్యాబ్ సదుపాయాన్ని అందిస్తామని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్ 9849517440కు సంప్రదించాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

● కేశినేని వెంకట్



కేశినేని వెంకట్‌కు హారతి ఇస్తున్న మహిళ

వన్‌టౌన్, ఏప్రిల్ 30: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ అన్నారు. మంగళవారం ఆయన 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావుతో కలిసి ఆ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. ఎన్నికలలో ఎన్‌డీఏ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వెంకట్ మాట్లాడుతూ యువతను జగన్మోహనరెడ్డి మోసం చేశారని తెలిపారు. కేశినేని చిన్ని, సుజనా చౌదరిలను గెలిపించాలని కోరారు. డివిజన్ నాయకులు ఈగల సాంబ, హరిబాబు, కనకారావు, బాబురావు, నూకరాజు, జి.వెంకటేశ్వరరావు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో కూటమి నాయకుల ప్రచారం



విద్యాధరపురం, ఏప్రిల్ 30: విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), కూటమి బలపరచిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిలను గెలిపించాలని మంగళవారం పశ్చిమ వాణిజ్య విభాగం కార్యదర్శి నెలకుర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో 42వ డివిజన్ పరిధి భవానీ టవర్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి పథకాలను వివరించారు. ఎన్నికలలో ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్‌డీఏ నాయకులు పి.వెంకట్, ఎం.రమేష్ చౌదరి, పి.మల్లిఖార్జునరావు, కె.మాల్యాద్రి, ఎన్.శ్రీనివాసరావు, మహేష్, బోయపాటి శ్రీనివాస్, అన్నబత్తిన శ్రీనివాస్, పోతుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వంటమాస్టర్ మృతి

పాయకాపురం, ఏప్రిల్ 30 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై నున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతానికి చెందిన మావిడాల ప్రవీణ్ లెనిన్ సెంటర్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్న ప్రవీణ్‌ను తోటి సిబ్బంది ప్రకాష్‌నగర్‌లోని గీతా నర్సింగ్ హోమ్‌కు తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రవీణ్ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న నున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

లబ్బీపేట, ఏప్రిల్ 30: విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవి టెలిఫోన్ ఎక్చేంజ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీసీపీడీఈఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. పకీరుగూడెం, ప్రగతినగర్, శ్రీరాం నగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్ బెంజిసర్కిల్ ప్రాంతం, మైత్రీయ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి



కుమ్మరిపాలెం కౌస్తుబా నివాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సుజనా చౌదరి

వన్‌టౌన్, ఏప్రిల్ 30: అమరావతిని ఉక్కుపాదంతో అణచివేసి రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన వైసీపీ అరాచక పాలనకు ప్రజలందరూ చరమగీతం పాడాలని పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం 37వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పిళ్లా సుదర్శన్, టీడీపీ డివిజన్ మహిళా అధ్యక్షురాలు మెండి జ్యోతి, బీజేపీ మండల అధ్యక్షుడు నాళం ఠాకూర్‌లతో కలిసి వన్‌టౌన్ జెండా చెట్టు, గాంధీ బొమ్మ, అప్పారావు వీధి, సామారంగం చౌక్, రమణయ్య కూల్ డ్రింక్ షాప్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అమరావతి రాజధాని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ జేఏసీ నాయకులు, అమరావతి మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ఏపీ ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. అమరావతిని అంగుళం కూడా కదలనివ్వమని ఏపీ రాజధానిగా అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు. సుజనాకు మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, డివిజన్ కన్వీనర్ పొట్టి శ్రీహరి, మాజీ బీజేపీ కార్పొరేటర్ ఉత్తమ్ చంద్ భండారి, జనసేన డివిజన్ అధ్యక్షుడు గన్ను శంకర్, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● భవానీపురం బీజేపీ ఎన్నికల కార్యాలయంలో మంగళవారం సుజనా సమక్షంలో పెద్ద ఎత్తున ముస్లింలు బీజేపీలో చేరారు. 54, 56 డివిజన్ల నుంచి గుడిశె బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, మైనార్టీమోర్చా అధ్యక్షుడు బాజీ పాల్గొన్నారు.

దేశంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు

విద్యాధరపురం: దేశంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఏర్పడతాయని కూటమి బలపరచిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కుమ్మరిపాలెం కౌస్తుబా నివాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ హరీష్ భండారి, వైస్ ప్రెసిడెంట్ అప్పన సాయిబాబు, సెక్రటరీ కిరిట్ జైన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఏర్పాటవుతాయని, దీని ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు మరింతగా కొనసాగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పచ్చిపులుసు వెంకట శివప్రసాద్, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, పీయూష్ దేశాయ్, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ జైన్, రాజు సోలంకి పాల్గొన్నారు.

12 రోజుల్లో జగన్ ప్రభుత్వం దిగిపోవడం ఖాయం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



18వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో గద్దె రామ్మోహన్



గద్దె రాజేష్, క్రాంతి కుమార్‌ల ప్రచారం

రాణిగారితోట, ఏప్రిల్ 30: జగన్ దోషి అని సొంత కుటుంబసభ్యులే చెబుతున్నారని, చెల్లి షర్మిల అడిగే ప్రశ్నలకు జగన్ దగ్గర సమాధానాలు లేవని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాణిగారితోట 17,18 డివిజన్లలో ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌తో కలిసి గద్దె రామ్మోహన్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో మురాకక్షలు, హత్యా రాజకీయాలేనని జగన్ సొంత చెల్లెలు షర్మిల ఆమె భర్త అనిల్ చెబుతున్నారని, జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్న అధికారంలోకి రావాలని పాదయాత్ర చేసిన చెల్లి జగన్ పాలన గురించి ఇప్పుడు చెబుతున్నారని అన్నారు. మరో 12 రోజుల్లో జగన్ ప్రభుత్వం దిగిపోవడం ఖాయమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతి, అక్రమాలు చేసిన వారికి శిక్ష తప్పదని అన్నారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సంక్షేమం అంటేనే టీడీపీ అని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి కుటుంబానికి ఎంతోమేలు జరుగుతుందని అన్నారు. మే 13 న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి తనను, గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు పోతంశెట్టి నాగేశ్వరరావు, వేముల దుర్గారావు, రాయిరంగమ్మ, కొక్కెర తిరుప తయ్య, వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, పీరుబాబు, ఆదిబాబు పాల్గొన్నారు.

లబ్బీపేట: 19వ డివిజన్ లబ్బీపేట, పున్నమ్మతోట ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి మంగళవారం సాయంత్రం గద్దె రాజేష్, గద్దె క్రాంతి కుమార్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి గద్దె రామ్మోహన్‌ను, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని అన్నారు.

ఏపీకి పూర్వ వైభవం చంద్రబాబుతోనే సాధ్యం

గుణదల: ఏపీకి పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిందేనని టీడీపీ యువనాయకుడు గద్దె రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్దె రాజేష్ మంగళవారం స్థానిక 5వ డివిజన్లోని ఫిలింనగర్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గద్దె, కేశినేని చిన్నిలను గెలిపించాలని కోరారు. నందిపాటి దేవానంద్, అల్లిబిల్లి రామకృష్ణ, జాస్తి సతీష్, కోడూరు సుబ్రహ్మణ్యం, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్వీర్యం చేసిన జగన్

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



7వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ

మొగల్రాజపురం, ఏప్రిల్ 30: మాట్లాడితే నా ఎస్సీలు, నా ఎస్టీలు అని చెప్పే జగన్ ఎస్సీ ఎస్టీ నిధులను దారి మళ్లించాడని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ విమర్శించారు. మంగళవారం 7వ డివిజన్ శిఖామణి సెంటర్ ఏరియాలో గద్దె అనురాధ ప్రచారం నిర్వహించారు. బీజేపీ, జనసేన బలపరచిన పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌కు సైకిల్ గుర్తుమీద ఓటేసి గెలిపించాల కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తు మీద రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గుమ్మడి గురు ప్రసాద్, పటమట సతీష చంద్ర, మాజీ కార్పొరేటర్ దోమకొండ జ్యోతి రత్నాకర్, సంజయ్ వర్మ, కొండపల్లి లక్ష్మణరావు, దోమకొండ అశోక్, శిరీషా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్ల పంపిణీ

గుణదల: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లబ్దిదారులకు టిడ్కో ఇళ్లను పంపిణీ చేయనున్నట్లు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గుణదల పాత పంచాయతీ కార్యాలయం ఏరియాలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వరుసగా మూడో సారి గద్దె రామ్మోహన్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించుకునేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, యలమంచలి పండు, ఈశ్వర్ పేరేపి, పూలదాసు మారుతి మోహన్, యలమంచలి రాజా, తాడి విజయ్‌కుమార్, శ్రీను నాయుడు, గద్దె రమేష్, బండి కోమలి తదితరులు పాల్గొన్నారు.

పెత్తందారులను తరిమి కొట్టండి

● రోడ్ షోలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

భవానీపురం, ఏప్రిల్ 30 : దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించేలా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలకు పెత్తందారులను ఓడించి తరిమికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, సీపీఎంలు బలపర్చిన పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి వల్లూరి భార్గవ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నగరంలోని కుమ్మరిపాలెం సెంటర్ నుంచి నాలుగు స్తంభాలు, చెరువు సెంటర్ మీదుగా రోడ్‌షో నిర్వహించారు. సితార వద్ద ఈ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరు ప్రఖ్యాతలున్న విజయవాడ పశ్చిమలో కోటేశ్వరరావు విజయం సాధిస్తే అది ప్రజా విజయమే అవుతుందన్నారు. బీజేపీ అభ్యర్థి సుజనా ఇక్కడ గెలిచినా ఉండరని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో చేసిన పనులు చెప్పుకోవడానికి ఏమీ లేవన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఇతర నేతలు కాంగ్రెస్ నాయకులు , సీపీఎం నాయకులు బోయి సత్తిబాబులు పాల్గొన్నారు. ఎర్రబెల్లూన్ల చేతబట్టిన మహిళా కార్యకర్తలు ఎరుపు రంగు చీరలతో ర్యాలీలో ఆకర్షణీయంగా ముందుకు సాగారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి : కేశినేని స్నిగ్ధ



సత్యనారాయణపురం, ఏప్రిల్ 30: జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని విజయవాడ టీడీపీ ఎంపి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) కుమార్తె కేశినేని స్నిగ్ధ పిలుపు నిచ్చారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలో మంగళవారం బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనందసూర్య, కేశినేని శివనాథ్ సోదరుడు కేశినేని హరితో కలిసి పర్యటించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. 33వ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్, డివిజన్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఆర్‌బీఎస్ రాష్ట్రఅధ్యక్షురాలు విజయలక్ష్మి, నందిగామ బ్రాహ్మణ సంఘం అధ్యక్షురాలు కల్పన, ఉపాధ్యక్షురాలు మంచికంటి ధనలక్ష్మి, నిర్మల చౌదరి, తంగిరాల లక్ష్మి, రామలక్ష్మి, అరుణ, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్య నిషేధం చేయాలంటూ దీక్ష

భవానీపురం, ఏప్రిల్ 30 : ఎన్నికల్లో పోలింగ్ శాతం మెరుగుపడాలంటే మే నెల నుంచే మద్యనిషేధం అమలు చేస్తే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవచ్చునని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఆర్.గాంధీనాగరాజన్ అన్నారు. ఊర్మిళానగర్ ట్రస్ట్ కార్యాలయంలో ప్రతీ నెల 30న చేపట్టే దీక్షలో భాగంగా మద్యం నిషేధం యుద్ధప్రాతిపదికన చేపట్టాలంటూ ఒక రోజు దీక్షను మంగళవారం ఆయన నిర్వహించారు. ఆర్. శివరంజని, బంగారు భారతి పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 30 : అజిత్‌సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో టీడీపీ నేతలు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



30వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కేశినేని జానకీ లక్ష్మి

జగన్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి

● కేశినేని జానకీ లక్ష్మి

సత్యనారాయణపురం, ఏప్రిల్ 30: అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్మోహనరెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పాలని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి పిలుపు నిచ్చారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో మంగళవారం బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాతతో కలిసి ఆమె పర్యటించారు. ఆమె ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కేపీ టవర్స్‌లో లోటస్‌ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానకీ లక్ష్మి మాట్లాడుతూ రామరాజ్యం తిరిగి రావాలన్నా, ప్రజారంజక పాలన సాగాలన్నా తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యం అన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, డివిజన్ అధ్యక్షుడు సూర్యనారాయణ, గొట్టుముక్కల శేషం రాజు, లక్కంరాజు శ్రీనివాసరాజు, గరిమెళ్ల నాగమణి, వీరుబాబు, సతీష్, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE

» బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999

AJB-182130

PLOT FOR SALE

» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ.గ. 1,900/- నుండి 18,500/- సంప్ర : 9390665999

AJB-7

TO - LET

» విజయవాడ, ఏలూరు రోడ్డు, విజయ టాకీస్ దగ్గరలో 500sft (12 x 41) గొడౌన్‌కు, కమర్షియల్‌కు అద్దెకు ఇవ్వబడును. సంప్ర : సెల్ : 93953 79396

AJB-182087

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

GST 5% | REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT

రూ॥ 290/- కలర్ 30% EXTRA

1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
& 99854 11868, 99854 85777, 99854 11733, 99854 09286, 99854 09587

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
& సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

పామర్రు నియోజకవర్గ విజేతలు వీరే..				
2009	డివైదాస్	కాంగ్రెస్	ఉప్పులేటి కల్పన	టీడీపీ
2014	ఉప్పులేటి కల్పన	వైసీపీ	వర్లరామయ్య	టీడీపీ
2019	కైలే అనిల్‌కుమార్	వైసీపీ	ఉప్పులేటి కల్పన	టీడీపీ
గతంలో ఈ పామర్రు మండలం నిడుమోలు నియోజకవర్గంలో ఉండేది.				
1962	గుంటూరు బాపనయ్య	సీపీఐ	కనుమూరి సోమేశ్వరరావు	కాంగ్రెస్
1967	కనుమూరి సోమేశ్వరరావు	కాంగ్రెస్	గుంటూరు బాపనయ్య	సీపీఐ
1978	గుంటూరు బాపనయ్య	సీపీఐ	కలపాల నాంచారయ్య	కాంగ్రెస్
1979(ఉ.ఎ)	గుంటూరు ధనసూర్యవతి	సీపీఐ	డీఎం రంగారావు	స్వతంత్ర
1983	గోవాడ మల్లిఖార్జునరావు	టీడీపీ	కోనేరు రంగారావు	కాంగ్రెస్
1985	పాటూరు రామయ్య	సీపీఎం	మునిపల్లి వినయబాబు	కాంగ్రెస్
1989	పాటూరు రామయ్య	సీపీఎం	మునిపల్లి వినయబాబు	స్వతంత్ర
1994	పాటూరు రామయ్య	సీపీఎం	మునిపల్లి వినయబాబు	స్వతంత్ర
1999	గోవాడ మలియకుమారి	టీడీపీ	పెనుమత్స జయరాజు	కాంగ్రెస్
2004	పాటూరు రామయ్య	సీపీఎం	ఉప్పులేటి కల్పన	టీడీపీ



సైకిల్ ఎత్తా.. విజేతగా నిలుస్తా..

- విజయవాడలో గద్దె రామ్మోహన్ వినూత్న ప్రచారం
- గుడివాడలో నుదిటిపై బ్యాండేజీతో వెనిగండ్ల, రావి

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు వినూత్న ప్రచారానికి సిద్ధమవుతున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కార్యకర్తల జయజయధ్వానాల మధ్య తెలుగుదేశం పార్టీ ఎన్నికల గుర్తు అయిన సైకిల్‌ను ఒంటి చెత్తో పైకెత్తి మన ఎన్నికల గుర్తు సైకిల్ అంటూ ఓట్లు అభ్యర్థించారు. మరోవైపు గుడివాడ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెనిగండ్ల రాము సైతం తన ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నారు. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడిలో ప్రచారం చేస్తున్నారు. ఇటీవల సీఎం జగన్ తనపై జరిగిన గులకరాయి దాడిని హైలెట్ చేస్తూ చాలా రోజులు బ్యాండేజీతో ప్రచారం చేశారు. ఈ దాడి అంతా వైసీపీ ఎన్నికల స్టంట్ అంటూ సీఎం చర్యలను ఎత్తిచూపుతూ, ఎద్దేవా చేస్తూ వెనిగండ్ల, రావి తమ నుదిటిపై బ్యాండేజీలు అంటించుకుని వినూత్నంగా ప్రచారం చేశారు. అంతేకాక వారితో పాటు పాల్గొన్న నేతలు, కార్యకర్తలు సైతం నుదిటిపై బ్యాండేజీలతో ప్రచారం చేశారు. మార్గ మధ్యంలో అలసిపోయి షోడా తాగుతూ అక్కడ కూడా కార్యకర్తలను ఉత్సాహ పరుస్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తూ ముందుకు సాగిపోతున్నారు. - విజయవాడ/గుడ్లవల్లేరు.







తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు స్వగ్రామం పామర్రు నియోజకవర్గంలో ఉండటంతో ఇక్కడ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతిష్టాత్మకంగానే జరుగుతుంటాయి. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ ఒకసారి మాత్రమే గెలుపొందగా వైసీపీ మాత్రం రెండుసార్లు గెలుపొందింది. ఇక్కడి నుంచి గెలుపొందేవారు మాత్రం స్థానికులు కాదు. పైగా వారు ఎన్నిసార్లు పోటీ చేసినా ఒక్కసారి మాత్రమే ఇక్కడి ప్రజలు గెలిపిస్తూ వచ్చారు. గతంలో పామర్రు మండలం గుడివాడ, నిడుమోలు నియోజవర్గాలతో కలిసి ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నిడుమోలు, ఉయ్యూరు నియోజకవర్గాల్లోని మొవ్వ, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాలతోపాటు గుడివాడలోని పెదపారుపూడి మండలాన్ని కూడా కలుపుకుని ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా పురుడు పోసుకుంది. - మచిలీపట్నం/పామర్రు

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ పుట్టిన ప్రాంతం



పామర్రులో పాగా వేసేదెవరో..?

నియోజకవర్గం ఎమ్మెల్యేగా వలసదారులకే పట్టం | **ఇప్పటికి మూడు పర్యాయాలు ఎన్నికలు** | **విభిన్నమైన తీర్పునిస్తున్న ఓటర్లు**

2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఆ పార్టీ సీనియర్ నేత, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కుమారుడు వర్ల కుమార్ రాజా తొలిసారి ఎన్నికల బరిలో నిలిచారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన ఆయన చేసిన పోరాటాలు టీడీపీ అధినేత గుర్తించి కుమార్‌రాజాకు టీడీపీ టికెట్‌ను కేటాయించారు. పల్లె నిద్ర పేరుతో అన్ని గ్రామాల్లోనూ ఆయన పర్యటించడంతో ఎక్కడ లేని మైలేజీ వచ్చింది. అంతేకాక జనసైనికులతోనూ సఖ్యతగా మెలగడం కలిసివచ్చే అంశం. ఐదేళ్లుగా వైసీపీ ఎమ్మెల్యే చేసిన అవినీతి అక్రమాలు తన గెలుపునకు బాటలు వేస్తాయనే నమ్మకంతో ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మరోసారి వైసీపీ తరుపున ఎన్నికల బరిలో నిల్చున్నారు. ఆయన శైలే వేరు. చెప్పేదొకటి, చేసేదొకటి. కృష్ణానది తీరాన ఉన్న పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల వెంబడి ఉన్న ఇసుకను పెద్ద ఎత్తున తవ్వి, తరలించి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారని, పేదలకు ఇళ్లస్థలాల పేరుతో తక్కువ ధరకు భూమిని కొని రెండింతల అధిక ధరకు ప్రభుత్వానికి విక్రయించారనే ఆరోపణలున్నాయి. ఈ అంశం హైకోర్టులో ఉండటంతో ఇళ్లస్థలాల పంపిణీ నిలిచిపోయింది. అభివృద్ధిని పక్కనపెట్టి తన అనుచరుల ద్వారా ప్రతిపనికీ రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడ్డారని విమర్శలు వచ్చాయి. అధికారులతో అడ్డగోలుగా పనులు చేయించుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయకపోతే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఇబ్బందుల పెడతారనే అపప్రదను మూటగట్టుకున్నారు. మహిళా అధికారులతో అసభ్యంగా మాట్లాడటం, నచ్చని అధికారులను బదిలీ చేయించడం ఈయన నైజం, పదవీ విరమణ చేసిన ఒక జిల్లా న్యాయమూర్తికి చెందిన భూవిని వైసీపీకి అనుకూలురు రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఆక్రమిస్తే సదరు ఎమ్మెల్యే ఆక్రమణదారులకే కొమ్ముకాయడం గమనార్హం. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే డీవై దాసు మరోసారి పోటీ చేస్తున్నారు. గతంలో తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



డీవై దాసు



ఉప్పులేటి కల్పన

ఇదీ నియోజకవర్గ చరిత్ర

పామర్రు నియోజకవర్గం (ఎస్సీ)లో 1,83,158 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుష ఓటర్లు, 88,815 మహిళా ఓటరు 94,340, ఇతర ఓటర్లు ముగ్గురున్నారు. ఈ నియోజకవర్గం 592.38 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 43,818 హెక్టార్ల భూమి ఉంది. లంక, నదీతీరం వెంబడి గ్రామాల్లో వరితోపాటు చెరకు, ఇతర వాణిజ్య పంటలు అధికంగా సాగవుతుంటాయి. ఇక్కడ తొలి శాసనసభ్యుడిగా దివిసీమకు చెందిన దోవారి ఏసుదాస్ (డీవైదాస్) కాంగ్రెస్ నుంచి అప్పటి టీడీపీ అభ్యర్థి ఉప్పులేటి కల్పనపై 10వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వర్ల రామయ్యపై 942 ఓట్ల ఆధిక్యతతో ఉప్పులేటి కల్పన వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2017లో ఆమె తిరిగి టీడీపీలోకి చేరారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఉప్పులేటి కల్పనపై గన్నవరం నియోజకవర్గానికి చెందిన వలసదారుడు కైలే అనిల్ కుమార్ 30వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిపొందారు. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఓటర్లు వలసదారులకే పట్టం కడుతూ వస్తున్నారు. అదికూడా ఒక్కసారి మాత్రమే కావడం గమనార్హం.



ఎందరో మహానుభావులు..

సినిమారంగంలో రాణించి శ్రీకృష్ణుడు, రాముడంటే ఇలాగే ఉంటారేమోనని భావించేలా చేసి, కాంగ్రెస్‌పార్టీకి తిరుగులేని రోజుల్లో తెలుగుదేశం పార్టీని స్థాపించి ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చివేసి ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవానికి నూతన అరత్థం చెప్పిన నందమూరి తారకరామారావు సొంత ఊరు నిమ్మకూరు పామర్రు నియోజకవర్గంలోనే ఉంది. భారత జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన కాకి మాధవరావు, రంగస్థల కళాకారులులైన రాళ్లబండి కామేశ్వరరావు, సాక్షి రంగారావు, తమ్మారెడ్డి చలపతిరావు, చంద్రమోహన్, సినీ నిర్మాతలు భీమవరపు బుచ్చిరెడ్డి, ఉప్పలపాటి సూర్యనారాయణ, చలసాని గోపి ఈప్రాంతం వారే. స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరిలూదిన ఆంధ్రపత్రిక సంపాదకుడు దేశోద్ధార కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుతోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ జాస్తి చలమేశ్వరరావు, జిల్లా జడ్జి పనిచేసిన తమ్మా కోటమ్మరెడ్డి లంటి వారి పురిటి గడ్డ కూడా ఇదే కావడం విశేషం. తెలుగువారి సంస్కృతీ, సంప్రదాయాలను, ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన కూచిపూడి నాట్యం ఇక్కడే పురుడు పోసుకుంది.

అభివృద్ధికి ఆమడదూరం

పదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్య. ముఖ్యంగా పామర్రు పట్టణాభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. పెదపారుపూడి, గుడివాడలోని కొన్ని ప్రాంతాలకు. కృష్ణానదీ నుంచి తాగు నీటిని అందించేందుకు రూపొందించిన మంచినీటి పథకం పనులు నిలిచిపోయాయి. తోట్లవల్లూరు మండలంలో పాముల్లంక వంతెన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం పక్కనపెట్టింది. నియోజకవర్గ కేంద్రంలో ఇండోర్‌స్టేడియం పనులు నిలిచిపోయాయి. మండలాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరగనేలేదు. ఇక్కడ ఎక్కువ శాతం వ్యవసాయంపైనే రైతులు ఆధారపడి ఉన్నారు. వారికవసరమైన ఇబ్బందులు తొలగించడంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. కాల్వల మరమ్మతులు లేక వర్షాకాలంలో ముంపునకు గురై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు సక్రమంగా అందక సీహెచ్‌సీ ఆధునీకరణ నిలిచిపోయి వైద్యారోగ్య సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం ఒక ఐటీ హబ్, విద్యార్థుల కోసం ఇంజినీరింగ్ కళాశాల, మహిళలకు స్వయం సంవృద్ధి కేంద్రాల ఏర్పాటు వంటివి ఈ నియోజకవర్గానికి రావాల్సి ఉంది.



ఓటు విలువ తెలుసుకో..

'ఓటు మన హక్కు- ఓటువేద్దాం మే 13- 69 తిరువూరు' ఆకారంలో కూర్చొని ఎన్నికల సిబ్బంది నిర్వహించిన ప్రదర్శన జిల్లాలో చర్చనీయాంశం అయింది. ఓటు విలువను తెలిపేందుకు ఇటువంటి వినూత్న పద్ధతిని ఎంచుకోవడంపై స్థానికులు ఎన్నికల సిబ్బందిని అభినందిస్తున్నారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాలకు చెందిన ఎన్నికల సిబ్బందికి స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో ఆర్డీఓ కె.మాధవి నిర్వహించిన ఓటర్ల అవగాహన సదస్సులో పాల్గొన్న అనంతరం ఈ ప్రదర్శన నిర్వహించారు. - తిరువూరు.

బలహీన వర్గాలకు 'పెద్ద'సింగు

- క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లక్ష్మణరావు
- మచిలీపట్నం నుంచి 3సార్లు ఎమ్మెల్యే
- ఆయన పేరిటే లక్ష్మణరావు పురం ఏర్పాటు



మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గానికి బలహీన వర్గాల నుంచి 3 సార్లు వరసగా ఎన్నికైన శాసనసభ్యుడు పెదసింగు లక్ష్మణరావు. 1922 నవంబరు 14న పెదసింగు వెంకట రంగయ్య మంగతాయారు దంపతులకు మచిలీపట్నంలో జన్మించారు. తండ్రి వెంకట రంగయ్య 1932లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఇలా తండ్రి నుంచి రాజకీయాలు వారసత్వంగా వచ్చాయి. దేశభక్తి కలిగిన లక్ష్మణరావు 1942లో స్వాతంత్రోద్యమంలో పాల్గొని 3 నెలలపాటు జైలుకు వెళ్లారు. అక్కడ కలిసిన టంగుటూరి ప్రకాశం పంతులుకు సన్నిహితులయ్యారు. మత్స్యకారుల్లో ధనవంతుల కుటుంబంలో జన్మించిన లక్ష్మణరావు జైలుకు వెళ్లడం అప్పట్లో బలహీన వర్గాల్లో ఆలోచన రేకెత్తించింది. తండ్రి వెంకటరంగయ్య నౌకా వ్యాపారం చేసేవారు. అలా మచిలీపట్నం ప్రజలకు పరిచయమైన లక్ష్మణరావు 1962లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. తరువాత వరుసగా రెండు సార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు, ఇలా 1967లోను, 1972లోను పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఇలా 1962 నుంచి 1978 వరకు 15 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఆయన మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గానికి సేవలందించారు. బలహీన వర్గాలకు పలు ప్రాంతాల్లో కలెక్టరుతో సిఫార్సు చేసి ఇళ్లస్థలాలు ఇప్పించారు. ఇందుకుగాను వీరి పేరుతో లక్ష్మణరావుపురం ఏర్పాటు చేశారు. లంబాడీలకు, వడ్డెరలకు ఇళ్లస్థలాలిచ్చారు. రిక్షాకార్మిక సంఘానికి అధ్యక్షుడిగా ఉండి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారు. 1956 నుంచి వీరు అగ్నికుల క్షత్రియుల రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల హక్కుల రక్షణ సమితిని నెలకొల్పి మత్స్యకారుల పరిరక్షణకు కృషి చేశారు. వేటకు వెళ్లే మత్స్యకారుల సంక్షేమానికి కృషిచేసిన ఎమ్మెల్యేలలో లక్ష్మణరావు ఆద్యుడుగా మిగిలిపోయారు. అనంతరామన్ కమిషన్ సభ్యుడిగా ఉండి రాష్ట్రమంతా మత్స్యకారుల హక్కుల కోసం పోరాడారు. మత్స్యకారులను బీసీ-ఏగా గుర్తించేందుకు కృషిచేశారు. ఒక దశలో మత్స్యకారులను ఎస్సీల్లో చేర్చాలని పోరాటం కూడా చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీ ఎదుట ధర్నాలు చేశారు. మత్స్యకారుల సొసైటీలు ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేశారు. పేద మత్స్యకారులకు పెద్ద ఎత్తున భూములు పంపిణీ చేశారు. 1996 ఏప్రిల్ 21న లక్ష్మణరావు కన్నుమూశారు. వీరి సేవలకు గుర్తుగా మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో పెదసింగు లక్ష్మణరావు విగ్రహాన్ని నెలకొల్పారు. తరువాత మళ్లీ అగ్నికులక్షత్రియకు చెందిన నడకుదిటి నరసింహారావు, కొల్లు రవీంద్ర శాసన సభకు ఎన్నికై మంత్రి పదవులు చేపట్టారు.



ఆయనెప్పుడూ అంతే..!

- సీటు నాదే అంటారు... చివరకు పోటీలో ఉండరు

అవనిగడ్డ రూరల్: ఎన్నికలు వచ్చినప్పుడల్లా అవనిగడ్డ అసెంబ్లీ టికెట్ తనదేనని ప్రకటిస్తారు తోట శ్యామ్ కిషోర్ నాయుడు. పేద ప్రజలకు, అనారోగ్యంతో బాధపడే వారికి అండగా ఉండే వ్యక్తి. 15 ఏళ్లుగా అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిక్కెట్ తనదేనంటూ ముందే ప్రచారం చేస్తుంటారు. తనకు 60శాతం ఓటింగ్ ఉందని, మిగిలిన వారికి 20, 30 శాతమే ఉంటుందని చెప్పుకుంటుంటారు. ఇంటి చుట్టూ వాస్తును సరిచేసుకోవడం, ఈసారి తన దశ మారిపోతుందని చెప్పుకోవడం, చివరికి ఏ పార్టీ ముందుకొచ్చి టిక్కెట్ ఇవ్వకపోవడం పరిపాటిగా మారుతోంది. ఈ ఎన్నికల్లోనూ అదే జరిగింది. ఇటీవల వరకు అసెంబ్లీ టిక్కెట్ తనదేనని చెప్పిన శ్యామ్ కిషోర్ నాయుడు పేరును ఏ పార్టీ ప్రకటించకపోవడంతో జనం ఆయన్ను జాలిగా చూస్తున్నారు.



గాజుగ్లాసుపై 24 గంటల్లో నిర్ణయం

- ఆ పార్టీ ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం
- హైకోర్టుకు తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘం
- స్వతంత్రులకు గుర్తు కేటాయింపును సవాల్ చేసిన జనసేన

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గాజుగ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ జనసేన పార్టీ దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ స్పందిస్తూ.. జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడిగా పోటీ చేస్తున్నందున గాజుగ్లాసు గుర్తును ఇతరులకు కేటాయించవద్దంటూ జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం ఇచ్చారని తెలిపారు. ఆ వినతిపై నిర్ణయాన్ని ప్రకటిస్తామని, ఆ పార్టీ ఎదుర్కొంటున్న ఇబ్బందులను 24గంటల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ వివరాలను నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ విచారణను నేటికి వాయిదా వేశారు. టీడీపీ వేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను ప్రస్తుత వ్యాజ్యానికి జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. జనసేన పార్టీకి కేటాయించిన గాజుగ్లాసు గుర్తును ఆ పార్టీ పోటీ చేయని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో ఎన్నికల సంఘం స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ టి.శివశంకరరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీలు ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయన్నారు. జనసేన పోటీ చేయని స్థానాల్లో కూటమి అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు. ఆయా స్థానాల్లో గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడం వల్ల కూటమి అభ్యర్థులు నష్టపోతారన్నారు. ఓటర్లు అయోమయానికి గురై కూటమి అభ్యర్థులకు పడాల్సిన జనసేన పార్టీ మద్దతుదారుల ఓట్లు స్వతంత్ర అభ్యర్థులకు పడే ప్రమాదం ఉందన్నారు. ఓ పార్టీ దురుద్దేశపూర్వకంగా స్వతంత్ర అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేయించిందన్నారు. గాజుగ్లాసు గుర్తును కోరాలని వారిని ప్రోత్సహిస్తోందన్నారు. గాజుగ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించవద్దని కోరుతూ జనసేన పార్టీ ఈ ఏడాది ఏప్రిల్ 24న కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం ఇచ్చిందన్నారు. ఇప్పటివరకు ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదన్నారు. మరోవైపు జనసేన పిటిషన్‌లో ఇంప్లీడ్ అవుతూ ఏలూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేశ్‌యాదవ్, అనకాపల్లి బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. వారి తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల సంఘం నిర్ణయం కూటమి అభ్యర్థులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ఆదాయం పెంచి.. పంచుతాం

> పాలన చేతగాని వ్యక్తి రూ.2.70 లక్షల కోట్లకు బటన్ నొక్కారట..! ఒక్క అమరావతిలోనే రూ.3 లక్షల కోట్ల ప్రజల ఆస్తి ఆవిరైపోయింది.. మీరేమీ చేసి ఉండక్కర్లేదు.. ఉన్నది ఉన్నట్లు వదిలిపెట్టి ఉంటే అమరావతిపై రూ.3 లక్షల కోట్లు వచ్చేది. -చంద్రబాబు

- అన్ని వర్గాల సంక్షేమం.. అభివృద్ధిపథంలో రాష్ట్రం..
- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి లక్ష్యమిదే: చంద్రబాబు
- ఉమ్మడి మేనిఫెస్టో విడుదల

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టి.. ఆదాయ పంపిణీ తమ లక్ష్యమని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. చేతగాని పాలకుడి వల్ల రాష్ట్రం సర్వనాశనమైందని.. అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో అన్ని వర్గాలూ నష్టపోయాయని.. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అంకితభావంతో పనిచేసే తమ కూటమికి అవకాశమివ్వాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్ నాథ్ సింగ్‌తో కలిసి 'ఉమ్మడి మేనిఫెస్టో 2024'ను చంద్రబాబు విడుదల చేశారు. అన్ని వర్గాలకూ అండగా ఉండేలా తెలుగుదేశం సూపర్ సిక్స్.. జనసేన షణ్ముఖ వ్యూహం.. బీజేపీ సలహాలతో మేనిఫెస్టో రూపొందించామని తెలిపారు. '1994-95లో జీతాలివ్వలేని పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో ఉండేది.. వ్యవస్థను గాడిన పెట్టాం.. 2004కి మిగులు బడ్జెట్ సాధించాం.. ఆదాయం పెంచే మార్గాలు టీడీపీకి తెలుసు' అని వెల్లడించారు. మేనిఫెస్టో అంశాలపై ఇంకా ఏం చెప్పారంటే..

యువత నిర్వీర్యం..

మేం వచ్చాక 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం.. పరిశ్రమలకు ఊతమిచ్చి ఉపాధి అవకాశాలు పెంచుతాం.. నిరుద్యోగులకు 3వేల భృతి ఇస్తాం.. మెగా డీఎస్సీపైనే తొలి సంతకం పెడతా. ప్రజలపై విద్యుత్ భారం వేయం. చెత్త పన్నులు రద్దు చేస్తాం. ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా. చంద్రన్న బీమా తీసుకొచ్చి సహజ మరణాలకు రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల బీమా భరోసా కల్పిస్తాం. జనరిక్ మెడికల్ షాపులు విరివిగా ఏర్పాటు చేసి పేద రోగులకు మందులు అందుబాటులోకి తెస్తాం. అగ్రవర్ణ పేదలకు పదిశాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేస్తాం. గంజాయి, డ్రగ్స్‌పై వంద రోజుల్లోనే ఉక్కుపాదం మోపుతాం. విషపూరిత మద్యం బ్రాండ్లను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యా సంస్థలకే అందజేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. విదేశీ విద్యను పునరుద్ధరించి ఎక్కువ మందికి అవకాశాలు కల్పిస్తాం. ఐదేళ్లలో బీసీ సబ్ ప్లాన్ కింద 1.50లక్షల కోట్లు ఖర్చుచేసి ఆదరణ కింద ఆధునిక పనిముట్లతో ఆ వర్గాల్లో వెలుగులు నింపుతాం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం. రాష్ట్రంలోని 140 బీసీ కులాల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తాం. యాదవులకు



కూటమి ఎన్నికల ప్రణాళికను చూపిస్తున్న చంద్రబాబు, పవన్, పక్కన బీజేపీ నేత సిద్ధార్థ్‌నాథ్ సింగ్

ఆవులు, కురుబలకు గొర్రెలు, నేతన్నలకు 200నుంచి 500యూనిట్లు ఉచిత విద్యుత్, గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు, నాయీబ్రాహ్మణులకు ప్రోత్సాహకాలు.. ఇలా అన్ని బీసీ కులాలకు అందిస్తాం. మైనారిటీలకు హజ్ యాత్ర కోసం లక్ష అందజేస్తాం. విజయవాడలో హజ్ హౌస్ నిర్మిస్తాం.

మహిళలకు అన్నివిధాలా అండగా..

డ్వాక్రా మహిళలకు పది లక్షల వడ్డీ లేని రుణం అందజేస్తాం. ప్రతి మహిళకు 1,500 చొప్పున నెలనెలా ఇస్తాం. తల్లికి వందనంతోపాటు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. కాపు మహిళలకు స్వయం ఉపాధి, కాపు యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తాం. రాయలసీమలో హార్టికల్చర్‌కు, పరిశ్రమలకు ఊతమిస్తాం. రైతులకు 9గంటలు విద్యుత్ సరఫరా చేస్తాం. డ్రిప్ ఇరిగేషన్‌కు 90శాతం సబ్సిడీ అమలు చేస్తాం. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి తీరతాం. రాష్ట్రంలో ఎవరి ఆస్తులకూ రక్షణ లేదు. పోర్టులు.. పరిశ్రమలు.. క్వారీలు.. మైనింగ్.. భూములు.. సెజ్‌లు.. స్థలాలు ఏదీ వదిలిపెట్టని వైసీపీని వచ్చే ఎన్నికల్లో భూ స్థాపితం చేయాలి. ప్రజల భూములను కబ్జా చేసేందుకు జగన్ తెచ్చుకున్న 'జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు'ను రద్దు చేసి తీరతాం. లాక్కున్న ఆస్తులపై విచారణ చేయిస్తాం. కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు వదిలేసుకుని తమ ప్రాణాలుంటే చాలంటూ ఆరుద్ర వారణాసికి, రంగనాయకమ్మ హైదరాబాద్‌కు వెళ్లిపోయే పరిస్థితి ఎంత దారుణం?

యజమానులుగా ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు

రాష్ట్రంలో ఆటో, ట్యాక్సీ, క్యాబ్, ఇతర వాహనాల డ్రైవర్లను యజమానులుగా చేసే బాధ్యత తీసుకుంటాం. వాహన కొనుగోలుకు రూ.4 లక్షల వరకూ సబ్సిడీ ఇవ్వడంతో పాటు డ్రైవర్లకు ఏటా 15వేలు అందిస్తాం. జరిమానాలు, గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తాం. ఉచిత ఇసుక విధానం తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పని కల్పిస్తాం. పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకొచ్చి నిధులు, సర్పంచులకు గౌరవ వేతనం పెంచుతాం.

బీజేపీ మద్దతుతోనే ఉమ్మడి మేనిఫెస్టో..

ఈ మేనిఫెస్టో టీడీపీ, జనసేన ఉమ్మడిగా తయారు చేసిందే.. టీడీపీ సూపర్ సిక్స్‌కు జనసేన షణ్ముఖ వ్యూహం జతచేసి ఇరు పార్టీలు కసరత్తు చేసిన తర్వాతే విడుదల చేస్తున్నాం.. ఇందులో బీజేపీ ముఖ్యుల సలహాలు కూడా తీసుకున్నాం.. జాతీయ స్థాయిలో మా మేనిఫెస్టో విడుదల చేశామని.. రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఉండబోదని వారు స్పష్టత ఇచ్చారు.. ఉమ్మడి మేనిఫెస్టో అమలుకు కేంద్రం మద్దతు ఉంటుంది. అందులో భాగంగానే బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్ సింగ్ ఇక్కడకు వచ్చారు.

అభివృద్ధి+సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)

హామీలు... యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, మెగా డీఎస్సీ, కులవృత్తులకు అండగా ఉండేలా జీవితాలను మార్చే హామీలు... అమరావతి పునర్నిర్మాణం, ఆర్థిక రాజధానిగా విశాఖ, కర్నూలులో తక్షణం హైకోర్టు ధర్మాసనం వంటి కీలక హామీలు... రాష్ట్ర ఆదాయాన్ని పెంచి, యువతకు ఉపాధి కల్పించేలా భారీ పరిశ్రమల ఏర్పాటు... ఇలా సంపూర్ణ సమాహారంగా మేనిఫెస్టోను రూపొందించడం విశేషం. దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామని ప్రకటించారు. సహజంగా మరణించిన వారికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల చొప్పున బీమా చెల్లిస్తామన్నారు. గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామని... ఆ తర్వాత పక్కా ఇళ్లనూ నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే సామాజిక పింఛను మంజూరు చేస్తామన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిల్ చట్టం, చెత్త పన్ను రద్దు చేస్తామని... ఆస్తిపన్నుపై సమీక్షిస్తామని... విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని తెలిపారు. మళ్లీ ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. 'భోగాపురం' విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెడతామని, అమరావతిలో ఐదు ఎకరాల్లో అల్లూరి స్మారక వనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పోలవరం సహా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. దేవాలయాలు, సత్రాల ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ బోర్డు ఏర్పాటు చేస్తామని... వైదిక, ఆగమ శాస్త్ర సంబంధ విషయాల్లో ఆలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కల్పిస్తామని ప్రకటించారు. 'ఐదేళ్లలో ధ్వంసమైన వ్యవస్థలను పునరుద్ధరిస్తాం' అని ఉద్ఘాటించారు.

విధ్వంస పాలనను సాగనంపండి

- కూటమి అభ్యర్థులకు ఓటుతో స్వర్ణాంధ్ర సాధన
- జనసేన షణ్ముఖ వ్యూహం, టీడీపీ సూపర్ సిక్స్ కలిపి మేనిఫెస్టో
- ప్రజల అవసరాలు తీరుస్తాం... రేపటి ఆకాంక్షలను సాకారం చేస్తాం: పవన్ కల్యాణ్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆకాంక్షలకు అనుగుణంగా జనసేన షణ్ముఖ వ్యూహం, టీడీపీ సూపర్ సిక్స్ కలిపి ఈ మేనిఫెస్టో రూపొందించామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో బీజేపీ నేత సిద్ధార్థనాథ్ సింగ్, చంద్రబాబుతో కలసి కూటమి మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'ప్రజల అవసరాలు తీరుస్తూ, రేపటి ఆకాంక్షలను సాకారం చేసే దిశగా ఉమ్మడి మేనిఫెస్టోను కూటమి ప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తుంది. ఏపీ ప్రజల భవిష్యత్తుపై కత్తి వేలాడుతోంది. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన తెలుగు జాతి తన రాష్ట్ర పరిస్థితి చూసి తలదించుకుంటోంది. లూటీ కోసమే రూ.15 లక్షల కోట్ల అప్పులు చేసిన పాలకులు రాష్ట్రాన్ని దివాలా తీయించారు. గత ఐదేళ్లలో అన్ని రంగాల్లో రాష్ట్రం తిరోగమన స్థితిలో పయనిస్తోంది. రాష్ట్రంలో ఎటు చూసినా అభద్రత, అశాంతి, హత్యలు, ఆత్మహత్యలే కనబడుతున్నాయి. ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల భారం.. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తిపైనా రూ.8 లక్షల భారం మోపారు. ఉదయం పథకం కింద రూ.10 ఇస్తూ.. సాయంత్రం సారాయితో రూ.100 కొట్టేశారు. పట్టాదారు పాసు పుస్తకాల మీద జగన్ ఫొటో వేయించుకుని లక్షలాది ఎకరాల ప్రజల ఆస్తుల మీద కన్నేశారు. ఇలాంటి విధ్వంసకర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని గాడిన పెట్టుకునే అవకాశం ఎన్నికల రూపంలో మన ముందుకు వచ్చింది. విధ్వంస పాలనను సాగనంపి స్వర్ణాంధ్ర సాధన కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి' అని పవన్ పిలుపునిచ్చారు.

మేనిఫెస్టోకు బీజేపీ మద్దతు: సిద్ధార్థనాథ్ సింగ్

'మోదీ గ్యారంటీ 2024 పేరుతో దేశమంతా భారతీయ జనతా పార్టీ ఒకే మేనిఫెస్టో ఇప్పటికే విడుదల చేసింది. వివిధ రాష్ట్రాల్లోని మిత్ర పక్షాల మేనిఫెస్టోకు మద్దతు ఇస్తుంది. అందులో భాగంగానే భాగస్వామ్య పార్టీల మేనిఫెస్టో విడుదలకు హాజరయ్యా' అని బీజేపీ రాష్ట్ర సహ ఇంచార్జి సిద్ధార్థనాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉమ్మడి మేనిఫెస్టోపై బీజేపీ నేతల ఫొటో లేదంటూ కూలి మీడియా చేస్తున్న ప్రచారంపై ఆయన స్పందించారు. 'సూపర్ సిక్స్-షణ్ముఖ వ్యూహం మేనిఫెస్టో బాధ్యత తమదేనని చంద్రబాబు, పవన్ స్పష్టంచేశారు. ఇక ఇందులో భిన్నంగా చూడాల్సింది ఏముంది?' అన్నారు. అరాచకం తప్ప అభివృద్ధి లేని రాక్షస వైసీపీ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడాలని బీజేపీ నాయకుడు సుధీశ్ రాంబొట్ల విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ అభ్యర్థుల తరఫున ప్రచారానికి ప్రధాని మోదీ సహ బీజేపీ అగ్రనేతలు వచ్చేవారం ఏపీలో పర్యటిస్తారని తెలిపారు. పులివెందులలో రైతులు సీఎం భార్యను అడిగిన వాటికి సమాధానం చెప్పలేక కేంద్ర చట్టమంటూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అభాండాలు వేయడం తగదని బీజేపీ నాయకుడు లంకా దినకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రైతుల భూ పత్రాలపై జగన్ ఫొటో వేసుకోమని కేంద్రం చెప్పిందా? సర్వే రాళ్లపై ముఖ్యమంత్రి ఫొటో వేయించుకోమని కేంద్ర చట్టంలో ఉందా? అన్నీ తెలిసి అబద్ధాలు చెప్పడం రాష్ట్ర మంత్రికి తగదు' అని దినకర్ హితవు పలికారు.

175 స్థానాలు... బరిలో 2,387 మంది: మీనా

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 25 పార్లమెంటు స్థానాలకు 454 మంది అభ్యర్థులు, 175 అసెంబ్లీ(ఏసీ) స్థానాలకు 2,387 మంది అభ్యర్థులు మే 13న జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఎన్నికల్లో అత్యంత కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసిందని పెద్దఎత్తున అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని వివరించారు. పార్లమెంటరీ నియోజకవర్గాల్లో(పీసీ) 503 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వారిలో 49 మంది ఉపసంహరించుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,705 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, 318 మంది ఉపసంహరించుకున్నారు. విశాఖ పార్లమెంటు స్థానానికి గరిష్ఠంగా 33 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. అత్యల్పంగా రాజమండ్రి పార్లమెంటు స్థానానికి 12మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.



దుర్మార్గ వైసీపీకి ఓటేయాలా?

- రెడ్డి సంఘ పెద్దలను నిలదీసిన జనసేన రెడ్డి యూత్

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), ఏప్రిల్ 30: రెడ్డి కులస్థులంతా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఓటు వేయాలని రెడ్డి సంఘానికి చెందిన కొంతమంది, ముఖ్యంగా వేమన మందిరానికి చెందిన సభ్యులు హుకుం జారీచేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జనసేన పార్టీ రెడ్డి యూత్ ప్రతినిధి మద్ది రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్డి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఇతర పెద్దలు రెడ్లకు మంచి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి కానీ దుర్మార్గమైన పాలన సాగిస్తున్న వైసీపీకి మద్దతు పలకాలంటూ చెప్పడం మంచిది కాదని, వైసీపీ కోసమే రెడ్డి కులం పుట్టిందా? అని ప్రశ్నించారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడానికి రెడ్లుగా తాము పూర్తిస్థాయిలో కష్టపడినా, తమకు ఎలాంటి గుర్తింపూ లభించలేదన్నారు. వైసీపీలో రెడ్లకు ఒరిగిందేమీ లేదన్నారు. ఓటు విషయంలో ఎవరూ జోక్యం చేసుకోకూడదని, అలాకాదని వైసీపీకే ఓటు వేయాలని బెదిరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

మంత్రికి హారతిచ్చి.. మహిళ మృతి

- పట్టించుకోకుండా ప్రచారం కొనసాగింపు

పొదలకూరు, ఏప్రిల్ 30: తమ గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రికి ఎంతో ఆప్యాయంగా ఆమె హారతి ఇచ్చారు. ఆ వెంటనే కుప్పకూలి మరణించారు. అయితే, అదేమీ పట్టించుకోకుండా ఆ మంత్రి ప్రచారాన్ని కొనసాగించారు. నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలో మంగళవారం జరిగిందీ దారుణం. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ గ్రామంలో ప్రచారానికి రాగా, కేతు వెంకటరమణమ్మ కర్పూర హారతి ఇచ్చారు. అనంతరం ఇంటి లోపలికి వెళ్లిన రమణమ్మ గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలిసిన మంత్రి కనీసం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మాట్లాడడం కానీ, ప్రచారాన్ని నిలిపివేయడం కానీ చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఆ కుటుంబంలో గ్రామ వలంటీర్ కూడా ఉండటం గమనార్హం.

కూటమి మేనిఫెస్టోతో సర్వతోముఖాభివృద్ధి

- మేడిపండు చందంగా వైసీపీ హామీల పత్రం: బాలకృష్ణ



ఒంగోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కావాల్సిన అంశాలన్నీ కూటమి మేనిఫెస్టోలో కనిపిస్తున్నాయని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కితాబిచ్చారు. వైసీపీ మేనిఫెస్టో మేడిపండు సామెతను గుర్తు చేస్తుందని ఎద్దేవా చేశారు. అవినీతి మంత్రులను నియోజకవర్గాలు మార్చి రంగంలోకి దించారంటూ ఆదిమూలపు సురేశ్, మేరుగ నాగార్జునపై ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం మర్రిపూడిలో ఆ తర్వాత సంతనూతలపాడులో జరిగిన రోడ్‌షోలో మంగళవారం ఆయన మాట్లాడారు.

హైకోర్టు లాయర్ల సంఘం అధ్యక్షుడిగా చిదంబరం



అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కె.చిదంబరం ఎన్నికయ్యారు. చిదంబరానికి మొత్తం 715 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష బరిలో ఉన్న వి.వేణుగోపాలరావుకు 507 ఓట్లు, సి.రఘుకు 501ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా ఎన్.రంగారెడ్డి విజయం సాధించారు. రంగారెడ్డికి 655 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి కేఎం కృష్ణారెడ్డికి 607 ఓట్లు వచ్చాయి. 781 ఓట్లతో ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీహరి గెలుపొందారు. శ్రీహరికి 781 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి టి.సింగయ్యగౌడ్‌కు 438 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శిగా ఉదయ్‌కుమార్ గెలిచారు. గ్రంథాలయ కార్యదర్శిగా కె.రమ్యకృష్ణ, కోశాధికారిగా జంపని శ్రీదేవి గెలిచారు. క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా షేక్ రిజ్వాన్ అలీ గెలుపొందారు. మహిళా ప్రతినిధిగా వేముల బేబీ రాణి ఏకగ్రీవమయ్యారు. కార్యనిర్వహణ సభ్యులు (30 సంవత్సరాలు)గా కె.మోహన్‌రామిరెడ్డి, బాలినేని పరమేశ్వరరావు(ఇరవై సంవత్సరాలు), ఎగ్జిక్యూటివ్ మహిళ సభ్యులు(పది సంవత్సరాలు)గా వరపుల శేషకుమారి ఏకగ్రీవమయ్యారు.






ఆంధ్రజ్యోతి

ప్రజా అజెండా

జన కేతనం

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

బుధవారం ◇ 1-5-2024



కౌంట్ డౌన్ 12 రోజులు

ధరలు ఆకాశాన్నంటాయి



రెక్కల కష్టంతో రిక్షా నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాను. రోజుకు రూ.200 నుంచి రూ.250 వరకూ సంపాదిస్తున్నాను. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా సంక్షేమం రూపంలో పొందలేదు. నా వయసు 60 ఏళ్లు దాటినా ఆధార్ కార్డులో వయసు తక్కువగా చూపడం వల్ల పింఛన్ కూడా పొందలేకపోయాను. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మద్యం ధరలను గత ప్రభుత్వంలో కంటే రెట్టింపు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెబుతున్నారు. ఆ రకంగానైనా పింఛన్ వస్తాదని ఆశిస్తున్నా.

– నొల్ల అప్పారావు, మార్టూరు గ్రామం, అనకాపల్లి మండలం

సాయం కంటే చలానాలే ఎక్కువ



25 ఏళ్ల నుంచి ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నా. ఇంతకుముందు రోజంతా కష్టపడితే డీజిల్ ఖర్చు పోను వెయ్యి మిగిలేది. ఇప్పుడు డీజిల్ ఖర్చు పెరిగిపోవడంతో రూ.600 కూడా మిగలడం లేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర లీటరు ధర ఐదు నుంచి పది రూపాయలు అధికంగా ఉంది. వీటితో పాటు ట్రాఫిక్ చలానాలు, పర్మిట్ చార్జీల పేరుతో బాగా వసూలు చేస్తున్నారు. గత ఏడాది రూ.38 వేలు చెల్లించాను. జగన్ ఇచ్చింది మాత్రం రూ.పది వేలే. జగన్ వచ్చాక మొదటి మూడేళ్లు ప్రత్యేక డ్రైవ్‌లు పెట్టి మరీ చలానాలు వసూలు చేశారు. ఆటో డ్రైవర్లపై కేసులు పెరిగాయి. మమ్మల్ని ఆర్థికంగా కోలుకోనీయకుండా చేశారు. జగన్ వస్తే జీవితాలు మారిపోతాయని భావించాం కానీ, బతుకులు మరింత దారుణంగా తయారయ్యాయి.

– బి.శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్, విశాఖపట్నం

రిక్షా కార్మికులకు అన్యాయం

వైసీపీ ప్రభుత్వంలో రిక్షా కార్మికులకు ఒరిగిందేమీ లేదు. అన్ని వర్గాలకూ ఏదోవిధంగా పథకాలు ఇస్తున్నా రిక్షా కార్మికులకు మాత్రం ఏ పథకమూ ఇవ్వడం లేదు. ఆటో డ్రైవర్లకు ఇచ్చినట్టుగా రిక్షా కార్మికులకు కూడా రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. 20 ఏళ్లుగా రిక్షా నడుపుకొంటున్నా. కిరాయిలు లేక వ్యవసాయ కూలికి వెళ్తున్నాం. జగన్ ప్రభుత్వం రిక్షా కార్మికులను ఆదుకోలేదు.

-దేవరపల్లి ఏడుకొండలు, రిక్షా కార్మికుడు, దేవరపల్లి, తూర్పుగోదావరి జిల్లా

వడ్రంగి వృత్తిదారులకు ఒరిగిందేమీ లేదు



జగన్ పాలనలో వడ్రంగి చేతివృత్తిదారులకు ఒరిగిందేమీ లేదు. వృత్తి పనిముట్ల రుణాలు మంజూరు చేయడం లేదు. కార్మికులకు సరైన గుర్తింపు లేదు. జగన్ పాలనలో అన్నివిధాలా వడ్రంగి కార్మికులు ఇబ్బంది పడ్డారు.

– గుండుమళ్ల చిట్టియ్య, వడ్రంగి కార్మికుడు, ప్రత్తిపాడు, కాకినాడ జిల్లా

చిత్రబ్రో!



చింటూ: ఏంట్రా... ఎల్లో అంటున్నావ్!

చిన్నూ: 'హల్లో' అన్నా ఎల్లోలాగా వినిపిస్తోందంటే తేడా కొడుతున్నట్టేరోయ్!

చింటూ: పసుపంటే అన్నియ్యకు పడదోయ్!

చిన్నూ: ఇంద్ర ధనస్సులోంచి పసుపు రంగు తీసేస్తాడేమో రోయ్!

చింటూ: పసుపులేని వంటకాలు కనిపెట్టాలోయ్!

చిన్నూ: తెల్లన్నం తింటే సరిపోద్ది కదరా!

చింటూ: మరి పులిహోరా?

చిన్నూ: రోజా మైకు ముందు కలుపుతూనే ఉన్నాడు కదా!



బతుకు భారం

కార్మికులకు కష్టాలు కన్నీళ్లే

నేడు మే డే



జగన్ ప్రభుత్వంలో అరకొర సాయం
ఒక్క చాన్సంటూ బడుగులకు మోసం

- నిబంధనల పేరుతో పథకాలు కట్
- డీజిల్, పెట్రోల్‌పై అదనపు బాదుడు
- ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇస్తూ చలానాల రూపంలో 40 వేలు నొక్కుడు
- రిక్షా కార్మికులకు వర్తించని వాహనమిత్ర
- చేనేతలు, చేతివృత్తులదారులూ సతమతం
- చివరికి ఉత్తుత్తి 'బటన్' నొక్కుడుతో టోపీ
- మరోవైపు నిత్యావసరాల ధరల భారం
- బతకలేక ఇతర రాష్ట్రాలకు వలసలు

గుడ్డిగా నమ్మినందుకు నడ్డి విరిచిన జగన్!
ఐదేళ్లలో మోసపోయింది చాలు
ఇంకో చాన్స్ ఇచ్చేందుకు సిద్ధంగా లేం!

కార్మిక సోదరుల కన్నుల
నిండా జలజలా కారే కన్నీళ్లే!
కర్షక వీరుల కాయంపై జగన్ సర్కారు
కారణంగా అయిన గాయాలే!
పొలాలనన్నీ హలాలతో దున్ని బంగారం
పండించే రైతుకు నిండా దుఃఖమే!
కమ్మరి కొలిమీ... కుమ్మరి చక్రం...
నేతల మగ్గం... జాలరి పగ్గం.. సకల కుల
వృత్తులకు కోలుకోలేనంత కష్టం!
శ్రామిక లోకపు సౌందర్యం కానరాదు..
కార్మిక లోకపు సౌభాగ్యం లేదు.

కార్మికులు, కర్షకులకు జగన్ సర్కారు చేసినంత అన్యాయం ఇంకెవరూ చేయలేదు! కష్టపడి పని చేసి, కుటుంబాన్ని పోషించుకునే వాళ్లకు పనులు దూరమయ్యాయి. సొంతంగా సంపాదించుకుని, దర్జాగా సాగిన జీవితాలు కష్టాల పాలయ్యాయి. 'నేను బటన్ నొక్కితేనే మీకు బతుకు!' అన్నట్లు, వారి జీవితాలను మార్చేసినట్లు ప్రకటనలు, ఆర్భాటపు మాటలే తప్ప చేసిందేమీ లేదు! ఇసుకను దోచేసి భవన నిర్మాణ కార్మికుల పొట్ట గొట్టారు. వాహన మిత్ర పేరిట ఏడాదికి, అదీ కొందరికి మాత్రమే బటన్ నొక్కి... నిత్యం పెట్రోలు/డీజిల్ సెస్సులు, చలాన్లతో ఆటో డ్రైవరన్నల పొట్ట గొట్టారు. ఇచ్చింది పదివేలైతే... లాగేసుకున్నది రూ.40 వేలు! రక్తాన్ని ధారపోసి మరీ రిక్షాలాగే కార్మికులకు ఆ పదివేలూ లేదు. 'మేదర'లను చేతివృత్తిదారులుగానే పరిగణించడంలేదు. 'ఒక్క చాన్స్ ఇస్తే మీ బతుకులు బంగారం చేస్తా' అని 2019 ఎన్నికల ముందు ఊదరగొట్టి, ఆ తర్వాత బతుకులను బుగ్గి చేశారు. గత ఐదేళ్లలో ఏ కార్మికుడికీ చేతి నిండా పనిలేదు. మరోవైపు... రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు భారీగా పెరిగిపోయాయి. ఇక్కడ చేసుకోవడానికి పనుల్లేక తట్టాబుట్టా సర్దుకుని బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్లిపోయారు. 'ఒక్కసారి... అని అడగ్గానే మోసపోయాం. ఇంకోసారి చాన్స్ ఇచ్చేందుకు సిద్ధంగా లేం' అని కార్మికులు, కర్షకులు తేల్చి చెబుతున్నారు.

జగన్ పాలన తెచ్చిన కష్టాలు, కన్నీళ్లపై ఆయా వర్గాలు, వృత్తిదారుల అభిప్రాయాలు ఇవి...

'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం' సందర్భంగా..

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

గతంలో కుటుంబం అంతా చేనేత వస్త్రాలు నేసే వాళ్లం. సొసైటీలు చీరలు కొనుగోలు చేసేవి. రానురాను సొసైటీల పరిస్థితి అంతంత మాత్రంగా మారడంతో నేత నేసిన చీరలు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. నెలకు ఒక పడుగు వేసి, 8 చీరలు నేస్తాం. అందుకుగాను రూ.4 వేలు ఇస్తారు. అందులో అచ్చుకు రూ.300, పడుగుకు రూ.500, కండెలు చుట్టడానికి రూ.250.. మొత్తం రూ.1,050 ఖర్చవుతుంది. మాకు మిగిలేది రూ.2,950 మాత్రమే. జగన్ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24 వేలు ఇస్తోంది. జీవనం సాగించడం కష్టం కావడంతో కుటుంబంలో యజమాని, నా కొడుకు నర్సరీల్లో పనులకు వెళుతున్నారు.

– ఉట్ల మహాలక్ష్మి, వీరవరం, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా



చేనేత వదలి.. నర్సరీ పనుల్లోకి

బతకడం కష్టంగా మారింది



తండ్రిని మించిన పరిపాలన చేస్తానని గత ఎన్నికల ముందు జగన్ చెప్పడంతో ఆయన మాట నమ్మి ఓట్లేశాం. ఇప్పుడు మా పరిస్థితి దారుణంగా మారింది. వాహన మిత్ర కింద ఇచ్చే డబ్బుల మాటేమో కానీ డీజిల్ రేటు పెరగడం మాకు భారంగా మారింది. గతంలో కంటే లీటరుకు 40 రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఇది చాలదన్నట్టు జరిమానాలు వేస్తున్నారు. ఆటో నడిపి బతకడం కష్టంగా మారిపోయింది.

– దోసపాటి శ్రీరామమూర్తి, ఆటో డ్రైవర్, గుంటూరు

ఈ ప్రభుత్వానికో నమస్కారం



సబ్సిడీ రుణాలు లేవు. ఇంటి స్థలాలకు అతీగతీ లేదు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలు దూర ప్రాంతాలకు తరలి వెళ్లిపోవడంతో ఆటోలకు కిరాయిలు లేవు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఫైనాన్సు వడ్డీలు కట్టకపోవడంతో కొన్ని ఆటోలు సీజ్ చేశారు. కొందరు ఆటోలు అమ్ముకుని కూలి పనులకు ఇతర గ్రామాలకు వెళ్లిపోయారు. బతుకు భారమైంది. ఇంటి అద్దెలు కట్టడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాం. ఈ ప్రభుత్వ పాలనకు ఓ నమస్కారం. ఇకచాలు.

– రెల్లి నాగు, ఆటో డ్రైవరు, పోలవరం

ఆటో కార్మికులకు మోసం



ఆటో కార్మికులకు రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చి వైఎస్సార్ వాహనమిత్ర ద్వారా కొంతమందికి మాత్రమే ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కార్పొరేషన్ ద్వారా అందించే వాహనాలు ఒక్కరికీ ఇవ్వలేదు. యజమానుల నుంచి ఆటోలు అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాం. మాలాంటి వారికి వాహనమిత్ర పథకం వర్తించడం లేదు. ఆటో, ట్యాక్సీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి కూడా చేయలేదు. వాహన మిత్ర పథకం సగంమంది కార్మికులకు ఇవ్వడం లేదు.

– నంబూరి వెంకటరమణ, ఆటో డ్రైవర్, ఏలూరు

మద్య నిషేధం ఏదీ..?:



మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారు. కానీ సీఎం జగన్ మాట నిలబెట్టుకోలేదు. ప్రభుత్వమే దుకాణాలు తెరిచి మద్యం అమ్మిస్తోంది. ఇంకో చాన్స్ ఇస్తే రాష్ట్రం అప్పులపాలే. ఇక చాలు జగన్ పాలన.

– మస్తానమ్మ, పూల వ్యాపారి, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా

మేదర్లకు గుర్తింపే లేదు



చేతివృత్తుల వారికి సాయం చేస్తామన్నారు. అసలు చేతి వృత్తుల్లో మా మేదర్ల పేరే లేదు. సబ్సిడీ రుణాలు లేవు. మాకు ఇంటి స్థలం కూడా లేదు. ప్రభుత్వ దృష్టిలో మేదర్లకు కనీస గుర్తింపే లేదు. ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరడంతో జగన్‌కు ఓటేశాం. మాకు ఈ ఐదేళ్లలో ఎలాంటి న్యాయమూ జరగలేదు.

– సోముల రాంబాబు, మేదరి చేతి వృత్తి పని, పోలవరం

భజంత్రీలకు మోసం



భజంత్రీలకు ఆర్థికసాయం అందకుండా ప్రభుత్వం అడ్డుకుంది. జగన్ ప్రభుత్వంలో మొదట మా సామాజికవర్గంలో అందరికీ ఆర్థికసాయం చేశారు. రెండేళ్లుగా భజంత్రీలు దరఖాస్తు చేసుకున్నా సాయం చేయలేదు. మంగలివారికి మాత్రమే ఆర్థిక సాయం చేశారు. కులాన్ని విభజించి మోసం చేశారు. టీడీపీ పాలనలో క్షురక వృత్తికి అవసరమైన పరికరాలు, కుర్చీలు అందరికీ ఇచ్చారు. మమ్మల్ని ఆదరించి, ఆదుకునేవారికే ఎన్నికల్లో ఓటు వేస్తాం.

– లోకేశ్, సెలూన్ నిర్వాహకుడు, గోరంట్ల, శ్రీసత్యసాయి జిల్లా

నిండా మోసపోయాం



ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరిన జగన్ మాటలు నమ్మి ఓటు వేశాం. ఐదేళ్ల కాలంలో హమాలీలకు చేసిందేమీలేదు. కూలి ధరలు పెంచుతారనుకున్నాం. కానీ పెంచలేదు. ఐదేళ్ల కిందట హమాలీలకు నెలనెలా వేతనాలు అందేవి. జగన్ అధికారంలోకి వచ్చాక రెండు నెలలైనా వేతనాలు అందలేదు. కాంట్రాక్టర్ ఇచ్చినప్పుడే తీసుకోవాలి. హమాలీలకు ప్రమాదాలు జరిగినా బీమా అందలేదు. జిల్లా వ్యాప్తంగా 52 మందికి పీఎఫ్ నంబర్లు ఇవ్వలేదు. ఐదేళ్లలో హమాలీలంతా నష్టపోయాం.

– నాగరాజు, హమాలీ, పెనుకొండ, శ్రీసత్యసాయి జిల్లా

జగన్‌ను నమ్మి ఓటు వేసినందుకు భవన నిర్మాణ కార్మికుల బతుకులను బుగ్గిపాల్జేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇసుక కొరత ఏర్పడింది. ఇసుక ధరలు భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇళ్లు నిర్మించుకోలేని దుస్థితి ఏర్పడింది. భవన నిర్మాణ పనులు సజావుగా సాగలేదు. కార్మికులు తినడానికి తిండిలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ ఎన్నికల్లో జగన్ మాటలు విని మళ్లీ మోసపోయే ప్రసక్తే లేదు.

– షేక్ సర్దార్, తాపీ మేస్త్రీ, గోరంట్ల, శ్రీసత్యసాయి జిల్లా

మా బతుకులు బుగ్గిపాలు



జే బ్రాండ్లు మాకొద్దు!

- ఆ మందు వద్దంటున్న కార్యకర్తలు
- ప్రచారంలో అభ్యర్థులకు చుక్కలు
- గోవా మద్యం డంప్ చేసుకుంటున్న అభ్యర్థులు
- స్థానిక బార్లలోనూ భారీగా కొనుగోళ్లు



అసలే ఎండాకాలం.. ఆపై ఎన్నికల సమయం. ప్రచారానికి వచ్చే కార్యకర్తల్లో చాలామందికి మంచినీళ్లు లేకపోయినా ఫర్వాలేదు కానీ.. పగలు బీరు, రాత్రి బ్రాందీ పడాల్సిందే. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వెంట ప్రచారానికి వచ్చే కార్యకర్తలకు తప్పనిసరిగా మందు.. బిర్యానీ.. ఇప్పించాల్సిందే. బిర్యానీకి ఇబ్బంది లేకపోయినా మందు దగ్గరకు వచ్చేసరికి అభ్యర్థులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రచారానికి వచ్చే కార్యకర్తలకు లోకల్‌గా దొరికే జగనన్న బ్రాండ్లు ఇస్తే ససేమిరా అంటున్నారు. అలాంటి చీప్ లిక్కర్ తమకు వద్దని తిరస్కరిస్తున్నారు. దీంతో ఏంచేయాలో తోచక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి ప్రచారానికి వెళుతున్నారు. స్వచ్ఛందంగా వచ్చే కార్యకర్తలు కొందరైతే అద్దెకు వచ్చేవారు మరికొందరు. ఇలా అద్దెకు వచ్చిన కార్యకర్తలకు రోజూ బిర్యానీ పొట్లం, క్వార్టర్ బాటిల్, రూ.300 నుంచి 500 ఇవ్వాలి. ఇంతవరకు బాగానే ఉన్నా మద్యం విషయానికి వచ్చేసరికి అద్దె కార్యకర్తల డిమాండ్లు అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. బీర్లు కావాలనుకునే వారికి లోకల్‌గా దొరికే బ్రిటిష్ ఎంపైర్, బూం బూం బీర్లు ఇస్తున్నారు. విస్కీ, బ్రాందీ తాగాలనుకునే వారికి రాయల్ నైట్, రాయల్ ప్యాలెస్, ఆంధ్రా గోల్డ్ వంటివి ఇస్తున్నారు. వైసీపీ అభ్యర్థులు ఇప్పటికే వీటిని పెద్ద ఎత్తున డంప్ చేసుకున్నారు. అయితే వాటిని తాగేందుకు అద్దె కార్యకర్తలు సుముఖత చూపడం లేదు. విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన ఓ అభ్యర్థి తన వెంట ప్రచారానికి వచ్చిన వారికి బ్రిటిష్ ఎంపైర్ బీర్ సరఫరా చేశారు. అది తాగితే తమకు రోజంతా తిక్క తిక్కగా ఉంటోందని, బార్లలో దొరికే అల్ట్రా బ్రాండ్ తెప్పించాలని పట్టుబట్టారు. దీంతో అప్పటికప్పుడు ఆయన అల్ట్రా బ్రాండ్ తెప్పించి వారికి అందజేశారు. ఈ పరిస్థితి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కనిపిస్తోంది. దీంతో బార్లలో కొనుగోళ్లు భారీగా పెరిగాయి. దీనిని బార్ల యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. అయినా డిమాండ్‌కు తగినంతగా సరఫరా లేక అవస్థలు పడుతున్నారు. ప్రీమియం బ్రాండ్లు ఆచితూచి ఇస్తున్న బెవరేజెస్ కార్పొరేషన్.. జగనన్న బ్రాండ్లను మాత్రం ఎన్నికావాలంటే అన్ని ఇస్తోంది. ఉదాహరణకు ఒక బారుకు రోజుకు కాస్త ప్రీమియం బ్రాండు అయిన అల్ట్రా బీరు కేసులు ఐదు మాత్రమే ఇస్తున్నారు. అదే జగనన్న బ్రాండ్లయిన బూం బూం, బ్రిటిష్ ఎంపైర్ 10 నుంచి 15 కేసులైనా ఇస్తున్నారు. గన్నవరంలో ఆదివారం ఎన్నికల అధికారులు సుమారు రూ.80 లక్షల విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. సుమారు 1200 కేసులు సీజ్ చేశారు. ఈ మద్యమంతా గోవా నుంచి దిగుమతి చేసుకున్న ఇంపీరియల్ బ్లూ బ్రాండే కావడం గమనార్హం. 'జగనన్న బ్రాండ్లు ఇస్తుంటే మరుసటి రోజు నుంచి ప్రచారానికి రావడం లేదని, దీంతో గోవా నుంచి ప్రత్యేకంగా మద్యం తీసుకురావాల్సి వస్తోందని' అభ్యర్థులు వాపోతున్నారు. జే బ్రాండ్లను తీసుకునేందుకు అద్దె కార్యకర్తలు ఇష్టపడటం లేదు. దాని బదులు డబ్బులు ఇచ్చేయాలని, బార్‌కు వెళ్లి నచ్చిన బ్రాండ్ తాగుతామని చెబుతుండటం గమనార్హం. దీంతో ఇప్పటికే డంప్ చేసిన మద్యాన్ని ఏం చేసుకోవాలో తెలియక, మళ్లీ కొత్తగా మద్యాన్ని దిగుమతి చేసుకోలేక అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు.

-విజయవాడ, ఆంధ్రజ్యోతి



మనం ఓటు వేయకపోతే చరిత్రను విస్మరించి భవిష్యత్తును త్యాగం చేసినట్టే.



మిచెలీ ఒబామా



జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి

అబ్బ-ఛా!

జగన్ ఎప్పుడూ అబద్ధం చెప్పడు..!

జగన్ ఎప్పుడూ అబద్ధాలు ఆడడు. జగన్ ఎప్పుడూ మోసం చేయడు. పేదలను ప్రేమించి, అభిమానించే విషయంలో మేనిఫెస్టోలో పెట్టినా.. పెట్టకపోయినా జగన్ వేసిన అడుగులు రాష్ట్రంలో ఎవరూ వేయలేరు.

ప్రతి కుటుంబానికీ 25 లక్షల ఆరోగ్య బీమా!

- దేశంలో తొలిసారి ప్రభుత్వ బీమా
- సామాన్యులకు ఉచిత ఇసుక విధానం
- రైతులకు ఏటా 20 వేల ఆర్థిక సాయం
- మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం
- కూటమి మేనిఫెస్టోలో హామీలు
- విడుదల చేసిన బాబు, పవన్,సిద్ధార్థనాథ్

ఎస్సీ, ఎస్టీ సంక్షేమం

- జిల్లా వారీగా వర్గీకరణ అమలు చేస్తాం
- ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు
- సబ్‌ప్లాన్ నిధులు వారి అభివృద్ధికే ఖర్చు చేస్తాం
- ఏజెన్సీల్లో ఆదివాసీ ఉపాధ్యాయుల నియామకం, జీవో 3 పునరుద్ధరణ
- ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల పునరుద్ధరణ
- డా.సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, మంత్రూ భాయ్, డా.అచ్చెన్న హత్యలకు కారకులను కోర్టుల్లో శిక్షపడే విధంగా చర్యలు
- ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తాం

ముస్లిం మైనార్టీల సంక్షేమం..

- ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్
- మైనార్టీలకు ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, ఖబరిస్తాన్‌లకు స్థలాలు కేటాయింపు, విజయవాడ సమీపంలో హజ్‌హౌస్ నిర్మాణం
- నూర్‌భాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.100 కోట్లు కేటాయింపు
- మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు
- ఇమామ్, మౌజన్‌లకు ప్రతి నెలా రూ.10 వేలు, రూ.5 వేలు గౌరవ వేతనం
- అర్హత ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వ ఖాజీలుగా నియామకం
- మసీదుల నిర్వహణకు ప్రతి నెలా రూ.5 వేలు ఆర్థిక సాయం, హజ్ యాత్రకు వెళ్లే ఒక్కో ముస్లింకు రూ.లక్ష సాయం

క్రిస్టియన్‌ల సంక్షేమం..

- క్రిస్టియన్ మిషనరీస్ ప్రాపర్టీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు
- చర్చిల నిర్మాణం, పునరుద్ధరణకు ఆర్థిక సాయం
- స్మశాన వాటికలకు స్థలం కేటాయింపు
- జెరూసలెం యాత్రికులకు సాయం

క్షత్రియ సంక్షేమం...

- భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టుగా నామకరణం
- ప్రజా రాజధాని అమరావతిలో అల్లూరి సీతారామ రాజు స్మృతివనం నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయింపు

సామాజిక భద్రత పింఛన్లు పెంపు

- రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంపు - ఏప్రిల్ నుంచి పెంచిన పెన్షన్ అమలు
- దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచుతాం
- పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ.15 వేలు పెన్షన్
- కిడ్నీ, తలసీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు పెన్షన్

పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు

- గృహ నిర్మాణానికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం మంజూరు చేస్తాం
- ఇప్పటి వరకూ మంజూరై పట్టాలు పొందిన వారికి ప్రభుత్వం నుంచి పక్కా, ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం

దేవాలయాలు-బ్రాహ్మణుల సంక్షేమం...

- హిందూ దేవాలయాలు, సత్రాల ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ బోర్డు ఏర్పాటు
- ప్రైవేటు దేవాలయాల్లోని అర్చకులకు కనీస వేతనం
- వార్షిక ఆదాయం రూ.50 వేలకు పైన ఉన్న ఆలయాల అర్చకులకు కనీస వేతనం రూ.15 వేలకు పెంపు
- వార్షిక ఆదాయం రూ.50 వేలకు తక్కువ ఉన్న ఆలయాల్లోని అర్చకులకు ధూప, దీప, నైవేద్యం కింద ఇచ్చే మొత్తాన్ని నెలకు 5 వేల నుంచి 10 వేలకు పెంపు
- వైదిక, ఆగమశాస్త్ర సంబంధ విషయాల్లో ఆయా ఆలయాలకు పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి
- తిరుపతి వేయి కాళ్ల మండపం వంటి చారిత్రక కట్టడాల పునరుద్ధరణ
- దేవాలయాలకు పూర్తి రక్షణ - గత ప్రభుత్వ హయాంలో దేవాలయాలపై జరిగిన దాడులకు బాధ్యులైన వారికి శిక్ష పడేవిధంగా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు
- పురోహితులు, వంట బ్రాహ్మణుల కులవృత్తికి గుర్తింపు
- బ్రాహ్మణ కార్పొరేషన్, కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బలోపేతం
- తిరుపతి సహా అన్ని దేవాలయాల్లో పూజారితోపాటు ఒక బ్రాహ్మణుడిని ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా నియామకం
- బ్రాహ్మణులు అపరకర్మ చేసుకోవడానికి నియోజకవర్గాల్లో భవనాలు.. వేద విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి.

అగ్రవర్ణ పేదల సంక్షేమం

- కమ్మ, రెడ్డి, వెలమ, అగ్రకులాల కార్పొరేషన్‌లకు తగిన నిధులు కేటాయించి వారి సాధికారత, అభివృద్ధికి చర్యలు చేపడతాం.

కాపు సంక్షేమం..

- ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు అదనంగా కాపుల సంక్షేమం కోసం కనీసంగా రానున్న అయిదేళ్లలో రూ.15 వేల కోట్లు నిధులు కేటాయించి కాపుల సాధికారత, అభివృద్ధి కోసం చర్యలు చేపడతాం
- కాపు యువత, మహిళల నైపుణ్యాభివృద్ధికి, స్వయం ఉపాధికి ప్రాధాన్యం ఇస్తాం
- కాపు భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తాం

ఆర్యవైశ్య సంక్షేమం..

- ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు తగు మేరకు నిధుల కేటాయింపు
- చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాల సౌలభ్యం
- స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యాపార నిర్వహణకు పటిష్ఠ చర్యలు
- కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారిక కార్యక్రమంగా చేపడతాం

సాగునీటి రంగం

- పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేస్తాం
- గాలేరు- నగరి, హంద్రీనీవా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తోటపల్లి రిజర్వాయర్, వంశధార-నాగావళి నదుల అనుసంధానం, ప్రాజెక్టుల శీఘ్రతర నిర్మాణానికి చర్యలు
- నదుల అనుసంధానం - ప్రతి ఎకరాకు నీరు
- రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తి

పారిశ్రామికీకరణ, పెట్టుబడులు

- బ్రాండ్ ఏపీని పునఃప్రతిష్ఠించి, భారీస్థాయిలో దేశ విదేశీ పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమల ఏర్పాటు ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు పెద్ద ఎత్తున ఊతమిస్తాం. కొత్త ఇండస్ట్రియల్ పాలసీ కింద పూర్తి స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి ఆధునిక, సాంకేతిక విజ్ఞానం వినియోగం ద్వారా తగు ప్రోత్సాహం.

మహిళా సంక్షేమం

- స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ పెంపు
- ప్రత్యేక పథకం ద్వారా పి-4 మోడల్‌లో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చర్యలు
- అంగన్‌వాడీ కార్యకర్తలకు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ చెల్లిస్తాం. ఆశావర్కర్లకు కనీస వేతనం పెంపు దిశగా చర్యలు
- ఉద్యోగాలు చేసే మహిళలకు హాస్టల్ వసతి కల్పన
- విద్యార్థినులకు కలలకు రెక్కలు పథకం ద్వారా రుణాలు
- పండుగ కానుకలు, పెళ్లి కానుకలు పునరుద్ధరిస్తాం

కార్మికులు

- **రవాణా రంగం:** డ్రైవర్ సాధికార సంస్థ ఏర్పాటు. డ్రైవర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలు
- డ్రైవర్లను ఓనర్లు చేసే లక్ష్యంతో వాహన కొనుగోళ్లకు రూ.4 లక్షల వరకూ పొందే రుణాలపై 5 శాతం పైగా వడ్డీ సబ్సిడీ
- బ్యాడ్జ్ కలిగిన ప్రతి ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం
- జీవో 21 రద్దు, వాహనాల గ్రీన్ ట్యాక్స్ తగ్గింపు
- అసంఘటిత రంగ కార్మికులకు చంద్రన్న బీమా పునరుద్ధరణ
- భవన నిర్మాణ బోర్డు పునరుద్ధరణ, ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు

జర్నలిస్టులు..

- అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఉచిత నివాస స్థలం

న్యాయవాదులు...

- న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉచిత న్యాయ సేవల అందుబాటుకు లీగల్ కియోస్క్‌ల స్థాపన. జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వ స్టైఫండ్ నెలకు రూ.10 వేలు, జూనియర్ న్యాయవాదుల శిక్షణకు ప్రత్యేక ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు

బాబు సూపర్ 6 సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు
- ప్రతి మహిళకు నెలకు రూ.1500 (19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు)
- ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ప్రతి ఇంటికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు

సూపర్ సిక్స్ 2.0, షణ్ముఖ వ్యూహం..

- ఇంటింటికి రక్షిత తాగునీరు: ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్
- పూర్ టు రిచ్: పేదలను సంపన్నులను చేసే దిశగా పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్ట్‌నర్‌షిప్ పథకాలు
- రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సెన్సెస్ చేపట్టి తద్వారా ప్రజల నైపుణ్యత స్థాయిని పెంచుతాం
- సౌభాగ్యపథం: చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా రూ.10 లక్షల వరకూ సబ్సిడీ
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిని త్వరితగతిన పెంచడానికి పటిష్ఠమైన చర్యలు
- ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాన్ని కొనసాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి

యువత సంక్షేమం

- మెగా డీఎస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్
- ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ప్రత్యేక ఎంప్లాయిమెంట్ జోన్‌ల ఏర్పాటు
- అత్యధిక ఉద్యోగాల కల్పన చేసే ఎంఎస్ఎంఈ సెక్టార్‌కు ప్రోత్సాహకాలు
- మూతపడిన ప్రతి నైపుణ్య శిక్షణా కేంద్రం పునఃప్రారంభం- విస్తరణ
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పిస్తాం
- **క్రీడలు:** ప్రపంచస్థాయి క్రీడా సదుపాయాలు అభివృద్ధి పరిచి రాష్ట్ర యువతను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం
- భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు రాష్ట్రాన్ని వేదికగా మారుస్తాం
- **డిజిటల్ లైబ్రరీలు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరీక్షలకు ప్రిపేర్ కావడం కోసం డిజిటల్ లైబ్రరీల స్థాపన
- ఎన్‌డీఏ ప్రభుత్వం తెచ్చిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేస్తాం. ప్రతి 5 ఏళ్లకు ఒకసారి ఆర్థిక సర్వే చేసి రిజర్వేషన్లు అమలు చేస్తాం

పన్నులు, ధరల నుంచి ఉపశమనం

- చెత్తపన్ను రద్దు, ఇంటి పన్నుల సమీక్ష
- పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణ
- మద్యం ధరల నియంత్రణ, విష పూరిత మద్యం బ్రాండ్లు రద్దు

విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం

- ఇంటి పైకప్పుపై కేంద్ర ప్రభుత్వ సోలార్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి పథకం అనుసంధానం ద్వారా విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తా. అదనపు విద్యుత్‌ను ప్రజల నుంచి కొనుగోలు

ఫీజు రీయింబర్స్‌మెంట్..

- ఎయిడెడ్ కాలేజీలు, ప్రైవేటు పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తాం
- కాలేజీలకే రుసుము చెల్లిస్తాం

ఉచిత ఇసుక విధానం

- సామాన్యులకు అందుబాటులో ఉండేలా సమగ్ర ఇసుక విధానం

విద్య..

- కేజీ టు పీజీ సిలబస్‌ను రివ్యూ చేస్తాం
- స్కూళ్ల మూతకు కారణమైన జీవో 117 రద్దు
- మూతపడిన పాఠశాలల పునఃప్రారంభం
- డా.అంబేద్కర్ విదేశీ విద్య పథకం పునరుద్ధరణ

గంజాయి నిర్మూలన

- గంజాయి, డ్రగ్స్ మాదకద్రవ్యాల నిర్మూలనకు 100 రోజుల్లో కఠిన చర్యలు చేపడతాం.

ఆక్వా...

- అవసరమైన జిల్లాల్లో 5 వేల టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజీలు, అన్ని జోన్లలో ఉన్న వారికి విద్యుత్ యూనిట్‌కు రూ.1.50కే సరఫరా చేస్తాం.
- ట్రాన్స్‌ఫార్మర్ల ధరలు తగ్గిస్తాం - ఏవియేటర్లు సబ్సిడీపై అందిస్తాం

సమగ్రాభివృద్ధి..

- శీఘ్రతర సమగ్ర ఆర్థికాభివృద్ధికి పటిష్ఠమైన విధానాలను అమలు చేస్తాం.
- సంపద సృష్టితో సంక్షేమ పథకాల విస్తృత అమలును పటిష్ఠం చేస్తాం
- వికసిత భారత్ నిర్మాణానికి చేపడుతున్న పలు చర్యలను రాష్ట్రంలో కూడా అమలు చేస్తాం.

మౌలిక వసతుల కల్పన

- గ్రామాల నుంచి మండల, జిల్లా కేంద్రాలకు రోడ్ల నిర్మాణం
- సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి
- పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రైల్వే ప్రాజెక్టులు త్వరితగతిన నిర్మిస్తాం
- వర్క్‌ఫ్రం హోం కోసం ప్రతి మండల, జిల్లా కేంద్రాల్లో వర్క్ స్టేషన్ల ఏర్పాటు
- ప్రతి ఇంటికీ మంచినీరు సరఫరా

ఉత్తరాంధ్ర అభివృద్ధి

- ఆర్థిక రాజధానిగా విశాఖ అభివృద్ధి
- వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌తో ప్రధాన ప్రాంతాల అనుసంధానం
- విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు. అవసరమైన భూమి కేటాయిస్తాం
- విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షిస్తాం
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, నాగావళి-వంశధార నదుల అనుసంధానం, తోటపల్లి రిజర్వాయర్ ఆధునీకరణ
- జీడిమామిడి, కొబ్బరి ధరల స్థిరీకరణ
- కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణం

రాయలసీమ అభివృద్ధి..

- తాగునీరు, సాగునీరు, విద్య, వైద్య సదుపాయాల ఏర్పాటుకు ప్రాధాన్యం. హార్టికల్చర్ హబ్‌గా, విత్తన రాజధానిగా రాయలసీమ
- కర్నూలులో తక్షణ హైకోర్టు బెంచ్ ఏర్పాటు
- ఆటోమొబైల్ హబ్‌గా రాయలసీమ
- రాయలసీమ పట్టణాలకు చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అనుసంధానం
- యువగళం యాత్రలో ప్రకటించిన మిషన్ రాయలసీమ అమలుకు చర్యలు

చంద్రన్న బీమా పథకం

- సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా సౌకర్యం

వైద్యం, ఆరోగ్యం..

- దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు ఆరోగ్య బీమా
- ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు
- అన్ని మండల కేంద్రాల్లో జన ఔషధి కేంద్రాల ఏర్పాటు
- బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు ఉచితంగా జనరిక్ మందుల పంపిణీ

అన్న క్యాంటీన్లు

- అన్న క్యాంటీన్ల ఏర్పాటు, డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పేదల ఆకలి తీరుస్తాం
- పంపిణీ విధానాన్ని సమీక్షించి, పౌరసరఫరాల వ్యవస్థను పటిష్ఠం చేస్తాం

ప్రజా రాజధానిగా అమరావతి పునర్నిర్మాణం

- నవ్యాంధ్ర ప్రగతికి దోహదం చేసే రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి చర్యలు, ఆర్థిక ప్రగతికి చేయూత

వ్యవసాయం

- 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా
- రాయితీతో సోలార్ పంప్‌సెట్లు- మిగిలిన విద్యుత్ ప్రభుత్వం కొనుగోలు
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు
- ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు
- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు-పంటల బీమా వర్తింపు
- రైతు కూలీలకు కార్పొరేషన్ స్థాపించి రాయితీలు, సంక్షేమ పథకాల అమలు
- ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేపట్టి, ఆర్థిక, సాగు, మార్కెటింగ్ అంశాల్లో తోడ్పాటు
- ప్రభుత్వ రంగంలో గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజి యూనిట్ల ఆధునీకరణ, యూనిట్ల ఏర్పాటు
- దళారుల దోపిడీని అరికట్టడానికి ఏపీఏంసీ యాక్ట్ పటిష్ఠంగా అమలు
- డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ
- సెరికల్చర్‌ను ప్రోత్సహించి రైతులను ఆదుకుంటాం. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేసి.. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తాం

పాడి రైతులు

- పశువుల కొనుగోళ్ల, దాణా, మందుల కొనుగోళ్లపై సబ్సిడీలు, ఇన్సూరెన్స్ సౌకర్యం-గోకులాల ఏర్పాటు, మేత కోసం భూముల కేటాయింపు
- గోపాల మిత్రల పునర్నియామకం దిశగా చర్యలు ఫుడ్ ప్రాసెసింగ్
- వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమల స్థాపనకు పెద్దఎత్తున ప్రోత్సాహకాలిచ్చి రైతుల ఆదాయం పెంచడంతోపాటు స్వయం ఉపాధి, ఉపాధి కల్పనకు ప్రోత్సాహం

అగ్రిగోల్డ్ బాధితులు

- అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు అందేలా చర్యలు తీసుకుంటాం

పంచాయతీరాజ్ డిక్లరేషన్

- ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు అందిస్తాం
- పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం కల్పిస్తాం - స్థానిక పాలనకు ఊతమిస్తాం
- పంచాయతీరాజ్ ప్రాజెక్టు ప్రతిపాదనల కోసం బడ్జెట్‌లో 5 శాతం కేటాయిస్తాం. ఐదేళ్లలో 10 శాతం వరకూ పెంచుతాం
- సర్పంచ్‌ల నుంచి జెడ్పీ చైర్మన్‌ల వరకూ ప్రస్తుత గౌరవ వేతనాన్ని పెంచుతాం

బీసీ డిక్లరేషన్...

- బీసీలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేల పెన్షన్
- బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం
- బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తాం

బీసీలకు రాజకీయ ప్రాధాన్యం

- స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34% రిజర్వేషన్
- చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం
- ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు నామినేషన్‌ల ద్వారా రాజకీయ భాగస్వామ్యం
- బీసీల ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తాం..
- దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు
- స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్లు
- రూ.5,000 కోట్లతో ఆదరణ పునరుద్ధరణ
- శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు

యాదవ, కురుబ...

- అత్యాధునిక ప్రమాణాలతో గొర్రెల పెంపకం యూనిట్ల స్థాపనకు రాయితీలు, గొర్రెలు, మేకల పెంపకం యూనిట్‌లకు బీమా సౌకర్యం

చేనేతలు...

- చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేస్తాం, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్లూమ్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్

నాయీ బ్రాహ్మణులు..

- దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలు గౌరవవేతనం, షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

రజక..

- దోబీఘాట్ల నిర్మాణాలకు ప్రోత్సాహం. విద్యుత్ రాయితీ

గీత కార్మికులు...

- మద్యం షాపుల్లో 10% కేటాయింపు

వడ్డెర...

- క్వారీల్లో 15% రిజర్వేషన్, రాయల్టీ, సీనరీ చార్జీల్లో మినహాయింపు

మత్స్యకారులు

- వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల సాయం. జీవో 217 రద్దు
- బోట్ల మరమ్మతులు, ఆధునిక కమ్యూనికేషన్‌కు ఆర్థిక సాయం

స్వర్ణకారులు

- అభివృద్ధికి కొత్తగా కార్పొరేషన్ ఏర్పాటు

హంతకులకు శిక్ష

- తోట చంద్రయ్య, అమర్నాథ్‌గౌడ్, జల్లయ్య యాదవ్, పాల సుబ్బారావు లాంటి బీసీలను హత్య చేసిన వైసీపీ గూండాలకు శిక్ష పడేలా చర్యలు

ఉద్యోగస్తులు, పెన్షనర్స్

- గత ఐదేళ్ల పాలనలో ప్రధాన వ్యవస్థలన్నీ విధ్వంసమయ్యాయి.
- ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు, అవమానాలకు గురయ్యారు. వారి గౌరవాన్ని పునఃప్రతిష్ఠింప చేసి పూర్తి అనుకూల వాతావరణంలో వారు పనిచేసేలా తగు చర్యలు చేపడతాం.
- సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తాం
- ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ అమలు చేస్తాం. అలవెన్స్ పేమెంట్స్‌పైన కూడా పునఃపరిశీలన చేస్తాం
- ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తాం
- రాష్ట్రంలోని ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తారీఖున జీతాలు, పెన్షన్లు చెల్లిస్తాం. వీరికి రావాల్సిన బకాయిలు కూడా చెల్లించే ఏర్పాటు చేస్తాం. పెన్షనర్స్ కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు
- తక్కువ జీతాలు పొందే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపు
- వలంటీర్ల గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు

ఎక్స్‌సర్వీస్‌మెన్ సంక్షేమానికి

- ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎక్స్‌సర్వీస్‌మెన్ సంక్షేమానికి కృషి చేస్తాం. వారి సమస్యలను పరిష్కరిస్తాం



అంబాజీపేటలో సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న షర్మిలారెడ్డి



ఇంట్లో వాళ్ల చేతిలో రిమోట్ జగన్!

ఐదేళ్లుగా కేంద్రంలో మోదీ చేతిలో కూడా .. అటు బీజేపీ... ఇటు ఇంట్లో ఉన్నవాళ్లు...

- ఇద్దరి పేర్లూ 'బీ' తోనే మొదలవుతాయి
- తనపై కేసుల నుంచి తప్పించుకోవడానికి వైఎస్సార్ పేరు చార్జిషీట్‌లో పెట్టించారు
- చెల్లెలిపై ప్రేముంటే అవినాశ్‌తో విత్‌డ్రా చేయించండి
- చిన్నాన్నను చంపిన వ్యక్తికి టికెట్ ఇచ్చినందుకే బరిలోకి
- జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది: పీసీసీ చీఫ్ షర్మిల
- జాబ్ ఇవ్వలేని జగన్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్న

రావులపాలెం/అంబాజీపేట, ఏప్రిల్ 30: సీఎం జగన్ తన ఇంట్లో ఉన్నవాళ్ల చేతిలో రిమోట్ కంట్రోల్‌గా మారిపోయారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు చేతిలో రిమోట్ అని జగన్ ఆరోపించారు. కానీ రిమోట్ కంట్రోళ్ల గురించి జగన్‌కు బాగానే అవగాహన ఉంది. ఎందుకంటే గత ఐదేళ్లుగా కేంద్రంలో మోదీ చేతిలోనూ, రాష్ట్రంలో తన ఇంట్లో ఉన్నవాళ్ల చేతుల్లోనూ జగన్ రిమోట్ కంట్రోల్‌గా ఉన్నారు. ఇద్దరి పేర్లూ 'బీ'తోనే మొదలవుతాయి. బీజేపీ అయినా... ఇంట్లో ఉన్న వాళ్లు అయినా...' అని షర్మిల ఎద్దేవా చేశారు. జగన్ తనపైన ఉన్న కేసుల నుంచి తప్పించుకోవడానికే పొన్నవోలు సుధాకర రెడ్డితో సుప్రీంకోర్టులో పిటిషన్ వేయించి వైఎస్సార్ పేరును చార్జిషీట్‌లో చేర్పించి దుర్మార్గానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జగన్ తాను తప్పుచేసి కాంగ్రెస్‌పైకి నెట్టడం కుట్రలో భాగమని మండిపడ్డారు. కేసుల నుంచి బయటపడేందుకే జగన్ కుట్రలు, కుతంత్రాలకు దిగారన్నారు.

'జగన్‌ను సూటిగా అడుగుతున్నా... చెల్లిపై ప్రేమ ఉంటే, తన బాధ నిజమైనదే అయితే కడపలో అవినాశ్‌రెడ్డితో నామినేషన్ విత్‌డ్రా చేయించాలి. చాపర్ ప్రమాదంలో ఆరోపణలు వచ్చినవారికే ఎంపీ పదవులు ఎందుకు ఇచ్చారో చెప్పాలి. చిన్నమ్మ లేఖ రాసినా అవినాశ్‌రెడ్డిని ఎందుకు తప్పించలేదు? ఎందుకు ముఖస్తుతిగా మాట్లాడుతున్నారు? ఆ ఎన్నికల్లో వివేకాను ఓడించింది అవినాశ్ రెడ్డి, భాస్కరరెడ్డి అయినప్పటికీ అలాంటివారికి ఎందుకు టికెట్ ఇచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలి. నేను ఓడిపోతానని నమ్మకం ఉంటే ఎందుకు భయపడుతున్నారు? భయం ఉంది కాబట్టే వైఎస్ కుటుంబాన్ని మొత్తం దింపి ప్రచారం చేయిస్తున్నారు. వైఎస్సార్ బిడ్డ మీ చెల్లి అని చూడకుండా... నా గురించి, నా పుట్టుక గురించి, నా పేరు గురించి సోషల్ మీడియాలో కుక్క బిస్కెట్లు పారేసి తప్పుడు కథనాలు ఎందుకు ప్రచారం చేయిస్తున్నారు? ఓటమి భయంతోనే జగన్ అసత్య ఆరోపణలకు దిగారు. చిన్నాన్నను చంపిన వ్యక్తికి టికెట్ ఇచ్చినందుకే నేను కడపలో పోటీకి దిగాల్సి వచ్చింది. కుటుంబ సభ్యుల్లో ఇంకెవ్వరికి టికెట్ ఇచ్చినా పోటీ చేసేదాన్ని కాదు. అవినాశ్‌రెడ్డిని ఎందుకు కాపాడుతున్నారో ప్రజలకు జగన్ సమాధానం చెప్పాలి" అని షర్మిల డిమాండ్ చేశారు. కడప ఎన్నికలు డబ్బుకి, న్యాయానికి, నేరానికి మధ్య జరుగుతున్నవని షర్మిల పేర్కొన్నారు. రాజశేఖర్‌రెడ్డి బిడ్డ ఓడిపోయిందంటే నేరం గెలిచినట్టేనని చెప్పారు. తలకు చిన్న గాయమైతేనే హత్యాయత్నం అని సొంత మీడియాలో పెద్దపెద్ద కథనాలు రాశారు. వివేకానందరెడ్డి తలపై గొడ్డలితో ఏడుసార్లు నరికితే గుండెపోటు అని ఎందుకు రాశారో జగన్ ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేకపోతున్నారని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ట్రయాంగిల్ లవ్‌స్టోరీ: షర్మిల

రాష్ట్రంలో ట్రయాంగిల్ లవ్‌స్టోరీ నడుస్తోందని షర్మిల అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట రోడ్‌షోలో ఆమె మాట్లాడారు. 'చంద్రబాబుకు బహిరంగంగానే బీజేపీతో పొత్తు ఉంది, జగన్‌కు మోదీతో అక్రమంగా పొత్తు ఉంది, జగన్ మోదీకి తొత్తుగా ఉన్నారు. జగన్‌కు ఓటేసినా, చంద్రబాబు, పవన్‌కు ఓటేసినా బీజేపీకి వేసినట్లే. బీజేపీకి ఓటేస్తే పోలవరం రాదు, రాజధాని రాదు' అని ఆమె పేర్కొన్నారు. జగన్‌కు ఒక రాజధాని సరిపోదని, మూడు రాజధానులు కావాలనుకుని ఒక్కటి కూడా నిర్మించలేదని ఎద్దేవా చేశారు. మద్యనిషేధం అమలు చేస్తానన్న జగన్ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని విమర్శించారు. 2.25 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న హామీని జగన్ నెరవేర్చకపోవడంతో నిరుద్యోగులు పస్తులు ఉంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఏటా జాబ్ కేలెండర్ ఇస్తానన్నారని, ఐదేళ్లలో ఐదు సంక్రాంతులు వచ్చినా కేలెండర్ ఊసే లేదని ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీ ఇస్తానని చెప్పి ఎన్నికల ముందు కేవలం 6వేల పోస్టులతో దగా డీఎస్సీ ఇచ్చారని మండిపడ్డారు. 'జాబ్ ఇవ్వలేని జగన్‌కు ఎందుకు ఓటు వేయాలి? సొంత చిన్నాన్నను హత్య చేసిన అవినాశ్‌రెడ్డిని పక్కన పెట్టుకుని తిరుగుతున్న జగన్‌కు ఎందుకు ఓటు వేయాలి?' అని షర్మిల ప్రశ్నించారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తులకు వైసీపీ ఎమ్మెల్సీ పదవులు కేటాయించిందన్నారు. ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందని షర్మిల తెలిపారు.

ఒక్కసారైనా నిజం చెప్పు జగన్!

- నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనా?
- హత్యకేసుపై మాట్లాడ్డానికి వణుకా
- అవినాశ్ దొరికిపోతాడని భయమా
- వైఎస్ భారతి ఎందుకు మాట్లాడట్లేదు?
- ఓడిపోతామని జగన్ జడిసిపోతున్నారు
- రేపోమాపో పదవి ఊడడం ఖాయం
- ఇది రాజకీయ సమరం.. జూన్ 4న ఆన్సర్ వస్తుంది
- వివేకా కుమార్తె డాక్టర్ సునీత వెల్లడి



వివేకా హత్య తర్వాత అవినాశ్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యాన్ని చూపుతున్న సునీత

పులివెందుల, ఏప్రిల్ 30: "మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విషయం మాట్లాడ్డానికి మీరు(జగన్, భారతి) వణుకుతున్నారు. నోరు తెరిచి ఒక్కసారి అయినా మాట్లాడండి" అని వివేకా కుమార్తె డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం పులివెందులలోని తమ ఇంట్లో సునీత.. వివేకా హత్య కేసుకు సంబంధించి పలు విషయాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

కల్లాం మాట మార్చారు

నాన్న హత్యకుగురైన రోజు.. తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో నాన్న చనిపోయినట్లు అజయ్‌కల్లాంకు జగన్ ద్వారా సమాచారం వచ్చినట్లు సీబీఐ విచారణలో చెప్పారు. కానీ, మళ్లీ తాను చెప్పలేదని మాట మార్చారు. ఉదయం 5 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌లోని జగన్‌కు సమాచారం వచ్చింది.. అప్పుడు జగన్ ఇంట్లోకి వెళ్లి.. తిరిగి వచ్చి చిన్నాన్న చనిపోయారని అక్కడున్న వారికి చెప్పారు. విచారణలో అవినాశ్‌రెడ్డి నుంచి 5.15 గంటల సమయంలో పలువురికి ఫోన్ కాల్స్ వెళ్లాయని తేలింది. ఆ ఫోన్ కాల్స్ ఎందుకు చేశారో? ఎవరితో మాట్లాడారో? ఏం చెప్పారో? తెలియాల్సి ఉంది. భారతి దగ్గర పనిచేసే నవీన్‌కు, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డికి ఫోన్‌కాల్స్ వెళ్లాయి.(వివేకా మృతి చెందిన వీడియోను చూపించారు). ఆ ఫోన్ కాల్స్ ఈ వీడియో చూసి గుండెపోటు అని ఎలా నిర్ధారిస్తారు? జగన్ మీడియాలో ఎలా ప్రసారం చేస్తారు? చనిపోయిన అనంతరం మూడు సిట్ బృందాలను ఏర్పాటు చేశారు. మొదటి సిట్ బృందం ముగ్గురిని అరెస్టు చేసింది. రెండవ సిట్ బృందం విచారణ సమయంలో కొమ్మా శ్రీనివాసరెడ్డి గుళికల మందు తిని మృతి చెందారు. ఆయన రాసిన సూసైడ్ నోట్‌లో రెండు రకాల చేతిరాతలున్నాయి. శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యలో కూడా అనుమానం ఉంది. అనంతరం గంగాధర్‌రెడ్డి(కువైట్ గంగాధర) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. సీబీఐ విచారణ వద్దని జగన్ కోర్టు నుంచి పిటిషన్‌ను వెనక్కు తీసుకునే సమయంలో జడ్జి కూడా స్పందించారు. "ఈ కేసులో మీకు(జగన్) బాధ్యత లేదా? మీ అంకుల్ చనిపోతే మీ పోలీసులు ఎవరినీ పూర్తిస్థాయిలో అరెస్టులు గానీ, విచారణ గానీ సాగించలేదు. మీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయలేదని తెలుస్తోంది" అన్నారు. వివేకాను టీడీపీ వాళ్లే హత్య చేశారంటారు. తర్వాత మేము చేశామంటారు. ఈ కేసును 9 నెలల పాటు సీబీఐకి ఇవ్వకుండా, మీ పోలీసుల పరిధిలో ఉంచుకున్నా ఎలాంటి విచారణ సాగలేదు. శంకర్ అరెస్టు అయిన అనంతరం వీరికి భయం పట్టుకుంది. అవినాశ్‌రెడ్డి వరకు కేసు వెళ్తుందని తెలిసి జగన్ మాట తీరు మారింది. కేసు ముందుకు వెళ్లనివ్వకుండా సీబీఐ అధికారి రామ్ సింగ్‌పైన, నాపైన, నా భర్త రాజశేఖర్‌రెడ్డిపైన కేసులు పెట్టారు.

ఏ దేవుడికి తెలుసు?

కేసు విషయానికి వస్తే దేవుడికి తెలుసు.. దేవుడికి తెలుసు అంటున్నారు. ఏ దేవునికి తెలుసో అర్థం కావడం లేదు. (గజ్జల ఉమాశంకర్‌రెడ్డి ఎంపీ అవినాశ్‌రెడ్డి, సీఎం జగన్‌లను కలిసిన ఫొటోలను చూపించారు). నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నారు.. ఈ ఫొటోలు చూస్తే ఎవరికీ తెలియదని అనుకుంటారా? పులివెందులలో గానీ, కడపలో గానీ వివేకానందరెడ్డి అంటే తెలియని మనిషి లేరు. ఇంత దారుణమైన హత్య జరిగితే ఎందుకు సమాధానాలు దొరకలేదు. సీబీఐ చెప్పిన దాని ప్రకారం విచారణ జరగాలి. కానీ ఎందుకు జరగలేదు. వివేకానందరెడ్డి మీ చిన్నమామ. ఆయన గురించి ఎవరైనా అడిగితే ప్రజలలో తిరుగుతున్న మీరు(వైఎస్ భారతి) సమాధానం చెప్పాలి. వివేకానందరెడ్డి కేసు ఎందుకు ముందుకు పోవడం లేదు? ఇప్పుడు నేను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు బయటకు వస్తాయని భయమా? నాకు భయం అంటున్నారు. నాకు భయం అయితే ఇంత వరకు నేను వచ్చేదానినా? మీలో భయం పెట్టుకొని వణుకుతూ ఈ కేసు గురించి మాట్లాడద్దు అని గ్యాగ్ ఆర్డర్ తెచ్చుకున్నారు. ఎక్కడ ఓడిపోతామో అనే భయంతో మీరే ఏదోదో మాట్లాడుతున్నారు. ఇది రాజకీయ సమరం. ఈ రాజకీయానికి జూన్ 4న సమాధానం వస్తుంది.

> **జగన్ పదవి పోతుంది**
>
> పులివెందులలో వారం రోజులుగా తిరుగుతుంటే ప్రజల బాధ వారి కళ్లలో కనిపించిందని సునీత తెలిపారు. భయంతో సీఎం జగన్ ఏం చెబుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. నోరు తెరిస్తే అబద్ధాలు వస్తున్నాయని, ఒక్కసారైనా నిజం ఒప్పుకోవాలని కోరారు. జగన్‌కి రేపో మాపో పదవి పోతుందనిపిస్తోందన్నారు. ప్రజలకు ఏమైనా అన్యాయం జరిగితే అడగడానికి భయపడే పరిస్థితి వచ్చిందని సునీత అన్నారు. ఎందుకంటే తర్వాత సీఐడీ, పోలీసులు కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. దీంతో న్యాయం కోరడం కాదు కదా.. తమకు అన్యాయం జరిగిందని పక్కింటి వాళ్లకు చెప్పుకొనేందుకు కూడా భయపడతున్నారని అన్నారు. "కనీసం వివేకా నా ఆత్మీయుడు అని చెప్పుకోవడానికి భయపడే స్థితి వచ్చింది" అని సునీత ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజలకు ఇదో అవకాశం

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం సునీత మీడియాతో మాట్లాడారు. "కోర్టుల్లో న్యాయం ఎప్పుడు జరుగుతుందో నాకు తెలియదు. కానీ పులివెందుల, కడప ప్రజలకు ఇదో అవకాశం. మన వివేకా సార్‌కి న్యాయం జరిగేలా చూడండి. ప్రతిసారీ కోర్టుల్లోనే న్యాయం జరగాల్సిన అవసరం లేదు. ప్రజల చేతిలో కూడా న్యాయం ఉంటుంది. మీ ఓటు నిందితులకు వేస్తారా లేక న్యాయం పక్కన ఉంటుందా అనేది ఆలోచించాలి. 1978 నుంచి వివేకానందరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి కడప ప్రజల కోసం శ్రమించారు. దీనిని మనసులో పెట్టుకుని ఎంత కష్టమైనా చనిపోయిన వ్యక్తికి న్యాయం చేయాలి. చనిపోయిన వ్యక్తి మనవద్దకొచ్చి న్యాయం చేయండని అడిగే పరిస్థితి లేదు. మన మనస్సాక్షిని మనం అడగాలి. మనం ఏం చేయాలి అన్నదానికి సమాధానం లభిస్తుంది. ప్రజలు మంచిదారిలో వెళ్తారని నమ్ముతున్నా" అని డాక్టర్ సునీత అన్నారు.

పులివెందులలో స్వాతంత్ర్యం పోయింది

దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిందని, కానీ పులివెందులకు ఆ స్వాతంత్ర్యం పోయిందని సునీత అన్నారు. ఇంత నరకం ఉండకూడదన్నారు. "రాజశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, రాజారెడ్డిలతో నువ్వు తప్పుచేశావని ధైర్యంగా మాట్లాడగలుగుతారు. పోరాడి వారి హక్కులు తెచ్చుకునే వారు. కానీ, ఇపుడున్న వారు వారి వారసులు ఎలా అవుతారు? అద్దంలో చూసుకోండి వారసుల్లా కనిపిస్తున్నారా?" అని నిలదీశారు. పులివెందుల ప్రజలకు 2019కి ముందున్న స్వేచ్ఛ లేదన్నారు. ఆ భయం పోవాలన్నారు. ఆ స్వేచ్ఛ మళ్లీ రావాలంటే ఓటు వేసేటపుడు బాగా ఆలోచించుకోవాలని సూచించారు. "నేను ఇన్ని రోజులు మాట్లాడింది న్యాయం గురించి. ఇపుడు మాట్లాడుతోంది మీ స్వేచ్ఛ గురించి. ఎవరికి ఓటు వేయాలో ఆలోచించుకోవాలి" అన్నారు.

కుమ్మక్కు అబద్ధం

సీఎం జగన్ నోరు తెరిస్తే అబద్ధాలే వస్తాయని సునీత్ అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేనతో తాను కుమ్మక్కు కావడం ఏమిటని ప్రశ్నించారు. తాను పోరాడుతోంది న్యాయం కోసమన్నారు. "మీ పార్టీ వాళ్లు నాతో మాట్లాడాలంటే భయపడుతున్నారు. నాతో వచ్చేందుకు భయపడుతున్నారు. నాతో పర్సనల్‌గా మాట్లాడితే మాత్రం మేము మీతో ఉన్నామంటున్నారు. వారు బయట చెప్పుకోలేని పరిస్థితి. నేను టీడీపీ, బీజేపీ, జనసేనతో వెళ్లడం లేదు. నా బాధ చూసి ప్రతిపక్షనేతలుగా వారు తమ బాధ్యత నిర్వహిస్తున్నారు. దీన్ని కుమ్మక్కు అంటారా?" అని సునీత నిలదీశారు.



ఉద్యోగాలు ఇవ్వలేనివాడు నాయకుడా?

దెందులూరులో మంగళవారం నిర్వహించిన ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

- పిల్లలను జగన్ గంజాయిపరం చేశారు: చంద్రబాబు
- పులివెందులలో సీఎం భార్యనే జనం నిలదీశారు
- ఆ స్ఫూర్తితో అందరూ రోడ్లపైకి రావాలి
- తాడో పేడో తేల్చుకుందాం
- ప్రజాగళంలో టీడీపీ అధినేత పిలుపు
- దెందులూరు, తెనాలిల్లో భారీ సభలు

ఏలూరు, గుంటూరు-ఆంధ్రజ్యోతి/దెందులూరు/పెదవేగి, ఏప్రిల్ 30: పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వలేనివాడు ఒక నాయకుడా అని టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం జగన్‌పై ధ్వజమెత్తారు. పిల్లలను గంజాయిపరం చేశారని దుయ్యబట్టారు. ఎన్నికల మేనిఫెస్టో అంటే ఐదేళ్లలో చేయబోయే పనులని.. అంతే గానీ ఇంట్లో కూర్చుని బటన్ నొక్కేస్తానంటే కుదురుతుందా అని నిలదీశారు. 'నేనేమీ చేయలేనంటా.. ఈ ముగాడు పెద్దగా చేస్తాడంటా.. చూశారుగా ఏం చేశాడో ఇప్పటివరకు' అని ఎద్దేవాచేశారు. ఉమ్మడి మేనిఫెస్టో అదిరిపోయిందని.. సైకో మేనిఫెస్టో కిందకు దిగిపోయిందన్నారు. ప్రజాగళంలో భాగంగా మంగళవారం సాయంత్రం ఏలూరు జిల్లా దెందులూరు, రాత్రికి గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. 'కొత్తగా జగన్ గాంబ్లింగ్ యాక్టు తెస్తున్నారు.. ఆ చట్టం అమలైతే మన ఆస్తులన్నీ ఆయనే కైవసం చేసుకుంటారు. అబద్ధాలు చెప్పడంలో పీహెచ్‌డీ చేశారు. తప్పులు చేసినవాడిని కాదని బాధితుల పైనే కేసులు పెట్టిస్తున్నారు. ఆయన్ను చూడగానే గొడ్డలి జ్ఞాపకం వస్తుంది. కరెంటు చార్జీలు పెంచనని చెప్పి తొమ్మిదిసార్లు పెంచారు. ఆస్తిపన్ను, చెత్తమీద పన్ను.. ఇలా పన్నుమీద పన్ను వసూలు చేస్తున్నారు' అని దుయ్యబట్టారు. ఇంకా ఏమన్నారంటే..

రికార్డులు మార్చేస్తే గిజగిజే

జగన్ తీసుకొచ్చింది ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. అది జగన్ గ్రాబింగ్ యాక్టు. ఆ చట్టంతో భూములు ప్రజల పేరుతో ఉండవు. జగన్ ఆన్‌లైన్‌లో పెట్టుకుంటాడు. రికార్డులు మార్చేస్తే వాటి యజమానులు గిజగిజ కొట్టుకోవడం తప్ప చేయగలిగింది ఏమీ ఉండదు. నిన్న జగన్ భార్య పులివెందులకు వెళ్తే భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ధైర్యంగా అడిగాడు. ఏమమ్మా నా భూమి మీ ఆయన ఇచ్చాడా... మీ మామ ఇచ్చాడా... మీ తండ్రి ఇచ్చాడా? మా తండ్రి, తాత ఇచ్చారు. అలాంటిది మా భూమి పట్టాదారు పాసుపుస్తకంపై నీ భర్త ఫొటో ఏందని అడిగాడు. ఆ విధంగా తిరుగుబాటు పులివెందుల నుంచే మొదలైంది.

హత్యా రాజకీయాల మనస్తత్వమా నాది?

నేను జగన్‌ను చంపేస్తానట! బుద్ధుందా ఆయనకు? హత్యా రాజకీయాలు చేసే మనస్తత్వమా నాది..! అభివృద్ధి చేసే రాజకీయం నాది. అయన్ను చంపడానికి ప్లాన్ వేస్తున్నామని ఆయన మాట్లాడతారు.. ఆయన భార్య మాట్లాడుతున్నారు.. ఏ-2 కూడా మాట్లాడతారు. ఇటువంటి వ్యక్తిని శాశ్వతంగా రాజకీయాల నుంచి పంపేయాలి!

ఎవరు బాగున్నా సహించలేరు..

జగన్ ఒక అహంకారి.. సైకో మనస్తత్వం కలిగిన వ్యక్తి. పక్కనున్నవాళ్లు తెల్లబట్టలు వేసుకున్నా సహించలేని గుణం. ఎవరన్నా బాగుంటే ఏమాత్రం ఉపేక్షించరు. జగన్.. కక్షలుంటే నీ ఇంట్లో పెట్టుకో. ప్రజాజీవితంలో వాటికి తావు లేదు. నాకు, ఆయనకు ఆస్తుల తగాదా ఉందా..ఆయనేమైనా మా దాయాదా.. ఊరోడా.. బంధువా, కులమా? రాజకీయ విభేదాలు సిద్ధాంతపరంగా ఉంటాయి.

బీజేపీ వాళ్లు ఇంట్లో కూర్చోవద్దు

రాష్ట్రంలో వైసీపీ ఉండడానికి వీల్లేదు. ఓట్లు చీలడానికి వీల్లేదని, అందుకు పొత్తు అనివార్యమని పవన్ చెప్పారు. ఆ స్ఫూర్తి ఎక్కడికెళ్లినా ప్రజల్లో కనిపిస్తోంది. బీజేపీ పోటీచేయడం లేదని ఆ పార్టీ వాళ్లు ఇంట్లో కూర్చోవద్దు. తిరుగులేని మెజారిటీ వచ్చేలా చూడాలి. చింతమనేని మీద అక్రమ కేసులు పెట్టారు...నాపైనా కేసులు పెట్టారు. తప్పుడు కేసులు పెట్టిన ప్రతి ఒక్కరికీ వడ్డీతో సహా చెల్లించే బాధ్యత నాది.. రైతులకు గోనె సంచులు ఇవ్వలేని ఎర్రిపప్ప (మంత్రి కారుమూరి నాగేశ్వరరావు).. తన కొడుకును (వైసీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి) ఇక్కడకు పంపించాడు. అయన్ను ప్రజలంతా ఎర్రిపప్ప చేసి ఇంటికి పంపాలి. కాగా, చంద్రబాబు బుధవారం బాపట్ల జిల్లా చీరాలలో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తర్వాత గుంటూరులో రోడ్ షో, సభలో పాల్గొంటారు.

అన్నం పెడితే సహించలేరు

2014-19 నడుమ అభివృద్ధిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ వన్‌గా నిలిపాం. 100 సంక్షేమ పథకాలు అమలు చేశాం. అలాంటిది అన్న క్యాంటీన్లను జగన్ తీసేశారు. పేదలకు అన్నం పెడితే సహించలేని మూర్ఖుడు. ఇలాంటి వ్యక్తి పేదల పెన్నిధా? రంజాన్ తోఫాలు ఆపేశాడు. పండగ చేసుకోకుండా పొట్టగొట్టిన వ్యక్తి మైనారిటీలకు శ్రేయోభిలాషా? మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో మంచి న్యాయవాదులను పెట్టి పోరాడింది టీడీపీయే. బీజేపీ నేత సిద్ధార్థనాథ్ సింగ్ సమక్షంలోనే ఉమ్మడి మేనిఫెస్టోలో మైనారిటీ డిక్లరేషన్‌ను ప్రకటించాం. అదీ మాకు మైనారిటీలపై ఉన్న చిత్తశుద్ధి. వారి జోలికొస్తే తాట తీస్తాం.

బ్యాండేజ్ బబ్లూని సాగనంపాలి

- జగన్ పాలనలో అధికంగా నష్టపోయింది యువతే
- వచ్చే ఎన్నికల్లో వాళ్లే ఆయనను తరిమికొడతారు
- ఒంగోలు 'యువగళం' సభలో నారా లోకేశ్



ఒంగోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు.. నేడు బ్యాండేజ్ బబ్లూగా మారి ఆస్కార్ అవార్డు అందుకునే స్థాయిలో నటిస్తున్న జగన్ పాలనలో అత్యధికంగా నష్టపోయింది యువతే. టీడీపీ పాలనలో ఏపీ జాబ్ క్యాపిటల్‌గా ఉంటే.. జగన్ పాలనలో గంజాయి క్యాపిటల్‌గా మారింది. వచ్చే ఎన్నికల్లో ఈ అరాచక ముఖ్యమంత్రిని తరిమికొట్టేందుకు యువత సిద్ధంగా ఉంది' అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఒంగోలులో మంగళవారం నిర్వహించిన 'యువగళం' సభలో ఆయన యువతతో ముఖాముఖి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, జగన్ పాలనలో యువతకు జరిగిన నష్టం.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జగన్ అధికారంలోకి వచ్చాక టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి తెచ్చిన పలు పరిశ్రమలను వెళ్లగొట్టారని విమర్శించారు. దానివల్ల యువత ఉపాధి అవకాశాలను కోల్పోయారన్నారు. గత ఎన్నికల వేళ 2.30 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్.. వాటిని నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బటన్ నొక్కినా, వాటిని సకాలంలో ఇవ్వకుండా విద్యార్థులను ఆందోళనకు గురిచేశారని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏటా 20 లక్షల ఉద్యోగాల కల్పన, పోస్టుల భర్తీ, మెగా డీఎస్సీపై తొలి సంతకం, నైపుణ్యాభివృద్ధి శిక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రాభివృద్ధి, రాజధాని, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల పెంపు, రెడ్‌బుక్ ప్రకటన, క్రైస్తవ ఆస్తుల సంరక్షణ, ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై యువత అడిగిన ప్రశ్నలపై లోకేశ్ ఓపికగా సమాధానమిచ్చారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన చేస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో సాగనంపాలని, దానికోసం యువత కీలకంగా పనిచేయాలని కోరారు. చంద్రబాబు అంటే ఒక బ్రాండ్ అని, ఆయన కృషితో రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తామనిచెప్పారు. రెడ్‌బుక్‌పై సమాధానమిస్తూ.. అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరించిన అధికారులపై చట్టపరిధిలో చర్యలు తీసుకుంటాం తప్ప ఉద్దేశపూర్వకంగా, నిబంధనలకు విరుద్ధంగా చర్యలు ఉండవన్నారు.

ఫార్మాహబ్‌గా ప్రకాశం

యువగళం పాదయాత్రలో ప్రకటించిన విధంగా ప్రకాశం జిల్లాను ఫార్మాహబ్‌గా చేస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టును ఏడాదిలో పూర్తిచేసి నీటిని ఇవ్వడంతో పాటు వంద రోజుల్లో నిమ్జ్‌లో పరిశ్రమలు వచ్చేలా చూస్తామన్నారు. కాగా, ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు.



కొయ్యలగూడెంలో పవన్ కల్యాణ్ సభకు హాజరైన జనం

పరాయి ఆస్తులు దోచుకోవడం.. జగన్ డీఎన్ఏలోనే ఉంది!

- తాతల నుంచీ ఇంతే: పవన్ కల్యాణ్
- కుల కక్షకు కేరాఫ్ జగన్
- వైసీపీ సర్కారుకు ఏటీఎంలా పోలవరం
- కొయ్యలగూడెం సభలో జనసేనాని ఫైర్



కొయ్యలగూడెం సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ఏలూరు/కొయ్యలగూడెం/నిడమర్రు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'పరాయి ఆస్తులు దోచుకోవడం జగన్ డీఎన్ఏలోనే ఉంది. తాతల నుంచీ పరాయి ఆస్తులపై కన్ను వేశారు' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ సీఎంపై ధ్వజమెత్తారు. మంగళవారం ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెంలో వారాహి విజయయాత్రలో ఆయన ప్రసంగించారు. మన తాత ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తి పత్రాలపై జగన్ ఫొటోలెందుకని యువత నిలదీయాలని.. వైసీపీ మీద కోపం రేపు ఎన్నికల్లో చూపించాలని పిలుపిచ్చారు. సరిహద్దు రాళ్లమీద జగన్ బొమ్మ అవసరమా అని ప్రశ్నించారు. 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వచ్చాక మన ఇల్లు మనదేనని నిరూపించుకోవాలి. సజ్జల, మిథున్‌రెడ్డిల కన్ను పడితే ఆక్రమణే! కోర్టుకు వెళ్లకూడదంట. అధికారుల వద్దకు వెళ్లాలట. మన ఆస్తి పత్రాల ఒరిజినల్స్ వారి వద్ద.. జిరాక్స్‌లు మన వద్దా? ఇదెక్కడి న్యాయం? దున్నని ప్రతి భూమినీ జగన్ ఆక్రమిస్తాడు. మన ఇల్లు, మన భూములను తాకట్టు పెట్టేస్తాడు. ఈ ఐదేళ్లలో చేసిన విధ్వంసం చూశాం. మరో ఐదేళ్లు భరించలేం' అని స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి రాక ముందు నుంచీ ఈ ఏజెన్సీ ప్రాంతంలో సంచరించానని.. ఇక్కడి ప్రజలు కష్టాలు తెలిసినవాడినని చెప్పారు. ఒక కులానికి లబ్ధి చేకూరుతుందని జగన్ చింతలపూడిని ఆపేశారని.. ఒక కులం కోసం అమరావతిని కట్టలేదని.. కుల కక్షకు కేరాఫ్ అడ్రస్ ఆయనేనని విమర్శించారు. 'నన్ను కాపు ఎమ్మెల్యేలతో తిట్టిస్తాడు. ఎంఆర్‌పీఎస్ ఉద్యమ నేత మంద కృష్ణ మాదిగ రెండున్నర దశాబ్దాల పోరాటం ఈ రోజు ప్రధాని మోదీ దృష్టిలో పడింది. కాపు రిజర్వేషన్లను జగన్ ఆపేశారు. ఈబీసీలో కూడా 5 శాతం రిజర్వేషన్ తీసేశాడు. అప్పుడు ఈ కాపు ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడలేదు? నన్ను తిట్టడానికి వారిని వాడతారు. ఏ ఒక్క కులంతో రాష్ట్రాన్ని నడపలేం. అన్ని కులాల సహకారంతోనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలం. 30 కేసులున్న జగన్ మనల్ని పాలిస్తారా' అని ప్రశ్నించారు. పోలవరం జగన్ ప్రభుత్వానికి ఏటీఎంలా తయారైందని పవన్ విమర్శించారు. దీనిని పూర్తి చేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వానిదేనన్నారు. భగీరథుడు స్ఫూర్తిగా 2027లోపు పూర్తి చేస్తామని తెలిపారు. 'ఎప్పుడు పూర్తవుతుందంటే గంటకో మాట చెప్పేవాడు మంత్రి అనిల్. బపూన్ రాంబాబు అయితే నాకేం తెలుసునంటూ డాన్స్ ప్రాక్టీసులు చేసుకునేవాడు. వీళ్లు ఇరిగేషన్ మంత్రులా' అని నిలదీశారు.

నిర్వాసితులకు పవన్, పుట్టా చెరో కోటి

పోలవరం నిర్మాణానికి కేంద్రం సొమ్ములు పంపితే ఈ జగన్ ప్రభుత్వం దొంగ లెక్కలతో సొమ్ములు లేకుండా చేసిందని పవన్ విమర్శించారు. '1.65 లక్షల మంది నిర్వాసితులకు సొమ్ములు ఇవ్వకపోవడంతో వారు రోడ్డున పడ్డారు. వారందరికీ మనం అండగా నిలబడదాం. కరాటం రాంబాబు పోలవరం కోసం 110 ఎకరాలు ఇచ్చారు. మన ప్రభుత్వం వచ్చాక ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధిని ఏర్పాటు చేసుకుని రూ.33 వేల కోట్లు పోగుచేసి వారికి ఇద్దాం' అని అన్నారు. ఆ నిధి కోసం తన వంతుగా కోటి రూపాయల సొంత సొమ్మును ఆయన విరాళంగా ప్రకటించారు. ఆ వెంటనే టీడీపీ ఏలూరు పార్లమెంటరీ అభ్యర్థి పుట్టా మహేశ్ యాదవ్ కూడా రూ.కోటి విరాళం ప్రకటించారు.

6న తాళ్లపాలెం సభకు ప్రధాని మోదీ: సీఎం రమేశ్

నక్కపల్లి, ఏప్రిల్ 30: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో ఈ నెల 6న నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారని కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ తెలిపారు. ప్రధాని సభకు పాయకరావుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ అనకాపల్లి వస్తున్నారంటే జిల్లా అభివృద్ధికి మార్గం ఏర్పడినట్టేనని రమేశ్ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


సీతారామపురంలో సమస్యలపై వెలంపల్లికి వివరిస్తున్న స్థానికుడు


సమాధానం చెప్పలేక వెనుదిరుగుతున్న వెలంపల్లి

వెలంపల్లికి నిరసన సెగ

- రోడ్లు నిర్మించి మార్జిన్లు వదిలేశారు
- ఎమ్మెల్యే విష్ణు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు
- మట్టి రోడ్డుగానే ఉంచారని 25వ డివిజన్‌వాసుల ఆగ్రహం
- కార్పొరేటర్‌తో స్వల్ప వాగ్వాదం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 30 : సెంట్రల్ నియోజవర్గం వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్‌కు మంగళవారం నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా 25వ డివిజన్‌లోని సీతారామపురం శివాజీ కేఫ్ సెంటర్‌లో సిమెంట్ రోడ్లు నిర్మించి మార్జిన్లు వదిలేసిన విషయంపై స్థానికులు వెలంపల్లి దృష్టికి తెచ్చారు. సిమెంట్ రోడ్డు మార్జిన్‌లో టైల్స్ అతికించకుండా కాంట్రాక్టర్లు పనులు ఎగ్గొట్టి బిల్లులు మొత్తానికి చేసుకున్నారని స్థానికులు ఆరోపించారు. గతంలో విషయాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకెళ్లామని, ఆయన తగిన విధంగా స్పందించలేదని వెలంపల్లి శ్రీనివాస్‌కు వివరించారు. ఎక్సైజ్ కార్యాలయం రోడ్డులో డ్రైనేజీ సమస్య ఉందని, గత 15 ఏళ్లుగా ఈ సమస్యపై అధికారులకు వివరిస్తున్నా పనులు జరగడం లేదని మండిపడ్డారు. ఈ రోడ్డు మట్టి రోడ్డుగానే ఉంచేశారని, తారు రోడ్డు వేయడం గానీ, సిమెంట్ రోడ్డు వేయడం కానీ చేయడం లేదని, ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. స్థానికంగా అంత అవగాహన లేని వెలంపల్లికి పక్కనే ఉన్న 25వ డివిజన్ కార్పొరేటర్ బంకా శకుంతల, డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి బంకా భాస్కరరావును అడిగి విషయం తెలుసుకున్నారు. ఈ విషయంపై స్థానిక నేతలకు కార్పొరేటర్‌కు మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. జోక్యం చేసుకున్న వెలంపల్లి ఇరువర్గాలను శాంతపరిచి ఎన్నికల తరువాత సమస్యలు పరిష్కరిస్తానని, కాస్త ఓపిక పట్టమని స్థానికులకు నచ్చజెప్పడంతో స్థానికులు శాంతించారు.

విద్యుత్ వైరు తగిలి యువకుడు మృతి

విద్యాధరపురం, ఏప్రిల్ 30 : విద్యాధరపురం బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న ఓ ఎగ్జిబిషన్‌లో విద్యుత్ వైరు తగిలి రాణిగారి తోటకు చెందిన రొయ్యూరు సురేష్ అలియాస్ సూరిబాబు (29) మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. మృతుడి సోదరుడు రొయ్యూరు ఏసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాణిగారితోట అంథోని వీధిలో రొయ్యూరు సురేష్ ఉంటున్నాడు. ఇతనికి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. భార్యభర్తల మధ్య మనస్థాపాలు రావడంతో విడిపోయారు. అప్పటి నుంచి సురేష్ సోదరుడి వద్ద ఉంటున్నాడు. ప్రస్తుతం ఇతను రాణిగారి తోటలోని ఓ పెయింటింగ్ షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 8 గంటలకు సురేష్ పెయింట్ షాపులో పనిచేసే నంద్యాల మురళీకృష్ణ, మరో స్నేహితుడు సీహెచ్ నవీన్ మోటార్ సైకిల్‌పై విద్యాధరపురం బైపాస్ రోడ్డులోని ఎగ్జిబిషన్‌కు వెళ్లారు. ముగ్గురు ఎగ్జిబిషన్‌లో సెల్ఫీ దిగుతుండగా పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ వైర్ సురేష్‌కు తగిలింది. దీంతో అతను కిందపడిపోవడంతో అతని స్నేహితులు అక్కడున్నవారు బాధితుడిని ఆటోలో ఎక్కించుకుని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు.

శ్రీశ్రీ సాహిత్య నిధి పుస్తకాల ఆవిష్కరణ


తుమ్మలపల్లి కళాక్షేత్ర ప్రాంగణంలోని శ్రీశ్రీ విగ్రహం వద్ద పుస్తకావిష్కరణలో సాహిత్యవేత్తలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 30 : మహాకవి శ్రీశ్రీ 114వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. రచయితలు, సాహిత్య, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని శ్రీశ్రీకి నివాళులర్పించారు. శ్రీశ్రీ సాహిత్య నిధి వెలువరించిన 10 పుస్తకాలను ఆవిష్కరించారు. సంస్థ కన్వీనర్ సింగంపల్లి అశోక్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్, ఎక్స్‌రే సాహిత్య సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, వివిధ సంఘాల ప్రతినిధులు అరసవిల్లి కృష్ణ, ఓర ప్రసాద్, మోతుకూరి అరుణ్‌కుమార్, చెరుకూరి సత్యనారాయణ, బండ్ల మాధవరావు, గోళ్ల నారాయణరావు, అంజనేయరాజు, కొల్లా రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని సమస్యతో జగన్ ఓటమి ఖాయం

విద్యాధరపురం, ఏప్రిల్ 30 : రాబోయే ఎన్నికల్లో జగన్ ఓటమికి మూడు రాజధానులే కారణం కానున్నాయని సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్ ఆశించిన వికేంద్రీకరణ ఫలాలు దళిత బడుగు బలహీనవర్గాలకు అందుతాయని నమ్మి జగన్ ప్రకటించిన మూడు రాజధానులకు కట్టుబడి ఉద్యమం చేశామని అయితే జగన్ వికేంద్రీకరణకు, అంబేద్కర్ ఆశించిన వికేంద్రీకరణకు పొంతన లేకుండా పోవడంతో మోసపోయామని గుర్తించే సరికి నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయన్నారు. మూడు రాజధానుల ఆలోచన వెనుక కుట్ర కోణం దాగుందని ఇదే ఆయన ఓటమికి కారణమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సంకే విశ్వనాథ్, కామా దేవరాజ్, అబిద్ హుస్సేన్, ఎన్.నరసింహా చౌదరి తదితర నాయకులు పాల్గొన్నారు.

10 నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

ఉంగుటూరు, ఏప్రిల్ 30 : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్వర్ణ భారత్‌ట్రస్ట్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ఆత్కూరు స్వర్ణ భారత్‌ట్రస్ట్ ఆవరణలోని యూబీఆర్ఎస్ఈటీఐలో మహిళలకు పలు వృత్తినైపుణ్య కోర్సుల్లో ఉచితశిక్షణలు నిరంతరాయంగా అందిస్తున్నట్టు శిక్షణాకేంద్రం డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మే 10 నుంచి బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. శిక్షణానంతరం స్వయం ఉపాధి పొందే యువతులకు బ్యాంకు ద్వారా రుణసౌకర్యం కల్పించడంలో సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 63042 54730, 99519 20120 నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

దుర్గగుడిలో నృత్య ప్రదర్శనలు

వన్‌టౌన్, ఏప్రిల్ 30 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరిగే నిత్య నీరాజనం కార్యక్రమం మంగళవారం ఆలయంలోని ధర్మపదం కళావేదికపై విజయవాడ భవానీపురానికి చెందిన శారద నృత్య కళాపీఠం వారి ఆధ్వర్యంలో జార్ఖండ్‌కు చెందిన తరిత్ సర్కార్ కథక్ నృత్యం, వెస్ట్ బెంగాల్‌కు చెందిన హేమంత్ విశ్వకర్మ మణిపూరి నృత్యాన్ని ప్రదర్శించారు. వీరితో పాటు శారద నృత్య కళాపీఠం నాట్యాచార్య సంతోష్ ఆధ్వర్యంలో పిల్లలు భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

వేసవి ఉచిత క్రీడా శిబిరాలు 15కు వాయిదా

విజయవాడ స్పోర్ట్సు, ఏప్రిల్ 30 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న కారణంగా మే 1 నుంచి జరగాల్సిన వేసవి ఉచిత క్రీడా శిబిరాలను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశామని ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ.అజీజ్ తెలిపారు. ఈ మేరకు శాప్ ఎండీ నుంచి సర్క్యులర్ తమకు అందిందన్నారు. శాప్ గైడ్‌లెన్స్ ప్రకారం మే 15 నుంచి జూన్ 14 వరకు జిల్లాలో 50 ఉచిత క్రీడాశిబిరాలను నిర్వహిస్తామని అజీజ్ తెలిపారు.

25 నుంచి జ్యోతిర్లింగ దివ్య దక్షిణయాత్ర

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 30 : ఐఆర్‌సీటీసీ ఈనెల 25 నుంచి జ్యోతిర్లింగ దివ్య దక్షిణయాత్ర ప్యాకేజీని మంగళవారం ప్రకటించింది. తొమ్మిది రాత్రులు, పదిరోజుల పాటు సాగే ఈ యాత్రలో అరుణాచలం, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తంజావూరు, తిరుచ్చి, త్రివేండ్రం ఉన్నాయి. మే 25 నుంచి ప్రారంభమై జూన్ 2వ తేదీ వరకు ఈ యాత్ర కొనసాగుతుంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈ ప్రత్యేక రైలు యాత్ర ప్రారంభమవుతుంది. విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గుడూరు, రేణుగుంటల మీదుగా వెళుతుంది. వివరాలకు ప్రవీణ్-9281495848, రాజేష్-8977314121 నెంబర్లను సంప్రతించవచ్చన్నారు.

కూటమి మేనిఫెస్టోపై వీరాంజనేయులు హర్షం

కృష్ణలంక, ఏప్రిల్ 30 : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు స్థానిక సంస్థలకు ప్రత్యేకంగా పంచాయతీ డిక్లరేషన్ చేస్తూ హామీ ఇచ్చిన కూటమి మేనిఫెస్టోపై అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం పంపించిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బకాయిల పేరుతో చెల్లించుకోవడం, ఆ నిధులను సకాలంలో ఇవ్వకుండా గ్రామ పంచాయతీలను ఇబ్బందులకు గురిచేయడం వీటన్నిటిపై సమీక్ష చేసి అన్నిటినీ సరిచేసి డైరెక్ట్‌గా నిధులను పంచాయతీలకు ఇస్తానని స్పష్టంగా చంద్రబాబు మేనిఫెస్టోలో తెలపడం అభినందనీయమన్నారు.

సాగుతూ...నే..

20, 30 ప్లాట్లు ఉన్న అపార్టుమెంట్ అన్ని సౌకర్యాలతో కలిసిన నిర్మాణం చేయలన్నా.. 20 గదులతో కూడిన భవనం నిర్మించాలన్నా నిదానంగా పనులు చేసినా ప్రస్తుత పరిస్థితుల్లో ఏడాదిలో పూర్తవుతుంది. కానీ.. పిల్లర్లు, శ్లాబులతో సంబంధం లేకుండా 14 గదులు కట్టడానికి మూడేళ్లు పట్టింది. 2022 నుంచి నిర్మిస్తూనే ఉన్నా ఇంకా 40 శాతం పనులు మిగిలే ఉన్నాయి. ఇదెక్కడ అనుకుంటున్నారా.. అదేనండీ నాడు-నేడు పనుల్లో భాగంగా మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లోని వీఎంసీ బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ దుస్థితి ఇదీ..

- మూడేళ్లయినా పూర్తికాని నాడు-నేడు పనులు
- బీఎస్ఆర్‌కే పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పెండింగులోనే
- ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిన పనులు

మొగల్రాజపురం : చుట్టుపక్కల ఉన్న కొండ ప్రాంతం. పేదలు ఎక్కువగా ఉండే గిరిపురం. ఉడ్‌పేట, నెహ్రూనగర్, 6, 7, 8, 4, 5 డివిజన్లలో నివసించే పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ప్రైమరీ, హైస్కూల్ చదువుకు మున్సిపల్ కార్పొరేషన్ నడుపుతున్న ఈ పాఠశాలకు వస్తారు. ఇక్కడ వెయ్యి మందికిపైగా విద్యార్థులున్నారు. రాష్ట్ర విభజన తరువాత ఈ పాఠశాలను ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) దత్తత తీసుకుంది. అప్పటి నుంచే ఈ పాఠశాల రూపురేఖలు మారడం మొదలైంది. అమ్మ అసోసియేషన్ కంప్యూటర్ లాబ్ చేయడం, కంప్యూటర్ టీచర్‌లకు జీతాలు, వాచ్‌మెన్, స్వీపర్‌లకు జీతాలు, విద్యార్థులకు ప్రతి ఏటా పుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఇస్తూ వస్తోంది. వైసీపీ అధికారంలోకొచ్చాక నాడు - నేడులో పథకంలో ఈ పాఠశాలను 2022లో చేర్చింది. రూ.2.45 కోట్లు అంచనాలు వేసి రివాల్వింగ్ ఫండ్ కింద మొదటి విడత రూ.36 లక్షలు ఇచ్చింది.


పాఠశాల లోపలి భాగం ప్రధాన ద్వారం వద్ద నిర్మాణం (వృత్తంలో)

2022 మే నెలలో పనులు ప్రారంభించింది. అప్పటి నుంచో కొనసాగుతూనే ఉన్నాయి.

నిర్మాణానికి నిధుల కేటాయింపు రూపాయల్లో	
14 అదనపు తరగతి గదులు	1,51,40,631
ప్రహరీ నిర్మాణం నిమిత్తం	5,64,849
ఎలక్ట్రికల్ వర్కు	8,45,447
గ్రీన్ చాక్ బోర్డులు	2,24,638
తాగునీటి నిమిత్తం ఆర్‌వో ప్లాంట్	5,87,491
వంట షెడ్	3,55,908
టాయిలెట్స్ రన్నింగ్ వాటర్ పనులు	19,32,125
ఫర్నిచర్	12,69,080
పాఠశాల మొత్తం పెయింటింగ్ పనులు	8,48,620
మేజర్, మైనర్ మరమ్మతులకు	27,71,777

ఎన్నికల కోడ్ పేరుతో ప్రస్తుతం పనులు ఆపేశారు. వాస్తవానికి నిధుల కొరతతో పనులు ఆగాయి. అసంపూర్తిగా ఉన్న ఈ గదుల్లో ఒక మూడు గదులను వినియోగిస్తున్నారు. ఏప్రిల్ 2024 వచ్చినా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

- పాఠశాల ప్రధాన గేటు వద్ద ఖాళీ స్థలంలో మాత్రమే పడమరవైపు రెండు అంతస్తులతో ఫ్లోర్‌కు ఒక గది మేర చిన్న భవనం కట్టారు. ఉత్తరం, దక్షిణం ఉన్న పాత భవనంపై గోడలు కట్టి రేకుల షెడ్ వేశారు. లోపల జిప్సం సీలింగ్ చేశారు. ఒక పక్కన టాయ్‌లెట్స్ కట్టారు. ఈ పనులకు రెండున్నర సంవత్సరాలు దాటింది.

● చేయాల్సిన పనులు

గోడలు కట్టి రేకుల షేడ్ వేసి సీలింగ్ చేశారు. ఇంకా ఫ్లోరింగ్ పనులు పూర్తికాలేదు. గుమ్మాలకు డోర్‌లు పూర్తిస్థాయిలో బిగించలేదు. కిటికీలు మొదలు పెట్టలేదు. కొన్ని గదుల్లో వైరింగ్ చేయాలి. ఫ్యాన్‌లు బిగించాలి. చాక్ బోర్డులు బిగించాలి. కారిడార్లలో ఫ్లోరింగ్ చేయాలి. ఆర్‌వో ప్లాంట్‌కు షెడ్ వేయాలి. వంట గదికి షెడ్ వేయాలి. పెయింట్లు వేయాలి. దక్షిణంవైపు పాతభవనంపైన రెండో అంతస్తులో బాత్ రూంలలో ఇంకా సగం పనులు మిగిలే ఉన్నాయి.


అసంపూర్తిగా మిగిలిన ఫ్లోరింగ్, కారిడార్ పనులు

● స్లాబ్‌కు బదులు రేకులా?

మొత్తం రెండున్న కోట్ల అంచానాతో మొదలైన నాడు-నేడు పనుల్లో తరగతి గదుల స్ట్రక్చర్‌కు కోటిన్నర కేటాయించారు. ఈ నిధులతో ప్రస్తుతం రెండో అంతస్తులో పైకప్పుకు స్లాబ్‌కు బదులు రేకుల వేయడంపై విమర్శలు వస్తున్నాయి. గోడలు కట్టి, రేకులేవేయడానికి రెండున్నర సంవత్సరాలు గడిపారు. ఇంకా చేయాల్సిన ఫినిషింగ్ పనులు చేస్తే మరో ఆరునెలలు పడుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు.. ఈ పాఠశాలలో 10 బూత్‌లు ఉన్నాయి. బిల్లులు రాక తాపీ పనివాళ్లు పనులు ఆపేశారు. మిగిలిన పనులు చేయాలంటే ఎన్నికలు అవ్వాలి. కొత్త ప్రభుత్వం కొలువు జూన్, లేదా జూలై కాబట్టి అప్పటికి కూడా తరగతి గదులు పూర్తి స్థాయిలో సిద్ధం అయ్యే అవకాశం లేదు.

దోచుకునేందుకు రాలే.. సేవ చేసేందుకు వచ్చా..

- గన్నవరాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఎన్నికల ప్రచారంలో యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 30 : 'నేను కొండలను గుట్టలను దోచుకునేందుకు రాలేదు. నియోజకవర్గానికి మంచి చేసేందుకు వచ్చా. ఈ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా' అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల ప్రచారం మంగళవారం ఉదయం మండలంలోని గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపలెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో సాగింది. వెంకట్రావు మాట్లాడుతూ ఆశీర్వదించి గెలిపిస్తే గన్నవరాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా చేసి చూపిస్తానన్నారు. చంద్రబాబు నాయుడు కన్నీటికి కారణమైన గన్నవరంలో గెలిచి ఈ సీటును కానుకగా ఇస్తానని తెలిపారు. మల్లవల్లిలో 20వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని తెలిపారు. పోలవరం కుడకాలువ నుంచి ఏలూరు కాలువకు నీటి అనుసంధానం చేస్తానని తెలిపారు. పోలవరం కాలువపై పూర్తి స్థాయిలో మోటార్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, నల్లూరి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.


గోపవరపుగూడెంలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

సూపర్ సిక్స్ పథకాలతో లబ్ధి

కేశినేని శివనాథ్, సుజనా చౌదరి

భవానీపురం, ఏప్రిల్ 30 : అనేక దశాబ్దాలుగా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న విజయవాడ పశ్చిమ నియోజకవర్గ రూపురేఖలను మార్చేందుకు ప్రత్యేక మేనిఫెస్టోను తయారు చేస్తున్నామని కూటమి నుంచి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, పశ్చిమ అభ్యర్థి యలమంచిలి సుజనా చౌదరీ భరోసా ఇచ్చారు. 45వ డివిజన్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ ఆధ్వర్యంలో డివిజన్‌లోని సితార సెంటర్, కబేళా, విద్యాధిలానగర్, బ్రహ్మయ్య వీధి, చనుమోలు ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌తో కలిసి మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరిద్దరూ కబేళా సెంటర్‌లో కూటమి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన సెంట్రల్ ఆంధ్రా ఎన్నికల కన్వీనర్ బాడిత శంకర్ సుజనా పూలమాలతో ఘన సత్కరించారు. ఎక్కడ చూసినా అధ్వాన పరిస్థితులే దర్శనమిచ్చాయని, మోడల్‌గా పశ్చిమను తీర్చిదిద్దుతానని సుజనా చౌదరి తెలిపారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలకు ఎలాంటి కండీషన్స్ లేకుండా అందరికీ అందిస్తామని కేశినేని శివనాథ్ అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల టీడీపీ ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, మైనార్టీ నాయకులు నాగుల్‌మీరా, ఎంఎస్.బేగ్, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి తుపాకుల రమణమ్మ పాల్గొన్నారు.


సమస్యలను వింటున్న సుజనా చౌదరీ, చిత్రంలో బుద్దా వెంకన్న, బాడిత శంకర్


మాట్లాడుతున్న పైలా సోమినాయుడు

జాగ్రత్తగా మాట్లాడు!

- పోతిన మహేశ్‌కు బీజేపీ నేతల హెచ్చరిక

విద్యాధరపురం, ఏప్రిల్ 30 : సుజనా చౌదరి పక్కాగా స్థానికుడేనని, నోరు జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలని పోతిన మహేశ్‌ను బీజేపీ నాయకులు పైలా సోమినాయుడు, అడ్డూరి శ్రీరామ్, పోతిన వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు సుజనా చౌదరిపై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పోతిన మహేశ్ వైసీపీ నుంచి ప్యాకేజీ తీసుకుని ఎన్డీఏకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని అతని మాటలు నమ్మే స్థితిలో ఎవ్వరూ లేరని తెలిపారు.

పీబీ సిద్దార్థ - వీవీఐటీ మధ్య పరిశోధనల ఒప్పందం

మొగల్రాజపురం, ఏప్రిల్ 30 : పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల, గుంటూరు జిల్లా నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య పరిశోధనలపై ఒప్పందం జరిగింది. మంగళవారం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ సంయుక్తంగా పరిశోధనలు, సాంకేతిక సదస్సులు నిర్వహించడం, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం వంటి అంశాలపై రెండు సంస్థల మధ్య ఒప్పందం జరిగిందని తెలిపారు.

ప్రభుత్వం మారితేనే దేవాలయాలకు పూర్వ వైభవం

సాధు పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి

గుణదల, ఏప్రిల్ 30 : దేవాలయాలకు, ఆశ్రమాలకు, మఠాలకు పూర్వవైభవం రావాలంటే ఏపీలో ప్రభుత్వం మారాల్సిందేనని ఏపీ సాధు పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. ఏపీలో హిందువుల ఆత్మగౌరవ పరిరక్షణ భవిష్యత్ కార్యాచరణ కార్యక్రమాన్ని ఏపీలోని హిందూ సంఘాల సమన్వయంతో నగరంలోని ఓ హోటల్‌లో ఏపీ సాధు పరిషత్ సోమవారం హిందూ ధార్మిక సదస్సు నిర్వహించింది. ఏపీలో కూటమిగా ఏర్పడ్డ మూడు పార్టీలకు మఠాధిపతులు, ఆశ్రమ నిర్వాహకులు మద్దతు ఇచ్చి హిందూ బంధువుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

స్ఫూర్తిలో ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు

భారతీనగర్, ఏప్రిల్ 30 : పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షలు రాసి అలసిపోయిన విద్యార్థుకు ఆటవిడుపుగా ఉండేందుకు, వారిలో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు నగరానికి చెందిన స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈనెలాఖరు దాకా ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, పెన్సిల్ షేడింగ్, పెన్ డ్రాయింగ్, కార్టూన్స్, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, కాలిగ్రఫీ, పేపర్ క్విల్లింగ్, క్లే మౌల్డింగ్, మండాల ఆర్ట్, మైక్రో ఆర్ట్, లీఫ్ ఆర్ట్, ఫొటోగ్రఫీ, డిజిటల్ పెయింటింగ్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ప్రతి సంవత్సరం నిర్వహించే టెక్నికల్ గ్రేడ్ లోయర్, హయ్యర్ పరీక్షలకు, టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తిగలవారు గాయిత్రీ నగర్ వాసిరెడ్డి శివరామకృష్ణయ్య వీధిలోని స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్‌లోగానీ, 98493 55339, 93908 47433 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని అన్నారు.


విజేతలతో ముఖ్య అతిథులు

అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ విజేతగా ఇమ్రాన్

విజయవాడ స్పోర్ట్సు : ఏప్రిల్ 30 : కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్లో స్కార్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా జరుగుతున్న తొలి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ విజేతగా విజయవాడకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ నిలిచాడు. రూ.70 వేల ప్రైజమనీని అందుకున్నాడు. 10 రౌండ్ల పోరులో 9.5 పాయింట్లతో ఇమ్రాన్ విజేతగా నిలిచాడు. 8.5 పాయింట్లతో ద్వితీయ స్థానంలో శ్రీ షణ్ముక్ చాంద్ (తెలంగాణ), తృతీయస్థానంలో ఎస్. శ్రీ చరణ్ (తెలంగాణ) నిలిచారు.

విభజన హామీల సాధనే లక్ష్యం

ధర్నాచౌక్, ఏప్రిల్ 30 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనే తమ పార్టీ లక్ష్యమని జై హింద్ పార్టీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ గుర్తును తమ పార్టీకి ఎన్నికల కమిషన్ కేటాయించిందన్నారు. గెలిస్తే విజయవాడ పార్లమెంట్ పరిధిలోకి అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు.

ఓటును బాధ్యతగా వినియోగించుకోవాలి

- అవగాహన ర్యాలీలో ఎన్నికల పరిశీలకుడు నరేందర్‌సింగ్ బాలి

నందిగామ, ఏప్రిల్ 30: ఓటు వినియోగం అనేది భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇచ్చిన హక్కు, బాధ్యతగా దానిని వినియోగించుకొని ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు నరేందర్ సింగ్ బాలి కోరారు. ఓటు హక్కు వినియోగంపై అధికారులతో కలసి పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం మెయిన్ బజార్‌లో కొత్త ఓటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల్లో పాల్గొని నచ్చిన వ్యక్తికి స్వేచ్ఛగా వేయాలని కోరారు. కొత్తగా ఓటు పొందిన యువకులు విధిగా ఓటింగ్‌కు హాజరు కావాలన్నారు. ఓటర్లతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కొత్త ఓటర్లుకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు : సాధారణ ఎన్నికలు -2024లో భాగంగా జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పెనుగంచిప్రోలు నందు ఎస్వీఈఈపీ యాక్టివిటీ ప్రోగ్రామ్ కింద పట్టణంలోని ప్రధాన సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఓటర్ల అవగాహన నిమిత్తం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల పర్యవేక్షణ అధికారి నరేందర్ సింగ్ బాలి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- జనరల్ అబ్జర్వర్ నరేందర్ సింగ్ బాలి, జగ్గయ్యపేట నియోజకవర్గం రిట్నరింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కార్మికులతో చర్చలు జరిపాం

- హైకోర్టుకు నివేదించిన అదానీ గంగవరం పోర్టు
- కౌంటర్ వేసేందుకు సమయం కోరిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలకు అనుగుణంగా జిల్లా అధికారుల సమక్షంలో నిర్వాసిత కార్మికులతో చర్చలు జరిపామని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం హైకోర్టుకు నివేదించింది. ఈ సమావేశానికి సంబంధించి పూర్తి వివరాలను న్యాయస్థానం ముందు ఉంచామని సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ కోర్టుకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎస్‌జీపీ సి.సుమన్ స్పందిస్తూ... పోర్టు యాజమాన్యం సమర్పించిన వివరాలను పరిశీలించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలుకు సమయమివ్వాలని అభ్యర్థించారు. విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య విచారణను మే 2వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు వ్యాజ్యంలో ఇంప్లీడ్ అవుతూ అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు వేసిన అనుబంధ పిటిషన్‌ను న్యాయమూర్తి అనుమతించారు.

ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయండి

- గుంటూరు కలెక్టర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు
- అమరావతి భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణపై పిల్

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 28న గుంటూరు జిల్లా కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి సాంబశివరావు, రాజధాని రైతు పరిరక్షణ సమితి జాయింట్ సెక్రటరీ ధనేకుల రామారావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. అధికార దుర్వినియోగం చేస్తూ దురుద్దేశపూర్వకంగా కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు, సీఆర్డీయే చట్టం, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనలకు కలెక్టర్ నిర్ణయం విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజధాని అమరావతి నగరాన్ని ధ్వంసం చేయాలనే ఏకైక లక్ష్యంతో భూసేకరణ ప్రక్రియను ఉపసంహరించారని ఆరోపించారు. కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుంటే రైతులకు పూడ్చుకోలేని నష్టం జరుగుతుందన్నారు. కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. 'కలెక్టర్ ఉత్తర్వులతో రాజధాని ప్రాంతంలో అక్కడక్కడ వ్యవసాయ భూములు మిగిలిపోతాయి. అమరావతి నగరం అభివృద్ధికి అవరోధం కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్‌కు మార్పులు చేస్తే రైతుల హక్కులకు భంగం వాటిల్లుతుంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియలో ముందుకెళ్లాలే గానీ దానిని ఉపసంహరించడానికి వీల్లేదు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కలెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయండి' అని పిటిషన్‌లో కోరారు. వ్యక్తిగత హోదాలో సీఎం జగన్, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మితో పాటు సీఎస్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీసీఆర్డీఏ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ రాష్ట్రంలో విద్యుత్తు వాడకం కూడా బాగా పెరిగింది. ఈ నెల 20వ తేదీ నుంచి 29వ తేదీ దాకా పది రోజులపాటు పెరిగిన విద్యుత్తు డిమాండ్‌ను తట్టుకునేందుకు బహిరంగ మార్కెట్లో రూ.287.65 కోట్లు పెట్టి కరెంటును డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. విద్యుత్తు అవసరాల కోసం కొంటున్న కరెంటు భారం విద్యుత్తు వినియోగదారులపైనే పడనుంది.

17 మంది వలంటీర్ల రాజీనామా... టీడీపీలో చేరిక

టెక్కలి, ఏప్రిల్ 30: 'ఐదేళ్ల పాటు మాతో గొడ్డుసేవలు చేయించుకుని ఇప్పుడేమో రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కొందరు వైసీపీ నేతలు తమ వింటారా, లేదా అని ఎదురుప్రశ్నలు వేస్తున్నారు. వైసీపీ నాయకుల నియంతృత్వ ధోరణి మధ్య మేం ఉండలేం. మేమంతా మూకుమ్మడిగా రాజీనామా చేసి స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నాం' అని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన 17మంది వలంటీర్లు ప్రకటించారు. అనంతరం, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడ కావడంతో ఆయన వద్దకు వెళ్లి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పుకొన్నారు.

అధికారం కోసం జగన్ అడ్డదారులు: వర్ల

జగన్‌రెడ్డికి కూటమితో తలపడే ధైర్యం లేక, అడ్డదారులు తొక్కైనా అధికారం నిలబెట్టుకోవాలని చూస్తున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో వర్ల రామయ్య విమర్శించారు. అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాజుగ్లాసు గుర్తును జనసేన పార్టీకే కేటాయించాలని హైకోర్టు ఆదేశాలివ్వగా ఇండిపెండెంట్ అభ్యర్థులకూ గాజుగ్లాసు గుర్తును కేటాయించేలా కుట్రలు చేస్తున్నారు. పుంగనూరును ప్రత్యేక సామ్రాజ్యంగా భావిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి మనుషులు టీడీపీ ప్రచార రథాలు తిరగకుండా, తగలబెడుతున్నారు. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకూ పెద్దిరెడ్డి మనుషులే కావడంతో చోద్యం చూస్తున్నారు. బీసీవై పార్టీ నేత రామచంద్ర యాదవ్‌పై దాడులు చేసినా పోలీసులు తమాషా చూస్తున్నారు. పరిస్థితులు కాస్త అటుఇటూ అయితే సీఎం అవుదామని పెద్దిరెడ్డి ఉబలాటపడుతున్నాడు. పుంగనూరులో ఏ ఆదేశాలు ఇవ్వలేని దుస్థితిలో సీఎస్, డీజీపీ ఉన్నారు' అని విమర్శించారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

- రొంపిచర్ల కేసులో తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. చిత్తూరు జిల్లా రొంపిచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్‌కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఎన్నికల అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా రొంపిచర్ల బస్టాండ్ ప్రాంతంలో సమావేశం నిర్వహించానని ఎంపీడీవో రెడ్డెప్ప ఆచార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎన్‌పీ సుమంత్ వాదనలు వినిపించారు. సభలు, సమావేశాలు నిర్వహించుకొనేందుకు ఎన్నికల అధికారి నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఎన్నికల అధికారే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రస్తుత కేసులో ఎన్నికలతో సంబంధంలేని ఎంపీడీవో ఫిర్యాదు చేశారన్నారు. నిర్దిష్ట సమయానికి ముందే పిటిషనర్ సమావేశాన్ని ముగించారన్నారు.

భారత్ సూపర్‌గా ఎదిగితే పాక్ అడుక్కుంటోంది!

- ఆ దేశ పార్లమెంటులో విపక్ష నేత వ్యాఖ్య

ఇస్లామాబాద్, ఏప్రిల్ 30: సూపర్ పవర్‌గా ఎదగాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంటే పాకిస్థాన్ నిధుల కోసం అడుక్కుంటోందని విపక్ష నేత మౌలానా ఫజులుర్ రహ్మాన్ వ్యాఖ్యానించారు. జమాత్ ఉలేమా ఎ ఇస్లాం (ఫజల్) పార్టీ నాయకుడైన ఆయన మంగళవారం పార్లమెంటు ప్రారంభ సమావేశంలో ప్రసంగించారు. దేశ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ "1947లో భారత్, పాకిస్థాన్‌లకు ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చింది. ఇవాళ భారత దేశం ప్రపంచంలోనే సూపర్ పవర్‌గా ఎదగాలని ప్రయత్నాలు చేస్తోంది. మనం మాత్రం దివాళా పరిస్థితి నుంచి బయటపడేందుకు పోరాటం చేస్తున్నాం. ఇంతగా అంతరం ఉండడానికి కారకులు ఎవరు?" అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఎన్నికల తీరుపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఇవేమి ఎన్నికలు? ఓడిన వారు అసంతృప్తిలో ఉండడం..గెలిచిన వారిలోనూ సంతోషం కనిపించకపోవడం..ఇదేమి పరిస్థితి?" అని అన్నారు. ఎక్కువ సీట్లు పొంది ఉంటే పాకిస్థాన్ తెహరీక్ ఇన్సాఫ్ పార్టీకే అధికారాన్ని అప్పగించి పదవి నుంచి తప్పుకోవాలని ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను సూచించారు. "ప్రజలకు అవసరమైన చట్టాలు చేయలేని నిస్సహా స్థితిలో ఉన్నాం. ఇన్ని ఆంక్షలు ఉన్నప్పుడు దీన్ని ప్రజల పార్లమెంటు అనొచ్చా? ఇదేమి ప్రజాస్వామ్యం?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో అప్పటి ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను గద్దె దింపడానికి జరిగిన పాకిస్థాన్ డెమొక్రాటిక్ మూమెంట్ ఉద్యమంలో ఫజల్ కీలకంగా వ్యవహరించడం గమనార్హం. చరిత్రలో ఎప్పుడూ లేనంత ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు సోమవారమే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) రుణాన్ని విడుదల చేయడం గమనార్హం. మొత్తం 3 బిలియన్ డాలర్ల (సుమారు 25వేల కోట్ల భారత రూపాయలు) రుణాన్ని మంజూరు చేయగా తొలి విడతగా 1.1 బిలియన్ డాలర్లు (సుమారు 9వేల కోట్ల భారత రూపాయలు) విడుదల చేసింది. రుణం మంజూరు చేసే ముందు సబ్సిడీలు తగ్గించాలని, కరెంటు ఛార్జీలు, పన్నులు పెంచాలని షరతులుగా విధించింది. మరోవైపు తీసుకున్న విదేశీ రుణాలను తిరిగి చెల్లించలేని పరిస్థితికి కూడా పాకిస్థాన్ చేరుకుంది.

మహిళా కార్యకర్తలే మహారాణులు


పసుపు ఫ్యాక్టరీలో మహిళా కార్మికులతో మాట్లాడుతున్న బ్రాహ్మణి

- స్త్రీశక్తి, మహిళా మిత్రలతో నారా బ్రాహ్మణి

దుగ్గిరాల, ఏప్రిల్ 30: తెలుగుదేశం పార్టీలో ఎప్పటికీ మహిళా కార్యకర్తలే మహరాణులని నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో స్త్రీశక్తి, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ.. ఇంటిని సమర్థవంతంగా నడిపే మహిళలు రాజకీయాల్లోనూ మరింతగా రాణించగలరని గుర్తించే ఎన్టీఆర్ వారికి పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించారన్నారు. ఎన్టీఆర్ సంక్షేమానికి కొనసాగింపుగా మహిళల ఆర్థిక స్వావలంబనకు చంద్రబాబు డ్వాక్రాలకు శ్రీకారం చుట్టి వారి స్థితిగతులను మార్చివేశారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. స్త్రీశక్తి పథకం ద్వారా శిక్షణ తీసుకుని ఉపాధి పొందామని, తద్వారా కుటుంబానికి ఆర్థికంగా తమ వంతు సాయం అందిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఎన్ఆర్ఐలు మాట్లాడుతూ.. టీడీపీ విజయం కోసం ప్రచారం చేయడానికి విదేశాల నుంచి సొంతూళ్లకు వచ్చామని తెలిపారు. అనంతరం దుగ్గిరాలలో పసుపు విల్లును నారా బ్రాహ్మణి పరిశీలించారు. పసుపు ఎలా తయారు చేస్తారో అక్కడి మహిళా కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు విన్నారు.

అమెరికాలో

విద్యార్థులపై ఉక్కుపాదం!

- పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో అట్టుడుకుతున్న వర్సిటీలు
- వెయ్యిమందిని అరెస్టు చేసినా.. వెనక్కి తగ్గని విద్యార్థులు
- కొలంబియా, కార్నెల్ వర్సిటీల్లో పలువురు విద్యార్థుల సస్పెన్షన్

న్యూయార్క్, ఏప్రిల్ 30: అమెరికాలోని యూనివర్సిటీలు పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో అట్టుడుకుతూనే ఉన్నాయి. ఎన్ని హెచ్చరికలు చేసినా విద్యార్థులు లెక్కచేయడంలేదు. క్యాంపస్‌లలో టెంట్లు వేసుకొని రోజుల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. పోలీసులను రంగంలోకి దించి వందలాదిమందిని అరెస్టు చేసినా, విద్యార్థులు వెనక్కి తగ్గడం లేదు. దీంతో అరెస్టుల సంఖ్య వెయ్యికి చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో నిరసనకారులపై తీవ్రమైన చర్యలు చేపడుతున్నారు. కొలంబియా యూనివర్సిటీలో మంగళవారం కూడా విద్యార్థులు సుమారు 120 టెంట్లలో బైఠాయించి నిరసనలు కొనసాగించారు. ప్రవేశద్వారానికి అడ్డంగా మానవహారం నిర్వహించారు. హాస్టళ్లలోని కిటికీల నుంచి పాలస్తీనా జెండాలను ఊపుతున్నారు. ఆందోళనలు విరమించడానికి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు డెడ్‌లైన్ విధించిన కొలంబియా, కార్నెల్ యూనివర్సిటీలు.. ఆ తర్వాత పలువురు విద్యార్థులను సస్పెండ్ చేశాయి. తక్షణమే వర్సిటీని వీడాలని, హాస్టల్ భవనాలనూ ఖాళీ చేయాలని వారిని ఆదేశించాయి. అమెరికా వ్యాప్తంగా మిగిలిన యూనివర్సిటీల్లో మంగళవారం కూడా పలువురు విద్యార్థులను అరెస్టు చేశారు.

సస్పెన్షన్‌తో వసతి కూడా ఖాళీ..

అమెరికాలోని యూనివర్సిటీల్లో సస్పెండ్ అయిన విద్యార్థులు గ్రాడ్యుయేషన్ లేదా సెమిస్టర్ పూర్తి చేయడానికి అనర్హులవుతారు. వారిని తరగతులకు, పరీక్షలకూ అనుమతించరు. వర్సిటీ అనుబంధ హాస్టళ్లలో వారు వసతి కూడా కోల్పోతారు. వారిని అకడమిక్ భవనాల్లోకి కూడా అనుమతించరు. గ్రాడ్యుయేషన్ చేయడానికీ వారు అర్హత కోల్పోతారు. ఈ మేరకు కొలంబియా యూనివర్సిటీ క్యాంపస్‌లో నోటీసు అంటించారు. కార్నెల్ యూనివర్సిటీలోనూ అలాంటి నోటీసునే అంటించారు. ఒకసారి క్రమశిక్షణ చర్యలకు గురైతే, వారిపై వర్సిటీలోని వివిధ విభాగాలు విచారణ జరుపుతాయని కొలంబియా యూనివర్సిటీ ప్రజాసంబంధాల విభాగం ఉపాధ్యక్షుడు బెన్ చాంగ్ తెలిపారు. యూనివర్సిటీ లైఫ్ కార్యాలయం, యూనివర్సిటీ సెనేట్ కార్యాలయం క్రమశిక్షణ చర్యల ప్రక్రియను చేపడతాయని వివరించారు. కాగా, సస్పెన్షన్‌కు గురైన పలువురు విద్యార్థులు తమను హాస్టల్ నుంచి కూడా పంపించేశారని స్థానిక మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాము ఎక్కడ నివసించాలంటూ విలపిస్తున్నారు. సస్పెన్షన్‌కు గురైన విదేశీ విద్యార్థుల వీసాలు కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని అటార్నీ రాధికా సాయినాథ్ తెలిపారు.

భారతీయ విద్యార్థులు.. తల్లిదండ్రుల్లో ఆందోళన..

తాజా పరిస్థితి విదేశీ విద్యార్థులపై, ప్రత్యేకించి భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. క్యాంపస్‌లో తరగతుల నిర్వహణకు అవాంతరాలు కలుగుతుండటంతో కొలంబియా యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు ఆన్‌లైన్ బోధన చేపట్టాయి. దీంతో భారతీయ విద్యార్థులు తమ భవితవ్యంపై ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై స్వదేశంలోని వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కూడా ఆందోళన చెందుతున్నారు. నిరసనల్లో పాల్గొని అరెస్టయినవారిలో భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారు. దీంతో వారి వీసా, స్కాలర్‌షిప్‌లకు కూడా ముప్పు పొంచి ఉందనే ఆందోళనలు నెలకొన్నాయి. 'విదేశీ విద్యార్థులు మూడు స్థాయిల్లో అమెరికా చట్టాలను, విధానాలను పాటించాలి. అమెరికా ఫెడరల్ చట్టానికి, రాష్ట్ర చట్టానికి వారు కట్టుబడి ఉండాలి. యూనివర్సిటీలు రాష్ట్ర చట్టం పరిధిలోకి వస్తాయి. ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతోపాటు విద్యాసంస్థ విధానాలకూ వారు కట్టుబడి ఉండాలి. ఇందులో ఏ స్థాయిలోనైనా అతిక్రమణకు పాల్పడితే 'విద్యార్థి హోదా'నే అతిక్రమించినట్టు భావించి.. వారిని అమెరికా నుంచి పంపించేసే అవకాశం కూడా ఉంది' అని ఇమ్మిగ్రేషన్.కాం మేనేజింగ్ అటార్నీ రాజీవ్ ఖన్నా పేర్కొన్నారు.

అమెరికాను వీడాల్సిందే!

ఎఫ్-1 వీసాపై చదువుకొంటున్న విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉండాలంటే తప్పనిసరిగా 'విద్యార్థి హోదా'ను కాపాడుకోవాలి. విద్యాసంస్థ నుంచి సస్పెన్షన్ లేదా బహిష్కరణకు గురైన విద్యార్థుల ఎఫ్-1 వీసాకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. 'ఒకసారి విద్యార్థి సస్పెన్షన్ లేదా బహిష్కరణకు గురైతే, సెవీస్(స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)లో ఆ విద్యార్థి అడ్మిషన్‌ను విద్యాసంస్థ తప్పనిసరిగా తొలగించాలి. అదే జరిగితే ఎఫ్-1 లీగల్ హోదాను ఆ విద్యార్థి కోల్పోయినట్టే' అని లాక్వెస్ట్ మేనేజింగ్ పార్ట్‌నర్ పూర్వి చోతని తెలిపారు. ఆ పరిస్థితుల్లో విద్యార్థి తక్షణమే అమెరికాను వీడాల్సి ఉంటుందన్నారు. విద్యాసంస్థ నుంచి తొలగింపునకు గురైనవారికి గ్రేస్ పీరియడ్ కూడా ఉండదని చెప్పారు. అలాంటివారు 180 లేదా అంతకంటే ఎక్కువ రోజులు చట్టవిరుద్ధంగా అమెరికాలోనే ఉన్నట్లైతే.. తిరిగి వారు అమెరికాలోకి ప్రవేశించకుండా మూడేళ్ల నిషేధం విధిస్తారని తెలిపారు. చట్టవిరుద్ధంగా 12 నెలలకుపైబడి అమెరికాలో నివసించిన వారిపై ఈ నిషేధం పదేళ్ల వరకూ విధిస్తారని చెప్పారు. విద్యార్థితోపాటు ఎఫ్-2 హోదా ద్వారా అమెరికాలో నివసిస్తున్న విద్యార్థి జీవిత భాగస్వామి, పిల్లలపైనా ఈ తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. హింసాత్మక ఆందోళనల్లో అరెస్టయిన విద్యార్థుల వీసా రద్దయ్యే అవకాశం ఉందని, దీంతో వారు అమెరికాను వీడాల్సి ఉంటుందని తెలిపారు. 'వీసాతో వచ్చి అమెరికాలో నివసించేవారు ఆందోళనల్లో పాల్గొంటే గనుక, వారి వీసాల రెన్యువల్ సమయాల్లో సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. యూనివర్సిటీ గ్రాంట్స్, తద్వారా వారి స్కాలర్‌షిప్‌పైనా ప్రభావం పడే అవకాశం ఉంది' అని ఖైతాన్ అండ్ కో లీడర్‌షిప్ అండ్ రివార్డ్స్ డైరెక్టర్ ప్రీతీశ్ గాంధీ తెలిపారు.

వైసీపీకి గుంటూరు డిప్యూటీ మేయర్ రాజీనామా

- నేడు టీడీపీలో చేరనున్న సజీల
- కార్పొరేటర్లపై అధికార పార్టీ నిఘా


టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసిన గుంటూరు డిప్యూటీ మేయర్ షేక్ సజీల

గుంటూరు, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికలకు ముందు అధికార పార్టీ వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. మొన్నటి వరకు ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించిన పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే ఆరుగురు కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీలో చేరగా తాజాగా డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆమె తండ్రి వైసీపీ నేత షేక్ షౌకత్‌లు ఆ పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. అనంతరం, వారిద్దరూ టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిశారు. టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో బుధవారం ఆ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. తూర్పు నియోజకవర్గంలో కీలక నేత, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని ఇటీవల నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయన గత రెండు ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం కృషి చేశారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే సుభానితో పాటు తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్‌తో పాటు వైసీపీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు ఖాజామొహిద్దీన్ చిష్టీ, షేక్ మీరావలి, వేముల జ్యోతిలు టీడీపీలో చేరారు. పశ్చిమ నియోజకవర్గంలో కూడా ముగ్గురు కార్పొరేటర్లు వైసీపీకి ఝలక్ ఇచ్చారు. ఇటీవల టీడీపీలో చేరిన మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ వెంట వైసీపీ కార్పొరేటర్ శ్రీవల్లి కూడా వెళ్లారు. అనంతరం 23వ డివిజన్ కార్పొరేటర్ సాదు ఉమామహేశ్వరి, భర్త రాజేశ్, 19వ డివిజన్ కార్పొరేటర్ హనుమాయమ్మ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇటీవల టీడీపీ యువనేత నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి మరికొంత మంది వైసీపీ కార్పొరేటర్లు తమకు టచ్‌లో ఉన్నారని, త్వరలోనే చేరేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నేతలు తెలిపారు. దీంతో కంగారు పడిన వైసీపీ.. కార్పొరేటర్లపై నిఘా పెట్టింది. ఏ కార్పొరేటర్లు పార్టీని వీడేలా ఉన్నారు? ఏం ఆశించి వెళుతున్నారు.. వంటి వివరాలు సేకరిస్తోంది. అదేసమయంలో కార్పొరేటర్ల కదలికలపై కీలక నేతలు ఆరా తీస్తున్నారు. కార్పొరేటర్ల కదలికలను గుర్తించేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిసింది.

'రెడ్‌బుక్' విచారణ 15కు వాయిదా

విజయవాడ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ సీఐడీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఏసీబీ కోర్టు మే 15వ తేదీకి వాయిదా వేసింది. లోకేశ్ తరఫున న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. ఇందుకు కొంత సమయం కావాలని న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ కోరగా, విచారణను న్యాయాధికారి మే 15వ తేదీకి వాయిదా వేశారు.

డీప్‌ఫేక్ వీడియో కేసు..

కాంగ్రెస్ ఎమ్మెల్యే పీఏ, ఆప్ నేత అరెస్టు

- రేవంత్‌కు సమన్లివ్వడం.. తెలంగాణ ప్రజలను అవమానించడమే
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్
- మన్మోహన్ ఫేక్ వీడియోలపై ఏం చేశారని ప్రశ్న
- నిజామాబాద్ పసుపుబోర్డు వాగ్దానం ప్రస్తావన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో కేసులో ఓ ఎమ్మెల్యే పీఏ, మరో ఆప్ నేత అరెస్టయ్యారు. ఇప్పటికే ఈ కేసులో గువాహటికి చెందిన అసోం కాంగ్రెస్ ఎన్నికల వార్ రూమ్ సమన్వయకర్త సోమవారం రీతంసింగ్ అరెస్టవ్వగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహా.. నలుగురు కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మంగళవారం మరో 12 మందికి నోటీసులు పంపారు. ఈ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ పీఏ, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనుచరుడు సతీశ్‌వన్సోలాను, దావోద్ జిల్లా ఆప్ అధ్యక్షుడు ఆర్కే వారియాను అరెస్టు చేసినట్లు ఢిల్లీ సైబర్ సెల్ అధికారులు వెల్లడించారు. వీరిద్దరికీ వాట్సాప్ ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా డీప్‌ఫేక్ వీడియో చేరిందని, వారు ఉద్దేశపూర్వకంగా ఆ వీడియోను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారని చెప్పారు. డీప్‌ఫేక్ వీడియోను ఎవరు ఎడిట్ చేశారనేదానిపై దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. తన పీఏ అరెస్టుపై ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ స్పందించారు. తన పీఏ పొరపాటున ఆ వీడియోలను షేర్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఆ వీడియో ఫేక్ అని అతనికి తెలిసి ఉండదన్నారు. బీజేపీనే చాలా కాలంగా ఫేక్ వీడియోలను వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. దానిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. డీప్‌ఫేక్ వీడియోను సృష్టించిన వారిని కాకుండా.. పొరపాటున షేర్ చేసిన వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు.

రేవంత్ అంటే మోదీకి భయం: జైరాం రమేశ్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అంటే ప్రధాని మోదీకి భయమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. రేవంత్‌కు సమన్లు పంపడం అంటే.. తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఇది నిష్పక్షపాతంగా జరగాల్సిన ఎన్నికలపై దాడేనని ఎక్స్‌లో ఆరోపించారు. "మాజీ ప్రధాని మన్మోహన్ డీప్‌ఫేక్ వీడియోలు బీజేపీ సృష్టించింది. ఆ వీడియోలను సర్క్యులేట్ చేస్తోంది. దీనిపై ఢిల్లీ పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. మొదటి రెండు దశల ఎన్నికల్లో బీజేపీ పేలవమైన ప్రదర్శనతో నిరాశకు లోనై.. బీజేపీ అవకాశాలను దెబ్బతీస్తున్న రేవంత్‌ను ప్రధాని మోదీ భయపెడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించే రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం మోదీకి అలవాటేనని విమర్శించారు. తెలంగాణ కూడా కేంద్రానికి చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు.. ఆ రాష్ట్రానికి 43 పైసలు మాత్రమే దక్కుతోందని గుర్తుచేశారు. పసుపు ఎగుమతుల్లో సుమారు 30% వాటాను తెలంగాణ అందిస్తోందని పేర్కొంటూ.. నిజామాబాద్ పసుపుబోర్డుపై మోదీ వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు.

బీజేపీకి 180 సీట్లు దాటవు: మాణిక్కం ఠాకూర్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 180 సీట్లు దాటవని కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాకూర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. తెలంగాణలో మోదీ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని.. బీజేపీపై అసమ్మతి పెరగడం వల్లే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మోదీ ఎన్ని కుట్రలు చేసినా.. తెలంగాణ ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు.


విజయవాడలో సమావేశమైన హజ్ కమిటీ

హజ్ యాత్రకు సర్వం సిద్ధం చేయండి

- అధికారులకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ఆదేశం
- బెజవాడలో మొదటి సన్నద్ధత సమావేశం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి హర్షవర్ధన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నిర్దేశించారు. 2024-హజ్ యాత్ర మొదటి సన్నద్ధత సమావేశాన్ని మంగళవారం విజయవాడలోని ముసాఫిర్ ఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ హజ్‌యాత్రకు ఈ ఏడాది కోటా 2,902 మందికిగాను ఇప్పటి వరకు 2,580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 728 మంది, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1,118 మంది, బెంగళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 725 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 9 మంది బయలుదేరనున్నారని పేర్కొన్నారు. మే 26 నుంచి జూన్ 9 మధ్య విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్‌యాత్రకు బయలుదేరనున్నారని తెలిపారు. హజ్‌యాత్రికులకు గన్నవరం సమీపంలోని మదరసాలో వసతి ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మదరసా వద్ద టెంట్లు, ఎయిర్ కూలర్లు సిద్ధం చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రత చర్యల్లో భాగంగా మహిళా పోలీసులను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా విమానాశ్రయ అధికారులు సహాయ, సహకారాలు అందిస్తారని తెలిపారు. యాత్రికులను మదరసా నుంచి గన్నవరం విమానాశ్రయానికి పంపించేందుకు ఆర్టీసీ చర్యలు చేపడుతుందన్నారు. మదరసా వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన వ్యాక్సినేషన్, వైద్య సహాయం అందించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను కోరామన్నారు. హజ్‌యాత్రలో సుమారు 40 రోజుల పర్యటనకు మాత్రమే అనుమతి ఉందని, అంతకంటే ఎక్కువ రోజులకు అనుమతి లేదని తెలిపారు.

కూటమి మేనిఫెస్టోపై ఉద్యోగుల్లో జోష్

- ప్రతి నెలా 1నే జీతాలు, ఫించన్లు హామీపై హర్షం

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టోపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అధికార వైసీపీ, కూటమి మేనిఫెస్టోల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై ఆ వర్గాల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది. వైసీపీ మేనిఫెస్టోలో ఏమీ లేదంటూ ఇప్పటికే ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. దానికంటే ఎన్డీయే కూటమి మేనిఫెస్టో బెటర్ అని అంతర్గత చర్చల్లో అంగీకరిస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు ఆశాజనకంగా ఉన్నాయని చెబుతున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలు, పెన్షన్లు ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో.. గత ఐదేళ్లుగా జీతాలు, పింఛన్లు సకాలంలో అందక అనుభవించిన నరకయాతనను తల్చుకొని ఊపిరి పీల్చుకుంటున్నారు. వైసీపీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు వచ్చే ఐదేళ్లలో ముఖ్యమైన హామీలేమీ ఇవ్వలేదని గుర్తుచేస్తున్నారు. జగన్ సర్కారు సకాలంలో వేతనాలు చెల్లించలేదని, డీఏలు ఇవ్వకుండా రూ.వేల కోట్లు బకాయి పెట్టిందని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా వైసీపీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలతో ఉద్యోగులకు ఒరిగేదేమీ లేదని స్పష్టం చేస్తున్నారు.

పీఆర్సీపై ఆశాభావం

ఉద్యోగులకు సకాలంలో పీఆర్సీ ఇస్తామని, అదేవిధంగా అధికారంలోకి రాగానే మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటిస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో స్పష్టంగా చెప్పారు. జగన్ సర్కారు ఉద్యోగులకు బకాయిపడిన రూ.25వేల కోట్లకుపైగా మొత్తాన్ని కొత్త ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలన్నీ చెల్లిస్తామని కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు దేశంలో మొట్టమొదటిసారిగా ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ ఇచ్చింది చంద్రబాబేనని, ఇప్పుడు సీపీఎస్ అంశంలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటాననే హామీ ఇచ్చారనే చర్చ జరుగుతోంది. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తానని హామీ ఇవ్వడంపైనా ఉద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది.

కాపులకు జగన్ మోసం!

- రాష్ట్ర కాపు జేఏసీ నాయకుల ధ్వజం


అనంతపురంలో మీడియాతో మాట్లాడుతున్న కాపు జేఏసీ నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30: జగన్ సర్కారు కాపులను దారుణంగా మోసం చేసిందని రాష్ట్ర కాపు సంఘాల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, రామ్మూర్తి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు కాపులను వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన జగన్ కాపులను వెన్నుపోటుపొడిచారని మండిపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కింద 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో కాపు వర్గాల విద్యార్థులు నష్టపోయారన్నారు. కాపులకు ప్రత్యేకంగా ఏడాదికి రూ.2వేల కోట్ల చొప్పున ఐదేళ్లల్లో రూ.10 వేలకోట్లు ఖర్చు పెడతామని గత ఎన్నికల ముందు హామీ ఇచ్చి, కేవలం రూ.1,490 కోట్లు ఖర్చుపెట్టారని విమర్శించారు. ఏ ఒక్కరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. టీడీపీ హయాంలో విదేశీ విద్యకు అర్హులైన పిల్లలకు దశలవారీగా రూ.15 లక్షలు చెల్లించారని, వైసీపీ పాలనలో అన్ని పథకాలనూ రద్దు చేశారని మండిపడ్డారు. కాపులంతా ఏకమై ఎన్డీయే కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం చేసుకోలేం

- అభ్యంతరాలు ఉంటే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించండి
- మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై వ్యాజ్యం కొట్టివేత

అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణ అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి నారాయణ నామినేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని గుర్తు చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 329(బి) కోర్టుల జోక్యాన్ని నిరోధిస్తుందన్నారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచిస్తూ.. పిటిషన్‌ను కొట్టివేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ తీర్పు ఇచ్చారు. నారాయణ తన నామినేషన్ పత్రాలలో భార్య వివరాలు ప్రస్తావించాల్సినచోట రెండో భార్య వివరాలను పొందుపర్చలేదని, తన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా నామినేషన్‌ను ఆమోదించారని పేర్కొంటూ నెల్లూరుకు చెందిన న్యాయవాది దేశాయ్‌శెట్టి హనుమంతురావు హైకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారం స్పౌజ్ కాలమ్‌లో భార్యకు సంబంధించిన అన్ని వివరాలను పొందుపర్చాలన్నారు. నారాయణ తన రెండో భార్య ఇందిర వివరాలను నామినేషన్ పత్రాలలో ప్రస్తావించలేదన్నారు. తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని, తగిన నిర్ణయాన్ని వెల్లడించేలా రిటర్నింగ్ అధికారిని ఆదేశించాలని కోరారు. నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరం ఉంటే ఎన్నికల ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాలి తప్ప రిట్ దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. వ్యాజ్యానికి విచారణార్హత లేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ... ఎన్నికల ప్రక్రియ మధ్యలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి పిటిషన్‌ను కొట్టివేశారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 1 మే 2024



మెస్రాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)- బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (బీహెచ్ఎంసీటీ), ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

బిట్ మెస్రాలో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

బీహెచ్ఎంసీటీ

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా 18 వారాల ఇండస్ట్రియల్ ట్రెయినింగ్, సెమిస్టర్ బ్రేక్ సమయంలో ఒకేషనల్ ట్రెయినింగ్ ఉంటాయి. అకడమిక్ మెరిట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 తరవాత జన్మించి ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 10

ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: జూన్ 18

ఎమ్మెస్సీ

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'బయో ఇన్ఫర్మాటిక్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ'. ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లు పూర్తిచేశాక కోర్సు నుంచి వైదొలగే వీలుంది. వీరికి పీజీ డిప్లొమా ప్రదానం చేస్తారు. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ ప్రోగ్రామ్ జైపూర్ క్యాంపస్‌లో ఉంది.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ లేదా మేథమెటికల్/ఫిజికల్/కెమికల్/బయలాజికల్ సైన్సెస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ స్థాయి మేథమెటిక్స్‌లో పరిజ్ఞానం తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 జూన్ 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. (గేట్/జీప్యాట్) (2022/2023/2024) స్కోర్ లేదా జామ్/సీయూసెట్ 2024 స్కోర్ ఉన్న వారు ఆన్‌లైన్ టెస్ట్ రాయనవసరం లేదు. ఆన్‌లైన్ టెస్ట్‌లో జామ్/సీయూసెట్ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 10

కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల: జూన్ 14

ఆన్‌లైన్ టెస్ట్/ఇంటర్వ్యూ/కౌన్సెలింగ్: జూన్ 19 నుంచి 20 వరకు

పీహెచ్‌డీ

మెస్రా క్యాంపస్‌లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

విభాగాలు: ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయో ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫిజిక్స్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, రిమోట్ సెన్సింగ్, స్పేస్ ఇంజనీరింగ్ అండ్ రాకెట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ ఇంజనీరింగ్/ఎంఆర్క్/ఎంఫార్మసీ/ఎంఎస్ ఫార్మసీ/ఎమ్మెస్సీ ఫార్మసీ/ఎంప్లాన్/ఎంసీఏ/ఎంబీఏ/ఎంఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు; కనీసం 80 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్/బీఫార్మసీ/బీఆర్క్/బీప్లాన్ ఉత్తీర్ణతతోపాటు గేట్/జీప్యాట్‌లో కనీసం 80 పర్సంటైల్ సాధించినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది పరీక్షలు రాసే వారు కూడా అర్హులే. వీరు 2024 ఆగస్టు 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/డీబీటీ/ఐసీఎంఆర్‌ల నుంచి జేఆర్ఎఫ్ అర్హత పొందినవారు, గేట్/నెట్ అర్హత పొందిన వారు రిటెన్ టెస్ట్ రాయనవసరం లేదు. రిటెన్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.


ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 12

రిటెన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: మే 17

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **వెబ్‌సైట్:** bitmesra.ac.in

నిట్ ఢిల్లీలో ఎగ్జిక్యూటివ్ ఎంటెక్



ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- ఎగ్జిక్యూటివ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో నాలుగు సెమిస్టర్లు కోర్సు వర్క్, రెండు సెమిస్టర్లు డిజర్టేషన్ వర్క్ ఉంటాయి. వారాంతాల్లో ఆన్‌లైన్ ద్వారా థియరీ క్లాసెస్ నిర్వహిస్తారు. వీటికి 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఇన్‌స్టిట్యూట్‌లో అయిదు రోజులపాటు నిర్వహించే ల్యాబొరేటరీ తరగతులకు అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌ను రిజిస్టర్ చేసుకున్న నాటినుంచి గరిష్ఠంగా అయిదేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అడ్మిషన్ పొందినవారికి ఎటువంటి ఫైనాన్షియల్ అసిస్టెన్స్/స్కాలర్‌షిప్ లభించవు.

స్పెషలైజేషన్‌లు

- కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్/మాన్యుఫాక్చరింగ్ (క్యాడ్/క్యామ్)
- అడిటివ్ మాన్యుఫాక్చరింగ్(ఏఎం)
- సీట్లు: స్పెషలైజేషన్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్)(మెకానికల్ ఇంజనీరింగ్/ఆటొమేషన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్/మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్/మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటొమేషన్ ఇంజనీరింగ్/ఆటొమొబైల్ ఇంజనీరింగ్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్/మైనింగ్ మెషినరీ ఇంజనీరింగ్) పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు 2024 జూన్ 30 నాటికి ఏడాది పోస్ట్ క్వాలిఫికేషన్ అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 30
- **అకడమిక్ మెరిట్ ప్రకారం అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 10
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 11
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 18
- **వెబ్‌సైట్:** https://nitdelhi.ac.in

నిట్ హమీర్‌పూర్‌లో ఎంబీఏ

హమీర్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్‌హెచ్)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు, సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఉంటాయి. రెండు స్పెషలైజేషన్‌లు ఎంచుకొనే వీలుంది. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, టెస్ట్ పర్సంటైల్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

స్పెషలైజేషన్‌లు: హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతూ 2024 సెప్టెంబరు 15 నాటికి సర్టిఫికెట్ సబ్మిట్ చేయగలిగే అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/మ్యాట్/సీమ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

వెయిటేజీ: క్యాట్ స్కోర్‌కు 10 మార్కులు, సీమ్యాట్ స్కోర్‌కు 7 మార్కులు, మ్యాట్ స్కోర్‌కు 5 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

- జాతీయ పరీక్ష స్కోర్‌కు 25 మార్కులు, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 మార్కులు, టెస్ట్ పర్సంటైల్‌కు 10 మార్కులు కేటాయించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** మే 28, 29
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 6
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించాల్సిన తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** www.nith.ac.in

జాబ్ కార్నర్

ఐకార్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోయాబీన్ రీసెర్చ్, ఇండోర్(మధ్యప్రదేశ్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఐఐఎస్ఆర్‌లో జేఆర్ఎఫ్

1. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **3 పోస్టులు**
2. రీసెర్చ్ అసోసియేట్: **1 పోస్టు**
3. యంగ్ ప్రొఫెషనల్-2: **2 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీలు: 2024 మే 2, 3

ప్రదేశం: ఐకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోయాబిన్ రీసెర్చ్, ఖండ్వడ రోడ్, ఇండోర్(మధ్యప్రదేశ్).

వెబ్‌సైట్: iisrindore.icar.gov.in/

ఉత్తర రైల్వేలో స్పోర్ట్స్ కోటాలో గ్రూప్-డి ఖాళీలు

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్, నార్తర్న్ రైల్వే... స్పోర్ట్స్ కోటాలో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టులు: 38

క్రీడాంశాలు: ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బాక్సింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, హాకీ, బ్యాడ్మింటన్, కబడ్డీ, రెజ్లింగ్, చెస్.

అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత క్రీడాంశంలో వివిధ స్థాయుల్లో ప్రతిభ చూపి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18-25 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, మహిళలు, మైనార్టీలు, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 16

ట్రయల్ తేదీ: జూన్ 10

వెబ్‌సైట్: https://www.rrcnr.org/

హెచ్ఏఎల్, బెంగళూరులో మెడికల్ ఆఫీసర్లు

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్... తాత్కాలిక ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మెడికల్ ఆఫీసర్(జనరల్ డ్యూటీ): **2 పోస్టులు**

అర్హత: ఎంబీబీఎస్‌తోపాటు పని అనుభవం ఉండాలి

వయోపరిమితి: 35 సంవత్సరాలు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను చీఫ్ మేనేజర్(హెచ్‌ఆర్), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ హెల్త్ సెంటర్, సురంజందాస్ రోడ్, విమానపుర, బెంగళూరు చిరునామాకు పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 13

వెబ్‌సైట్: www.hal-india.co.in/home

'టైమ్స్' జాబితాలో యూఫెస్ లెర్నింగ్

మన దేశంలో పేరొందిన ఎడ్యుటెక్ సంస్థ 'యూఫెస్ లెర్నింగ్'కు అంతర్జాతీయ గౌరవం లభించింది. 'టైమ్స్' ప్రకటించిన 2024 టాప్ ఎడ్యుటెక్ రైజింగ్ స్టార్స్ జాబితాలో ఈ సంస్థకు చోటు దక్కింది. విద్యకు సంబంధించి యూఫెస్ లెర్నింగ్ అనుసరించిన సరికొత్త విధానాలతో గ్లోబల్ ఎడ్యు సెక్టర్‌లో అరుదైన ఈ స్థానాన్ని పొందింది. గడచిన మూడు సంవత్సరాల్లో ఆదాయపరంగా అధికంగా ఆర్జించిన పదిహేను కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. తరగతిగదికి ఇంటికి చేరిన తరవాత అభ్యాసానికి మధ్య ఉన్న అంతరాన్ని సరిదిద్దడంలో పలు సొల్యూషన్లను కంపెనీ ప్రవేశపెట్టగలిగింది. 2017లో ఆరంభమైన యూఫెస్ లెర్నింగ్ మన దేశంలో రమారమి పది వేల వరకు ప్రీమియం పాఠశాలల విద్యార్థులకు తనదైన పద్ధతిలో సేవలు అందిస్తోంది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందినందుకు కంపెనీ సహ వ్యవస్థాపకుడు అమిత్ కపూర్ ఆనందం వ్యక్తం చేశారు. 'క్లాస్‌రూమ్ ఫస్ట్, కరికులమ్ ఫోకస్డ్' అప్రోచ్‌తో ఇండియాలో కోటి మంది విద్యార్థులకు చేరువ కాగలిగామని ఈ సందర్భంలో ఆయన తెలిపారు.

SCHOLARSHIP ALERT

TOEFL India Championship

Description: An initiative of ETS India Private Limited to help undergraduate students and working professionals pursue their dream of studying abroad.

Eligibility: Participants must currently be enrolled in the 3rd or 4th year of undergraduate studies at an accredited Indian higher education institution (college or university). Additionally, applicants who have completed their undergraduate or graduate studies in India and are seeking higher education abroad, or those with up to two years of verifiable professional work experience, are also eligible to apply.

Prizes & Rewards: Total prize money of 15 lacs

Last Date to Apply: 15-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TOIC1

Voluntary Internship Scheme for Law Students

Description: Voluntary Internship Scheme for Law Students 2023 is an initiative by the Institute of Legislative Drafting and Research (ILDR) with the purpose to motivate students to create interest in legislative drafting as a profession.

Eligibility: Open for candidates pursuing 4th and 5th year integrated bachelor's degree in law (5 years) or pursuing the final year of 3 years bachelor's degree in law from recognised law colleges in the country.

Prizes & Rewards: A certificate by ILDR

Last Date to Apply: Round The Year

Application mode: Via email or post to - Branch Officer, ILDR, 416 'D' Wing, Legislative Department, Ministry of Law and Justice, Shastri Bhawan, New Delhi-110 001

Short Url: www.b4s.in/aj/VSL8



University of Bath GREAT Scholarship, India 2024

Description: University of Bath GREAT Scholarship, India 2024 is an opportunity offered by the University of Bath in collaboration with the British Council's Study UK campaign. Under this programme, students from 15 countries including India will receive financial support to pursue postgraduate study in the UK.

Eligibility: Open to Indian citizens with a valid passport who hold an offer for a full-time, postgraduate taught master's course at the University of Bath. Candidates must be classified as international students for tuition fee purposes and demonstrate an outstanding academic background.

Prizes & Rewards: A partial tuition fee of £10,000 for one year of study

Last Date to Apply: 20-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/UBG01

buddy4study.com



మీకు తెలుసా?

- తలమీద ఎర్రగా ఉండే ఈ నల్లని పిట్ట పేరు 'బ్లాక్ ఉడ్‌పెకర్'. తెలుగులో నల్లని వడ్రంగి పిట్ట అంటారు. ఇవి యూరోపియన్ దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- ఆసియాతో పాటు ఉత్తర, అమెరికా దక్షిణ అమెరికాల్లో కూడా ఉంటాయి. ఇవి ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాయి. ఇతర ప్రదేశాలకు వెళ్లటానికి ఇష్టపడవు.




- 55 సెం.మీ. పొడవు ఉండే ఈ పక్షి వింగ్ స్పాన్ 84 సెం.మీ.
- ఈ పక్షి ముక్కు గట్టిగా ఉంటుంది. ఎండిపోయిన లేదా ఫంగస్‌తో, పురుగుల వల్ల ఎండిపోయిన చెట్లను ఇవి తొలుస్తాయి. వీటి మెడ కండరాలు స్ట్రాంగ్‌గా ఉండటం వల్ల సులువుగా చెట్లును తొలుస్తాయివి. ఒక్కోసారి ఆరోగ్యంగా ఉండే చెట్లనూ తొలుస్తాయి. గూడు చేసుకుంటాయి. ఈ పక్షులు మరో గూడు చేసుకున్నప్పుడు ఇతర పక్షులు ఆ గూళ్లలో ఆవాసాలను ఏర్పరచుకుంటాయి. అన్నట్లు 50 సెం.మీ. కంటే లోతు చెట్లును తొలుస్తాయి.
- వడ్రంగి పిట్టలు ప్రపంచ వ్యాప్తంగా 180 రకాలు ఉన్నాయి.
- పురుగులు, చెట్ల మీద ఉండే చీమలను తింటాయి.
- ఆరు గుడ్లను పెడతాయి. 20 రోజుల పాటు పొదుగుతాయి.

జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 295

	7			2		1		
	2				1		3	4
6								
				1	3		5	7
		2	9		5	8		
4	5		8	6				
								8
8	9		5				6	
		3		7			4	

సుడోకు - 294 సమాధానం

9	1	8	7	5	6	2	4	3
6	2	3	8	4	1	7	9	5
7	4	5	9	2	3	8	6	1
3	8	1	2	9	7	4	5	6
2	5	9	3	6	4	1	8	7
4	7	6	1	8	5	9	3	2
8	9	7	6	3	2	5	1	4
1	6	4	5	7	9	3	2	8
5	3	2	4	1	8	6	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.